
'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 275

గురువారం 26-12-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



గెలుపు పంచ్ ఎవరిదో?

నేటి నుంచి భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య 'బాక్సింగ్ డే' టెస్టు - 14లో



10 వేల కోఆపరేటివ్ సొసైటీలు..

బుధవారం దేశవ్యాప్తంగా ప్రారంభించిన కేంద్ర మంత్రి అమిత్‌షా - 15లో



గాలిలో మృత్యు ప్రయాణం

విమాన ప్రయాణం తీవ్ర విషాదం మిగిల్చింది. కజకిస్తాన్‌లో విమానం కూలిన ఘటనలో 38 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు.

- వివరాలు 6లో▶



తరుముకొస్తున్న ఉత్పాతం

అమెరికాలో కిలోవెయా అగ్నిపర్వతం బద్దలైంది. త్వరలో అంతకుమించి విస్ఫోటనం తప్పకపోవచ్చని జియాలజిస్టులు అంటున్నారు.

- వివరాలు 6లో▶



అఫ్గాన్‌పై పాక్ దాడులు

అఫ్గానిస్తాన్‌లోని బర్మల్ జిల్లాపై పాకిస్తాన్ వైమానిక దాడులు జరిపింది. మహిళలు, చిన్నారులు సహా 46 మంది మృతిచెందారు.

- వివరాలు 6లో▶



త్వరలో ఢిల్లీ సీఎం ఆతిశి అరెస్టు


ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశిని త్వరలో అరెస్టు చేస్తారని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్ ఆరోపించారు.

- వివరాలు 6లో▶

సాగు రైతుకే 'భరోసా'!

రైతు భరోసా పథకంపై కేబినెట్ సబ్ కమిటీ మార్గదర్శకాలు సిద్ధం

పెట్టుబడి సాయం కోసం ఏడు ఎకరాల సీలింగ్ విధించే అవకాశం



ఒక కుటుంబంలో ఎందరి పేరిట ఎంత భూమి ఉన్నా.. మొత్తంగా ఏడెకరాలకే పెట్టుబడి సాయం!

- ఎన్‌ఆర్‌ఎస్‌సీ సహకారంతో సాగు భూముల శాటిలైట్ సర్వే
- క్షేత్ర స్థాయిలో సహాయ వ్యవసాయ అధికారులతో నిర్ధారణ
- ఐటీ చెల్లింపుదారులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు పెట్టుబడి సాయం కట్?
- పీఎం కిసాన్ సమ్మాన్ నిధిలోని కొన్ని మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోనున్న ప్రభుత్వం
- ఈ నెల 30న జరిగే కేబినెట్ భేటీలో ఆమోదం తెలిపే చాన్స్.. సంక్రాంతి నుంచి అమలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సాగులో ఉన్న భూములకు మాత్రమే పెట్టుబడి సాయం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు సాగు చేసిన భూమిని శాస్త్రీయ పద్ధతిలో లెక్కగట్టి తదనుగుణంగా 'రైతు భరోసా' మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. రైతులు భూమిని సాగు చేశారో లేదో తెలుసుకునేందుకు ప్రతి సీజన్‌లో శాటిలైట్ సర్వే చేయాలని కూడా నిర్ణయించింది. ఇందుకోసం నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ) సహకారాన్ని తీసుకోనుంది. అదే సమయంలో సహాయ వ్యవసాయ అధికారుల (ఏఏఓలు)తో క్షేత్రస్థాయిలో పంటల లెక్కలు సేకరించనుంది. ఎన్‌ఆర్‌ఎస్‌సీ సాంకేతిక పరిజ్ఞానంతో ఏ రైతు ఎంత భూమిలో ఏ పంట సాగు చేశాడనే వివరాలను తీసుకుని.. మిగతా 2వ పేజీలో ▶

రైతులు, పెట్టుబడి సాయంలో తగ్గుదల

కొత్త మార్గదర్శకాలతో రైతులకు ఇచ్చే పెట్టుబడి సాయం తగ్గే అవకాశం ఉంది. రాష్ట్రంలో పీఎం కిసాన్ సమ్మాన్ యోజన ద్వారా 30 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందుతుండగా.. రైతుబంధు ద్వారా 1,48,70,045 ఎకరాలకు సంబంధించి 65 లక్షల మంది రైతులకు సాయం అందుతూ వస్తోంది. ఏటా సగటున రూ.13 వేల కోట్ల చొప్పున ఆరేళ్లలో రూ.80,453.41 కోట్లను ప్రభుత్వం అందజేసింది. ఇందులో రూ.21,283.66 కోట్లు సాగులో లేని భూములకు, గుట్టలు, రాళ్లతో కూడిన భూములకు అందాయని మంత్రి తుమ్మల అసెంబ్లీలో చెప్పారు. ఇలా సాగులో లేని భూములతోపాటు ప్రభుత్వం పెట్టనున్న ఆంక్షలతో.. ఏటా రూ.3 వేల కోట్ల నుంచి రూ. 4 వేల కోట్ల మేర పెట్టుబడి సాయంలో కోతపడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.



అటల్ బిహారీ వాజ్‌పేయి స్మారకం 'సదైవ్ అటల్' వద్ద నివాళులర్పిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

వాజ్‌పేయికి ఘన నివాళి

'సదైవ్ అటల్' వద్ద నివాళులర్పించిన రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: దివంగత ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా ఢిల్లీలోని ఆయన స్మారకం 'సదైవ్ అటల్' వద్ద రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సహా పలువురు ప్రముఖులు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, జె.పి.నడ్డా, లలన్‌సింగ్, జీతన్‌రామ్ మాంఝీ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు పలువురు ఎంపీలు, వాజ్‌పేయి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. అలాగే పాత పార్లమెంట్ భవనం సెంట్రల్ హాల్‌లో వాజ్‌పేయి చిత్రపటం వద్ద మల్లికార్జున ఖర్గే, జె.పి.నడ్డా తదితరులు నివాళులర్పించారు. దేశాభివృద్ధికి వాజ్‌పేయి అందించిన సేవలను ప్రధాని మోదీ స్మరించుకున్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. రాజ్యాంగ విలువలను పరిరక్షించడానికి వాజ్‌పేయి ఎంతగానో కృషి చేశారని, దేశంపై ఎనలేని ప్రభావం చూపారని కొనియాడారు. వాజ్‌పేయి జయంతి వేడుకలు దేశవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, బీజేపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

అంబేడ్కర్ కృషిని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వాలు: మోదీ

- మధ్యప్రదేశ్‌లో కెన్–బెత్వా అనుసంధాన ప్రాజెక్టుకు శంకుస్థాపన
- వాజ్‌పేయి స్మారక పోస్టల్ స్టాంప్, నాణెం విడుదల

6లో

న్యూస్‌రీల్

నేడో రేపో కేటీఆర్‌కు ఏసీబీ సమన్లు!



ఫార్ములా–ఈ కార్ రేసు వ్యవహారంలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ వాంగ్మూలం ఇచ్చారు. దీని ఆధారంగా మాజీ మంత్రి కేటీఆర్,అర్వింద్‌కుమార్ తదితరులకు ఏసీబీ సమన్లు జారీ చేయనున్నట్లు సమాచారం.

- వివరాలు 3లో▶

పాలనకు 'ఏఐ' సాయం



రాష్ట్రంలో ప్రభుత్వ పాలన, ప్రజాసేవల్లో ఏఐను మేళవించి సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ప్రయోగాత్మకంగా కొన్ని ప్రభుత్వ శాఖల్లో ఏఐ వినియోగంతో కూడిన యాప్‌లు ప్రవేశపెట్టాలని ప్రాథమికంగా నిర్ణయించింది.

- వివరాలు 12లో▶

డీజిల్ బస్సుకు ఎలక్ట్రిక్ రూపు



డీజిల్ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చే ప్రయత్నాలను టీజీఆర్టీసీ ముమ్మరం చేసింది. రెట్రో ఫిట్‌మెంట్ టెక్నాలజీ ద్వారా వీటిని ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చటానికి ఆర్థిక సాయం చేయాలని కేంద్రానికి లేఖ రాసింది.

- వివరాలు 16లో▶

మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య



కామారెడ్డి జిల్లా బీబీపేట ఠాణా మహిళా కానిస్టేబుల్ శృతి అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువులో దూకి బుధవారం ఆత్మహత్య చేసుకొన్నారు. ఆమెతోపాటు నిఖిల్ అనే యువకుడి మృతదేహాన్ని కూడా గుర్తించారు. కాగా, చెరువు సమీపంలో భిక్కనూరు ఎస్సై సాయికుమార్ కారును గుర్తించారు.

- వివరాలు 16లో▶





ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న మెదక్ సీఎస్ఐ చర్చి ఇన్‌చార్జి బిషప్ రూబెన్‌మార్క్. చిత్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

ఇళ్ల కేటాయింపుల్లో దళిత, గిరిజన, క్రైస్తవులకు ప్రాధాన్యత

- ఫీజు రీయింబర్స్‌మెంట్, 'ఆరోగ్యశ్రీ'కి క్రైస్తవ మిషనరీలే స్ఫూర్తి: సీఎం రేవంత్‌రెడ్డి
- రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేలా ప్రభువు ఆశీర్వదించాలని ఆకాంక్ష
- క్రిస్మస్ సందర్భంగా మెదక్ చర్చిని సందర్శించి.. వందేళ్ల వేడుకల్లో పాల్గొన్న సీఎం
- అంతకుముందు ఏడుపాయల వనదుర్గా మాత ఆలయంలో ప్రత్యేక పూజలు

2లో

నేడు సీఎంతో సినీ ప్రముఖుల భేటీ

2లో

రేవతి కుటుంబానికి 'పుష్ప' టీమ్ రూ.2 కోట్ల పరిహారం





తెలుగు మాధ్యమంలో చెప్పేదెవరు?

మాతృభాషలో ఉన్నత విద్య బోధించాలన్న కేంద్రం సిఫార్సులపై రాష్ట్ర విద్యాశాఖ తర్జనభర్జన

- రాష్ట్రంలో తగ్గుతున్న తెలుగు మీడియం... ఉన్న విద్యార్థులకూ బోధన అంతంత మాత్రమే
- విద్యార్థులు, ఉపాధ్యాయుల చూపు ఇంగ్లిష్ మీడియం వైపే!
- తెలుగు మాధ్యమంలో చదివేవారు ఏడు శాతం లోపే..

సాక్షి, హైదరాబాద్: మాతృభాషకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర విద్యాశాఖ పేర్కొంటోంది. ఇటీవల అన్ని రాష్ట్రాలకు దీనిపై సూచనలు చేసింది. సాంకేతిక విద్య సహా అన్ని ఉన్నత విద్య కోర్సులకు స్థానిక భాషల్లో పుస్తకాలు అందించే ప్రక్రియను ఇప్పటికే చేపట్టింది. నూతన విద్యా విధానంలో భాగంగా ఈ మార్పులు చేస్తున్నట్టు చెబుతోంది. అయితే రాష్ట్రంలో తెలుగు మీడియం పరిస్థితిపై రెండు నెలల క్రితం మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

తెలంగాణ ప్రభుత్వానికి రాహుల్ అభినందన

మంత్రి పొన్నంకు రాహుల్ లేఖ



సాక్షి, హైదరాబాద్: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు సాగుతున్న తెలంగాణ ప్రభుత్వానికి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా.. ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి ఒక లేఖ రాశారు. రాహుల్ నాయకత్వంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ.. ఏడాది పూర్తి చేసుకొని విజయవంతంగా ముందుకెళ్తోందని పేర్కొన్నారు. దానికి రాహుల్‌గాంధీ ప్రత్యుత్తరమిస్తూ.. తమ దార్శనికతను సాకారం చేసే దిశగా నిరంతరం కృషి చేస్తారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వానికి రాహుల్ శుభాకాంక్షలు తెలిపారు.

టీ-యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా శివచరణ్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా జక్కిడి శివచరణ్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈమేరకు జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ బుధవారం ఢిల్లీలో శివచరణ్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు. కాగా.. ఇటీవల జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో శివచరణ్‌రెడ్డి రెండు లక్షలకు పైగా ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. దీనికి సంబంధించిన అధికారిక నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు.

రైతులకిచ్చే పథకాల్లో నిబంధనలు ఎందుకు?

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సమావేశంలో మాట్లాడుతున్న కవిత

మెదక్ జోన్/మెదక్ మున్సిపాలిటీ: రైతులకు ఇచ్చే సంక్షేమ పథకాల్లో నిబంధనలు ఎందుకు పెడుతున్నారని ఎమ్మెల్సీ కవిత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం ఆమె క్రిస్మస్ సందర్భంగా మెదక్ చర్చిని సందర్శించారు. మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆమెను ఆశీర్వదించారు. అనంతరం బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ తుంగలో తొక్కిందని మండిపడ్డారు. పండుగల సందర్భంగా ప్రజలకు ఇచ్చే గిఫ్టులను సైతం బంద్ పెట్టారన్నారు. అధికారంలోకి రాగానే రేషన్ కార్డులు ఇస్తామని, ఆడబిడ్డలకు తులం బంగారం పెడతామని హామీ ఇచ్చారని, ఏడాది అవుతున్నా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రైతు భరోసా లేదు, పూర్తి స్థాయి రుణమాఫీ కాలేదు.. అన్నిరకాల ధాన్యానికి రూ.500 బోనస్ అని ఆ తర్వాత సన్నాలకే ఇచ్చి రైతును మోసం చేశారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో కర్ణాటక డిప్యూటీ సీఎం

సాక్షి, హైదరాబాద్: కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, ఆ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ బుధవారం హైదరాబాద్‌కు వచ్చారు. వివాహ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు బేగంపేట విమానాశ్రయంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్ గౌడ్ స్వాగతం పలికారు.

గృహనిర్మాణ శాఖ చీఫ్ ఇంజనీర్‌గా చైతన్యకుమార్

మరికొందరు అధికారులకు పదోన్నతి



చీఫ్ ఇంజనీర్‌గా పదోన్నతి పత్రాన్ని చైతన్యకుమార్‌కు అందజేస్తున్న మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని సంక్రాంతి కల్లా ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్న ప్రభుత్వం, గృహనిర్మాణ శాఖను బలోపేతం చేస్తోంది. గత ప్రభుత్వం గృహనిర్మాణ శాఖ ఉద్యోగులను ఇతర విభాగాలకు తరలించి.. ఆ శాఖను నామమాత్రంగా చేసిన నేపథ్యంలో.. మళ్లీ పాత ఉద్యోగులను సొంతగూటికి తెచ్చే పని మొదలైంది. ఇప్పటికే దాదాపు 1,200 మందిని తిరిగి తీసుకొచ్చింది. ఇప్పుడు అంతర్గతంగా ఖాళీల భర్తీ, పదోన్నతులపై కూడా దృష్టి పెట్టింది. ఇప్పటి వరకు ఎస్ఈగా ఉన్న చైతన్యకుమార్‌కు గృహనిర్మాణ శాఖ చీఫ్ ఇంజనీర్‌గా పదోన్నతి కల్పించింది. గతంలో చీఫ్ ఇంజనీర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఈశ్వరయ్య సేవలను తీసుకునేందుకు.. ఆయనకు కూడా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇక మేనేజర్ స్థాయిలో ఉన్న ఒక అధికారిని డీజీఎంగా నియమించింది. ఒక ఈఈకి ఎస్ఈగా పదోన్నతి కల్పించింది. 12 మంది డీఈలకు ఈఈ పదోన్నతి కల్పించింది.

మాకు ఇదేం 'పరీక్ష'?

వీఎల్‌వో నియామకాలకు ప్రభుత్వ పోటీపరీక్ష నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న మాజీ వీఆర్వోలు, వీఆర్ఏలు

ఇతర శాఖల్లోకి పరీక్ష లేకుండానే పంపిన తమను మాతృశాఖలోకి తీసుకొనేందుకు పరీక్ష ఎందుకని ప్రశ్న

ప్రభుత్వ పెద్దలు చొరవ తీసుకొని తమను నేరుగా గ్రామ రెవెన్యూ వ్యవస్థలోకి తీసుకోవాలని వినతి


సాక్షి, హైదరాబాద్: గ్రామానికో రెవెన్యూ అధికారి (వీఎల్‌వో)ని నియమించే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం అవలంబించాలనుకుంటున్న విధానం వివాదాస్పదమవుతోంది. వీఎల్‌వోల నియామకం కోసం కచ్చితంగా పోటీ పరీక్ష పెట్టాల్సిందేనన్న ప్రభుత్వ నిర్ణయాన్ని గతంలో వీఆర్వోలు, వీఆర్ఏలుగా పనిచేసిన వారు వ్యతిరేకిస్తున్నారు. రెవెన్యూ శాఖ నుంచి తమను బలవంతంగా ఇతర శాఖల్లోకి పంపేటప్పుడు పరీక్ష పెట్టని ప్రభుత్వం.. తిరిగి మాతృశాఖలోకి తీసుకొనేటప్పుడు పరీక్ష పెట్టాలనుకోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అయితే ప్రభుత్వ వర్గాలు మాత్రం ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వారంతా పరీక్ష రాయాల్సిందేనని అంటున్నాయి. టీజీపీఎస్సీ లేదా జేఎన్టీయూ ద్వారా పోటీ పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయి.

అంగీకారం తెలియజేసిన వారినే..

వాస్తవానికి రాష్ట్రంలో 25 వేల మందిపైగా రెవెన్యూ సిబ్బంది గతంలో గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వో), గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ)గా పనిచేసేవారు. వీఆర్వో వ్యవస్థను రద్దు చేయడంతోపాటు వీఆర్ఏలను ఇతర శాఖల్లోకి పంపించడంతో ప్రస్తుతం వారిలో 4–5 వేల మందే రెవెన్యూ శాఖలో కొనసాగుతున్నారు. మరో 3,797 మందికి 61 ఏళ్లు దాటడంతో వారి వారసులకు ఉద్యోగాలిచ్చే ప్రక్రియ ఇంకా పెండింగ్‌లో ఉంది. ఈ రెండు కేటగిరీలు మినహాయిస్తే సుమారు 17 వేల మంది ఇతర ప్రభుత్వ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, వార్డు అధికారులు, మిషన్ భగీరథ హెల్పర్లు, పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అటెండర్లుగా పనిచేస్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వం రద్దయిన వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థలకు సమాంతరంగా గ్రామ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం సుమారు 11 వేల రెవెన్యూ గ్రామాల్లో గ్రామానికి ఒకరిని అధికారిగా నియమించనుంది. ఈ ఉద్యోగాల కోసం గతంలో వీఆర్వోలు, వీఆర్ఏలుగా పనిచేసి ప్రస్తుతం వివిధ శాఖల్లో పనిచేస్తున్న వారి నుంచి అంగీకార పత్రాలు తీసుకుంటోంది. డిగ్రీ, ఇంటర్ చదివిన వారు మళ్లీ రెవెన్యూ శాఖలోకి వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేస్తే వారికి పరీక్ష పెట్టి తీసుకుంటామని చెబుతోంది.

నిజంగా 'పరీక్షే'

ప్రభుత్వ నిర్ణయం తమ జీవితాలకే పరీక్షలా ఉందని పూర్వ వీఆర్వో, వీఆర్ఏలంటున్నారు. ఈ రెండు కేటగిరీల్లో కలిపి 11,600 మందికి పైగా డిగ్రీ, ఇంటర్ పూర్తి చేసిన వారు ఉన్నారని.. ప్రభుత్వానికి కూడా దాదాపు ఇదే సంఖ్యలో గ్రామ రెవెన్యూ అధికారులు అవసరమైనందున మళ్లీ పరీక్ష ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ఇది తమకు అగ్నిపరీక్షో, శీలపరీక్షో అర్థం కావట్లేదని పూర్వ వీఆర్వో సంఘం నేత ఒకరు వ్యాఖ్యానించారు. మరో ట్విస్ట్ ఏమిటంటే ఈ పరీక్ష రాసేందుకు గతంలో వీఆర్వో, వీఆర్ఏలుగా పనిచేసి ప్రస్తుతం రెవెన్యూ శాఖలో కొనసాగుతున్న వారు అర్హులు కాదని ప్రభుత్వం చెబుతోందని, కేవలం ఇతర శాఖల్లోకి వెళ్లిపోయిన వారి నుంచే సానుకూల వ్యక్తీకరణ హామీ తీసుకుంటోందని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. ఇలా చేయడం ద్వారా డిగ్రీ, ఇంటర్ ఉత్తీర్ణుల సంఖ్య భారీగా తగ్గిపోతుందని, అప్పుడు తగినంత మంది అర్హులు లేరనే కారణంతో బయటివారితో కలిపి తమకూ పరీక్ష పెట్టాలనేది రెవెన్యూ ఉన్నతాధికారుల ఆలోచనగా కనిపిస్తోందని అంటున్నారు. దీనిపై ప్రభుత్వ పెద్దలు చొరవ తీసుకొని డిగ్రీ, ఇంటర్ చదివి, పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలుగా పనిచేసిన వారందరినీ నేరుగా గ్రామ రెవెన్యూ వ్యవస్థలోకి తీసుకోవాలని కోరుతున్నారు.



ఇళ్ల కేటాయింపుల్లో దళిత, గిరిజన, క్రైస్తవులకు ప్రాధాన్యత

- ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ పథకాలకు క్రైస్తవ మిషనరీలే స్ఫూర్తి: సీఎం రేవంత్‌రెడ్డి
- క్రిస్మస్ సందర్భంగా మెదక్ చర్చిని సందర్శించి.. వందేళ్ల వేడుకల్లో పాల్గొన్న సీఎం
- అంతకుముందు ఏడుపాయల వన దుర్గా మాత గుడిలో ప్రత్యేక పూజలు



ఏడుపాయల గుడిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సీఎం రేవంత్, రాజనర్సింహ, పొంగులేటి, మహేశ్‌గౌడ్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులలో దళితులు, గిరిజనులు, దళిత క్రైస్తవులు, గిరిజన క్రైస్తవులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకంతో కూడా ఈ వర్గాల నిరుపేదలకు ఎక్కువ లబ్ధి చేకూరుతోందని చెప్పారు. క్రిస్టియన్ మిషనరీలు నిరుపేదలకు విద్య, వైద్య సేవలు అందించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించేవని.. ఆ మిషనరీల స్ఫూర్తితోనే ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలను తీసుకొచ్చిందని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం మెదక్ జిల్లాలో పర్యటించారు. ఏడుపాయల వనదుర్గా మాత ఆలయానికి వెళ్లిన ఆయన.. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని మెదక్ కేథడ్రల్ చర్చి శతాబ్ది వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విద్యుత్, సన్నధాన్యానికి రూ.500 బోనస్, రూ.21 వేల కోట్ల పంట రుణాల మాఫీ వంటి పథకాలతో నిరుపేదలకు లబ్ధి చేకూరిందన్నారు.

ఉపాధి హామీ పథకానికి స్ఫూర్తి కూడా ఇదే..

కరువులు వచ్చినప్పుడు, ప్రజలు ఆకలితో అలమటిస్తున్నప్పుడు వారిని కాపాడుకునేందుకు మెదక్ చర్చి నిర్మాణంలో భాగస్వాములైన వారికి భోజన సౌకర్యం కల్పించారని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. ఈ స్ఫూర్తితోనే తమ ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని, పనికి ఆహార పథకాన్ని తెచ్చి అమలు చేసిందని చెప్పారు. వందేళ్ల నాటి ఈ చర్చి తెలంగాణకే గర్వకారణమని, దేశవ్యాప్తంగా కీర్తించబడుతోందని పేర్కొన్నారు. మెదక్ చర్చితో తనకు ఎంతో అనుబంధం ఉందన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా మెదక్‌కు వచ్చిన సమయంలో ఇచ్చిన మాట మేరకు ఇప్పుడు సీఎం హోదాలో ఈ చర్చికి వచ్చి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని చెప్పారు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభువు తన మంత్రివర్గానికి ఆశీస్సులు అందజేయాలని కోరుకున్నారు. వందేళ్లు పూర్తి చేసుకున్న మెదక్ చర్చిని మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మైనంపల్లి రోహిత్, సంజీవరెడ్డి, మదన్‌మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, మైనంపల్లి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

యేసు మార్గం అనుసరణీయం

మెదక్ చర్చి వందేళ్ల వేడుకల్లో ఇన్‌చార్జి బిషప్ రూబెన్‌మార్క్

మెదక్ జోన్: ప్రఖ్యాత మెదక్ సీఎస్ఐ చర్చిలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా మత పెద్దలు శిలువను చర్చి చుట్టూ ఊరేగించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. వేకువజామున 4.30 గంటలకు మొదటి ఆరాధనను ప్రారంభించారు. ఇన్‌చార్జి బిషప్ రూబెన్‌మార్క్ దైవ సందేశం ఇచ్చారు. రెండో ఆరాధన ఉదయం 10 గంటలకు ప్రారంభించారు. ఈ ఉత్సవాలలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ తదితరులు పాల్గొని ప్రార్థనలు చేశారు. వారిని రూబెన్ మార్క్ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి బిషప్ మాట్లాడుతూ.. మానవాళికి యేసు మార్గం అనుసరణీయమని చెప్పారు. చర్చి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రభువు కృపతో ఈ ప్రభుత్వం ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. సీఎం రేవంత్‌రెడ్డి తనకు ఆత్మీయుడని, సమర్థవంతంగా ప్రజాపాలన అందిస్తున్నారని ప్రశంసించారు. ప్రార్థనల సందర్భంగా ఆలపించిన కీర్తనలు ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 20 మంది మతగురువులు భక్తులను ఆశీర్వదించారు. శతాబ్ది ఉత్సవాలకు చర్చి నిర్మాత చార్లెస్ వాకర్ మూడో తరం కుటుంబ సభ్యులు హాజరయ్యారు. వేడుకల కోసం సుమారు 5 లక్షల మంది వరకు తరలివచ్చినట్టు అంచనా.



మెదక్ చర్చికి భారీగా తరలివచ్చిన భక్తులు

సాగు రైతుకే 'భరోసా'!

▶ మొదటి పేజీ తరువాయి

ఏఏఓలు ఇచ్చే నివేదికలతో సరిపోల్చుకొని రైతు భరోసాను జమ చేయాలనే అభిప్రాయంతో ఉన్నట్టు తెలిసింది. తద్వారా సాగు చేసే భూమికే పెట్టుబడి సాయం అందించడంతోపాటు రైతులను వ్యవసాయం దిశగా ప్రోత్సహించినట్టు అవుతుందని భావిస్తున్నట్టు సమాచారం. దీని ప్రకారం రైతులకు ఖరీఫ్ (వానకాలం)లో వచ్చే పెట్టుబడి సాయానికి, రబీ (యాసంగి)లో అందే సాయానికి మధ్య కూడా తేడా ఉండే అవకాశం ఉంది. రాష్ట్రంలో రబీలో సాగు విస్తీర్ణం తక్కువగా ఉంటుండటమే దీనికి కారణం.

మార్గదర్శకాల రూపకల్పన దాదాపు పూర్తి

రైతులకు ఆరేళ్లుగా అందుతున్న పెట్టుబడి సాయం 'రైతుబంధు' స్థానంలో... కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తున్న 'రైతు భరోసా' పథకానికి మార్గదర్శకాల రూపకల్పన దాదాపు పూర్తయింది. కొత్త సంవత్సరంలో సంక్రాంతి నుంచి రైతు భరోసా ఇవ్వాలని నిర్ణయించినట్టు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇటీవల శాసనసభలో ప్రకటించారు కూడా. ఈ నెల 30న జరిగే మంత్రివర్గ సమావేశంలో రైతు భరోసాకు ఆమోదం తెలిపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 'రైతు భరోసా' అమలులో ప్రభుత్వం అనుసరించనున్న విధివిధానాలపై చర్చ జరుగుతోంది.

ఏడెకరాల సీలింగ్?

ఇక ఒక రైతుకు గరిష్టంగా ఎన్ని ఎకరాల వరకు రైతుభరోసా పెట్టుబడి సాయం ఇవ్వాలనే విషయంలో మంత్రివర్గ సమావేశంలో స్పష్టత రానుంది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద ఐదెకరాల్లోపు భూమి ఉన్న రైతులకు మాత్రమే కేంద్ర ప్రభుత్వ పెట్టుబడి సాయం అందుతున్న నేపథ్యంలో... రాష్ట్ర పథకంలోనూ భూమికి సీలింగ్ విధించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు చేసినట్లు సమాచారం. పదెకరాలలోపు భూమికి మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని తొలుత అభిప్రాయం వ్యక్తమైనా.. మధ్యేమార్గంగా ఏడెకరాల సీలింగ్‌ను అమలు చేయాలని ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. పీఎం కిసాన్ పథకంలో ఐదెకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతుకు పెట్టుబడి సాయం అందదు. రాష్ట్ర ప్రభుత్వం అలా కాకుండా ఎంత భూమి ఉన్నా గరిష్టంగా ఏడెకరాలకు రైతు భరోసా సాయం అందించాలని భావిస్తున్నట్టు సమాచారం.

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి సాయానికి వీరు అనర్హులు..

- ప్రజాప్రతినిధులు
- ప్రభుత్వ ఉద్యోగులు (జీతాలు పొందేవారు, పెన్షనర్లు)
- ఆదాయ పన్ను చెల్లించేవారు (గత ఐదేళ్లలో కనీసం వరుసగా రెండేళ్లు ఐటీ చెల్లించినవారు. ఒక్కరున్నా ఆ కుటుంబానికి పథకం వర్తించదు)
- డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు, ఆర్కిటెక్ట్స్ వంటి నిపుణులు
- కుటుంబంలో ఎంత మంది రైతులు ఉన్నా సరే..ఒక్కరికి మాత్రమే పెట్టుబడి సాయం

కుటుంబం యూనిట్‌గా తీసుకుంటే..?

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో కుటుంబం యూనిట్‌గా తీసుకున్నారు. రైతు రుణమాఫీకి కాంగ్రెస్ ప్రభుత్వం ఇదే విధానాన్ని అనుసరించి కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని.. ఒక కుటుంబం మొత్తానికి కలిపి రూ. 2లక్షల రుణమాఫీ చేసింది. ఇప్పుడు రైతు భరోసాకు కూడా కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకోవాలని నిర్ణయించినట్టు సమాచారం. అంటే ఒక కుటుంబంలో ఎంత మంది పేర్ల మీద ఎంత భూమి ఉన్నప్పటికీ... ఆ కుటుంబం మొత్తానికి కలిపి ఏడెకరాలకే ప్రభుత్వ సాయం అందేలా విధి విధానాలు రూపొందించినట్టు తెలిసింది. ఇక గత ఐదేళ్లలో వరుసగా రెండేళ్లపాటు ఆదాయ పన్ను చెల్లించినవారు కుటుంబంలో ఒక్కరున్నా కూడా.. ఆ కుటుంబానికి పీఎం కిసాన్ సమ్మాన్ నిధి వర్తించదు. ఈ విధానాన్ని రైతు భరోసాకు కూడా వర్తింపజేస్తే పెద్ద సంఖ్యలో అర్హులు తగ్గిపోయే అవకాశం ఉంటుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, పలు వర్గాలకు కోత!

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద కేంద్రం ఇచ్చే పెట్టుబడి సాయానికి కఠిన నిబంధనలు అమలవుతున్నాయి. అందులో ఒకటి ఆదాయ పరిమితి. ఆదాయపన్ను చెల్లించే వ్యాపారులు, కార్పొరేట్ ఉద్యోగులతోపాటు ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులను పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి నుంచి మినహాయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్రాంతి నుంచి తీసుకురానున్న రైతుభరోసాలో కూడా ఇదే విధానాన్ని అమలు చేయనున్నట్టు తెలిసింది. సాగు చేసే నిజమైన రైతులకే సర్కార్ సాయం అందాలన్న లక్ష్యంలో భాగంగా వీరికి రైతుభరోసా తొలగించాలని మంత్రివర్గ ఉపసంఘం సూచించినట్టు తెలిసింది. అయితే ఇందులో నాలుగో తరగతి ఉద్యోగులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను మినహాయించినట్టు సమాచారం. కుటుంబ ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకొని.. కుటుంబంలోని ఇతర సభ్యులు ఐటీ చెల్లింపుదారులుగా ఉంటే కోత పెట్టాలనే యోచన ఉన్నట్టు తెలిసింది.

రాష్ట్రంలోని రైతుల వద్ద ఉన్న భూమి వివరాలివే (ఎకరాల్లో)

భూమి విస్తీర్ణం	రైతుల సంఖ్య	శాతం
2.47 (1 హెక్టార్)	47,86,171	73.63
2.48-4.94 (1-2 హెక్టార్లు)	11,50,339	17.70
4.95-9.88 (2-4 హెక్టార్లు)	4,73,387	7.28
9.89-24.78 (4-10 హెక్టార్లు)	84,588	1.30
24.78పైన (10 హెక్టార్లపైన)	5,861	0.09

మొత్తం భూమి 1,48,70,045 (60,17,700హెక్టార్లు)
మొత్తంగా రైతుల సంఖ్య 65,00,286

నేడు సీఎంతో సినీ ప్రముఖుల భేటీ

- దిల్‌రాజు, చిరంజీవి, వెంకటేశ్, అల్లు అరవింద్, త్రివిక్రమ్ హాజరయ్యే అవకాశం
- సంధ్య థియేటర్ ఘటనతో పరిశ్రమకు, ప్రభుత్వానికి పెరిగిన దూరం
- పరిస్థితిని చక్కదిద్దేందుకు ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు ప్రయత్నాలు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సినీ ప్రముఖులు గురువారం సమావేశం కానున్నారు. ఉదయం 10 గంటలకు బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఈ సమావేశం జరగనుంది. ప్రభుత్వం తరఫున సీఎంతోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరు కానున్నారు. సినీ రంగం నుంచి తెలంగాణ చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డీసీ) చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్‌రాజు నేతృత్వంలో సినీ పెద్దలు చిరంజీవి, అల్లు అరవింద్, దగ్గుబాటి సురేశ్.. నిర్మాతలు సునీల్ నారంగ్, దామోదర ప్రసాద్, సుప్రియ యార్లగడ్డ, చినబాబు, నాగవంశీ, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి.. దర్శకులు హరీశ్ శంకర్, అనిల్ రావిపూడి, స్రవంతి రవికిషోర్, వీరశంకర్, రాజేశ్, వశిష్ఠ, త్రివిక్రమ్ శ్రీనివాస్.. నటులు వెంకటేశ్, నితిన్, శివబాలాజీ, కిరణ్ అబ్బవరం, వరుణ్ తేజ్, తెలుగు ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ హాజరయ్యే అవకాశం ఉంది. పుష్ప–2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట చోటుచేసుకొని ఒక మహిళ మరణించటం, ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడిన తర్వాత నటుడు అల్లు అర్జున్‌ను అరెస్టు చేయటం వంటి ఘటనలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటన తర్వాత సినీ రంగానికి, ప్రభుత్వానికి మధ్య దూరం పెరిగిందన్న అభిప్రాయం వ్యక్తమైన నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.

సయోధ్య కోసం ప్రయత్నం!: సంధ్య థియేటర్ ఘటన తర్వాత సినీ ప్రముఖుల తీరుపై సీఎం తీవ్ర విమర్శలు గుప్పించారు. అసెంబ్లీ వేదికగా ఒక మాదిరి వార్నింగ్ కూడా ఇచ్చారు. ఇకపై భారీ బడ్జెట్ సినిమాలకు బెనిఫిట్ షోలు కానీ, టికెట్ ధరల పెంపు అనుమతులు కానీ ఉండవని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. తొక్కిసలాటకు ప్రధాన కారణం అల్లు అర్జున్ అని ఆరోపిస్తూ ఆయనను అరెస్టు చేయగా,బెయిల్‌పై బయటకు రావటం.. మరోసారి చిక్కడపల్లి పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు పిలిచి 3.30 గంటలపాటు ప్రశ్నించటంతో పరిస్థితిని చక్కదిద్దేందుకు దిల్‌రాజు రంగంలోకి దిగినట్లు తెలిసింది. సీఎం, మంత్రులతో నేరుగా సమావేశమై సమస్య తీవ్రం కాకుండా చూడాలని ప్రయత్నిస్తున్నారు. వివాదానికి ఇంతటితో ముగింపు పలకాలని భావిస్తున్నారు. భారీ బడ్జెట్ సినిమాలకు బెనిఫిట్ షోలు, టికెట్ల ధరల పెంపు తదితర అంశాలను ఇకపై కూడా కొనసాగించాలని కోరనున్నట్లు సమాచారం. కాగా, ఈ సమావేశం ఫలవంతం కావాలని ప్రముఖ నటి విజయశాంతి ఆకాంక్షించారు.

రేవతి కుటుంబానికి పుష్ప–2 టీమ్ రూ.2 కోట్ల పరిహారం

- దిల్‌రాజుతో కలసి కిమ్స్ ఆసుపత్రిలో శ్రీతేజ్‌ను పరామర్శించిన అల్లు అరవింద్
- చిత్రపరిశ్రమ ప్రముఖులతో కలసి నేడు సీఎం రేవంత్‌తో భేటీ: దిల్‌రాజు

బన్సీలాల్‌పేట్ (హైదరాబాద్): సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన రేవతి కుటుంబానికి పుష్ప–2 టీమ్ భారీగా పరిహారం అందజేయడానికి ముందుకు వచ్చింది. ఈ ఘటనలో గాయపడి సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను అల్లు అరవింద్ బుధవారం ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజుతో కలసి పరామర్శించారు. ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ రేవతి కుటుంబానికి రూ. 2 కోట్లు పరిహారం ఇస్తున్నట్లు చెప్పారు. అందులో అల్లు అర్జున్ తరఫున కోటి రూపాయలు, పుష్ప–2 దర్శకుడు సుకుమార్ తరఫున రూ.50 లక్షలు, మైత్రీ మూవీ మేకర్స్ తరఫున రూ.50 లక్షలు.. మొత్తం రూ.2 కోట్లు అందజేస్తున్నామన్నారు. ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు మాట్లాడుతూ శ్రీతేజ్ ఆరోగ్యం కుదుటపడుతోందని, వెంటిలేటర్ లేకుండా వైద్యులు చికిత్స అందిస్తున్నారని చెప్పారు. కాగా, చిత్రపరిశ్రమ డైరెక్టర్లు, నిర్మాతలు కలిసి గురువారం సీఎం రేవంత్ రెడ్డిని కలుస్తామని తెలిపారు.

ప్రముఖ జ్యోతిష్యుడు వేణుస్వామి రూ.2 లక్షలు

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో గాయపడిన శ్రీతేజ్‌ను బుధవారం ప్రముఖ జ్యోతిష్యుడు వేణుస్వామి ఆసుపత్రిలో పరామర్శించారు. అనంతరం శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిని తండ్రి భాస్కర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వేణుస్వామి రూ. 2లక్షల చెక్కును భాస్కర్‌కు అందజేశారు. శ్రీతేజ్ ఆరోగ్యం కోసం ఈ వారంరోజుల్లో మృత్యుంజయ హోమాన్ని అది కూడా తన సొంత ఖర్చులతో నిర్వహిస్తానని చెప్పారు. ప్రస్తుతం హీరో అల్లు అర్జున్ జాతకం ఏం బాగోలేదని ఆయన తెలిపారు. అల్లు అర్జున్ జాతకంలో శని ఉండటం వల్ల ఈ సంఘటన చోటుచేసుకుందన్నారు. వచ్చే ఏడాది మార్చి 29 వరకు అల్లు అర్జున్ జాతకం ఇలాగే ఉంటుందని వివరించారు.

శ్రీతేజ్‌ను పరామర్శించిన జానీ మాస్టర్

సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను బుధవారం కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ తన కుటుంబంతో కలసి పరామర్శించారు. కొరియోగ్రాఫర్‌ల తరఫున శ్రీతేజ్ కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు.

'సంధ్య థియేటర్' ఘటనపై తప్పుడు ప్రచారం తగదు

- ప్రజలను తప్పుదోవ పట్టించే కథనాలు ప్రసారం చేస్తే కఠిన చర్యలు
- హైదరాబాద్ పోలీసుల హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: ఈనెల 4న ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనపై సామాజిక మాధ్యమాలలో వస్తున్న తప్పుడు కథనాలపై హైదరాబాద్ పోలీసులు సీరియస్ అయ్యారు. ఎలాంటి ఆధారాలు లేకుండా పోలీసు శాఖను బద్నాం చేసేలా ఎవరైనా తప్పుడు ప్రచారం చేసినా, ప్రజలను తప్పుదోవ పట్టించేలా సామాజిక మాధ్యమాలలో పోస్టులు, వీడియోలు, కథనాలను ప్రసారం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హీరో అల్లు అర్జున్ సంధ్య థియేటర్‌కు రాకముందే తొక్కిసలాట జరిగినట్టు కొందరు తప్పుడు వీడియోలు పోస్టు చేసిన అంశం పోలీసుల దృష్టికి రావడంతో ఈమేరకు ఒక ప్రకటనను విడుదల చేశారు. ఈ ఘటనపై విచారణ క్రమంలో తెలిసిన నిజాలను వీడియో రూపంలో పోలీసు శాఖ ఇప్పటికే ప్రజల ముందు ఉంచిందని తెలిపారు. అయినా కొందరు వ్యక్తులు ప్రజలను తప్పుదోవ పట్టించేలా, అర్జున్ రాకముందే తొక్కిసలాట జరిగినట్టు రూపొందించిన కొన్ని వీడియోలను సోషల్ మీడియాలో ఉద్దేశపూర్వకంగా పోస్టు చేస్తున్నారని, ఇది సరైంది కాదని హెచ్చరించారు. కేసు విచారణ జరుగుతున్న సమయంలో ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒక అమాయకురాలి మరణం, ఒక పిల్లవాడి ప్రాణానికి ప్రమాదం సంభవించిన ఈ కేసులో పోలీసు శాఖ ఎంతో నిబద్ధతతో విచారణ జరుపుతోందని, దీనిని ప్రశ్నించేలా అసత్య ప్రచారాలు, అభూతకల్పనలతో సోషల్ మీడియా ద్వారా ఎవరైనా ప్రచారం చేస్తే సహించేది లేదని పోలీసులు హెచ్చరించారు. ఈ ఘటనకు సంబంధించి ఎవరి వద్దనైనా తగిన ఆధారాలు, అదనపు సమాచారం ఉంటే పోలీసు శాఖకు అందించవచ్చని సూచించారు. సోషల్ మీడియాలో జరిగే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నేడు, రేపు బెల్గాంలో సీడబ్ల్యూసీ సమావేశం

హాజరుకానున్న సీఎం రేవంత్, పలువురు నేతలు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం గురు, శుక్రవారాల్లో కర్ణాటకలోని బెల్గాంలో జరగనుంది. సమావేశానికి తెలంగాణ కాంగ్రెస్ నాయకులు హాజరుకానున్నారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు కర్ణాటకలోని బెల్గాంలో ప్రారంభమయ్యే ఈ సమావేశానికి.. రాష్ట్రం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, సీడబ్ల్యూసీ సభ్యులు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, వంశీచంద్‌రెడ్డి హాజరు కానున్నారు. ఉదయం హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో కాంగ్రెస్ నాయకులు బెల్గాం వెళ్లనున్నారు.

క్లుప్తంగా...

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిర్బంధమేమిటి?: హరీశ్



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి మెదక్ జిల్లా పర్యటన నేపథ్యంలో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను నిర్బంధించడమేమిటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. నిర్బంధించిన ఉద్యోగులను తక్షణమే విడుదల చేయాలని బుధవారం ఒక ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను పోలీసుస్టేషన్‌కు తరలించి, నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే చాయ్ తాగినంత సేపట్లో.. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని చెప్పిన రేవంత్.. ఏడాదైనా ఉలుకూపలుకూ లేదని విమర్శించారు. టెంట్లు పీకేయడం కాదని, వారి సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. పదిహేను రోజులుగా ఆందోళన చేస్తున్న ఉద్యోగుల ఆవేదన అర్థం చేసుకోవాలని హరీశ్ హితవు పలికారు.

'జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలి'



యాదగిరిగుట్ట: రాష్ట్రంలో బీసీ జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. శ్రీనివాస్‌గౌడ్ బుధవారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న అనంతరం పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 60 శాతం ఉన్న బీసీలకు, 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ప్రభుత్వం చెబుతోందని, మొదట 42 శాతం పూర్తి చేసిన అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. రిజర్వేషన్ ప్రకటనకు ముందే న్యాయపరమైన సమస్యలు పరిష్కరించుకోవాలని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిపై ఒట్టు వేసి రుణమాఫీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు పూర్తిగా చేయలేదని, రైతుబంధు ఇవ్వడం లేదని మండిపడ్డారు. రైతు భరోసా పేరిట రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు.

27న విచారణకు రండి

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి నోటీసులు..



బంజారాహిల్స్ (హైదరాబాద్): ఈ నెల 27న ఉదయం 10 గంటలకు విచారణకు హాజరుకావాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి మాసబ్‌ట్యాంక్ పోలీసులు బుధవారం నోటీసులు జారీ చేశారు. ఇటీవల కౌశిక్‌రెడ్డి తన ఫోన్ ట్యాప్ అవుతోందని ఫిర్యాదు చేసే క్రమంలో బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి.. ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర కారును అడ్డగించడంపై మాసబ్‌ట్యాంక్ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేయడం తెలిసిందే. ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న కౌశిక్‌రెడ్డిని విచారించాలని నిర్ణయించిన పోలీసులు ఈ నెల 27న విచారణకు హాజరు కావాలని ఆయనకు నోటీసులు అందజేశారు. కాగా, ఎమ్మెల్యే నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్‌ను.. ఇటీవల హైకోర్టు ఆదేశాలతో మాసబ్‌ట్యాంక్ పోలీసులు తిరిగి ఆయనకు అప్పగించారు. కానీ అందులోని కీలక సమాచారం రాబట్టాల్సి ఉన్నందున.. ఎమ్మెల్యే ఫోన్‌ను తమకు అప్పగిస్తే ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు అందజేస్తామని బంజారాహిల్స్ పోలీసులు నాంపల్లిలోని మూడో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై నేడో రేపో కోర్టు ఆదేశాలు రానున్నాయి.

ప్రతీ ప్రభుత్వ శాఖలో అవినీతి

మాజీ సీబీఐ జేడీ లక్ష్మీనారాయణ



సాక్షి, హైదరాబాద్: ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న సమస్య అవినీతి అని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. ప్రతీ ప్రభుత్వ శాఖలో అవినీతి ఉందని చెప్పారు. అధికారులకు, ప్రజలకు మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని తగ్గించి... సాంకేతికను ఉపయోగించాలని, ఆన్‌లైన్‌లో కార్యకలాపాలు జరిగే వ్యవస్థ వస్తే అవినీతి తగ్గడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో బ్రోకర్లు ఉండరాదని, ప్రతీ ఫైలు పారదర్శకంగా ఉండాలని, వాటిని ప్రభుత్వ వెబ్‌సైట్లలో ఉంచాలని చెప్పారు. బుధవారమిక్కడ యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ అవినీతిపై రూపొందించిన సర్వే నివేదికను ఆయన సంస్థ ఫౌండర్ రాజేంద్ర పల్నాటితో కలిసి విడుదల చేశారు. అవినీతికి సంబంధించి ఇచ్చే నివేదికను విమర్శ రూపంలో కాకుండా.. అవినీతిని రూపుమాపేందుకు వినియోగించుకోవాలని లక్ష్మీ నారాయణ సూచించారు. ఈ నివేదికను ప్రభుత్వం సానుకూలంగా మలుచుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాలు, పట్టణ, జిల్లా కేంద్రాలు, నగరాల్లో దాదాపు 14,345 మందిని సర్వే చేసి నివేదిక రూపొందించారని పేర్కొన్నారు. కాగా, రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం ఉందా అనే ప్రశ్నకు ఏకంగా 91.8 శాతం మంది ఉందని సమాధానం ఇచ్చినట్లు సర్వేలో వెల్లడైంది.

నకిలీ వైద్యులపై ఉక్కుపాదం



- రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా టీజీఎంసీ తనిఖీలు
- ఇప్పటివరకు 400కి పైగా కేసుల నమోదు
- హైదరాబాద్‌లోనే 150 ఆసుపత్రులపై కేసులు
- పదో తరగతి అర్హతతో కూడా వైద్యులుగా చెలామణి
- రోగులకు విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ సిఫార్సు
- వీరితో జాగ్రత్తగా ఉండాలని మెడికల్ కౌన్సిల్ సూచన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని నకిలీ వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఉక్కుపాదం మోపుతోంది. మెడికల్ కౌన్సిల్ చైర్మన్ మహేశ్ ఆధ్వర్యంలోని బృందం విస్తృతంగా తనిఖీలు చేపడుతోంది. ఎంబీబీఎస్ డిగ్రీ లేకపోయినా నకిలీ సర్టిఫికెట్లతో ఆసుపత్రులు ప్రారంభించి వైద్యం చేస్తున్నవారిని గుర్తించి చర్యలు తీసుకుంటోంది. మెడికల్ కౌన్సిల్ లోని యాంటీ క్వాకరీ కమిటీ క్రియాశీలకంగా పనిచేస్తూ ఇప్పటివరకు ఏకంగా 400 ఆసుపత్రులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది. హైదరాబాద్‌లోనే 150కిపైగా ఆసుపత్రులపై కేసులు నమోదయ్యాయి.

పదో తరగతితో డాక్టర్..

రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో పదో తరగతి మాత్రమే అర్హత ఉన్నవాళ్లు కూడా వైద్యం చేస్తున్న సంఘటనలు వెలుగుచూస్తున్నాయి. వీరు ఎలాంటి భయం లేకుండా దర్జాగా ఆసుపత్రులను నడుపుతూ.. రోగులకు చికిత్స అందించడం చూసి మెడికల్ కౌన్సిల్ సభ్యులే ఖంగుతింటున్నారు. పైగా నిపుణులైన వైద్యులు సూచించే యాంటీబయాటిక్ ఇంజెక్షన్లు (అమికాసిన్), కార్టికోస్టెరాయిడ్ ఇంజెక్షన్లు (ప్రొజెస్టిరాన్, సెట్రోరెలిక్స్) వంటివి కూడా వీరి వద్ద పెద్దసంఖ్యలో ఉన్నట్లు గుర్తించారు. పలువురు ఆర్ఎంపీలు చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకే విచ్చలవిడిగా హై ఎండ్ యాంటీబయాటిక్స్‌ను రోగులకు ఇస్తున్నారు. దీంతో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ పెరుగుతుందని మెడికల్ కౌన్సిల్ ఆందోళన వ్యక్తంచేస్తోంది. కరోనాకన్నా యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ చాలా ప్రమాదకరమని చెబుతున్నారు. వీటిని అధికంగా వాడితే భవిష్యత్తులో పెద్ద సమస్యలు వచ్చినప్పుడు ఎలాంటి యాంటీబయాటిక్స్ పనిచేయవని, దాంతో రోగి ప్రాణాల మీదికి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

రిజిస్ట్రేషన్ ఉంటేనే ప్రాక్టీస్ చేయాలి..

➤ ఎంబీబీఎస్ పట్టా పొంది, మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు మాత్రమే అల్లోపతి వైద్యం చేయాల్సి ఉంటుంది. బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, వేరే ఏ ఆయుష్ కోర్సులు చేసినవారు కూడా అల్లోపతి వైద్యం చేయడం చట్టరీత్యా నేరం. అలాగే ఒక రకం స్పెషలైజేషన్ చేసినవారు వేరే స్పెషలైజేషన్ ప్రాక్టీస్ చేసినా నేరమే అవుతుందని మెడికల్ కౌన్సిల్ అధికారులు చెబుతున్నారు. కొందరు కార్పొరేట్ ఆసుపత్రుల వాళ్లు బిజినెస్ పెంచుకునేందుకు స్థానిక ఆర్ఎంపీలకు కమీషన్లు ఇచ్చి పేషెంట్లను రిఫర్ చేయించుకుంటున్నారని, ఈ విషయంలో కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఎంబీబీఎస్ పట్టా లేకుండా.. మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోకుండా వైద్యం చేస్తూ పట్టుబడితే ఏడాది జైలు శిక్ష.. రూ.5 లక్షల వరకు జరిమానా విధిస్తారు.



పలు జిల్లాల్లో ఆసుపత్రులపై నమోదైన కేసులు

జిల్లా	కేసుల సంఖ్య
హైదరాబాద్	150
ఖమ్మం	41
కరీంనగర్	50
నల్లగొండ	15
వికారాబాద్	15
షాద్‌నగర్	15
సూర్యాపేట	3
నిజామాబాద్	25
వరంగల్	50

ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన చికిత్స



రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో 4,600 సబ్‌సెంటర్లు ఉన్నాయి. ప్రతి రెండు గ్రామాలకు ఒక సబ్‌సెంటర్ అందుబాటులో ఉంది. 890 పీహెచ్‌సీలు ఉన్నాయి. పల్లె దవాఖానలను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఈ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందుబాటులో ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఆర్ఎంపీలపై ఆధారపడకుండా ఈ ఆసుపత్రులకు వెళ్లాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన మందులు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. నకిలీ వైద్యులను సంప్రదించి లేనిపోని ఆరోగ్య సమస్యలు తెచ్చుకోవద్దు.

– డాక్టర్ గుండగాని శ్రీనివాస్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వైస్ చైర్మన్

సేంద్రియ రైతులకు ఆహ్వానం

- ఢిల్లీలోని నా ఇంటికి సాదర స్వాగతం
- మెదక్ జిల్లా తునికి గ్రామ రైతులు నా ఆతిథ్యం స్వీకరించాలి
- ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఆహ్వానం
- ఘనంగా కేవీకే సేంద్రియ రైతు సమ్మేళనం



మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికిలోని కేవీకే ప్రాంగణంలో గిరిజన రైతులతో కలసి స్టెప్పులు వేస్తున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్

సాక్షి, సిద్దిపేట/రంగారెడ్డి జిల్లా/నందిగామ: భారతదేశ ఆర్థికాభివృద్ధిలో వ్యవసాయ రంగానిది కీలకపాత్ర అని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు. రైతుల ఆర్థిక ప్రగతే దేశ ఆర్థిక వ్యవస్థకు చోదక శక్తిగా పనిచేస్తుందని చెప్పారు. మెదక్ జిల్లాలోని తునికి గ్రామంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో బుధవారం నిర్వహించిన సేంద్రియ రైతు సమ్మేళనం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. మెదక్ జిల్లాలో 655 మంది రైతులు సేంద్రియ సేద్యం చేపట్టి దేశంలో చరిత్ర సృష్టించారని ప్రశంసించారు. తునికి గ్రామం తనకు మార్గదర్శకమని చెప్పారు. తునికి సేంద్రియ సాగు రైతులంతా మూడు రోజులపాటు ఢిల్లీలోని తన గృహానికి అతిథులుగా రావాలని ఆహ్వానించారు.

స్థానిక మార్కెటింగ్ పెంచాలి

2001లో అప్పటి ప్రధాని వాజ్‌పేయి కిసాన్ దివస్‌ను ప్రారంభించగా.. త్వరలో అత్యంత వైభవంగా రజతోత్సవం నిర్వహించుకోబోతున్నామని ఉపరాష్ట్రపతి చెప్పారు. ఇందులో దేశంలోని 730పైచిలుకు కేవీకేలు, 150 ఐకార్ సంస్థలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో పండించిన పండ్లు, కూరగాయలను అక్కడే విక్రయిస్తే.. ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ప్రతీ భారతీయుడు జాతీయవాదంపై విశ్వాసంతో ఉండాలని పిలుపునిచ్చారు.

సేంద్రియ సాగు పెరగటం శుభ పరిణామం: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సేంద్రియ వ్యవసాయ సమ్మేళనంలో 500 కుటుంబాలు పాల్గొనడం ఆనందంగా ఉందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. రైతులు సేంద్రియ సాగు దిశగా అడుగులు వేస్తూ.. రసాయనిక సాగును క్రమంగా తగ్గిస్తుండటం శుభ పరిణామం అని సంతోషం వ్యక్తంచేశారు. కేవీకేలో 43,337 మంది పురుషులు, 16,937 మంది మహిళా రైతులు సభ్యులుగా ఉండటం గొప్ప విజయమన్నారు. ఈ కార్యక్రమంలో సేంద్రియ రైతులు నరేందర్ రెడ్డి, ధనలక్ష్మిని ఉపరాష్ట్రపతి ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సతీమణి సుదేష్ ధన్‌ఖడ్, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, ఎంపీ రఘునందన్‌రావు, ఆర్ఎస్ఎస్ కార్యదర్శి భాగయ్య తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఉపరాష్ట్రపతి దంపతులకు శంషాబాద్ విమానాశ్రయంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీలు డాక్టర్ కె.లక్ష్మణ్, వద్దిరాజు రవిచంద్ర, కేఆర్ సురేష్ రెడ్డి, దామోదర్ రావు, పార్థసారధి రెడ్డి, డీజీపీ జితేందర్, తదితరులు ఘన స్వాగతం పలికారు.

కన్హా శాంతివనంలో ధ్యానం..

రంగారెడ్డి జిల్లా నందిగామలోని కన్హా శాంతివనం దేశంలో అత్యుత్తమ ఆధ్యాత్మిక కేంద్రంగా రూపుదిద్దుకుందని జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు. బుధవారం ఉపరాష్ట్రపతి దంపతులు కన్హా శాంతివనాన్ని సందర్శించారు. హార్ట్‌ఫుల్‌నెస్, శ్రీరామచంద్ర మిషన్ గురూజీ కమ్లేష్ పటేల్ (దాజీ)తో కలిసి వారు ధ్యానం చేశారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. కమ్లేష్ పటేల్ వలన ప్రతి ఒక్కరూ ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు. ధన్‌ఖడ్ దంపతులు రాత్రి కాన్హాలోనే బసచేశారు. గురువారం ఉదయం ధ్యానం చేసిన అనంతరం ఢిల్లీ వెళ్లనున్నారు.

జీవితాంతం అంబేడ్కర్‌ను అవమానించారు

- కాంగ్రెస్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ధ్వజం
- బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి శతజయంతి ఉత్సవం



బుధవారం బీజేపీ కార్యాలయంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో కె.లక్ష్మణ్, అనురాగ్ ఠాకూర్, ఈటల రాజేందర్, విశ్వేశ్వరరెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను జీవితాంతం అవమానించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు. ఆయనకు భారతరత్న ఇవ్వకపోగా, పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో కనీసం చిత్రపటం కూడా ఏర్పాటు చేయకపోవడం చూస్తే కాంగ్రెస్‌కు అంబేడ్కర్ పట్ల ఎలాంటి చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇందిరాగాంధీ సహా ఎంతోమందికి భారతరత్న ఇచ్చినా.. కాంగ్రెస్ అంబేడ్కర్‌కు ఇవ్వలేకపోయిందన్నారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా బుధవారం రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్‌ను రెండుసార్లు ఎన్నికల్లో కాంగ్రెస్ కావాలనే ఓడించిందని ఆరోపించారు. ఎన్డీయే హయాంలోనే అంబేడ్కర్‌కు భారతరత్న ఇచ్చామని గుర్తుచేశారు. ఏడాదిపాటు వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వాజ్‌పేయి జీవితం దేశానికి ఆదర్శమని, ఆయన ప్రసంగం వినడానికి దేశం నలుమూలల నుంచి వేలాదిమంది వచ్చేవారన్నారు. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించడంతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని.. అప్పట్లో జయప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలో వాజ్‌పేయి జనసంఘ్ నేతలతో కలిసి పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని, వారి సర్టిఫికెట్ బీజేపీకి అవసరం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ కుటుంబ, అవినీతి, నియంతృత్వ రాజకీయాల గురించి ప్రజలకు వివరిస్తూ.. కాంగ్రెస్ నిజస్వరూపాన్ని ఇంటింటికీ తెలియచేస్తామని కిషన్‌రెడ్డి అన్నారు.

అబద్ధాల్లో కాంగ్రెస్‌కు ఆస్కార్: బండి సంజయ్

కాంగ్రెస్ పార్టీకి అబద్ధాల్లో ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ 70 ఎంఎం సినిమా చూపించి ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. వాజ్‌పేయి అందరికీ స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. దేశభక్తి, అభివృద్ధి, చతుర్భుజి పేరిట జాతీయ రహదారుల నిర్మాణంతో దేశాన్ని ఒక ప్రాంతంతో మరో ప్రాంతాన్ని అనుసంధానించారన్నారు. అన్ని పార్టీల్లోనూ ఆయనను అభిమానించే నేతలు ఉన్నారని చెప్పారు. ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా పండుగ వాతావరణంలో వాజ్‌పేయి శతజయంతి వేడుకలు జరుగుతున్నాయన్నారు. సంతుష్టీకరణ విధానాలకు వాజ్‌పేయి వ్యతిరేకమని, అవినీతికి ఆమడ దూరం ఉన్నారని చెప్పారు. మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, వాజ్‌పేయి మధ్య మంచి అనుబంధం ఉందని చెప్పారు. కాంగ్రెస్‌కు, అంబేడ్కర్ గురించి మాట్లాడే కనీస అర్హత లేదని, అంబేడ్కర్‌కు భారతరత్న ఇవ్వని కాంగ్రెస్ అంబేడ్కర్ గురించి మాట్లాడటం విడ్డూరమన్నారు. ఈ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

క్రైస్తవ మైనార్టీల అభ్యున్నతికి కృషి: భట్టి



కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మధిర: క్రైస్తవ మైనార్టీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఖమ్మం జిల్లా మధిర మండలం బయ్యారం రోమన్ కేథలిక్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. అన్ని మతాల అభ్యున్నతికి స్థిర సంకల్పంతో పని చేస్తున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడో రేపో కేటీఆర్‌కు ఏసీబీ సమన్లు!

- ఫార్ములా ఈ రేస్ కేసులో అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలకు కూడా
- కేబినెట్ నిర్ణయం లేకుండానే నిధుల మళ్లింపు: దానకిశోర్

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా ఈ-కార్ రేసు వ్యవహారంలో ఆర్థికశాఖ నుంచి ఎలాంటి అనుమతులు కానీ.. కేబినెట్ నిర్ణయం కానీ లేకుండానే నిధుల మళ్లింపు జరిగినట్లు ఫిర్యాదుదారు, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ తన వాంగ్మూలంలో వెల్లడించారు. ఇందుకు సంబంధించి హిమాయత్‌నగర్‌లోని ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్‌లో గల హెచ్ఎండీఏ బోర్డ్ రికార్డులను కూడా ఏసీబీ అధికారులకు అందించారు. దానకిషోర్ వాంగ్మూలాన్ని బుధవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో వాంగ్మూలంలోని అంశాలే కీలకం కాబోతున్నాయి. దీని ఆధారంగా ఏసీబీ అధికారులు తదుపరి చర్యలు ప్రారంభించనున్నారు. నేడో రేపో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్, ప్రస్తుతం ప్రకృతి విపత్తుల నిర్వహణ విభాగంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న అర్వింద్‌కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బి.లక్ష్మీ నర్సింహారెడ్డిలకు సమన్లు జారీ చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

రికార్డులు సేకరించిన ఏసీబీ

ఈ కేసును దర్యాప్తు చేస్తున్న ఏసీబీ డీఎస్పీ మాజిద్ అలీఖాన్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం మంగళవారం దానకిశోర్ నుంచి వివరాలు సేకరించింది. దర్యాప్తులో భాగంగా ఎంఏయూడీ, ఫార్ములా ఈ ఆపరేషన్స్, ఎస్ నెక్స్ట్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య జరిగిన ఒప్పంద రికార్డులు, జీవోలను ఏసీబీ అధికారులు దానకిషోర్ నుంచి సేకరించినట్లు సమాచారం. దానకిశోర్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి జరిగిన పరిణామాలకు సంబంధించి కూడా వాంగ్మూలం రికార్డ్ చేశారు. 2024 ఫార్ములా-ఈ రేస్‌కు సంబంధించి సీజన్ 10 నిర్వహణ కోసం హెచ్ఎండీఏ బోర్డు నుంచి రూ.54.89 కోట్లు ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో) బదిలీలో అవకతవకలు జరిగినట్లు దానకిశోర్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

నన్ను అడ్డం పెట్టుకుని కేటీఆర్ అరెస్టుకు కుట్ర

- లగచర్ల ఘటనతో సంబంధం లేకున్నా నన్ను ఇరికించారు
- సీఎం రేవంత్‌రెడ్డిది పైశాచిక ఆనందం: పట్నం నరేందర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పట్నం నరేందర్‌రెడ్డి

పరిగి/బొంరాస్‌పేట: రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి తనను లగచర్ల కేసులో ఇరికించారని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. సీఎం తనను 37 రోజులు జైల్లో ఉంచి పైశాచిక ఆనందం పొందారే తప్ప.. ఏమీ చేయలేకపోయారన్నారు. ఎలాంటి వారెంట్‌లు, ఎఫ్ఐఆర్‌లో పేరు లేకుండానే తనను అక్రమంగా అరెస్ట్ చేశారని తెలిపారు. ఈ కేసులో తనను అడ్డం పెట్టుకుని, కేటీఆర్‌ను జైలుకు పంపేందుకు కుట్ర పన్నారని, జైలు నుంచి తాను జడ్జికి ఉత్తరం రాయడంతోనే అది ఆగిపోయిందని తెలిపారు. కేటీఆర్ సూచనల మేరకే తాను లగచర్ల దాడి చేయించానని, జైలులో ఉండగా పత్రికల్లో చదివి అవాక్కయ్యానని పేర్కొన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా పరిగిలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి నివాసంలో నరేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రజల తరఫున ప్రశ్నించే గొంతులను నొక్కేందుకు ప్రభుత్వం, రేవంత్‌రెడ్డి కుట్ర చేశారని మండిపడ్డారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించిన పాపానికి కొడంగల్ రైతుల చేతులకు బేడీలు వేయించిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కిందని ధ్వజమెత్తారు. పోలీసులు, ప్రభుత్వ వైఫల్యంతోనే లగచర్ల ఘటన జరిగిందన్నారు. అంతకుముందే దాడి జరిగినా.. సెక్యూరిటీ లేకుండా కలెక్టర్‌ను ఎలా పంపిస్తారని ప్రశ్నించారు. హామీలపై రైతుల దృష్టి మళ్లించేందుకే రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో అల్లు అర్జున్ కేసుపై చర్చించారన్నారు. కాగా, లగచర్ల ఘటనలో జైలుకు వెళ్లి, బెయిల్‌పై బయటకు వచ్చిన పట్నం నరేందర్‌రెడ్డి.. కోర్టు ఆదేశాల మేరకు బుధవారం బొంరాస్‌పేట పోలీస్ స్టేషన్‌లో హాజరై రికార్డులో సంతకం చేశారు.

తెలుగు మాధ్యమంలో చెప్పేదెవరు?

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర విద్యాశాఖ జరిపిన అధ్యయనంలో పలు ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. ముఖ్యంగా స్కూల్ స్థాయిలో తెలుగు మీడియం పరిస్థితి అంతంత మాత్రంగానే తేలింది. తెలుగు మీడియంలో బోధించడం ఉపాధ్యాయులకు కూడా ఇబ్బందిగానే ఉందని విద్యా శాఖ అధికారులు చెబుతున్నారు. ఇంగ్లిష్ వాడుక భాషగా మారడం, కొత్తతరం ఉపాధ్యాయ వృత్తిలోకి రావడంతో తెలుగు బోధనలోనూ ఇంగ్లిష్ పదాలు దొర్లుతున్నాయని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో ఉన్నత విద్యను తెలుగులో బోధించడంపై సమగ్ర అధ్యయనం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై నిపుణులతో కమిటీ వేసే యోచనలో ఉన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

చూపంతా ఆంగ్ల మాధ్యమం వైపే..

రాష్ట్రంలో తెలుగు మీడియం కన్నా ఇంగ్లిష్ మీడియం వైపే ప్రజలు మొగ్గుతున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో తెలుగు మీడియం అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులు కేవలం 0.6 శాతం మాత్రమే. ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఇది 6.7 శాతమే కావడం గమనార్హం. రాష్ట్రంలో 41,628 ప్రభుత్వ, ప్రైవేటు బడులు ఉండగా.. వాటిలో 59 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ బడుల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థుల సంఖ్య 22,63,491 మందికాగా.. ఇందులో 4,08,662 మంది (18 శాతం) మాత్రమే తెలుగు మీడియంలో చదువుతున్నారు. ప్రైవేటు స్కూళ్లలో 34,92,886 మంది చదువుతుంటే... అందులో 20,057 మంది (0.57 శాతం) మాత్రమే తెలుగు మీడియం విద్యార్థులు ఉండటం గమనార్హం. ఎయిడెడ్ స్కూళ్లలో చదువుతున్న 62,738 మందిలో 8,960 మంది మాత్రమే తెలుగు మీడియం వారు.

ఇంగ్లిష్ ముక్కలొస్తే చాలంటూ..

గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం చదివించాలనే భావిస్తున్నారని విద్యాశాఖ పరిశీలనలో తేలింది. ప్రభుత్వ స్కూళ్లలో 2023 నుంచి ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టినా... ప్రైవేటుకే మొగ్గుచూపుతున్న పరిస్థితి. ఇంగ్లిష్ నేర్చుకుని, మాట్లాడటం వస్తే చాలన్న భావన కనిపిస్తోందని అధికారులు అంటున్నారు. మరోవైపు టెన్త్, ఇంటర్ తర్వాత దొరికే చిన్నా చితకా ఉద్యోగాలకూ ఆంగ్ల భాష ప్రామాణికంగా మారిందని.. దీనితో ప్రైవేటు బడుల్లో ఆంగ్ల మాధ్యమం కోసం పంపుతున్నారని పేర్కొంటున్నారు. మరోవైపు ప్రభుత్వ బడుల్లోనూ తెలుగు మీడియం కంటే ఆంగ్ల మాధ్యమంలో చేరడానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మాతృభాషలో విద్యా బోధన ఉండాలన్న కేంద్రం సూచనలపై పీటముడి పడుతోంది. తెలుగు మీడియంలో చేరేవారెవరు, బోధించేవారెవరనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ప్రభుత్వ స్కూళ్లలో తెలుగు మీడియంలో చేరిన విద్యార్థుల శాతం (2024-25 విద్యా సంవత్సరం)

తరగతి	శాతం
2	11
3	21
4	26
5	21
6	16
7	14
8	14
9	20
10	24

తరగతుల వారీగా ఇంగ్లిష్ మీడియంలో చేరినవారి శాతం

తరగతి	శాతం
2	93.19
3	93
4	92.89
5	92.14
6	93
7	94
8	95.05
9	94.71
10	95.71

ప్రైవేటు స్కూళ్లలో ఈ ఏడాది 4.40 లక్షల మంది చేరారు. వారిలో 1,460 మంది తెలుగు మీడియంలో చేరారు.

రాష్ట్రంలో తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు ఇలా..

స్కూల్ రకం	మొత్తం	తెలుగు	ఇంగ్లిష్
ప్రభుత్వ	22,63,491	4,08,662	16,12,199
ఎయిడెడ్	62,738	89,60	45,061
ప్రైవేటు	34,92,886	20057	31,49,282

నేను ఒక మూల కోసం జన్మించలేదు: ప్రపంచం మొత్తం నా స్వస్థలమే.
– సెనెకా

సాక్షి
గురువారం, 26 డిసెంబర్ 2024

ఈ మార్పు మంచికేనా?!

విద్య–సమాజం విడదీయలేనివి. అవి ఏకకాలంలో పరస్పరాశ్రితాలు, పరస్పర ప్రభావితాలు కూడా. ఒక సమాజంలో పిల్లలకు అందే విద్య ఆ సమాజ స్థాయికి ప్రతిబింబంగా ఉంటుంది. క్రమేపీ ఆ సమాజాన్ని మెరుగుపరుస్తుంది. తిరిగి ఆ ప్రభావంతో విద్య ఉచ్ఛస్థితికి వెళ్తుంటుంది. అందువల్లే సమాజ స్థితిగతుల అధ్యయనం ఆధారంగా విద్యావిధాన నిర్ణయాలుండాలంటారు. పాఠశాల విద్యలో ప్రస్తుతం అమలవుతున్న 'నో డిటెన్షన్' విధానాన్ని కేంద్రం రద్దు చేయటంపై లోతైన చర్చే సాగుతోంది. కేంద్రీయ విద్యాలయాలూ, నవోదయా విద్యాలయాలూ, సైనిక్ స్కూళ్లతోపాటు కేంద్రం నడిపే మరో 3,000 పాఠశాలల్లో తక్షణం ఈ విధానం అమల్లోకొచ్చింది. పర్యవసానంగా ఇకపై అయిదు, ఎనిమిది తరగతుల వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేనివారికి రెండు నెలల్లో పరీక్షలు నిర్వహిస్తారు. రెండోసారి కూడా ఫెయిలైతే వారు తిరిగి అవే తరగతులు చదవాలి. వాస్తవానికి ఈ విధానం రద్దు కోసం 2019లోనే విద్యాహక్కు చట్టాన్ని కేంద్రం సవరించింది. విద్య ఉమ్మడి జాబితాలో ఉన్నది కనుక రద్దు నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు వదిలేసింది. అప్పట్లో 16 రాష్ట్రాలూ, 2 కేంద్రపాలిత ప్రాంతాలూ కేంద్ర విధానానికి అంగీకారం తెలిపాయి. కానీ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటి కొన్ని రాష్ట్రాలు మాత్రం వ్యతిరేకించాయి. నిర్ణయం తీసుకున్న అయిదేళ్ల తర్వాత తాజాగా నోటిఫికేషన్ వెలువడింది.

'నో డిటెన్షన్' విధానంపై అనుకూల వాదనలు ఎన్ని వున్నాయో, ప్రతికూల వాదనలు కూడా అంతకు మించే ఉన్నాయి. అనుకూల వాదనలు తీసిపారేయదగ్గవి కాదు. ఈ విధానంవల్ల డ్రాపౌట్ల శాతం గణనీయంగా తగ్గిందని, ఉత్తీర్ణత సాధించలేమన్న భయాన్ని విడనాడటంవల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతున్నదని, అందరూ తమను చిన్నచూపు చూస్తారన్న ఆందోళన తగ్గిందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఒక విద్యార్థిని ఫెయిల్ చేసినంత మాత్రాన నైపుణ్యం పెరుగుతుందన్న గ్యారెంటీ ఏమీ లేదని, పైగా తనతో చదివినవారంతా పై తరగతులకు పోవటంవల్ల ఆత్మన్యూనతకు లోనై, ఒత్తిడి పెరిగి విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉన్నదని కూడా 'నో డిటెన్షన్' సమర్థకులు చెబుతున్నారు. విద్యాహక్కు చట్టం 'నో డిటెన్షన్' విధానం పెట్టి ఊరుకోలేదు. అందులోని 29(2)(హెచ్) నిబంధన విద్యాబోధన తీరుతెన్నులనూ, పిల్లల అధ్యయన నైపుణ్యాలనూ మెరుగుపరిచేందుకు సమగ్ర, నిరంతర మూల్యాంకన(సీసీఈ) విధానం ఉండాలని సూచిస్తోంది. సంప్రదాయ పరీక్ష విధానానికి బదులుగా నిర్దేశించిన ఈ విధానం ఆచరణలో ఎలా అమలవుతున్నదో ఎవరైనా పరిశీలించారా? ఇది సక్రమంగా అమలైతే ఎప్పటికప్పుడు పిల్లల గ్రాహకశక్తిని అంచనా వేసి చదువుల్లో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవటానికి అవకాశం ఉండేది. కానీ ఉపాధ్యాయులకు అప్పజెప్పే ఇతరేతర పనులవల్ల కావొచ్చు... వారిలోని అలసత్వం వల్ల కావొచ్చు– పిల్లలపై శ్రద్ధ తగ్గిందన్నది 'నో డిటెన్షన్' విధానం రద్దు అనుకూలుర మాట. 'ఎలాగైనా' ఉత్తీర్ణులమవుతామన్న ధైర్యంతో పిల్లలు చదవటం లేదని, అలాంటివారి విషయంలో ఉపాధ్యాయులు కూడా నిర్లిప్తంగా ఉండిపోతున్నారని, ఇందువల్ల ఇతర పిల్లలపై కూడా ఆ ప్రభావంపడి మొత్తంగా విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయని వారి వాదన.

చాలా రాష్ట్రాల్లో పాలకులు పాఠశాల విద్యపై సమగ్ర దృష్టి సారించటం లేదు. ఈ విషయంలో కేరళ తర్వాత ఢిల్లీ చెప్పుకోదగ్గ ప్రగతి సాధించింది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో ఆంధ్రప్రదేశ్‌లో విద్యారంగ ప్రక్షాళన ఒక యజ్ఞంలాగే నడిచింది. ఒకపక్క సకల సదుపాయాలతో పాఠశాల భవనాలను తీర్చిదిద్దటంతోపాటు పిల్లల చదువులను మెరుగుపరిచేందుకు వీలుగా తరగతి గదుల్లో ఎన్నో బోధనోపకరణాలు ప్రవేశపెట్టారు. విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. విద్యాబోధనపై ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. సీబీఎస్‌ఈ, ఐబీ సిలబస్‌ల అమలుకు అంకురార్పణ చేశారు. ఈ తరహా సిలబస్‌లు ప్రవేశపెట్టిన ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్ వంటివి ట్యూషన్ ఫీజు కింద రూ. 14 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకూ వసూలు చేస్తున్నాయని ఈమధ్య మీడియా కథనాలు వెల్లడించాయి.

ప్రభుత్వాలు పాఠశాల విద్యను నిరంతరం పర్యవేక్షించి తగినంతమంది టీచర్లను నియమిస్తే, సదుపాయాలు మెరుగుపరిస్తే, ప్రామాణికమైన సిలబస్‌లు ప్రవేశపెడితే పిల్లల నైపుణ్యాలు పెరుగుతాయి. ప్రైవేటు విద్యలో ఎల్‌కేజీ నుంచే పిల్లల్లో పోటీ తత్వాన్ని పెంచే అనారోగ్యకర విధానాలు అమలవుతున్నాయి. కాన్సెప్ట్ స్కూళ్లు ఈ పోటీని మరింత పెంచాయి. 'పిండికొద్దీ రొట్టె' అన్నట్టు డబ్బు పారేస్తే తమ పిల్లలు అమాంతం ఎదుగుతారన్న భ్రమల్లో తల్లిదండ్రులున్నారు. మరి సర్కారీ బడుల్లో పిల్లల్ని చదివిస్తున్న పేద తల్లిదండ్రులు ఏం కావాలి... వారి పిల్లలకు మెరుగైన విద్య ఎలా అందాలి? గోరుచుట్టుపై రోకటి పోటులా ఇప్పుడున్న 'నో డిటెన్షన్' విధానం రద్దయితే పేద పిల్లలు ఎప్పటికి మెరుగుపడాలి? ఎదిగాక ఏం చేయాలి? కేంద్రం ఏ విధానం అమలు చేయదల్చుకున్నా దానికి ముందు బావురుమంటున్న ప్రభుత్వ బడులను ఉద్ధరించాలి. అక్కడి పిల్లలకు కడుపు నిండా తిండి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే బోధన ఉంటున్నాయో లేదో గమనించాలి. ఉపాధ్యాయుల నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించాలి. వారిని బోధనకే పరిమితం చేయాలి. 'నాణ్యత అనేది యాదృచ్ఛికంగా ఊడిపడదు. అది నిరంతరం కొనసాగే వేనవేల బౌద్ధిక చర్యల సమాహారం' అన్నారు ప్రముఖ శాస్త్రవేత్త ఐన్‌స్టీన్. పాలకులు దాన్ని గుర్తెరగాలి.

వ్యవసాయ ప్రమాదాలపై విధానమేది?

విశ్లేషణ



డా॥ దొంతి నరసింహా రెడ్డి

వ్యవసాయ కార్మికులు అనేక రకాల ప్రమాదాలకు లోనవుతున్నారు. కరెంటు షాకులు, రసాయనాల (పురుగు మందుల) విష ప్రభావం, పాము కాట్లు, యంత్రాలు, పిడుగులు, వడదెబ్బ, ఇంకా అనేక ఇతర సహజ, అసహజ, మానవ తప్పిదాలు వ్యవసాయ కార్మికుల భౌతిక భద్రతను ప్రభావితం చేస్తున్నాయి. వాటి బారిన పడి కుటుంబాలు ఛిద్రం అవుతున్నాయి. కానీ దేశంలో సంఖ్యాపరంగా అతి పెద్ద శ్రామిక శక్తిగా ఉన్న వ్యవసాయ రంగం పట్ల సర్కారుల పూర్తి స్థాయి నిర్లక్ష్యం కనబడుతుంది. వ్యవసాయ కూలీలకు ప్రమాదాలు ఎదురైతే రాజకీయ, సామాజిక స్పందన శూన్యం. చట్టాలు కూడా వీళ్ళ విషయంలో ఏమీ నిర్దేశించడం లేదు. వ్యవసాయ కార్మికులందరికీ వైద్య, ఆర్థిక సహాయంతో కూడిన ఉపశమన విధానాన్ని రూపొందించాలి.

పరికరాలు, యంత్రాలు, రసాయనాలు, డ్రోన్లు, మోటార్లు, 'రసాయన' పూత విత్తనాలు వగైరాలను వ్యవసాయంలో ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం దానికి తగిన శ్రేయో మార్గదర్శకాలు రూపొందించడం లేదు. ప్రమాదాల బారిన పడిన వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతుల సత్వర చికిత్సకు ఏర్పాట్లు లేవు. నష్టపరిహారం, ఆర్థిక మద్దతు వగైరా అంశాలు గురించి ఆలోచననే లేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒక రైతు రసాయన పిచికారీ చేస్తూ స్పృహ తప్పితే పొలంలో నుంచి గ్రామంలోకి తేవడానికి 3 గంటలు పట్టింది. జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లేసరికి ప్రాణం పోయింది. వ్యవసాయంలో ప్రవేశపెడుతున్న 'ఆధునిక' పరికరాలు, రసాయనాలతో జరిగే ప్రమాదాలకు సంబంధించి ప్రాథమిక వైద్య కేంద్రాలలో కనీస చికిత్స, మందులు లేవు. జిల్లా ఆసుపత్రిలోనే ఉండవు. విద్యుదాఘాతం కారణంగా ప్రతిరోజూ కనీసం ముప్పై మంది భారతీయులు చనిపోతున్నారని అంచనా. ఇందులో ఎక్కువ శాతం గ్రామీణ ప్రాంతాలలోనే జరుగుతున్నాయి. వీళ్లలో వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతులే ఎక్కువ.

ప్రమాదకరమైన వృత్తి

న్యూఢిల్లీలోని 'ఇండియన్ అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' సహకారంతో 'జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి' ఆధ్వర్యంలో 2004–07 నుంచి 2012–13 మధ్య కాలానికి వ్యవసాయ ప్రమాద సర్వే జరిగింది. ఒక సంవత్సరంలో మొత్తం సంఘటనల రేటు లక్ష మంది కార్మికులకు 334 ప్రమాదాలు కాగా, మరణాల రేటు లక్ష మంది కార్మికులకు 18.3గా ఉంది. ఇది చాలా తక్కువ అంచనా. వాస్తవంగా వ్యవసాయంలో వివిధ ప్రమాదాల మీద, తదుపరి పర్యవసానాల మీద ఏ ఒక్క ప్రభుత్వ సంస్థ సమాచారం సేకరించడం లేదు. యాంత్రీకరణ, రసాయనీకరణ, డిజిటలీకరణను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు వాటి ఉపయోగం వల్ల ఏర్పడుతున్న ప్రమాదాలు, సంభవిస్తున్న మరణాల పట్ల దృష్టి పెట్టడం లేదు.

ఆధునికత పొంగిపొర్లే అమెరికాలోనే వ్యవసాయం ప్రమాదకర వృత్తిగా పరిణమిస్తున్న వైనాన్ని అక్కడి పరిశోధకులు చెబుతున్నారు. అమెరికా వ్యవసాయ శాఖకు సంబంధించిన 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్' మద్దతుతో చేసిన ఒక అధ్యయనం, ఐదేళ్ల కాలంలో జరిగిన ప్రమాదాలను విశ్లేషిస్తూ వ్యవసాయ పరిశ్రమ గతంలో అనుకున్న దానికంటే మరింత ప్రమాదకరమైనదని సూచించింది. 2015–19 వరకు 60,000 మందికి పైగా వ్యవసాయ సంబంధిత గాయాలతో అత్యవసర చికిత్స పొందారని వెల్లడించింది. గాయపడిన వారిలో దాదాపు మూడోవంతు మంది యువకులు.

ట్రాక్టర్లు, డ్రోన్ల ప్రమాదాలు

భారతదేశంలో మధ్యప్రదేశ్‌లో 1995–99 వరకు, సంవత్సరానికి



ప్రతి 1000 మంది వ్యవసాయ కూలీలలో 1.25 మందికి పని చేసే సమయంలో గాయాలు, దాదాపు 9.2% మరణాలు అయినట్లు ఒక అధ్యయనం కనుగొంది. అత్యధిక మరణాలు ట్రాక్టర్లు, పాము కాటు వల్ల జరిగాయి. మరణాలు, గాయాలతో ఆర్థిక నష్టం కూడా ఎక్కువే. ఉత్తరప్రదేశ్‌లోని ఒక జిల్లాలో వ్యవసాయంలో ప్రమాదాల కారణంగా ఏటా సుమారు రూ.6.19 కోట్ల నష్టం వాటిల్లుతోందని ఒక అధ్యయనం అంచనా వేసింది. దేశంలో సగటున వ్యవసాయ క్షేత్ర ప్రమాదాలలో ట్రాక్టర్ ప్రమాదాలు అత్యధికం (పల్టీలు కొట్టడం, ట్రాక్టర్ నుండి పడిపోవడం మొదలైనవి) (27.7%). తర్వాత నూర్పిడి యంత్రాల వల్ల (థ్రెషర్) (14.6%), పిచికారీ (స్ప్రేయర్/డస్టర్) వల్ల (12.2%), చెరకు క్రషర్ (8.1%), గడ్డి కట్టర్ (7.8%) వల్ల జరిగాయి.

ఇప్పుడు కొత్తగా డ్రోన్లు వస్తున్నాయి. 2010–17 మధ్య కాలంలో అమెరికాలో 12,842 మందికి డ్రోన్ల వల్ల గాయాలైనాయి. భారతదేశంలో దాదాపు ఆరు లక్షలకు పైగా డ్రోన్లు ఉపయోగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీలు ఇచ్చి వీటి వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నది. వీటి వల్ల కలిగే ప్రమాదాల మీద మాత్రం ఏ సంస్థ సమాచారం సేకరించడం లేదు. పెరుగుతున్న డ్రోన్ల సంఖ్య చూస్తే, సంబంధిత ప్రమాదాలు పెరగడం అనివార్యంగా కనిపిస్తోంది.

పని కోసం వెళ్తున్నప్పుడు జరిగే ప్రమాదాల గురించి ప్రభుత్వం, యాజమాన్యాల స్పందన మీద చట్టం నిశ్శబ్దంగా ఉన్నది. పని ప్రదేశంలో భద్రత కల్పించే బాధ్యత ఆ యా వ్యక్తులు, లేదా సంస్థల మీదనే ఉంటుంది. కానీ పని ప్రదేశం చేరకముందు జరిగే ప్రమాదాల బాధ్యత ఎవరి మీదా ఉండటం లేదు.

అదే 'యూరోపియన్ కోర్ట్ ఆఫ్ జస్టిస్' ప్రకారం, కార్మికుల ప్రయాణ సమయాన్ని కూడా పని సమయంగా పరిగణించాలి. అప్పుడు వారి భద్రత కూడా పని ఇచ్చేవారి మీద ఉంటుంది. ప్రయాణ సమయంలో కార్మికుల భద్రత, ఆరోగ్యాన్ని కాపాడవలసిన అవసరాన్ని ప్రపంచ కార్మిక సంస్థ 'గ్లోబల్ స్ట్రాటజీ ఆన్ ఆక్యుపేషనల్ సేఫ్టీ అండ్ హెల్త్' 2024–2030 నొక్కి చెబుతోంది.

బాధితులకు ఉపశమనం కలిగేలా...

2024 నవంబర్‌లో అనంతపురం జిల్లా ధర్మవరం సమీపంలో ఆర్టీసీ బస్సు, ప్యాసింజర్ ఆటో ఢీకొన్న ప్రమాదంలో 9 మంది వ్యవసాయ కూలీలు మరణించారు. 2019 ఆగస్టులో మహబూబ్ నగర్ జిల్లా మిడ్జిల్ మండలం కొత్తపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో రిక్షాను లారీ ఢీకొనడంతో 14 మంది వ్యవసాయ కూలీలు మృతి చెందారు.

ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు, కొన్ని కుటుంబాలు వైద్య చికిత్స కోసం ఉన్న అరకొర ఆస్తులను అమ్ముకోవాల్సి వస్తున్నది. సరైన సమయంలో చికిత్స లభించనందున దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రమాద బాధితుల వైద్యానికి బీమా నుంచి కూడా మద్దతు లేదు. రవాణా వాహన ప్రమాదాలలో వ్యవసాయ కార్మికులకు థర్డ్ పార్టీ బీమా ప్రయోజనం ఉండదు. వారి ప్రయాణం తరచుగా నాన్ పర్సనల్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలలో ఉంటుంది. గ్రామీణ ప్రాంతాలలో ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలకు సాధారణంగా బీమా ఉండదు. డ్రైవర్‌కు లైసెన్స్ కూడా ఉండదు. ఒకే వాహనంలో ఎక్కువ మంది ప్రయాణించడం కూడా ఒక కారణం.

ప్రమాదాల కారణంగా రోజువారీ కూలీపై ఆధారపడిన కుటుంబాలు ఇంకా పేదరికంలోకి నెట్టబడుతున్నాయి. అవయవాలను కోల్పోయి వికలాంగులైతే, ఆ కుటుంబం పరిస్థితి ఇంకా దుర్భరంగా ఉంటుంది. ప్రమాదాలలో మరణమే మేలు అనే విధంగా పరిణామాలు ఉంటున్నాయి.

వ్యవసాయ కార్మికులందరికీ, ప్రత్యేకించి క్షేత్రస్థాయి కూలీలు, మహిళలపై దృష్టి సారించి, వైద్య, ఆర్థిక సహాయంతో కూడిన ఉపశమన విధానాన్ని రూపొందించాలి. ప్రతి గ్రామీణ ప్రమాదాన్ని నమోదు చేయాలి, దర్యాప్తు చేయాలి. ఇది జరగాలంటే, మోటారు వాహనాల రవాణా చట్టంతో సహా సంబంధిత చట్టాల్లో తగిన సవరణలు చేయవలసి రావచ్చు. తమ తప్పులేకుండా బలిపశువులయ్యే వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు మోటారు వాహనాల చట్టంలోని నిబంధనలను మెరుగుపరచాలి.

వ్యవసాయ మార్కెట్ సెస్, ఇతర పద్ధతుల ద్వారా ఒక ప్రమాద సహాయ నిధి ఏర్పాటు చేయాలి. వ్యవసాయ కూలీలకు కనీస బీమా కవరేజీ రూ.5 లక్షలతో ప్రారంభించి ముస్ముందు పెంచాలి. రవాణా మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలి.

వ్యాసకర్త వ్యవసాయరంగ నిపుణులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అధికారికం కాదు!



షేక్ హసీనాను అప్పగించమని అధికారికంగా బంగ్లాదేశ్ కోరినట్టు భారత మీడియా పొరబడుతోంది. అది కేవలం 'నోట్ వెర్బల్' (దౌత్య చీటి). అది ఇంకో దేశపు సాయానికి వినతి. ఇరుదేశాలు చేసుకున్న ద్వైపాక్షిక అప్పగింతల ఒప్పందంలో స్పష్టంగా రాజకీయ కేసులను మినహాయించారు కాబట్టి, బంగ్లాదేశ్ ఇంకా న్యాయకోణాన్ని పరిశీలిస్తోంది.

– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల నిపుణుడు

వేర్వేరుగా ఉండనిద్దాం!



సిక్కు రాజకీయాలు మన మతంలోకి చొరబడుతున్నాయా, లేక మన మతమే సిక్కు రాజకీయాల్లోకి చొరబడుతోందా నాకు అర్థం కావడం లేదు. లేదా రెండు రకాలుగా జరుగుతోందా? ఏదైనా అది రాజకీయాలకూ, మతానికీ హాని చేస్తోంది.

– అమర్ జిత్ సింగ్, మాజీ దౌత్యవేత్త

మామూలు అదృష్టాలు



నాగరికతను చాలా మందిమి తేలిగ్గా తీసుకుంటాం. పొద్దున్నే వేడి నీటితో స్నానం చేయడం: రాత్రిపూట ఏ భయం లేకుండా, దొంగతనానికో, హత్యకో గురికాకుండా దేశమంతా తిరగడం... ఇలాంటివి అదృష్టాలు. చరిత్రలో ఇలాంటివి అరుదు. ఇప్పటికీ అలాగే ఉంది.

– ఎమీ దార్, ఇజ్రాయెల్ యాక్టివిస్ట్

పెంపవుతోంది!



పారిస్‌లో చిన్నపిల్లల కన్నా పెంపుడు కుక్కపిల్లల సంఖ్య ఎక్కువ. చూస్తుంటే 'పెట్ ఎకానమీ' ప్రపంచాన్ని నియంత్రించేట్టుగా ఉంది.

– రాజేశ్ సహానీ, ఇన్వెస్టర్

తెలిసేది అప్పుడే!



రక్తం మీకు సంబంధం కలుపుతుంది. కానీ విధేయత అనేది మిమ్మల్ని ఎప్పటికీ సోదర సోదరీమణులుగా మారుస్తుంది. విధేయత అనేదాన్ని శాంతిగా ఉన్నప్పుడు పరీక్షించలేం; కేవలం యుద్ధాలు, సంక్షోభాల్లోనే అది నిగ్గు తేలుతుంది.

– వెలీనా త్చకరోవా, ఆస్ట్రియా వ్యాఖ్యాత

హామీ పట్టించుకోకపోతే ఎలా?

విద్యాశాఖలో భాగంగా ఉన్న 'సమగ్ర శిక్ష' పథకంలో ప్రతిష్టంభన ఏర్పడింది. గత 15 సంవత్సరాలుగా 27 వేల మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఈ పథకం ద్వారా విద్యా శాఖలో పని చేస్తున్నారు. ఇందులో 25,728 మంది కాంట్రాక్టు ఉద్యోగులు కాగా 1,890 మంది ఔట్ సోర్సింగ్ పద్ధతిలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీరు నియామకం అయిన నాటి నుండి నేటి వరకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నప్పటికీ ప్రభుత్వం వీరిని చిన్నచూపు చూస్తూ తక్కువ వేతనాలు ఇస్తున్నది. 'పంజాబ్ రాష్ట్రం – జగ్జీత్ సింగ్' వివాదంలో సుప్రీంకోర్టు ఇచ్చిన 'సమాన పనికి సమాన వేతనం' తీర్పు ప్రకారం బేసిక్ పే స్కేలును అమలు చేయకుండా కాంట్రాక్టు ఉద్యో గులకు తీవ్ర అన్యాయం చేస్తోంది. అన్ని అర్హతలు ఉండి చట్ట ప్రకారం నియమించ బడినప్పటికీ వీరికి కనీస వేత నాలు చెల్లించడం లేదు. ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసి పే స్కేలును అమలు చేయడం గమనార్హం.



రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్ష పథకంలో 27,168 మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానాలలో పని చేస్తున్నారు. రాష్ట్ర గణాంకాల ప్రకారం... రాష్ట్ర కార్యాలయంలో 77 మంది, జిల్లా కార్యాలయాలలో 388 మంది, మండల విద్యా వనరుల కేంద్రాలలో 602 మంది ఎమ్ఐఎస్ కోఆర్డినేటర్లు, 602 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు, 600 మెసెంజర్లు; భవిత కేంద్రాలలో 1,204 ఐఈఆర్పీలు, 602 మంది కేర్ గివర్లు; పాఠశాల సముదాయాలలో 2,117 మంది సీఆర్పీలు, పాఠశాల స్థాయిలో 6,219 మంది పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాలలో 12,821 మంది, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లలో 528 మంది బోధన, బోధనేతర సిబ్బంది, కేజీబీవీ టైప్ 4 (మోడల్) పాఠశాలల్లో 1,152 మంది కాంట్రాక్టు ఉద్యోగులు పని చేస్తున్నారు.

ఇంతమంది ఉద్యోగులు నిరంతరం విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నప్పటికీ వీరికి ఎటువంటి ఉద్యోగ భద్రత లేదు. ఉద్యోగ రీత్యా వీరు పాఠశాలల సందర్శనకు, మండల కార్యాలయాలకు వెళ్లే సమయంలో రోడ్డు ప్రమాదాలకు గురి అవుతూనే ఉన్నారు. కనీసం ప్రభుత్వం అటువంటి కుటుంబాలను కూడా ఆదు కోవడం లేదు.

ఈ నేపథ్యంలో ఈ చిరుద్యోగులు తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, మినిమం టైమ్‌స్కేలు నైనా అమలు చేయాలని, వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులను మహిళలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 10 తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా నిరశన దీక్షలు చేపట్టి జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ఆందోళన చేస్తున్నారు. ఫలితంగా పాఠశాల సముదాయలలో, మండల విద్యాకేంద్రాలలో, జిల్లా విద్యాశాఖ కార్యాలయాలలో పనులన్నీ స్తంభించిపోయాయి.

కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాలలో, అర్బన్ రెసిడె న్షియల్ పాఠశాలల్లో బోధన సైతం నిలిచి పోవడంతో విద్యా ర్థులు 'మా టీచర్లను మాకివ్వండి' అంటూ రోడ్డున పడ్డారు. గతంలో ఈ ఉద్యోగులు ఇదే డిమాండ్లతో సమ్మె చేస్తున్నపుడు ప్రస్తుత ముఖ్యమంత్రి ఆనాటి పీసీసీ అధ్యక్షుని హోదాలో వీరికి తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని చెబుతూ... 'చాయ్ తాగే లోపుగా మీ సమస్యలను పరిష్కరించవచ్చు గాని ప్రభుత్వం మీ సమస్యను పట్టించుకోకపోవడం శోచనీయం' అంటూ విమర్శలు గుప్పించారు.

ఇప్పుడు ఆయనే స్వయంగా ఏడాది కాలం నుంచి ముఖ్యమంత్రి హోదాలో పాలిస్తున్నారు. అయినప్పటికీఇంత వరకు వారి సమస్యలను పరిష్కరించే దిశలో ఎటువంటి ప్రయత్నం చేయకపోవడం శోచనీయం. ఇకనైనా తమ సమస్యలు తీరుస్తారని వేయికళ్లతో ఈ ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు.

– డా॥ సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు
క్లస్టర్ రీసోర్స్ పర్సన్ (కాంట్రాక్ట్) । 94913 57842

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి.
ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

అమెరికా–చైనాలు దగ్గరయ్యేనా?

అభిప్రాయం



సంగిరెడ్డి హనుమంత రెడ్డి

ప్రపంచ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలూ, సైనిక శక్తులూ అయిన అమెరికా– చైనాల మధ్య సత్సంబంధాలు చోటు చేసుకోనున్నాయనే సూచనలు అభినందనీయం. ట్రంప్ ఎప్పుడు ఏం చేస్తారో ఎవరూ ఊహించలేరు. తాను మంచివనుకున్న, తనకు పేరు తెచ్చే పనులను చేస్తారు. అనుకోని పనులు చేయడం తన బలమని ట్రంప్ ప్రకటించుకున్నారు. అమెరికా–చైనాల పరస్పర సహకారంతో ప్రపంచ శాంతి సౌభాగ్యాలను సాధించవచ్చు.

'చైనా అపాయం' బూచితో అమెరికా... చైనా వ్యతిరేక ప్రచారం చేస్తోంది. ఆంక్షలు విధిస్తోంది. చైనా ఉత్పత్తులపై ఎక్కువ పన్నులు విధిస్తోంది. చైనా వాణిజ్య కట్టడికి కూటములు కడుతోంది. చైనా పొరుగు దేశా లకు ఆయుధాలను అమ్ముతోంది. విదేశాల్లో దూకుడుగా వ్యవహరిస్తోందనీ, స్వదేశంలో అణచివేతకు పాల్పడు తోందనీ, రష్యా–ఉక్రెయిన్ సంఘర్షణలో రష్యాకు మద్దతు ఇస్తోందనీ చైనాపై అమెరికా ప్రచారం చేస్తోంది. ఎన్నికల ప్రచారంలో ట్రంప్ చైనా వ్యతిరేక వైఖరి ప్రదర్శించారు. అధ్యక్షునిగా ఎన్నికైన ట్రంప్ విదేశీ విధాన అమలుకు ఎన్నుకున్న వ్యక్తులను బట్టి ఆయన చైనా వ్యతిరేకత తెలుస్తుంది. విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, జాతీయ భద్రత సలహాదారు మైక్ వాల్జ్ దీనికి ఉదాహరణ.



మరోవైపు ప్రపంచ ఘటనలు అంచనాలను తారుమారు చేస్తున్నాయి. సిరియాలో 5 దశాబ్దాల అల్ అసద్ కుటుంబ పాలన స్వల్ప ప్రతిఘటనతో కూలి అందరినీ ఆశ్చర్యంలో ముంచింది. అతి బలీయమైన రష్యా, ఎదుగుతున్న ఇరాన్ అసద్‌ను దశాబ్ద కాలంగా గట్టిగా సమర్థించాయి. అయినా పేర్లే తెలియని తిరుగుబాటుదార్ల వేటలో కేవలం 2 వారాల్లో అసద్ దేశం వదిలి పారిపోయాడు. దీని వెనుక అనేక కారణాలు న్నాయి. ఇజ్రాయెల్‌పై 2023 అక్టోబర్ 7న హమాస్ దాడి; తర్వాత పాలస్తీనా, హమాస్, గాజా, వెస్ట్ బ్యాంక్‌లపై, లెబనాన్‌లో హెజ్ బొల్లాపై, వీరిని సమర్థించిన ఇరాన్‌పై ఇజ్రాయెల్ అమానవీయ దాడులు; ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతు, అమెరికా ఆధీన ఐక్యరాజ్యసమితి అశక్తత వాటిలో కొన్ని.

సిరియా ప్రభుత్వ పతనం తర్వాత 2 రోజుల్లో ఇజ్రాయెల్, సిరియా ఉన్నత స్థాయి సైనిక సంపదను, వాయు సేనను 80 శాతం ధ్వంసం చేసింది. క్షిపణులు, యుద్ధ విమానాలు, డ్రోన్లు, ఆయుధ కర్మాగారాలు, పరిశోధన కేంద్రాలు, రసాయనిక ఆయుధాలు నాశనమయ్యాయి. రష్యా–ఉక్రెయిన్ సంఘర్షణలో ఉత్తర కొరియా రష్యా వైపు జోక్యం, రష్యాకు చైనా మద్దతు (చైనా దీన్ని తిరస్కరించింది) ఐరోపాలో ఆందోళన కలిగించాయి. చైనా చౌక విద్యుత్ వాహనాలు తమ వాహన పరిశ్రమకు హానికరమని ఐరోపా భయం. తమ దేశాల ఉత్పత్తులపై ట్రంప్ విధించబోయే అధిక పన్నులపై అమెరికా మిత్రులైన ఐరోపా, ఆసియా దేశాలు బాధ పడుతున్నాయి.


ట్రంప్ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను మెచ్చుకున్నారు. తాను యుద్ధాలను ప్రారంభించననీ, కొత్త ఒప్పందాలను ప్రేమిస్తాననీ గర్వంగా ప్రకటించారు. ట్రంప్ అధికారంలో అమెరికా, చైనా సంబంధాల మెరుగుకు ఇది శుభసూచకం. 2009 ఆర్థిక సంక్షోభం తర్వాత చైనా ఆర్థిక వ్యవస్థలో స్వీయ ఉద్దీపన తగ్గింది. ప్రజల వినియోగాన్ని పెంచాలనీ, విదేశీ పెట్టుబడు లకు అనుకూలత కల్పించాలనీ, గిరాకీని పెంచాలనీ చైనా గుర్తించింది. మార్కెట్ అనుకూల ఆర్థిక విధానాలను స్వీకరించింది. ప్రజలకు డబ్బు అందే విధంగా వడ్డీ తగ్గించింది. రియల్ ఎస్టేట్, స్టాక్ మార్కెట్ల స్థిరీకరణ పద్ధతులను పాటించింది. విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తోంది. ప్రపంచ అభివృద్ధికి చోదకశక్తిగా పని చేస్తానంటోంది. ఇవి అమెరికా–చైనా సంబంధాల మెరుగుదలకు ప్రేరణ.

వ్యాసకర్త ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి । 94902 04545

ధ్యానమే సింహద్వారం

సమాజంలో ప్రతి ఒక్కరూ ఏ స్థానంలో లేక స్థాయిలో ఉన్నా సుఖ, శాంతులనే కోరుకుంటారు. వాస్తవాన్ని పరిశీలిస్తే జనులు ఇవి లభించే ప్రదేశాలను వదలి, మిగిలిన అన్ని ప్రదేశాలనూ అన్వేషిస్తున్నారు. మానవుడు ఇంద్రియాల ద్వారా లభించే తాత్కాలిక సంతోషమే నిజమైనదీ, శాశ్వతమైనదీ అని భ్రమించి గందరగోళంలో పడిపోతున్నాడు. పరిపూర్ణ సుఖ, శాంతులకు మూలం మనిషిలోనే ఉంది. వీటిని పొందడానికి ధ్యానం ఒకటే తగిన సాధనం. ఇటువంటి ధ్యానాన్ని మన శాస్త్రాలలో వర్ణింపబడినట్లుగా కానీ లేక గురువు బోధించిన పద్ధతి ద్వారా కానీ సాధన చేయాలి.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

ఆరంభ దశలో ధ్యానం అంటే ఏదైనా ఒక ప్రత్యేక వస్తువు లేక చిహ్నంపై ఆలోచనను నిలుపుట. ఇతర ఆలోచనలను దూరం చేసి, జాగ్రత్తగా ఏదైనా ఒకదానిపైన ఆలోచనను నిలుపుటయే 'ధ్యానం'. ధ్యానం అనేది ఒక చర్య కాదు. ఇది జీవితంలోని అవిభాజ్యమైన భాగం. చింతల నుండీ, ఒత్తిడుల నుండీ బయటపడాలంటే... ధ్యానం ఒకటే సింహద్వారం. శాశ్వత శాంతి, దైవసాక్షాత్కారాలకు ఇదే మార్గం!

సంసార బంధాలను తెంచుకొని, శాశ్వత ఆనందాన్ని పొందడానికి శ్రద్ధతో ప్రయత్నించే వ్యక్తికి అనేక మార్గాలు ఉన్నాయి. ముఖ్యంగా కర్మయోగం, భక్తియోగం, రాజయోగం, జ్ఞానయోగం అనేవి అందరికీ బాగా తెలిసినవే. వీటికి తోడు ఆచరణ సాధ్యమైన వేరొక మార్గాన్ని మన పవిత్ర గ్రంథాలు సూచిస్తున్నాయి. అదే 'సన్యాస యోగం'. ఇక్కడ సన్యాసం అనేది సంప్రదాయ పద్ధతుల (కాషాయ వస్త్రాన్ని ధరించడం, గుండు గీయించుకోవడం)తో ఏమాత్రం సంబంధం లేకుండా ఉండడం. దీనికి భిన్నంగా ప్రాపంచిక వస్తువుల నుండీ, ఉద్రేకాల నుండీ ఆలోచనల నుండీ మనస్సును దూరం చేసుకోవడమే ఇందుకు కావలసినవి. ప్రాపంచిక విషయాల నుండి దూరమైన మనస్సు భగవంతుని పాదపద్మాలను అంటిపెట్టుకొని ఉండడమే యోగం. ఈ దృష్టికోణంలో ఆలోచిస్తే వాస్తవంగా 'సన్యాస యోగం' అంటే అసంగయోగం.

ఇటువంటి యోగాన్ని ఎల్లప్పుడూ స్థిరంగా అభ్యాసం చేస్తే బుద్ధిపూర్వకంగా ప్రయత్నం చేసే సాధకుడు చివరగా ఆత్మ లక్ష్యాన్ని చేరతాడు. అంటే ఆత్మ సాక్షాత్కారాన్ని పొందుతాడన్నమాట!

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.ఏకాదశి రా.11.38 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** స్వాతి సా.5.47 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** రా.11.56 నుండి 1.40 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.13 నుండి 11.01 వరకు, తదుపరి ప.2.38 నుండి 3.26 వరకు, **అమృతఘడియలు:** ఉ.7.55 నుండి 9.41 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.32, **సూర్యాస్తమయం:** 5.28.

క్లుప్తంగా...

కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: ర్యాగింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్ సైఫ్ అలీ సస్పెన్షన్ ఎత్తివేసి పరీక్షలకు అనుమతి ఇవ్వాలని గతంలో తాము జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయకపోవడంపై వివరణ ఇవ్వాలని కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. డాక్టర్ ప్రీతి ఆత్మహత్యకు కారణమంటూ సైఫ్‌ను కాలేజీ నుంచి సస్పెండ్ చేశారు. దీన్ని సవాల్ చేస్తూ సైఫ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సస్పెన్షన్‌ను రద్దు చేసి.. పీజీ పరీక్షలకు అనుమతించాలని ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో డాక్టర్ సైఫ్ కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకుమార్‌రెడ్డిపై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ 2023 ఫిబ్రవరి 20 నుంచి అక్టోబర్ వరకు హాజరు వివరాలను రికార్డుల్లో చేర్చాలన్న ఆదేశాలను అమలు చేయడం లేదన్నారు. వాదనల అనంతరం ప్రిన్సిపాల్‌కు నోటీసులు జారీ చేసిన హైకోర్టు తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

కాటేసిన కరెంటు తీగ

- విద్యుదాఘాతంతో రైతు మృతి


రామారావు

కూసుమంచి: పొలంలో విద్యుదాఘాతానికి గురైన ఒక రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం ముత్యాలగూడెంలో బుధవారం జరిగిన ఈ సంఘటనపై పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తాటికొండ రామారావు (50) బోరు మోటార్ ఆన్ చేసేందుకు చేను వద్దకు వెళ్లాడు. ఆన్ చేసినా మోటార్ పని చేయకపోవడంతో స్తంభం నుంచి స్టార్టర్‌కు ఉన్న తీగను పరిశీలిస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. రామారావు కింద పడిపోవడాన్ని గమనించి చుట్టుపక్కల రైతులు వచ్చేసరికే ప్రాణాలొదిలాడు. కాగా మృతుడు అవివాహితుడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ.6.5 కోట్ల ఆల్ప్రాజోలం స్వాధీనం

- శ్రీ వాస్తవ లైఫ్‌సైన్స్ పరిశ్రమలో 32 కిలోలు పట్టివేత
- నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అధికారుల విచారణ


ఆల్ప్రాజోలం పట్టుబడిన శ్రీవాస్తవ పరిశ్రమ

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల పారిశ్రామికవాడలోని శ్రీవాస్తవ లైఫ్‌సైన్స్ పరిశ్రమలో దాదాపు రూ.6.5 కోట్ల విలువైన 32 కిలోల నిషేధిత మాదక ద్రవ్యం ఆల్ప్రాజోలంను నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కృష్ణా జిల్లా రెడ్డిగూడెం గ్రామానికి చెందిన రమేశ్‌రెడ్డి ఆల్ప్రాజోలంను తయారు చేస్తున్నట్లు గుర్తించి పోలీసులు అరెస్టు చేశారు. ఆర్గానిక్ రసాయన శాస్త్రంలో పీజీ పూర్తి చేసిన రమేశ్‌రెడ్డి.. ఒక కెమికల్ పరిశ్రమలో పరిశోధన విభాగంలో పని చేస్తున్నాడు. కాగా, శ్రీవాస్తవ లైఫ్ సైన్స్ పరిశ్రమ ఎండీ సత్యనారాయణతో కలసి నిందితుడు రియాక్టర్‌ను లీజుకు తీసుకుని ఆల్ప్రాజోలం తయారు చేస్తున్నట్లు ఎన్సీబీ అధికారులు విచారణలో గుర్తించారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం


మేడారంలో వర్షం కారణంగా తడిసిన ధాన్యం

సాక్షి ప్రతినిధి, వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న అకాల వర్షంతో కల్లాలు, కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డుల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. రెండు రోజులుగా ముసురు పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. టార్పాలిన్లు, పరదాలు కప్పినప్పటికీ పలుచోట్ల ధాన్యం రాశుల అడుగులు తడిసిపోయాయి. కాగా కాంటాపెట్టిన ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రాల్లోనే నిల్వ ఉంచడంతో అవి కూడా తడిసిపోయాయి. ఇదిలా ఉండగా ములుగు జిల్లాలో మోస్తరు వర్షం కురవడంతో ధాన్యం తడిసిపోయింది. ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని రెడ్డిగూడెం, మేడారం, కొత్తూరు, నార్లాపూర్ గ్రామాల్లో పంటల సాగు ఆలస్యమైంది. దీంతో ఆలస్యంగా కోతలు జరిగాయి. ఈ క్రమంలో రోడ్లపై ఆరబోసిన ధాన్యం వర్షం కారణంగా తడిసిపోయింది.

నకిలీ సర్టిఫికెట్ల పై విజిలెన్స్ దృష్టి

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నకిలీ సదరం సర్టిఫికెట్ల కుంభకోణం

- 2022లో ఆధారాలతోసహా బయటపెట్టిన 'సాక్షి'
- నాడు అధికారులు హడావిడి చేసినా తేలని దోషులు
- తాజాగా ఆ ఫైల్ దుమ్ము దులిపిన విజిలెన్స్ విభాగం
- దర్యాప్తును స్వయంగా పర్యవేక్షిస్తున్న ఏసీబీ డీజీ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ జిల్లాలో నకిలీ సదరం సర్టిఫికెట్ల కుంభకోణంపై అధికారులు మళ్లీ దృష్టి సారించారు. పింఛన్లు, పన్ను మినహాయింపులు, ఇతర సౌకర్యాలు పొందేందుకు కొందరు అనర్హులు అక్రమంగా వైకల్య సర్టిఫికెట్లు పొందినట్లు 'సాక్షి'2022 జనవరిలోనే బయటపెట్టింది. నాడు అధికారులు కొద్దిరోజులు హడావిడి చేసి.. ఆ తర్వాత మిన్నకుండిపోయారు. ఏసీబీ విచారణ జరిపినా దోషులను తేల్చలేకపోయింది. తాజాగా విజిలెన్స్ విభాగం నాటి ఏసీబీ నివేదిక దుమ్ము దులిపింది.

లోతుగా దర్యాప్తు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నకిలీ సదరం సర్టిఫికెట్ల దందాను నాడు సాక్షి బయటపెట్టింది. ఒక్క ఇల్లందకుంట మండలంలోనే 1,086 వైకల్య పింఛన్లలో అనేకం అనుమానాస్పదంగా ఉన్నాయన్న విషయాన్ని వెలుగులోకి తెచ్చింది. దీనిపై ఆ సమయంలో డీఆర్‌డీఏ, కరీంనగర్ సివిల్ ఆసుపత్రి వర్గాలు పరస్పరం నిందించుకుని ఇద్దరు తాత్కాలిక ఉద్యోగులను ఉద్యోగాల నుంచి తొలగించి చేతులు దులుపుకున్నారు. ఈ అంశంపై నిర్వహించిన ఏసీబీ విచారణ కూడా డీఆర్‌డీఏ, సివిల్ ఆసుపత్రి కనుసన్నల్లోనే జరిగిందన్న ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో ఇంతవరకూ దోషులను తేల్చకపోవటం ఆ ఆరోపణలకు బలాన్నిచ్చింది. తాజాగా ఈ కుంభకోణంపై దృష్టిపెట్టిన విజిలెన్స్ అధికారులు.. విషయాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి దృష్టికి తీసుకెళ్లారు. ఆవిడ ఆదేశాలతో రంగంలోకి దిగి.. అనుమానాస్పద సర్టిఫికెట్లు అన్నీ 2011 నుంచి 2021 మధ్య జారీ చేసినట్లు తేల్చారు. ఆ సర్టిఫికెట్లు జారీ చేసిన వైద్యులను ప్రశ్నించినా పెద్దగా సమాచారం రాబట్టలేకపోయారు. ఈ కుంభకోణంపై ఏసీబీ డీజీ శ్రీనివాస్‌రెడ్డి స్వయంగా దృష్టిపెట్టి దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారు. ఇది పైకి కనిపిస్తున్నంత చిన్న కుంభకోణం కాదని అధికారులు అంటున్నారు. ఈ సర్టిఫికెట్లను అడ్డుపెట్టుకుని ప్రభుత్వ ఉద్యోగాలు, పన్ను రాయితీలు, పింఛన్లు, ఇంజినీరింగ్, మెడికల్ సీట్లు పొందుతున్న విషయాన్ని విజిలెన్స్ గుర్తించింది. ఈ కుంభకోణంలో నిందితులను ఎవరినీ ఉపేక్షించేది లేదని ఓ ఉన్నతాధికారి సాక్షికి తెలిపారు.



భారీ నష్టమే..

నెలకు రూ.3000 పింఛనే కదా.. వాటివల్ల ఏం నష్టం అని ఈ కుంభకోణం గురించి చాలామంది అనుకుంటున్నారు. కానీ, ఇది చాలా లోతైన కుంభకోణం. ఉదాహరణకు ఇల్లందకుంట మండలంలో 1,086 వైకల్య ఆసరా పింఛన్లు ఉన్నాయి. వీరందరికీ నెలకు రూ.3000 చొప్పున పింఛన్ చెల్లిస్తే.. దాదాపు రూ.32 లక్షల పైనే అవుతుంది. ఏడాదికి దాదాపు రూ.4 కోట్లు అవుతుంది. అలాగే బస్ పాసులు, బ్యాంకు రుణాలు, లైసెన్సులు, రిజర్వేషన్లు, ఐటీ పన్ను మినహాయింపు.. ఇలా నెలనెలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లకు కోట్లలో చిల్లు పడుతోంది. చాలామంది వ్యాపారులు దివ్యాంగులమని సర్టిఫికెట్లు తీసుకుని ఏటా రూ.75 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు ఆదాయ పు పన్ను మినహాయింపు పొందుతున్నారు. ప్రభు త్వ ఉద్యోగులు బదిలీలు, పదోన్నతుల్లో వీటిని అడ్డం పెట్టుకుని కోరుకున్న చోట పోస్టింగులు పొందుతున్నారు. దీంతో ఎంతలేదన్నా.. ఒక్క నకిలీ సర్టిఫికెట్‌తో నెలనెలా సుమారు రూ.20 వేల వరకు లబ్ధి పొందవచ్చని దర్యాప్తు అధికారులు చెబుతున్నారు. ఇప్పుడున్న నకిలీ సదరం సర్టిఫికెట్లలోనూ అధిక భాగం చెవిటి సమస్య ఉన్నవారే కావడం గమనార్హం. ఇతర వైకల్యాలైతే ఆ సమస్య ఉన్నట్లు బయటకు నటించాల్సి ఉంటుంది. చెవుడు సమస్య అయితే.. పెద్దగా నటించాల్సిన అవసరం ఉండదు. అందుకే చాలామంది వాటినే తీసుకొన్నారు.


మాజీ పోలీసు అధికారికి జారీ చేసిన (100 శాతం వినికిడి సమస్య) సదరం సర్టిఫికెట్(ఫైల్)

సదరం సర్టిఫికెట్లతో లాభాలు..

1. ఆదాయపు పన్ను రాయితీ	ఏటా రూ.1.50 లక్షల వరకు
2. ఆసరా పింఛన్	నెలకు రూ.3,016
3. బస్/ రైల్వే పాసులు	నెలకు రూ.5,000
4. బదిలీలు/ పదోన్నతులో	ప్రత్యేక కోటా
5. ఇతరాలు	పెట్రోల్ బంకులు/ ఇతర రాయితీలు

భద్రాద్రిలో ఏపీ హైకోర్టు జడ్జి


రామాలయంలో న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్ తదితరులు

భద్రాచలం అర్బన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్ బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో రమాదేవి, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం వారు మూలమూర్తులను దర్శించుకుని పూజలు నిర్వహించారు. తర్వాత జస్టిస్ హరినాథ్‌కు పండితులు వేదాశీర్వచనం చేసి స్వామివారి ప్రసాదాలు అందజేశారు. ఏపీకి చెందిన డీఐజీ గోపీనాథ్, తెలంగాణ రాష్ట్ర డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్, ఉమ్మడి వరంగల్, ఉమ్మడి ఖమ్మం జిల్లాల లైసెన్సింగ్ అథారిటీ రాజ్యలక్ష్మి తదితరులు కూడా రామయ్యను దర్శించుకున్నారు. కార్యక్రమంలో భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి శివనాయక్, న్యాయవాది కొడాలి శ్రీనివాసన్, పరిమి సోమశేఖర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలోనే మొలకెత్తుతున్న ధాన్యం

- నెల దాటినా కాంటా వేయని వైనం


తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు కిషన్‌రావు

నేలకొండపల్లి: రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు అందించే బోనస్‌కు ఆశపడి ఓ రైతు కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం రాశులు పోశాడు. దాదాపు నెల రోజులవుతున్నా కాంటా వేయలేదు. దీంతో ఆడపాదడపా వచ్చిన వర్షాలకు ధాన్యం తడిసి మొలకెత్తుతోంది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం మంగాపు రం తండాకు చెందిన భూక్యా కిషన్‌రావు అనే రైతు నాలుగెకరాల్లో వరి సాగు చేశాడు. కోతలు పూర్తి కావడంతో దాదాపు నెల రోజుల క్రితమే ధాన్యాన్ని గ్రామంలోని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి ఆరబెట్టాడు. కానీ కాంటా వేయడంలో జాప్యం జరగడంతో ఇటీవల కురిసిన వర్షానికి ధాన్యం తడిసి మొలకెత్తుతోంది. దీనికి తోడు మళ్లీ మబ్బులు కమ్మి వర్షం కురుస్తుండటంతో కంటి మీద కునుకు లేకుండా పోతోందని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. బోనస్ సంగతేంటో కానీ.. ధాన్యం పూర్తిగా తడిస్తే అసలుకే ఎసరు వస్తుందని ఆందోళన చెందుతున్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, వెంటనే కాంటా వేసేలా చూడాలని కోరుతున్నాడు. దీనిపై కొనుగోలు కేంద్రం నిర్వాహకులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులో లేరు.

3 జలాశయాల్లో పూడిక తీతకు పచ్చజెండా

- కడెం, మిడ్ మానేరు, లోయర్ మానేరు జలాశయాల్లో పూడిక తొలగింపునకు త్వరలో టెండర్లు
- కాంట్రాక్టర్లు భారీ యంత్రాలతో ఇసుకను తవ్వి అమ్ముకునే వెసులుబాటు
- మెట్రిక్ టన్ను ఇసుకకు కనీస బిడ్డింగ్ ధర రూ.406గా ఖరారు

సాక్షి, హైదరాబాద్: కడెం, మిడ్‌మానేరు, లోయర్ మానేరు జలాశయాల్లో పైలట్ ప్రాజెక్టు కింద పూడిక తొలగింపునకు టెండర్లను ఆహ్వానించడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. ఇందులోని నిబంధనల మేరకు పూడిక తొలగింపుతో లభ్యమయ్యే ఇసుకను కాంట్రాక్టర్లు అమ్ముకోవచ్చు. ఈ నేపథ్యంలో మెట్రిక్ టన్ను ఇసుకకు రూ.406.64ను కనీస బిడ్డింగ్ ధరగా ప్రభుత్వం నిర్ధారించింది. ఈ ధరను ఎప్పటికప్పుడు సవరిస్తామని స్పష్టం చేసింది. కాంట్రాక్టర్లు తాము కోట్ చేసిన ధర ఆధారంగా ఎంత ఇసుకను తవ్వితే ఆ మేరకు ప్రభుత్వానికి చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. పూడిక తొలగింపు ద్వారా వచ్చే ఆదాయాన్ని తెలంగాణ వాటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీడబ్ల్యూఆర్‌డీసీ) ప్రత్యేక బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నారు. కాంట్రాక్టర్లు ఇసుక నిల్వలను స్టాక్‌యార్డులో నిర్వహించాల్సి ఉంటుంది. నీటిపారుదల శాఖ, తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ (టీజీఎండీసీ)లు దీనిని పర్యవేక్షించనున్నాయి. ఈ మేరకు పూడిక తొలగింపునకు టెండర్లను ఆహ్వానించాలని కరీంనగర్ ఈఎన్‌సీని ఆదేశిస్తూ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరుకుపోయిన పూడిక

రాష్ట్రంలో మొత్తం 929 టీఎంసీల సామర్థ్యం కలిగిన 159 జలాశయాలున్నాయి. కాగా, ఇందులో సగానికి పైగా జలాశయాలు 25 ఏళ్లకు పైబడినవే కావడంతో పూడిక పెరిగి క్రమంగా నిల్వ సామర్థ్యాన్ని కోల్పోతున్నాయి. తద్వారా ఆయకట్టుకు అవసరమైన సాగునీటికి లోటు ఏర్పడుతోంది. నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టులో భా గంగా 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన 14 ప్రాజెక్టులపై అధ్యయనం జరపగా, పూడికతో అవి 35 టీఎంసీల (16 శాతం) నిల్వ సామర్థ్యాన్ని కోల్పో యినట్టు తేలింది. దేశంలో పీఎం కిసాన్ సించాయ్ యోజన (పీఎంకేఎస్వై) మార్గదర్శకాల ప్రకారం ఒక టీఎంసీ సామర్థ్యం కలిగిన కొత్త జలాశయాన్ని నిర్మించాలంటే రూ.162 కోట్లు కావాల్సి ఉంటుంది. కాగా, పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన మూడు జలాశయాల్లో భారీగా పూడిక పేరుకుపోయింది.

సర్కారుకు ఖర్చు లేకుండా..

జలాశయాల్లో పూడిక తొలగించి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన జాతీయ విధానాన్ని తెలంగాణలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. పూడికతీత కోసం రాజస్తాన్, మహారాష్ట్రల తరహాలో ఆదాయ ఆర్జన విధానంలో భారీ యంత్రాలతో తవ్వకాలు (మెకానికల్ డ్రెడ్జింగ్) నిర్వహించనున్నారు. దీనికోసం ప్రభు త్వం ఎలాంటి ఖర్చు చేయదు. అత్యధిక ధర కోట్ చేసిన బిడ్డర్లు పన్నులు, సెస్, జీఎస్టీ, రాయల్టీని చెల్లించి తవ్విన మట్టి, ఇసుకను విక్రయించుకోవచ్చు. పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే ఇతర జలాశయాల్లో సైతం పూడిక తొలగింపునకు ఇదే విధానాన్ని అనుసరించడానికి రాష్ట్ర ప్రభుత్వం తదుపరిగా అనుమతి ఇవ్వనుంది.



పూడిక తొలగింపు గడువు 20 ఏళ్లు!

జలాశయాల్లో భారీగా ఉన్న పూడికను ఇప్పటికిప్పుడు తొలగించడం సాధ్యం కాదు. పూడిక తొలగింపునకు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్‌లు కాంట్రాక్టర్లతో 20 ఏళ్ల గడువుతో ఒప్పందా లు చేసుకోగా, మరో ఐదేళ్ల గడువు పొడిగింపునకు వెసులుబాటు కల్పించాయి. రాష్ట్రంలో సైతం ఇదే రీతిలో 20 ఏళ్ల గడువు విధించి, ఆ తర్వాత గరిష్టంగా 5 ఏళ్ల గడువు పొడిగింపునకు వెసులుబాటు కల్పించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది.

జలాశయం	వాస్తవ నిల్వ సామర్థ్యం టీఎంసీల్లో	ప్రస్తుత నిల్వ సామర్థ్యం టీఎంసీల్లో	పూడికతో తగ్గిన సామర్థ్యం టీఎంసీల్లో	నష్టం శాతం
కడెం	7.603	4.699	2.904	38.2
లోయర్ మానేరు	24.04	23.75	0.291	1.21

మావోయిస్టు స్వర్ణక్క లొంగుబాటు

ములుగు: నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీ నేషనల్ పార్క్ ఏరియా కమిటీ సభ్యురాలు, ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా కలిమెల మండలం పొట్టేరు గ్రామానికి చెందిన అలువ స్వర్ణ అలియాస్ స్వర్ణక్క ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్ ఎదుట లొంగిపోయారు. ఈ మేరకు ఎస్పీ శబరీష్ బుధవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. స్వర్ణ 2000 సంవత్సరంలో కలిమెల ఏరియా కమిటీకి చెందిన కమాండర్ రామన్న ప్రోత్సాహంతో మావోయిస్టు పార్టీలో చేరారు. నార్త్ తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ (ఎన్‌టీఎస్‌జెడ్‌సీ)సభ్యుడు ఛట్టి రాజా పాపయ్య అలియాస్ సోమన్న ప్రొటెక్షన్ టీంలో మూడేళ్లపాటు సభ్యురాలిగా పనిచేశారు. తరువాత గినుగు నరసింహారెడ్డి అలియాస్ జంపన్న ప్రొటెక్షన్ టీంలో ఐదేళ్లు పనిచేశారు. 2005 జనవరి 16న కర్ణగండి రాంపూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో, అదే ఏడాది నవంబర్ 5న లింగాలగుట్ట పాలధారగుట్ట ఎదురుకాల్పుల్లో స్వర్ణ తప్పించుకున్నారు. 2006లో ఎన్‌టీఎస్‌జెడ్‌సీ కమాండర్ వాజేడు మండలం కొంగాలకు చెందిన కురుసం సాయన్న అలియాస్ జగన్‌ను వివాహం చేసుకున్నారు. 2008లో ఏరియా కమిటీ సభ్యురాలిగా పదోన్నతి పొంది కేంద్ర కమిటీ సభ్యులు యాప నారాయణ అలియాస్ హరిభూషణ్, రావుల శ్రీనివాస్‌లకు ప్రొటెక్షన్‌గా పనిచేశారు. 2015లో వెస్ట్‌బస్తర్‌కు బదిలీ అయి నేషనల్ పార్క్ ఏరియా కమిటీ సభ్యురాలిగా చేరి సంద్ర ఎల్‌ఓఎస్ కమాండర్‌గా రెండేళ్లు పనిచేశారు. 2017లో గుండం ఎదురుకాల్పుల్లో భర్త సాయన్న మృతిచెందడంతో స్వర్ణ మానసికంగా, ఆరోగ్యపరంగా క్షీణించింది. నిషేధిత మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలు అర్థరహితం అని భావించి ములుగు జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు ఎస్పీ తెలిపారు. ఈ మేరకు తన పేరుపై ఉన్న రివార్డును ఎస్పీ ఆమెకు అందించారు. ఎస్పీ వెంట ఇన్‌చార్జ్ ఓఎస్డీ, ములుగు డీఎస్పీ రవీందర్, 39 సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాస్ ఉన్నారు.


స్వర్ణకు రివార్డును అందిస్తున్న ఎస్పీ శబరీష్

జీఐఎస్ ద్వారా ఉద్యానపంటల మ్యాపింగ్

- ములుగు ఉద్యానవర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ దండరాజిరెడ్డి
- ప్లాంట్ బయోడైవర్సిటీ అండ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌పై అంతర్జాతీయ వర్క్‌షాప్

ములుగు (గజ్వేల్): రిమోట్ సెన్సింగ్, జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ (జీఐఎస్)ను ఉపయోగించి ఉద్యాన పంటల మ్యాపింగ్ చేస్తామని సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ దండ రాజిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ వేదికగా 'జీఐఎస్ ఫర్ ప్లాంట్ బయోడైవర్సిటీ, రీసోర్స్ మేనేజ్‌మెంట్'పై వివిధ దేశాల నిపుణులతో ఒకరోజు అంతర్జాతీయ వర్క్‌షాప్ నిర్వహించి భౌగోళికరంగంలో తాజా స్థితిగతులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవిష్యత్‌లో ఉద్యాన విశ్వవిద్యాలయంలోని అన్ని కూరగాయలు, పండ్ల మొక్కలు, ఔషధ మొక్కల డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్, జీనోం సీక్వెన్సింగ్ చేయిస్తామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లర్నింగ్, డీప్‌లర్నింగ్ టెక్నిక్స్ ఉపయోగించి మొక్కల నిర్దిష్టమైన మోడల్స్ అభివృద్ధి చేస్తామని వివరించారు. వర్క్‌షాప్‌లో జపాన్‌లోని కుమామోటో యూనివర్సిటీ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రొఫెసర్ డాక్టర్ తకాశీ వతనాబే, హైదరాబాద్‌లోని విష్ణు ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్ ప్రొఫెసర్, డీన్ డాక్టర్ రాజు జీఐఎస్ ఉపయోగించి ప్రపంచంలోని మొక్కల వనరుల అన్వేషణ, జపనీస్ ఫ్లోరాపై పరిశోధనాంశాలు వివరించారు. జపాన్‌సాగా యూనివర్సిటీ అనలిటిక్స్ రీసెర్చ్ సెంటర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ యుకియో నగానో, గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ హెల్త్ సైన్స్ పరిశోధకురాలు ఎరంగ పావని వితారణలు 'పూర్తి క్లోరోప్లాస్ట్ జన్యువులు, సంరక్షించబడిన న్యూక్లియర్ జన్యువులతో సిట్రస్, దాని బంధువులలో ఫైలోజెనెటిక్ సంబంధాలను విడదీయడం'గురించి తెలిపారు. నేపాల్ శ్రద్ధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, హిమాలయన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్ శరణ్ శ్రేష్ఠ సదస్సులో నేపాల్, ఇటలీ, జపాన్ బయోప్రోస్పెక్టింగ్ ఔషధ మొక్కల గురించి వివరించారు. వర్క్‌షాప్‌లో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.భగవాన్, డీన్ డాక్టర్ ఎం.రాజశేఖర్, ఎగ్జామినేషన్ కంట్రోలర్ డాక్టర్ ఎస్.శ్రీనివాసన్, అసోసియేట్ డీన్ డాక్టర్ చీనా, డాక్టర్ పిడిగం సైదయ్య, డాక్టర్ వీణ జోషి, డాక్టర్ జయశంకర స్వామి, డాక్టర్ నిఖిల్, డాక్టర్ మల్లేశ్, డాక్టర్ ఎస్.ప్రణీత్, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ వీరసురేశ్, డాక్టర్ జి.సతీశ్ తదితరులు పాల్గొన్నారు.


జపాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న వీసీ రాజిరెడ్డి

తరుముకొస్తున్న ఉత్పాతం


ఇటీవల ఐస్‌లాండ్‌లో అగ్ని పర్వతం బద్దలైన దృశ్యం

- త్వరలో భారీ అగ్నిపర్వత విస్ఫోటం
- ప్రపంచానికి పెను ఇక్కట్లే: సైంటిస్టులు
- ఉష్ణోగ్రతల్లో తీవ్ర హెచ్చుతగ్గులు
- భారీగా పడిపోనున్న ఆహారోత్పత్తి

అమెరికాలో అతి పెద్దదైన కిలోవెయా అగ్నిపర్వతం సోమవారం బద్దలైంది. విస్ఫోటనం ధాటికి అగ్నిపర్వతం నుంచి ఏకంగా 80 మీటర్ల ఎత్తుకు పైగా లావా ఎగసిపడుతోంది. ఇది కేవలం ట్రైలర్ మాత్రమేనని, అతి త్వరలో అంతకు మించి భారీ స్థాయిలో అగ్నిపర్వత విస్ఫోటం తప్పకపోవచ్చని జియాలజిస్టులు అంచనా వేస్తున్నారు. "అదెక్కడన్నది ఇప్పటికిప్పుడు స్పష్టం కావడం లేదు. కానీ ముప్పు పొంచి ఉందన్నది మాత్రం సుస్పష్టం"అని చెబుతున్నారు. దాని దెబ్బకు ప్రపంచమంతా అతలాకుతలం కావడం ఖాయమని హెచ్చరిస్తున్నారు. పర్యావరణ సమస్యలు మొదలుకుని ఆహార కొరత దాకా మానవాళికి కొన్నేళ్ల పాటు అన్నివిధాలా కనీవినీ ఎరగని కష్టనష్టాలు తప్పకపోవచ్చంటున్నారు. ప్రపంచంలో ఏదో ఒక మూలన జరిగే అగ్నిపర్వత పేలుడు మొత్తం ప్రపంచాన్ని ఇంతగా ఎలా ప్రభావితం చేస్తుందంటే నమ్మశక్యంగా అనిపించకపోవచ్చు. కానీ, వినడానికి ఆశ్చర్యంగా అనిపించినా పచ్చి నిజమిది"అని సైంటిస్టులు చెబుతున్నారు...!

అది 1815. ఇండోనేసియాలోని మౌంట్ తంబోరా అగ్నిపర్వతం ఉన్నట్టుండి బద్దలైంది. ఎంతలా అంటే, మానవాళి చరిత్రలో ఇప్పటిదాకా నమోదైన అతి భారీ విస్ఫోటంగా అది రికార్డుల్లో నిలిచిపోయింది. ఆ తీవ్రత ధాటికి భారీ పరిమాణంలో ఎగసిపడ్డ దుమ్ము, ధూళి రేణువులు తదితరాలు వాతావరణంలో కిలోమీటర్ల ఎత్తున, అత్యంత విస్తారంగా పరుచుకుపోయాయి. భూమిని చేరే సూర్యరశ్మిని అవి అడ్డుకున్నాయి. దాంతో ఉత్తరార్ధ గోళంలో ఉష్ణోగ్రతలు ఏకంగా ఒక డిగ్రీకి పైగా పడిపోయాయి. ఆ ఏడాది ఆ ప్రాంతంలో ఎక్కడా వేసవే లేకుండా పోయింది. ఫలితంగా వానలు ముఖం చాటేయడంతో పంటలు తీవ్రంగా దెబ్బతిని దిగుబడి భారీగా తగ్గిపోయింది. దేశాలకు దేశాలే తిండికి అలమటించిపోయాయి. ఎటు చూసినా కరువు మరణాలే అన్నట్టుగా తయారైంది. వాతావరణ మార్పుల కారణంగా కలరా వంటి మహమ్మారులు విజృంభించి మరింత భారీ ప్రాణ నష్టానికి కారణమయ్యాయి. ఇదంతా కేవలం ఒకే ఒక్క అగ్నిపర్వత విస్ఫోటం చేసిన నష్టం. అందుకే, త్వరలోనే అలాంటి విస్ఫోటానికి ప్రకృతి రంగం సిద్ధం చేసుకుంటోందన్న జియాలజిస్టుల హెచ్చరికలు వణుకు పుట్టిస్తున్నాయి. అందుకు ఆరింట ఒక శాతం అవకాశమున్నట్టు జెనీవా యూనివర్సిటీ పర్యావరణ శాస్త్రవేత్త మార్కస్ స్టోఫెల్ అంచనా వేశారు. "ఈసారి జరగబోయే పర్యావరణ విధ్వంసం అంచనాకు కూడా అందనిది. పైగా ఈ విపత్తును ఎదుర్కోవడానికి మన దగ్గర ఎలాంటి ప్రణాళికా లేకపోవడం మరింత గుబులు పుట్టించే అంశం"అంటూ వాపోయారు. అంతేకాదు, "1815తో పోల్చుకుంటే ఈసారి జరగబోయే నష్టం అంచనాలకు కూడా అందని స్థాయిలో ఉంటుంది"అని అభిప్రాయపడ్డారు.

ఏం జరుగుతుంది?

అగ్నిపర్వతాలు బద్దలైనప్పుడు భారీగా లావాను వెదజల్లుతాయన్నది తెలిసిందే. దాంతోపాటు అత్యంత భారీ పరిమాణంలో బూడిదతో పాటు పలు రకాల వాయువులు కూడా విడుదలవుతాయి. వాటిలో సల్ఫర్ డయాక్సైడ్ చేసే హాని అంతా ఇంతా కాదు. పేలుడు తీవ్రత చాలా ఎక్కువగా ఉన్నప్పుడు ఇది ఏకంగా వాతావరణానికి మాతృ స్థానమైన ట్రోపోస్పియర్ దాకా చేరుతుంది. దాని దిగువన, అంటే భూమికి దాదాపు 7 మైళ్ల ఎత్తున ఉండే స్ట్రాటోస్పియర్‌లో భారీగా పరుచుకుని ఏరోసెల్ అణువుల పుట్టుకకు దారితీస్తుంది. అవి సూర్యరశ్మిని అడ్డుకుని దాన్ని భూమికి చేరకుండా అంతరిక్షంలోకే తిప్పి పంపుతాయి. ఫలితంగా భూమి చల్లబడుతుంది. ఈ అణువులు కనీసం రెండేళ్లపాటు వాతావరణంలో అలాగే ఉండిపోతాయి. 1991లో ఫిలిప్పీన్స్‌లో మౌంట్ పినాటుబో అగ్నిపర్వత పేలుడు వల్ల దాదాపు 1.5 కోట్ల టన్నుల సల్ఫర్ డయాక్సైడ్ వాతావరణంలోకి విడుదలైందని అంచనా. దాని దెబ్బకు ప్రపంచవ్యాప్తంగా వాతావరణం 0.5 డిగ్రీ సెల్సియస్ మేరకు చల్లబడిపోయింది. 1815 తరహావి, అంతకు మించిన భారీ అగ్నిపర్వత పేలుళ్లు సంభవిస్తే భూమి ఏకంగా 1.5 డిగ్రీల దాకా చల్లబడిపోయే ఆస్కారముంది. అదే జరిగితే ఈసారి నష్టతీవ్రత మరింత భారీగా ఉంటుందని న్యూయార్క్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మైకేల్ రాంపినో అన్నారు. "ప్రస్తుతం రికార్డులు బద్దలు కొట్టే స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలే అందుకు కారణం. వేడి వాతావరణంలో ఏరోసెల్ అణువులు మరింత చిన్న పరిమాణంలో ఏర్పడతాయి. దానికి తోడు వాతావరణపు పై పొరల్లో శరవేగంగానూ, సుదూరాలకూ పయనిస్తాయి. దాంతో సూర్యరశ్మిని అవి మరింత ఎక్కువగా అడ్డుకుని భూ వాతావరణాన్ని గణనీయంగా చల్లబరుస్తాయి"అని వివరించారు. గ్లోబల్ వార్మింగ్‌తో సతమతమవుతున్న నేపథ్యంలో ఇది మంచిదే కదా అనిపించడం సహజం. కానీ ఇది మరీ విపత్కర పరిణామాలకు బాటలు వేస్తుందని రాంపినో హెచ్చరించారు. "క్రీస్తుపూర్వం 43లో అలస్కాలోని ఓక్మోక్ అగ్నిపర్వతం బద్దలైన కారణంగా దక్షిణ యూరప్, ఉత్తర ఆఫ్రికా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఏకంగా 7 డిగ్రీల సెల్సియస్ దాకా పడిపోయాయి. ఆ దెబ్బకు ఆహారోత్పత్తి దాదాపుగా పడకేసింది. ఆ ప్రాంతాల్లోని దేశాలన్నీ నరకం చవిచూశాయి. నాటితో పోలిస్తే ఇప్పుడు జనాభా ఊహాతీతంగా పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా ఏకంగా 80 కోట్ల పైచిలుకు జనాభా చురుగ్గా ఉన్న అగ్నిపర్వతాలకు కేవలం 60 మైళ్ల దూరంలోనే విస్తరించి ఉంది" అని చెప్పారాయన. "కనుక చల్లని వాతావరణం ప్రపంచ ఆహారోత్పత్తిలో కీలకపాత్ర పోషించే భారత్‌తో పాటు అమెరికా, చైనా వంటి దేశాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. దేశాలన్నీ ఆహార సంక్షోభంతో అల్లాడుతాయి"అని ఆందోళన వెలిబుచ్చారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

గాలిలో మృత్యు ప్రయాణం

- కజకిస్తాన్‌లో కుప్పకూలిన విమానం
- 38 మంది ప్రయాణికులు మృతి!
- అజర్‌బైజాన్ నుంచి రష్యా వెళ్తుండగా దుర్ఘటన


విమాన శకలాలు

మాస్కో: విమాన ప్రయాణం తీవ్ర విషాదం మిగిల్చింది. విమానం ప్రమాదవశాత్తూ కుప్పకూలడంతో మంటలు చెలరేగి దాదాపు 38 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. కజకిస్తాన్‌లోని అక్తావ్ నగర సమీపంలో బుధవారం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన జే2-8243 విమానం 62 మంది ప్రయాణికులు, ఐదుగురు సిబ్బందితో రష్యాకు బయలుదేరగా మధ్యలో ప్రమాదం సంభవించింది. అజర్‌బైజాన్ రాజధాని బాకూ సిటీ నుంచి రష్యాలోని నార్త్ కాకస్ ఉన్న గ్రాజ్నీ నగరానికి బయలుదేరింది. అయితే, గ్రాజ్నీలో పొగమంచు కారణంగా ల్యాండింగ్ చేసే పరిస్థితి లేకపోవడంతో విమానాన్ని దారి మళ్లించారు. అక్తావ్ నగరానికి మూడు కిలోమీటర్ల దూరంలోని మైదానంలో అత్యవసరంగా ల్యాండ్ చేసేందుకు ప్రయత్నించారు. అదుపు తప్పిన విమానం కూలిపోవడంతో మంటలు ఎగసిపడ్డాయి. దట్టమైన పొగ వ్యాపించింది. వెంటనే అప్రమత్తమైన అత్యవసర సిబ్బంది మంటలను ఆర్పివేశారు. విమానాశ్రయానికి సమీపంలోనే ఈ ప్రమాదం జరిగింది. విమానాన్ని అత్యవసరంగా ల్యాండింగ్ చేయడానికి ఎయిర్‌పోర్టు అధికారులకు విజ్ఞప్తి చేశారు. వెంటనే అనుమతి రాకపోవడంతో విమానం ఆకాశంలోనే కొద్దిసేపు చక్కర్లు కొట్టింది. చివరకు అదుపుతప్పి నేలపైకి దూసుకొచ్చింది. ప్రమాదాన్ని నివారించడానికి పైలట్లు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి.

కొందరి పరిస్థితి విషమం

ప్రమాదానికి గురైన విమానంలో 42 మంది అజర్‌బైజాన్ పౌరులు, 16 మంది రష్యా జాతీయులు, ఆరుగురు కజకిస్తాన్ పౌరులు, ముగ్గురు కిర్గిజిస్తాన్ పౌరులు ఉన్నట్లు కజకిస్తాన్ అధికార వర్గాలు వెల్లడించాయి. ఐదుగురు సిబ్బంది సహా మొత్తం 29 మంది ప్రాణాలతో బయటపడ్డారని, వీరిలో ఇద్దరు చిన్నారులు ఉన్నారని కజకిస్తాన్ అత్యవసర మంత్రిత్వ శాఖ తెలియజేసింది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొంది. కానీ, ఇద్దరు పైలట్లు కూడా మరణించారని రష్యా వార్తా సంస్థ ఇంటర్‌ఫాక్స్ వెల్లడించింది. కనీసం 32 మంది ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారని అజర్‌బైజాన్ ప్రాసిక్యూటర్ జనరల్ కార్యాలయం స్పష్టంచేసింది. బాధితుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అజర్‌బైజాన్ విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వివరించింది.

పక్షి ఢీకొట్టడం వల్లే ప్రమాదం?

ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. రష్యా వైపు విమానం ప్రయాణిస్తుండగా హఠాత్తుగా పక్షి ఢీకొట్టిందని, దాంతో అత్యవసర పరిస్థితి తలెత్తడంతో పైలట్లు అప్రమత్తమయ్యారని, విమానాన్ని దారిమళ్లించడానికి ప్రయత్నించారని, కొద్దిసేపు తర్జనభర్జన తర్వాత అక్తావ్ వైపు మళ్లించారని రష్యా పౌర విమానయాన సంస్థ వెల్లడించినట్లు ఓ వార్తా సంస్థ తెలిపింది. ప్రమాదానికి సంబంధించి మొబైల్ ఫోన్ ఫుటేజీ సైతం సోషల్ మీడియాలో ప్రసారమైంది. విమానం నిట్టనిలువుగా కిందికి దూసుకొస్తున్నట్లు ఇందులో కనిపిస్తోంది. అది భూమిని తాకిన వెంటనే మంటలు చెలరేగాయి. విమాన ప్రధాన భాగం నుంచి రెక్కలు విడిపోయాయి. ప్రాణాలతో బయటపడిన ప్రయాణికులు తమ సహచరులను విమాన శిథిలాలనుంచి బయటకు లాగుతున్న దృశ్యాలు కనిపించాయి. దుర్ఘటన గురించి తెలిసిన వెంటనే అజర్‌బైజాన్ అధికారులు ఘటనా స్థలానికి బయలుదేరారు. రష్యా పర్యటనలో ఉన్న అజర్‌బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ అలీయేవ్ స్వదేశానికి చేరుకున్నారు. బాధిత కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అజర్‌బైజాన్ విమాన ప్రమాదంపై రష్యా అధ్యక్షుడు పుతిన్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. అలీయేవ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక విమానంలో వైద్య సిబ్బందిని, సహాయక సిబ్బందిని ఘటనా స్థలానికి పంపించామని పుతిన్ చెప్పారు.

అఫ్గానిస్తాన్‌పై పాక్ దాడులు

46 మంది మృతి • ప్రతీకారం తీర్చుకుంటామంటున్న తాలిబన్లు

కాబూల్: అఫ్గానిస్తాన్‌లోని పక్తికా ప్రావిన్స్‌లో ఉన్న బర్మల్ జిల్లాపై పాకిస్తాన్ వైమానిక దాడులు జరిపింది. డిసెంబర్ 24 రాత్రి జరిగిన ఈ దాడుల్లో మహిళలు, చిన్నారులు సహా 46 మంది మృతి చెందారు. ఐదు గ్రామాలు లక్ష్యంగా చేసిన దాడిలో బర్మాల్‌లోని ముర్గ్‌బజార్ గ్రామం ధ్వంసమైంది. పాకిస్తాన్ తాలిబాన్, లేదా తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ) ఇటీవలి నెలల్లో పాకిస్తాన్ దళాలపై తన దాడులను పెంచింది. అయితే వారికి అఫ్గాన్ తాలిబన్లు ఆశ్రయం కల్పిస్తున్నారని పాకిస్తాన్ ఆరోపించింది. చాలా మంది టీటీపీ కమాండర్లు, ఫైటర్లు అఫ్గానిస్తాన్‌కు పారిపోయారని, సరిహద్దు ప్రావిన్సులలో అఫ్గాన్ తాలిబన్లు వారికి రక్షణ కల్పిస్తున్నారని పాకిస్తాన్ పేర్కొంది. వీటిని తాలిబన్ రక్షణ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఎనాయతుల్లా ఖ్వారజ్మీ ఖండించారు. వైమానిక దాడిలో మరణించినవారు సామాన్య పౌరులని, వజీరిస్తానీ శరణార్థులు ఉన్నారని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ దాడిలో మృతి చెందిన మహిళలు, పిల్లలతో సహా 46 మృతదేహాలను వెలికితీశామని, గాలింపు చర్యలు కొనసాగుతుండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. వజీరిస్తానీ శరణార్థులు పాకిస్తాన్ గిరిజన ప్రాంతాల్లో సైనిక చర్యల వల్ల నిర్వాసితులైన పౌరులు.

ప్రతీకారం తీర్చుకుంటాం: తాలిబన్లు

పాక్ చేసిన వైమానిక దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని తాలిబన్ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. భూమిని, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం తమ చట్టబద్ధమైన హక్కని స్పష్టం చేసింది. వైమానిక దాడులను పాకిస్తాన్ అధికారికంగా ధ్రువీకరించలేదు.

రెవెన్యూ కార్యదర్శిగా అరుణిష్ చావ్లా

న్యూఢిల్లీ: సీనియర్ అధికారి అరుణిష్ చావ్లా కేంద్ర రెవెన్యూ కార్యదర్శిగా నియమితులయ్యారు. కేంద్ర ప్రభుత్వం బుధవారం కొన్ని కీలకమైన బదిలీలు చేసింది. ఫార్మాస్యూటికల్ కార్యదర్శిగా ఉన్న అరుణిష్ చావ్లాను రెవెన్యూ శాఖకు మారుస్తున్నట్లు సిబ్బంది శాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. మణిపూర్ ప్రధాన కార్యదర్శి వినీత్ జోషిని ఉన్నత విద్యా శాఖ కార్యదర్శిగా నియమించారు. టెక్స్‌టైల్స్ కార్యదర్శిగా ఉన్న రచనా షాను సిబ్బంది వ్యవహారాలు, శిక్షణ శాఖ కార్యదర్శిగా నియమించారు.

హైతీ ఆస్పత్రిపై ముష్కరుల దాడి

- ఇద్దరు జర్నలిస్టులు, పోలీసు అధికారి మృతి..
- పలువురికి గాయాలు

హైతీ: దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వాసుపత్రిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఆస్పత్రి పునఃప్రారంభం సందర్భంగా జరిగిన దాడిలో ఇద్దరు జర్నలిస్టులు, ఒక పోలీసు అధికారి అక్కడికక్కడే మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిలో జర్నలిస్టులు, పోలీసులు, వైద్య సిబ్బంది ఉన్నట్లుగా సమాచారం. భవనం లోపల ఉన్న చాలా మంది గాయపడినట్లు తెలుస్తోంది. హైతీ రాజధాని పోర్ట్ ఓ ప్రిన్స్‌లో జనరల్ ఆస్పత్రి పునఃప్రారంభానికి ఆరోగ్య మంత్రి లోర్టే బ్లెమా రాక కోసం జర్నలిస్టులు ఎదురుచూస్తుండగా.. ఈ దాడి జరిగింది. వివ్ అన్సమ్ ముఠా సభ్యులే ఈ దాడికి పాల్పడినట్లు సమాచారం. 'ఇది భయంకరమైన సినిమాలా అనిపించింది'అని హింసను ప్రత్యక్షంగా చూసిన ఫొటో జర్నలిస్ట్ డియాగో ఆండ్రే చెప్పారు. ఘటనపై హైతీ అధ్యక్ష పరివర్తన మండలి అధిపతి లెస్లీ వోల్టేర్ సంతాపం తెలిపారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఏప్రిల్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ, కెన్యా పోలీసు అధికారుల నేతృత్వంలో అంతర్జాతీయ దళాన్ని మోహరించినప్పటికీ హైతీ ప్రజలపై భరించలేని స్థాయిలో ముఠా హింస కొనసాగుతోంది. 2021లో అప్పటి అధ్యక్షుడు జోవెనెల్ మోయిస్ హత్య తర్వాత హైతీలో ఈ ముఠాల హింస చెలరేగింది. పోర్ట్-ఓ-ప్రిన్స్‌లో 85% ఇప్పటికీ ముఠాల నియంత్రణలోనే ఉందని అంచనా. హైతీలో జరిగిన హింసాకాండలో ఈ ఒక్క ఏడాదిలోనే 5,000 మంది చనిపోయినట్లు ఐక్యరాజ్యసమితి తెలిపింది.

పార్లమెంట్ సమీపంలో యువకుడి ఆత్మాహుతి యత్నం

న్యూఢిల్లీ: పార్లమెంట్ నూతన భవనం సమీపంలో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బుధవారం మధ్యాహ్నం తనకు తాను నిప్పంటించుకున్నాడు. ప్రాణాలు పోగొట్టుకొనేందుకు సిద్ధమయ్యాడు. పార్లమెంట్ బిల్డింగ్ ఎదుట రైల్వే భవన్ పక్కనే ఈ ఘటన చోటుచేసుకుంది. యువకుడి ఆత్మహత్యాయత్నాన్ని గమనించిన పార్లమెంట్ భద్రతా సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకొని అతడిని అడ్డుకున్నారు. మంటలు ఆర్పేశారు. రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రికి తరలించారు. యువకుడికి ప్రాణాపాయం తప్పినట్లు తెలిసింది. సదరు యువకుడిని ఉత్తరప్రదేశ్‌లోని బాగ్‌పట్‌కు చెందిన జితేంద్రగా గుర్తించారు. స్వగ్రామంలో కొందరితో గొడవల కారణంగానే అతడు ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. అతడు బుధవారం ఉదయమే రైలులో బాగ్‌పట్ నుంచి ఢిల్లీకి చేరుకున్నాడని పోలీసులు చెప్పారు. అతడి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశామని అన్నారు.

అంబేడ్కర్ కృషిని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వాలు

- జల సంరక్షణ ప్రాధాన్యతను సైతం పక్కనపెట్టాయి
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆగ్రహం
- మధ్యప్రదేశ్‌లో కెన్‌-బెత్వా అనుసంధాన ప్రాజెక్టుకు శంకుస్థాపన
- వాజ్‌పేయి స్మారక పోస్టల్ స్టాంప్, నాణెం విడుదల

ఖజురహో: దేశంలో జల వనరుల అభివృద్ధికి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చేసిన కృషిని కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. 21వ శతాబ్దంలో తగినన్ని జల వనరులతో పాటు వాటి నిర్వహణలో మెరుగ్గా ఉన్న దేశాలే ప్రగతి పథంలో ముందుకు సాగుతాయని స్పష్టం చేశారు. 21వ శతాబ్దంలో నీటి సంరక్షణే అతిపెద్ద సవాలు అని తేల్చిచెప్పారు. బుధవారం మధ్యప్రదేశ్‌లో కెన్‌-బెత్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. ఖజురహోలో నిర్వహించిన సభలో ప్రసంగించారు. అంబేడ్కర్ అందించిన సేవలను కొనియాడారు. మన దేశంలో జల వనరుల బలోపేతానికి, నిర్వహణకు, డ్యామ్‌ల నిర్మాణానికి అంబేడ్కర్ దార్శనికత, దూరదృష్టి ఎంతగానో దోహదపడ్డాయని తెలిపారు. కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) ఏర్పాటు వెనుక అంబేడ్కర్ కృషి ఉందన్నారు. అతిపెద్ద నదీ లోయ ప్రాజెక్టుల అభివృద్ధికి ఎంతగానో శ్రమించారని పేర్కొన్నారు. జల సంరక్షకుడు అంబేడ్కర్‌ను గత కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏనాడూ పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. జల సంరక్షణ ప్రాధాన్యతను సైతం పక్కనపెట్టాయని విమర్శించారు. ఈ సందర్భంగా దివంగత ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి సందర్భంగా ప్రత్యేక స్మారక పోస్టల్ స్టాంప్, రూ.100 నాణాన్ని మోదీ విడుదల చేశారు. అంతేకాకుండా దేశవ్యాప్తంగా 1,153 అటల్ గ్రామ్ సేవా సదనాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ.437 కోట్లతో ఈ సదనాలు నిర్మిస్తారు. నేడు సుపరిపాలన దినోత్సవం జరుపుకుంటున్నామని ప్రధానమంత్రి చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వాల నిర్వాకంతో ప్రాజెక్టులు ఆలస్యం

మధ్యప్రదేశ్‌లోని ఖాండ్వా జిల్లాలో ఓంకారేశ్వర్ ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. నదుల అనుసంధానంలో భాగంగా దౌధన్ సాగునీటి ప్రాజెక్టుకు సైతం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సి.ఆర్.పాటిల్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కెన్‌-బెత్వా నదుల నీటిని నింపిన రెండు కలశాలను ప్రధాని మోదీకి అందజేశారు. రెండు నదుల అనుసంధాన ప్రాజెక్టు నమూనా(మోడల్)లో మోదీ ఈ నీటిని ధారగా పోశారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని లాంఛనంగా ఆరంభించారు. కెన్‌-బెత్వా నదుల అనుసంధానంతో బుందేల్‌ఖండ్ ప్రాంతంలో సౌభాగ్యం, సుఖ సంతోషాలు వెల్లివిరుస్తాయని మోదీ ఉద్ఘాటించారు. రూ.44,605 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపడుతున్నారు. దీంతో మధ్యప్రదేశ్‌లో 44 లక్షల మందికి, ఉత్తరప్రదేశ్‌లో 21 లక్షల మందికి తాగునీరు లభించనుంది. 2,000 గ్రామాల్లో 7.18 లక్షల వ్యవసాయ కుటుంబాలు లబ్ధి పొందుతాయి. అలాగే 103 మెగావాట్ల హైడ్రోపవర్, 27 మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తి జరుగుతుంది.



ఖజురహోలో కెన్‌-బెత్వా నదుల అనుసంధానానికి శంకుస్థాపన చేస్తున్న ప్రధాని మోదీ

ఆయుధాల గర్జనలు ఆగిపోవాలి

- యుద్ధాలకు ఇకనైనా ముగింపు పలకాలి
- క్రిస్మస్ పర్వదినం సందర్భంగా పోప్ ఫ్రాన్సిస్ పిలుపు



వాటికన్ సిటీ: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రైస్తవుల అత్యున్నత గురువు పోప్ ఫ్రాన్సిస్ ప్రపంచ మానవాళికి శాంతి సందేశం ఇచ్చారు. ప్రపంచమంతటా ఘర్షణలు ఆగిపోవాలని, శాంతి సామరస్యం నెలకొనాలని ఆకాంక్షించారు. బుధవారం వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్స్ స్క్వేర్‌కు తరలివచ్చిన వేలాది మందిని ఉద్దేశించి పోప్ బాసిలికా చర్చి బాల్కనీ నుంచి ప్రసంగించారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు ఆశీస్సులు అందజేశారు. అమాయకుల ఉసురు తీస్తున్న యుద్ధాల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయుధాలు నిప్పులు కక్కుతున్న చోట ఇకనైనా కాల్పుల విరమణ పాటించాలని పిలుపునిచ్చారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ఇప్పటికైనా ముగించాలని ఇరు పక్షాలకు హితవు పలికారు. జరిగిన నష్టం చాలని అన్నారు. సుదీర్ఘ శాంతిని నెలకొల్పే దిశగా చర్చలకు రెండు దేశాలూ చొరవ తీసుకోవాలని సూచించారు. యుద్ధాన్ని ముగించి, సంప్రదింపులకు తలుపులు తెరవాల్సిన సమయం వచ్చిందన్నారు. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతల పట్ల పోప్ ఆందోళన వ్యక్తంచేశారు ఆ ప్రాంతంలో ఆయుధాల గర్జనలు ఆగిపోవాలని, నిశ్శబ్దం తిరిగి రావాలని పేర్కొన్నారు. గాజాలో ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని చెప్పారు. వారి క్షుద్బాధ తీర్చాలని, మానవతా సాయం విరివిగా అందించాలని ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేశారు. గాజాలో కాల్పుల విరమణకు సిద్ధం కావాలని హమాస్, ఇజ్రాయెల్‌కు పోప్ సూచించారు. బందీలను విడుదల చేయాలని, తద్వారా శాంతికి బాటలు వేయాలని హమాస్ మిలిటెంట్లకు హితవు పలికారు. లెబనాన్, మయన్మార్, సిరియా, ఆఫ్రికా తదితర దేశాల్లో సంఘర్షణల పట్ల మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ శాంతియుత పరిస్థితులు నెలకొనాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. వాతావరణ మార్పులు, దుష్పరిణామాలపైనా పోప్ మాట్లాడారు. డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో దేశంలో వ్యాధుల బారినపడి పెద్దసంఖ్యలో చిన్నారులు మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి చికిత్స అందించాలని, సాంత్వన కలిగించాలని మానవతావాదులను కోరారు.

చేంజ్‌మేకర్స్‌తో రాష్ట్రపతి ముర్ము భేటీ

న్యూఢిల్లీ: సమాజంలో మార్పు కోసం, ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న 15 మంది యువతీ యువకులతో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం సమావేశమయ్యారు. వీరిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, కర్ణాటక, సిక్కిం తదితర రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారు. చేంజ్‌మేకర్స్‌గా గుర్తింపు పొందిన వీరిని రాష్ట్రపతి అభినందించారు. ఐక్యరాజ్యసమితి గుర్తింపు పొందిన 1ఎం1బీ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వీరు పని చేస్తున్నారు. నవీన ఆవిష్కరణలతో దూసుకెళ్తున్నారు. గిరిజన ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనతోపాటు పలు సవాళ్ల పరిష్కారానికి శ్రమిస్తున్నారు. రాష్ట్రపతిని కలిసినవారిలో తెలంగాణకు చెందిన 21 ఏళ్ల మనాల్ మునీర్ కూడా ఉన్నారు. ప్రాజెక్టు ఇంటెల్లికెన్సాను స్థాపించిన మునీర్ గ్రామీణ పర్యాటకాన్ని ప్రోత్సహిస్తున్నారు. తెలంగాణలో ఇప్పటివరకు అంతగా ప్రాచుర్యం పొందని పర్యాటక ప్రాంతాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే 16 ఏళ్ల అనిరుధ్ చింతా 'దృష్టి'అనే ప్రాజెక్టును స్థాపించాడు. పాఠ్య పుస్తకాలను బ్రెయిలీ లిపిలోకి మార్చే సాఫ్ట్‌వేర్‌ను ఆవిష్కరించాడు. ప్రస్తుతం దాదాపు 10 ఎన్జీఓలు ఈ ప్రాజెక్టును ఉపయోగించుకుంటున్నాయి.

త్వరలో ఢిల్లీ సీఎం ఆతిశి అరెస్టు

- ఆప్ సీనియర్ నేతల ఇళ్లలోనూ సోదాలు
- మాజీ సీఎం కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశిని త్వరలో అరెస్టు చేస్తారని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. అలాగే.. తనతోపాటు పార్టీ సీనియర్ నేతలపై మరోసారి దర్యాప్తు సంస్థల రెయిడ్స్ జరుగుతాయన్నారు. ఇవి ఆరోపణలు కాదని, తమకు అందిన పక్కా సమాచారమని స్పష్టం చేశారు. బుధవారం ఢిల్లీలోని ఆప్ ప్రధాన కార్యాలయంలో సీఎం ఆతిశి, సీనియర్ నేతలు మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 'మూడు నాలుగు రోజుల్లో క్రితం ఈడీ, సీబీఐ, ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారుల మీటింగ్ జరిగిందని మాకు తెలిసింది. ఏదైనా ఫేక్ కేసు పెట్టి ఢిల్లీ సీఎం ఆతిశిని అరెస్టు చేయాలని ఉన్నతాధికారుల నుంచి వారికి ఆదేశాలు వచ్చాయని కూడా సమాచారం అందింది. ఆతిశి అరెస్టుకు ముందే... మా పార్టీకి చెందిన సీనియర్ నేతలపై రెయిడ్స్ జరుగుతాయని కూడా ఆ సమావేశంలో అధికారులకు చెప్పారని తెలిసింది. నాతో సహా మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్, ఆతిశిపై దాడులు జరుగుతాయి. ఎన్నికల ప్రచారం, సన్నద్ధత నుంచి మా దృష్టి మరల్చేందుకు ఇదంతా చేయాలన్నదే వారి (బీజేపీ) ఉద్దేశం. ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి ఒక ఫేక్ కేసు సిద్ధం చేస్తున్నారని మాకు సమాచారం అందింది. మహిళలకు అందిస్తున్న ఫ్రీ బస్ పథకాన్ని అడ్డుకోవాలన్నదే వారి లక్ష్యంగా కనిపిస్తోంది. గత కొన్నేళ్లుగా మమ్మల్ని ఫేక్ కేసుల్లో పెట్టి జైళ్లలో పెట్టే కుట్రలకు ప్రజలు సమాధానం చెబుతారని విశ్వసిస్తున్నాను. ప్రజలు ఇలాంటి రాజకీయాలను ప్రోత్సహించరు. మీరు పదేళ్లలో ఏం చేశారు.. భవిష్యత్తులో ఏం చేస్తారో చెప్పండి. జైళ్లలో వేయడం, తిట్టడం వంటి చర్యలకు ప్రజలు ఓట్లు వేయరు'అని కేజ్రీవాల్ అన్నారు.

న్యాయవ్యవస్థ, రాజ్యాంగంపై నమ్మకం ఉంది: ఆతిశి

దేశంలోని న్యాయ వ్యవస్థ, రాజ్యాంగంపై పూర్తి నమ్మకం ఉందన్నారు ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశి. తాము నిజాయితీగా పనిచేశాం, చేస్తామని స్పష్టం చేశారు. దర్యాప్తు సంస్థలు ఫేక్ కేసులో నన్ను అరెస్టు చేస్తే వాస్తవాలు త్వరలోనే బయటకు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీ ప్రజలు అంతాచూస్తున్నారు. వారే సమాధానం చెబుతారన్నారు. మహిళా యోజనపై పత్రికల్లో వచ్చిన నోటీసులు అవాస్తవమన్నారు. బీజేపీ ఒత్తిడి చేసి అధికారులతో ఈ నోటీసులు జారీ చేయించారని, ఆ అధికారులపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. మహిళా యోజనకు మంత్రివర్గం ఆమోదం తెలిపిన నోటిఫికేషన్ పబ్లిక్ డొమైన్‌లో కూడా ఉందని తెలిపారు.



సాక్షి హైదరాబాద్

గురువారం । 26 । డిసెంబర్ । 2024



'రియల్' రంగానికి ధోకా లేదు

నగరంలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలకు ధోకా లేదని హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి వెల్లడించారు. -8లో



విజ్ఞానం.. విహారం..

రాష్ట్రపతి దక్షిణాది అధికారిక నివాసం.. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం సామాన్యులకు అందుబాటులోకి వచ్చింది. సందర్శకులకు ప్రస్తుతం అవకాశం దక్కింది. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
26.0/21.0

వాతావరణం

నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరు జల్లులు కురిసే అవకాశముంది. గరిష్టంగా 26, కనిష్టంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



కల్వరి టెంపుల్ వద్ద యువతుల సెల్ఫీ



సికింద్రాబాద్‌లో యువతుల ఆత్మీయ చుంబనం



మియాపూర్‌లోని కల్వరి టెంపుల్ వద్ద క్రిస్మస్ సందడి



సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ చర్చి వద్ద..



బండ్లగూడలో క్రిస్మస్ వేడుకల్లో స్పీకర్ ప్రసాద్‌కుమార్

ఆనంద క్రిస్మస్

గ్రేటర్ పరిధిలో బుధవారం క్రిస్మస్ వేడుకలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. మియాపూర్‌లో కల్వరి టెంపుల్‌తో పాటు పలు చర్చిలు భక్తులతో కళకళలాడుతూ కనిపించాయి. క్రీస్తు స్తుతి గీతాలు.. ప్రత్యేక ప్రార్థనలతో ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణమే కనిపించింది. క్రైస్తవులు ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకొని ఆనందోత్సాహాలతో వేడుకలను నిర్వహించారు. కాగా.. బండ్లగూడలోని పేనియల్ గాస్పెల్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు. – సాక్షి, సిటీబ్యూరో



క్రీస్తును స్తుతిస్తూ భక్తి గీతాల ఆలాపన

డాలర్స్ హిల్స్‌లో కొండచిలువ కలకలం



ప్రహరీ లోపలికి వచ్చిన కొండ చిలువ

మణికొండ: నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి ప్రహరీలోకి కొండ చిలువ రావటంతో కార్మికులు భయాంకు గురయ్యారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని డాలర్స్‌హిల్స్ కాలనీలో డాక్టర్ అవినాష్ నూతన ఇంటి నిర్మాణం చేస్తున్నారు. మంగళవారం రాత్రి 10 అడుగుల కొండ చిలువ ప్రహరీ గోడ లోపలికి వచ్చింది. ఓ మూలన ఉన్న డస్ట్ బిన్ పక్కన చేరి బుసలు కొట్టింది. అటుగా వెళ్లిన వారు దాన్ని గమనించి యజమానికి తెలిపారు. దీంతో ఆయన స్నేక్ సొసైటీ వారికి సమాచారం ఇవ్వటంతో వారు వచ్చి సంచిలో దానిని బంధించారు. కొండచిలువను జూపార్క్‌లో అప్పగిస్తామని తెలిపారు.

చలి.. చినుకులు..

నగరంలో అక్కడక్కడా తేలికపాటి జల్లులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో బుధవారం తెల్లవారుజామున నుంచి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. పగలంతా ఆకాశం మబ్బులు కమ్మేసి మేఘావృతమైంది. సూరీడు కారుమబ్బుల చాటుకు పరిమితమయ్యాడు. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు డిగ్రీలు తక్కువ నమోదయ్యాయి. గరిష్టంగా 28, కనిష్టంగా 19.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పగటి పూట చలిలో మంచుతో పాటు చిరుజల్లులు కురిశాయి. సాధారణంగా సంక్రాంతి తర్వాత చలి తీవ్రత తగ్గి.. వాతావరణంలో మార్పు మొదలవుతుంది. డిసెంబర్ నెలాఖరుకు చలి ఎక్కువగానే ఉంటుంది. కానీ.. ఒకేసారి వాతావరణ మార్పుతో కొంత ఆహ్లాదకరంగా కనిపించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతోనే వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. చిరు జల్లులతో వాహనాల వేగం తగ్గడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఫలితంగా పలు ప్రాంతాల్లో భారీ ట్రాఫిక్ జామ్ అయ్యింది. ముఖ్యంగా కొండాపూర్‌లో ఏఎంబీ మాల్ రూట్‌లో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సాధారణంగానే ఈ రూట్‌లో భారీగా ట్రాఫిక్ జామ్ ఉంటుంది.

చెట్టును ఢీకొన్న కారు

ఇద్దరు నగర వాసుల దుర్మరణం

- మరో ఐదుగురికి గాయాలు
- భువనగిరి పట్టణంలో రోడ్డు ప్రమాదం

భువనగిరిటౌన్: స్నేహితులంతా కలిసి యాదగిరిగుట్టలోని లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చి వెళ్తుండగా.. కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన వరంగల్‌–హైదరాబాద్ జాతీయ రహదారిపై భువనగిరి పట్టణంలో బుధవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లో వివిధ కాలనీలకు చెందిన అర్జున్, శ్రీరాం మితిన్, శ్రీను, సుంకరి మణిజయంత్, యశ్వంత్ (17) స్నేహితులు. వీరంతా బుధవారం తెల్లవారుజామున అదే ప్రాంతానికి చెందిన అబ్దుల్ సూఫియాన్ అలియాస్ రహీం (27) ఇన్నోవా కారును అద్దెకు తీసుకుని అతడితో పాటు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు బయల్దేరారు. అదే కారులో అబ్దుల్ సూఫియాన్ బంధువు షాకీబ్ కూడా ఉన్నాడు. ఉదయం 7 గంటలకు యాదగిరిగుట్టకు చేరుకుని స్వామివారి దర్శనం పూర్తిచేసుకున్నారు. అనంతరం హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలో యాదగిరిగుట్ట–భువనగిరి మధ్యలో ఓ హోటల్ వద్ద కారును ఆపి టిఫిన్ చేశారు. అనంతరం అక్కడి నుంచి హైదరాబాద్‌లో ఓ ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు బయల్దేరారు. మార్గమధ్యలో భువనగిరి పట్టణంలోని టీచర్స్ కాలనీ సమీపంలో వరంగల్‌–హైదరాబాద్ జాతీయ రహదారి బైపాస్ వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన రెయిలింగ్‌ను ఢీకొని అక్కడే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న అబ్దుల్ సూఫియాన్‌తో పాటు వెనుక కూర్చున్న యశ్వంత్ అక్కడికక్కడే మృతి చెందారు. మిగతా ఐదుగురికి గాయాలయ్యాయి.

భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలింపు..

సమాచారం తెలుసుకున్న భువనగిరి పట్టణ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ఐదుగురిని 108 వాహనంలో భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. షాకీబ్‌తో పాటు మితిన్, మణిజయంత్‌కు తీవ్ర గాయాలవ్వడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అనంతరం వాహనంలో ఇరుక్కుపోయిన సూఫియాన్, యశ్వంత్ మృతదేహాలను పోలీసులు వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

సెలవు రోజు కావడంతో..

అర్జున్, యశ్వంత్, మణిజయంత్, శ్రీరాం మితిన్, శ్రీను హైదరాబాద్‌లోనే వివిధ ప్రాంతాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. శ్రీను, అర్జున్, మితిన్ శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో, యశ్వంత్ నారాయణగూడలోని నారాయణ జూనియర్ కళాశాలలో, మణిజయంత్ నల్లకుంటలోని నారాయణ జూనియర్ కళాశాలలో చదువుకుంటున్నారు. క్రిస్మస్ సందర్భంగా కళాశాలకు రెండు రోజులు సెలవులు ఇవ్వడంతో స్నేహితులంతా కలిసి యాదగిరిగుట్టకు వచ్చారు. మృతుల కుటుంబ సభ్యులు భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి పట్టణ ఎస్ఐ కుమారస్వామి తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



యశ్వంత్ (ఫైల్)

శాంతినగర్‌లో విషాద ఛాయలు

రామంతాపూర్: తమ ఒక్కగానొక్క కుమారుడు యశ్వంత్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో రామంతాపూర్ శాంతినగర్‌కు చెందిన శ్రీనివాస్, మాధవి దంపతుల దుఃఖ సాగరంలో మునిగిపోయారు. కుమారుడి మరణ వార్త తెలియగానే శ్రీనివాస్ దంపతులు భువనగిరి జిల్లా ఆస్పత్రికి చేరుకుని గుండెలవిసేలా రోదించారు. సోదరుడి మరణంతో యశ్వంత్ సోదరీమణులు భవ్య, సమీక్ష భోరున విలపిస్తున్నారు.

అందాల భవనానికి అరుదైన గౌరవం!

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని ఆర్ట్స్ కాలేజీ భవనానికి అరుదైన గౌరవం దక్కింది. నిజాం హయాంలో 1939లో నిర్మితమైన భవనానికి ప్రతిష్టాత్మక భారత ప్రభుత్వ ట్రేడ్ మార్క్ గుర్తింపు లభించింది. ట్రేడ్‌మార్క్ నిబంధనల ప్రకారం ఆర్ట్స్ కాలేజీ భవనం ఫొటోను ఇతరులు ఉపయోగించకూడదు. ఇక నుంచి ఈ భవనం ఫొటోను ప్రభుత్వ, ప్రైవేటు వర్సిటీలు, విద్యా సంస్థలు, కాలేజీలు, వ్యాపార సంస్థలతో పాటు క్రీడాకారుల బహుమతులు, వివిధ రకాల వస్తువులు, గృహాలంకరణ గిఫ్ట్‌లు, టీ కప్పులు, వాల్‌పోస్టర్లు, క్యాలెండర్లు, డైరీలు తదితరాలపై ముద్రించకూడదు. నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలు, వ్యక్తులపై చట్టపరంగా చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు. ట్రేడ్ మార్క్ ఉన్న భవనాలు మన దేశంలో రెండే ఉన్నాయి. ముంబైలోని తాజ్‌మహల్ హోటల్, స్టాక్ ఎక్స్ఛేంజ్ భవనాలు కాగా.. ఇప్పుడు ఈ జాబితాలో మూడో భవనంగా ఆర్ట్స్ కాలేజీ చేరింది.

ప్రతిష్టను పెంచేందుకు..

మారిన పరిస్థితులకు అనుకూలంగా ఆర్ట్స్ కాలేజీ భవన ప్రతిష్టను పెంచేందుకు ట్రేడ్ మార్క్ కోసం ఈ ఏడాది ఏప్రిల్‌లో జాతీయ స్థాయి మేధోసంపత్తి హక్కుల పరిరక్షణ విభాగంలో దరఖాస్తు చేయగా భారత ప్రభుత్వ గెజిట్ ఈ నెల 2న ప్రచురితమైందని ఓయూ న్యాయ కళాశాల సీనియర్ ప్రొఫెసర్ జీబీ రెడ్డి చెప్పారు. జనవరి 15 వరకు ట్రేడ్ మార్క్ సర్టిఫికెట్ చెన్నై కార్యాలయం నుంచి జారీ కానున్నట్లు ఆయన తెలిపారు. సర్టిఫికెట్ జారీ అయిన వెంటనే ఓయూ వీసీ ప్రొ.కుమార్ అధికారికంగా ప్రకటించనున్నట్లు జీబీ రెడ్డి చెప్పారు.

ఓయూ ఆర్ట్స్ కాలేజీకి ట్రేడ్‌మార్క్ గుర్తింపు



జీహెచ్ఎంసీ సివిల్ పనులపై నిఘా నేత్రం

- ల్యాబ్‌ల ఎంప్యానెల్‌కు టెండర్లు పిలిచిన యంత్రాంగం

నాణ్యతపై మరో నజర్!

ఈ పనుల కోసం..

దిగువ పేర్కొన్న పనుల్లో నాణ్యత పరీక్షల కోసం కొత్త పార్టీగా లేబరేటరీలను ఆహ్వానిస్తూ టెండర్లు పిలిచారు.

- బీటీ రోడ్లు
- సీసీ రోడ్లు
- భూగర్భ డ్రైనేజీలు
- వరదనీటి కాలువలు (బాక్స్ డ్రెయిన్స్, ఆర్‌సీసీ పైప్ డ్రెయిన్స్)
- ఆర్‌సీసీ బిల్డింగులు
- కల్వర్టులు, వంతెనలు
- ఫుట్‌పాత్‌లు
- ఘనవ్యర్థాల నిర్వహణకు సంబంధించిన పనులు.



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరిగే వివిధ నిర్మాణ పనుల నాణ్యత పరీక్షలకు ఇప్పటికే ఉన్న పార్టీలతో పాటు మరో పార్టీ ఎంపికకు అధికారులు సిద్ధమయ్యారు. జీహెచ్ఎంసీ చేపట్టే వివిధ సివిల్ ఇంజినీరింగ్ పనుల్లో మెరుగైన నాణ్యత కోసం ఇప్పటికే ఉన్న పరీక్షలతో పాటు నేషనల్ అక్రెడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లేబొరేటరీస్ (ఎన్ఏబీఎల్) గుర్తింపు పొందిన లేబొరేటరీల ద్వారా కూడా నాణ్యత పరీక్షలు చేయించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు సిద్ధమయ్యారు. తాము కోరిన పనులకు సంబంధించి పరీక్షలు నిర్వహించేందుకు ముందుకొచ్చే లేబొరేటరీలను ఆహ్వానిస్తూ టెండర్లు పిలిచినట్లు అధికారులు పేర్కొన్నారు. టెక్నికల్, ఫైనాన్షియల్ బిడ్లను పరిశీలించి ఎల్1 ఏజెన్సీగా నిలిచిన ఏజెన్సీ దాఖలు చేసిన ధరలకే నాణ్యత పరీక్షలు చేసేందుకు ముందుకొచ్చే ఏజెన్సీలను ఎంప్యానెల్ చేస్తారు. ఎంప్యానెల్‌కు ఎంపికైన ఏజెన్సీ ప్రతినిధి తాము కోరిన పనికి సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలనతో పాటు ల్యాబ్ పరీక్షలు కూడా చేయాల్సి ఉంటుందన్నారు.

ఇవీ అర్హతలు..

ఈ పనులు చేసేందుకు సంబంధిత ఏజెన్సీ తగిన అర్హత కలిగి ఉండాలి. ఈ మేరకు, ఎన్ఏబీఎల్ అక్రెడిటేషన్ కలిగి ఉండటంతో పాటు కంపెనీస్ చట్టం కింద రిజిస్టరై ఉండాలి. జీహెచ్ఎంసీ సరిహద్దులకు 5 కి.మీ. కంటే ఎక్కువ దూరంలో ఉండరాదు. గడచిన ఐదేళ్లలో కనీసం మూడేళ్లు నిర్మాణ మెటీరియల్‌ను పరీక్షించిన అనుభవం కలిగి ఉండటంతో పాటు ఏదైనా ప్రభుత్వ సంస్థకు కనీసం ఏడాదిపాటు క్వాలిటీ పరీక్షలు చేసినట్లు ధ్రువీకరించే సర్టిఫికెట్లు కలిగి ఉండాలి. ఐఆర్‌సీ, మోర్త్, ఏఎస్‌టీఎం, సీపీహెచ్ఈఈఓ ఇంజినీరింగ్ ప్రమాణాల మేరకు పనులు చేయాలి.

ఏడాది వరకు..

ఎంప్యానెల్‌కు ఎంపికయ్యే ఏజెన్సీలు ఏడాది పాటు పని చేయాల్సి ఉంటుంది. జీహెచ్ఎంసీ అవసరం, ఏజెన్సీ పని తీరును బట్టి, పరస్పర అంగీకారంతో మరికొంతకాలం గడువు పొడిగించేందుకు అవకాశం ఉంటుంది. జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగంలో క్వాలిటీ కంట్రోల్ విభాగం ఉంది. కాంట్రాక్టు ఏజెన్సీలు తాము చేసిన పనుల క్వాలిటీ చెక్ చేసుకోవడంతో పాటు జీహెచ్ఎంసీ క్వాలిటీ కంట్రోల్ విభాగం కూడా నాణ్యత పరీక్షలు చేస్తోంది. వీటితోపాటు థర్డ్‌పార్టీగా ఇంజినీరింగ్ కాలేజీల ద్వారా కూడా నాణ్యత పరీక్షలు చేయిస్తున్నారు. వాటితో పాటు మరో పార్టీగా లేబొరేటరీల ద్వారా కూడా నాణ్యత పరీక్షల కోసం ఈ టెండర్లు పిలిచారు. ఇన్ని పార్టీలతో క్వాలిటీ పరీక్షలు నిర్వహించినా జీహెచ్ఎంసీ పనుల్లో నాణ్యత మెరుగవుతుందో లేదో వేచి చూడాల్సిందే!

పరీక్షలు అవసరమే..

జీహెచ్ఎంసీ రూ.వేల కోట్ల పనులు చేస్తున్నందున పనులు నాణ్యతగా ఉండేందుకు ఎక్కువ పరీక్షల అవసరముందని అధికారులు అంటున్నారు. ఏ పార్టీ క్వాలిటీ పరీక్షల్లో తేడా వచ్చినా, లోపాలు గుర్తించినా చెల్లింపులు జరగవని చెబుతున్నారు.

వారికి మోదం.. వీరికి ఖేదం!

రాష్ట్రంలో అధికారంలో ఉన్నా ప్రభావం చూపని కాంగ్రెస్

- కంటోన్మెంట్‌ను మాత్రం కైవసం చేసుకున్న హస్తం పార్టీ
- రాజకీయ నేతలకు తీపి చేదుల కలయికగా..

లోక్‌సభ ఎన్నికల్లో.. సత్తా చాటిన బీజేపీ.. పత్తాలేని బీఆర్ఎస్

పొలిటికల్ రౌండప్ 2024

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో లోక్‌సభ ఎన్నికలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో జాతీయస్థాయిలో హేమాహేమీలైన పలువురు నేతలు ప్రచారంలో పాల్గొన్నారు. బీజేపీ కోసం ప్రధాని మోదీ, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలు సైతం గ్రేటర్‌లో ప్రచార షోలు నిర్వహించారు. మహా నగర పరిధిలోని నాలుగింట మూడు స్థానాల్లో గెలిచి బీజేపీ తన హవా చాటుకుంది. హైదరాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన మాధవీలత పాతబస్తీలో ప్రచారంతో ఫైర్‌బ్రాండ్‌గా గుర్తింపు పొందారు. ఎప్పటిలాగే హైదరాబాద్ ఎంపీగా ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ (ఐదోసారి) గెలవగా, సికింద్రాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి సిట్టింగ్ సీటును నిలుపుకున్నారు. మరో మారు కేంద్రమంత్రి అయ్యారు. దేశంలోనే అత్యధిక ఓట్లున్న మల్కాజిగిరి నుంచి బీజేపీ అభ్యర్థిగా ఈటల రాజేందర్ గెలుపొందారు. చేవెళ్ల నుంచి బీజేపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపొందారు.

రిక్త 'హస్తం'

రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టినప్పటికీ కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి సిట్టింగ్ స్థానాన్ని తిరిగి గెలవలేకపోయింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన ఆ నియోజకవర్గంలో తిరిగి కాంగ్రెస్ జెండా ఎగరలేదు. చేవెళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాద్‌ల నుంచి పోటీ చేసిన ఆపార్టీ అభ్యర్థులు గడ్డం రంజిత్‌రెడ్డి, సునీతా మహేందర్‌రెడ్డి, దానం నాగేందర్‌లు సైతం ఓటమి పాలయ్యారు.

వాడిన గులాబీ..

అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలో అత్యధిక స్థానాలు గెలుచుకున్న బీఆర్ఎస్ ఒక్క ఎంపీ సీటును కూడా దక్కించుకోలేకపోయింది. సికింద్రాబాద్ స్థానానికి సీనియర్ ఎమ్మెల్యే పద్మారావును బరిలో దింపినా ఫలితం లేకుండా పోయింది. మల్కాజిగిరి నుంచి పోటీ చేసిన రాగిడి లక్ష్మారెడ్డి, చేవెళ్ల నుంచి కాసాని జ్ఞానేశ్వర్ ఓటమి పాలయ్యారు.

ఎమ్మెల్యేలుగానే మిగిలారు..

కిషన్‌రెడ్డిని ఎదుర్కొనేందుకు సిట్టింగ్ ఎమ్మెల్యేలను బరిలో దింపినా బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు సికింద్రాబాద్‌లో గెలవలేకపోయాయి. పార్టీ మారి బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన దానం నాగేందర్, బీఆర్ఎస్ నుంచి నిలబడ్డ పద్మారావులు గెలవలేకపోయారు.

కాంగ్రెస్ ఖాతాలో కంటోన్మెంట్

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మరణంతో జరిగిన ఉప ఎన్నికలో బీఆర్ఎస్ నుంచి ఆమె సోదరి నివేదిత, బీజేపీ నుంచి బరిలో నిలిచిన వంశీ తిలక్ గెలవలేకపోయారు. బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన శ్రీగణేశ్ గెలిచారు.

బల్దియా ఆగమాగం



కోటిమందికి పైగా గ్రేటర్ ప్రజలకు సేవలందించాల్సిన జీహెచ్ఎంసీ పరిస్థితి ఈ సంవత్సరం గందరగోళంగా మారింది. తొలి ఆర్నెల్లలో ఓవైపు లోక్‌సభ ఎన్నికల కోడ్‌తో కొంతకాలం పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత ఆర్నెల్ల వ్యవధిలో ముగ్గురు కమిషనర్లు రావడంతో అయోమయం నెలకొంది. లోక్‌సభ ఎన్నికల తర్వాతే రోనాల్డ్ రాస్, ఆమ్రపాలి, ప్రస్తుతం ఇలంబర్తి కమిషనర్‌గా ఉన్నారు. ఏ ఒక్కరూ కూడా తమదైన పరిపాలన మార్కు చూపించలేకపోయారు. బల్దియా బాస్ స్థిరంగా లేకపోవడంతో అధికారులు ఆడింది ఆటగా సాగింది. ప్రజా సమస్యలు పట్టించుకున్న పాపాన పోలేదు. అవినీతి, అక్రమాలు అందలమెక్కాయి. అధికారుల వైఖరి అలా ఉండగా, పాలక మండలిలోని మేయర్, డిప్యూటీ మేయర్‌లు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ, బల్దియాలో బలంగా లేదు. కార్పొరేషన్‌కు నిధుల సమస్య తీరలేదు. ప్రభుత్వం మారినా నెల నెలా జీతాల కష్టాలు తప్పలేదు. ఈజీ చిరునామా, ఆస్తిపన్ను ఆదాయం పెంపు కోసం జీఐఎస్ సర్వే ప్రారంభించారు. టాక్స్,తదితర విభాగాల సిబ్బందికి కుటుంబసర్వే ముగియగానే ఇందిరమ్మ ఇండ్ల సర్వే పనులప్పగించారు. మొత్తానికి బల్దియా పరిస్థితి ఆగమాగంగా మారింది.

'రియల్' రంగానికి ధోకా లేదు

శరవేగంగా భవన నిర్మాణ అనుమతులు

- హెచ్‌ఎండీఏ పరిధిలో 45 శాతం పెరిగిన దరఖాస్తులు
- జీహెచ్‌ఎంసీలో 20 శాతం పెరుగుదల నమోదు
- త్వరలో ఔటర్ వరకు సమగ్ర మాస్టర్‌ప్లాన్
- సిటీ అభివృద్ధికి నిధులు ఫుల్
- మీడియా చిట్‌చాట్‌లో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం పరుగులు తీస్తోందని, నిర్మాణరంగంలో అనూహ్యమైన అభివృద్ధిని సాధించామని హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి వెల్లడించారు. లే అవుట్‌లు, భవనాల నిర్మాణం కోసంగతేడాది కంటే ఈ సంవత్సరం దరఖాస్తులు బాగా పెరిగినట్లు చెప్పారు. మరోవైపు దరఖాస్తుల పరిష్కారంలోనూ ఎలాంటి జాప్యానికి తావు లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి అనుమతులను అందజేసినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్దత నెలకొందనడంలో అర్థం లేదని అన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి నిధులు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. బుధవారం అమీర్‌పేట్‌లోని హెచ్‌ఎండీఏ కార్యాలయంలో నిర్వహించిన మీడియా చిట్‌చాట్ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి స్వయంగా పాల్గొనగా.. హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ సెలవులో ఉన్న కారణంగా ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్ శ్రీవత్స, డీటీసీపీ డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏలకు చెందిన ఉన్నతాధికారులు శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్ నాయక్, విద్యాధర్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ అభివృద్ధి, మహానగర విస్తరణ కోసం ఈ రెండు సంస్థలు ఏడాది కాలంలో అనేక ప్రాజెక్టులు చేపట్టాయని, ఇప్పటికే కొన్ని పూర్తి కాగా, మరి కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



మీడియాతో చిట్‌చాట్‌లో పాల్గొన్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి తదితరులు

రియల్ ఎస్టేట్ పడిపోలేదు...

- 'హైడ్రా వల్ల రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గిందనడంలో వాస్తవం లేదు. రియల్ రంగం వృద్ధిలో హైదరాబాద్ గణనీయంగా పురోగతి సాధించింది. హైదరాబాద్ నగర అభివృద్ధి విధానాలు, ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా రియల్ ఎస్టేట్ రంగంలో వృద్ధిని మరింత పెంచింది.' అని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి వెల్లడించారు. మరికొన్ని వివరాలు ఆయన మాటల్లోనే...
- ఈ ఏడాది నవంబర్‌లో 2078 భవన నిర్మాణ దరఖాస్తులు అందాయి. గతేడాది ఇదే నెలలో కేవలం 1740 దరఖాస్తులే వచ్చాయి. గతేడాది కంటే ఇది 20 శాతం అధికం. గత సంవత్సరం నవంబర్‌లో 1485 అనుమతులను ఇవ్వగా, ఈ నవంబర్‌లో 2071 దరఖాస్తులను పరిష్కరించాం. ఈ మేరకు 40 శాతం నిర్మాణ అనుమతులు పెరిగాయి.
- గత ఐదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ప్రథమార్థంలో రూ.58,481 కోట్ల వరకు భవనాల విక్రయాలు జరిగాయి. ఒక్క జూన్ నెలలోనే రూ. 4288 కోట్ల విలువైన నివాస ఆస్తుల విక్రయాలు నమోదయ్యాయి.
- ఈ సంవత్సరం 2.5 మిలియన్ చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ లీజింగ్ నమోదైంది. గతేడాది కంటే ఇది 11 శాతం అధికం.
- హై–సిటీ ప్రాజెక్టులో భాగంగా రూ.7032 కోట్ల అంచనాలతో 38 ప్రాజెక్టులు చేపట్టాం, సీఆర్ఎంపీ లో భాగంగా మొత్తం 934 రోడ్లు 1143కిమీ వరకు విస్తరణకు ప్రణాళికలు రూపొందించాం.
- ఎస్ఎన్‌డీపీ కింద రూ. 3825 కోట్లు. ఎస్ఎన్‌డీపీ–2 కింద రూ. 667.28 కోట్ల అంచనాతో 40 పనులు చేపట్టాం..
- ఆరాంఘర్ ఫ్లై ఓవర్ త్వరలో ప్రారంభిస్తాం. ఎలివేటెడ్ కారిడార్‌లకు మార్చిలో టెండర్లు పిలుస్తాం.

హై-సిటీ ప్రాజెక్టు...

- సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి తూంకుంట ఓఆర్ఆర్, డైరీఫామ్ వరకు రెండు మార్గాల్లో నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్‌లకు వచ్చే మార్చిలో టెండర్‌లను ఆహ్వానించనున్నట్లు హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ వెల్లడించారు.
- ఇందుకోసం 124 ఎకరాల భూమిని ఇప్పటి వరకు సేకరించినటు పేర్కొన్నారు. ఇప్పటి వరకు సర్వే, తదితర పనులు పూర్తయ్యాయన్నారు.
- రావిర్యాల నుంచి ఫోర్త్‌సిటీ వరకు 42 కిలో మీటర్ల మార్గంలో గ్రీన్‌ఫీల్డ్ రహదారులను నిర్మించనున్నట్లు చెప్పారు. 100 మీటర్ల వెడల్పుతో చేపట్టనున్న ఈ రహదారుల కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేశామన్నారు.
- ఇప్పటివరకు నగరంలో అమల్లో ఉన్న ఎంసీహెచ్, జీహెచ్‌ఎంసీ, హుడా, ఎయిర్‌పోర్ట్ అథారిటీ, సైబరాబాద్ అథారిటీ, తదితర మాస్టర్‌ప్లాన్‌లను సమగ్ర బృహత్తర మాస్టర్ ప్లాన్‌గా రూపొందించనున్నట్లు చెప్పారు. మార్చిలో కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ పూర్తవుతుందని, అనంతరం సెప్టెంబర్ నాటికి మాస్టర్‌ప్లాన్ అందుబాటులోకి వస్తుందని అన్నారు. ఔటర్‌రింగ్‌రోడ్డు నుంచి రీజనల్ రింగ్‌రోడ్డు వరకు అర్బన్, సెమీ అర్బన్‌గా విభజించి మాస్టర్‌ప్లాన్ రూపొందించనున్నారు. ఇందులో నీటివనరులు, అడవులను కచ్చితంగా అంచనా వేస్తారని చెప్పారు.
- హెచ్‌ఎండీఏ పరిధిలో గతేడాది కంటే ఈసారి అక్టోబర్ నాటికి 39 శాతం దరఖాస్తులు పెరిగాయి. గతేడాది కంటే పరిష్కరించిన ఫైళ్లు కూడా 14.4 శాతం ఎక్కువ.ఫైళ్ల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి అవకాశం లేకుండా ప్రతి వారం సమీక్షలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ఒక అధికారి వద్ద 10 రోజుల కంటే ఎక్కువ పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు.
- లే అవుట్‌లు, నిర్మాణాల కోసం ఈ ఏడాది నవంబర్ నాటికి 1920 దరఖాస్తులు అందాయి. గత సంవత్సరం ఇదే కాలానికి 1326 మాత్రమే వచ్చాయి. ఈ మేరకు గతేడాది కంటే ఇది 45 శాతం అధికం.
- గతేడాది జూన్ నుంచి అక్టోబర్ మధ్య 2038 అనుమతులను జారీ చేయగా, ఈ ఏడాది అదే కాలనికి 2332 అనుమతులను ఇచ్చారు. ఇది 14.4 శాతం అధికం.
- గత సంవత్సరం నవంబర్‌లో 267 దరఖాస్తులు రాగా, ఈ ఏడాది నవంబర్ 16వ తేదీ నాటికే 208 దరఖాస్తులు కొత్తగా వచ్చాయన్నారు.
- భవన నిర్మాణ అనుమతుల దరఖాస్తులు ఈ ఏడాది నవంబర్‌లో 1061 రాగా..గతేడాది ఇదే నెలలో 756 మాత్రమే వచ్చాయి. ఈ మేరకు 40 శాతం దరఖాస్తులు పెరిగాయి.
- హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయన్నారు.

చికిత్స పొందుతూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

గచ్చిబౌలి: ఈ నెల 23న రోడ్డు ప్రమాదంలో గాయపడి..చికిత్స పొందుతున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి చెందాడు. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న బుధవారం తెలిపిన వివరాల మేరకు..ఈ నెల 23న రాత్రి 1.50 గంటకు నానక్‌రాంగూడ రోటరీ నుంచి సర్వీస్ రోడ్‌లో నార్సింగి వైపు బైకుపైలో యువకుడు స్నేహితురాలితో కలిసి వెళ్తుండగా వెనుకనుంచి స్కోడా కారు ఢీకొట్టిన విషయం విదితమే. ఈ ఘటనలో బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థిని శివాని అదే రోజు మృతి చెందగా తీవ్ర గాయాలపాలైన వెంకటరమణారెడ్డి (26) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్‌కు చెందిన వెంకటరమణారెడ్డి తన స్నేహితురాలైన శివానిని హాస్టల్‌లో డ్రాప్ చేసేందుకు వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదం ఘటనలో మృతుల సంఖ్య ఇద్దరికి చేరింది. నిందితుడైన కాలేష్ (29)ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి



మృతిచెందిన రవి

అల్వాల్: కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతిచెందిన సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మచ్చబొల్లారం దర్శి బస్తీలో నివసించే సీహెచ్.రవి (56) చెత్త సేకరిస్తూ జీవిస్తుంటాడు. మచ్చబొల్లారంలోని తోటపెంటారెడ్డి గార్డెన్ సమీపంలో చెత్త సేకరిస్తున్న సమయంలో కరెంట్ స్తంభం ఎర్తింగ్ వైర్ తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. 11 కేవీ లైన్ ఎర్తింగ్ కోసం ఏర్పాటుచేసిన ఇండక్షన్ ఐరన్ ప్లేట్ తీసే ప్రయత్నంలో కరెంట్ షాక్ తగిలి ఉండవచ్చని విద్యుత్ అధికారులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జల్సాలకు మరిగి చోరీలు

మహేశ్వరం: కొత్తగా ఏర్పాటు చేసిన వెంచర్లలో ట్రాన్స్‌ఫార్మర్ వైర్లలను చోరీ చేస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి కటకటాల పాలు చేశారు. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మయన్మార్ దేశానికి చెందిన రోహింగ్యాలు హమీద్ హుస్సేన్, నూర్ అలాం, షఫీ అలాం, మహ్మద్ షఫీ, మహ్మద్ అబ్దుల్లా, మహ్మద్ ఫరూఖ్ అలీలు జల్సాలకు అలవాటుపడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ నెల 14న శనివారం అర్ధరాత్రి మండల పరిధిలోని దుబ్బచర్ల గ్రామ సమీపంలో ఉన్న స్టెల్లింగ్ వెంచర్‌లో ఉన్న 315 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులో నుంచి రాగి తీగలను దొంగిలించారు. మరుసటి రోజు సెక్యూరిటీగార్డులు గమనించి వెంచర్ యజమానికి సమాచారం అందించడంతో మహేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బైకుల దొంగ ఆటకట్టు

- ప్రభుత్వ ఆస్పత్రులే టార్గెట్‌గా దొంగతనాలు
- 9 బైకులు స్వాధీనం
- చోరీ బైకుల కొనుగోలుదారులూ అరెస్ట్



స్వాధీనం చేసుకున్న బైక్‌లు, విడి భాగాలతో పోలీస్ అధికారులు, సిబ్బంది

చిలకలగూడ: నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రులను టార్గెట్ చేసుకుని ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న నిందితుడు, దొంగిలించిన వాహనాలను కొనుగోలు చేస్తున్న ముగ్గురు రిసీవర్లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అనుదీప్, డీఐ రమేష్‌గౌడ్‌లతో కలిసి చిలకలగూడ ఏసీపీ జైపాల్ రెడ్డి బుధవారం వివరాలను వెల్లడించారు. ఫలక్‌నుమా తీగలకుంట దక్కన్ బేకరీ ప్రాంతానికి చెందిన మహ్మద్ సమీర్ అలియాస్ మహ్మద్‌హాషమ్ ఉరఫ్ షేక్ హాసమ్(28) వృత్తిరీత్యా ఏసీ మెకానిక్. అఫ్జల్‌గంజ్‌లోని పెట్రోల్ పంప్‌లో కొన్నాళ్లు పనిచేసి తర్వాత ఏసీ మెకానిక్‌గా పనిలో చేరాడు. మద్యం, గంజాయిలకు బానిసైన సమీర్ విలాసవంతమైన జీవితం గడిపేందుకు సులభంగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకుని, పార్కింగ్ చేసిన బైక్‌లను చోరీ చేసి విక్రయిస్తున్నాడు.

తల్లిని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి...

అస్వస్థతకు గురైన తల్లిని ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించిన నిందితుడు సమీర్ కొన్ని రోజులు ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్నాడు. ప్రభుత్వ ఆస్పత్రుల పార్కింగ్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పనిచేయడంలేదని గమనించాడు. రోజుల తరబడి పార్కింగ్ చేసిన వాహనాలను గుర్తించి మారు తాళాలతో వాటిని చోరీ చేయడం ప్రారంభించాడు. ఉస్మానియా, గాంధీ, ప్రభుత్వ యునానీ ఆస్పత్రుల్లో పార్కింగ్ చేసిన మొత్తం 9 వాహనాలను చోరీ చేసి, ముషీరాబాద్‌లోని స్క్రాప్ వ్యాపారులకు విక్రయించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసిన చిలకలగూడ పోలీసులు ఆస్పత్రుల సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితుని ఆటకట్టించారు. ఉస్మానియాలో 4, గాంధీలో 4, యునానీ ఆస్పత్రిలో ఒక ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. సమీర్‌తో పాటు చోరీ వాహనాలను కొనుగోలు చేసిన ముషీరాబాద్ స్క్రాప్ వ్యాపారులు మహ్మద్ యూసఫుద్దీన్ అలియాస్ లడ్డు, మహ్మద్ మొయిజుద్దీన్, మహ్మద్ ఖాజాహుస్సేన్‌లను బుధవారం అరెస్ట్ చేసి వారి నుంచి రూ.4 లక్షల విలువైన ద్విచక్ర వాహనాలు, విడిభాగాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

అదుపు తప్పి..విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి తారానగర్ ప్రధాన రోడ్డులోని పోచమ్మ ఆలయం సమీపంలో బుధవారం తెల్లవారుజామున అదుపుతప్పిన వేగంతో వచ్చిన ఓ కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. భెల్ చౌరస్తా నుంచి లింగంపల్లి వైపు వెళ్తున్న ఈ కారు (ఏపీ 28 సీఇ 5379) డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా అదుపుతప్పి ఎలక్ట్రికల్ , నెట్ కేబుల్ స్తంభాలను ఢీ కొట్టింది. దీంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. అలాగే విద్యుత్ స్తంభం ధ్వంసమై ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కాగా ఆ సమయంలో జనసంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ విభాగం అధికారులు వెంటనే స్పందించి సరఫరా నిలిపివేసి.. మరమ్మతు పనులు చేపట్టి వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



కారు ఢీకొట్టడంతో కూలిన విద్యుత్, కేబుల్ స్తంభాలు

'ప్రేమ' వేధింపులకు యువతి బలి



పూర్ణిమ (ఫైల్)



జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ ముందు నిరసన చేపట్టిన పూర్ణిమ కుటుంబ సభ్యులు

జవహర్‌నగర్: ప్రేమ పేరుతో ఓ యువకుడు వేధించడంతో తట్టుకోలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కుషాయిగూడ ఏసీపీ మహేష్‌కుమార్, జవహర్‌నగర్ సీఐ సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం..దమ్మాయిగూడ పరిధిలోని న్యూ భవానీనగర్‌లో నివసించే పానగంటి తానేష్, పద్మ దంపతుల కుమార్తె పూర్ణిమ (19) ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతూ ట్యూషన్లు కూడా చెబుతుంది. ఈ నెల 24వ తేదీన కళాశాలకు వెళ్లి ఇంటికి వచ్చిన పూర్ణిమ..పిల్లలకు ట్యూషన్ చెబుతూ మధ్యలో బాత్‌రూమ్‌లోకి వెళ్లి యాసిడ్ తాగి పడుకుంది. యాసిడ్ తాగానని ట్యూషన్‌కి వచ్చిన పిల్లలకు చెప్పడంతో వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. యాసిడ్ తాగి ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా, పోలీసులు విచారణ చేపట్టారు. నిఖిల్ అనే యువకుడి వేధింపుల కారణంగానే పూర్ణిమ ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసుల విచారణలో తేలింది. ఈ మేరకు నిఖిల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

పోలీస్ స్టేషన్ ముందు నిరసన

పూర్ణిమ ఆత్మహత్య సంఘటనను జీర్ణించుకోలేక ఆమె తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. చదువుకుని ప్రయోజకురాలు అవుతుందనుకుంటే కానరాని లోకాలకు వెళ్లిపోయిందని ఆవేదన చెందారు. పూర్ణిమను వేధింపులకు గురిచేసిన నిఖిల్‌ను వెంటనే అరెస్ట్ చేసి సరైన శిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ ముందు యువతి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు నిరసన చేపట్టారు.

బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగాన్ని సవరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం బీసీ భవన్‌లో రాష్ట్ర బీసీ లెక్చరర్స్ సంఘం సమావేశం అధ్యక్షులు కె.సుదర్శన్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలకు ఉద్యోగ ప్రమోషన్లల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ఎస్సీ, ఎస్టీలకు ఉన్న మాదిరిగానే బీసీలకు కూడా ఎట్రాసిటీ ప్రొటెక్షన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాముడి సుదర్శన్, ప్రధాన కార్యదర్శి మామిడి విఠల్, కోశాధికారి బుడిగే కొండయ్య, ఉపాధ్యక్షులు పరశురాములు, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, స్రవంతి, వెంకటరాములు, మోడల్ స్కూల్ ప్రతినిధి జమలాపురం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పనిచేస్తున్న ఇంటికే కన్నం...
24 గంటల్లో దొంగల అరెస్టు

రాజేంద్రనగర్: పని చేస్తున్న ఇంట్లో దొంగతనానికి పాల్పడి పారిపోయిన భార్యాభర్తలను రాజేంద్రనగర్ పోలీసులు 24 గంటల్లో అరెస్టు చేశారు. వారి నుంచి రూ.50 లక్షల విలువ చేసే డైమండ్ నగలతో పాటు బంగారు ఆభరణాలు, రూ.30 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బండ్లగూడ మైఫిల్ టౌన్ విల్లాస్‌లోని డాక్టర్ కొండల్‌రెడ్డి నివాసంలో బిహార్‌కు చెందిన నమీన్ కుమార్ యాదవ్, భారతిలు పని చేస్తున్నారు. సోమవారం రాత్రి కొండల్‌రెడ్డి ఇంట్లోని నగదు, నగలను దొంగలించి పారిపోయారు. మంగళవారం ఉదయం దొంగతనం విషయాన్ని గమనించిన కొండల్ రెడ్డి రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా నిందితులిద్దరినీ మంగళవారం అర్ధరాత్రి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో పట్టుకున్నారు. దాదాపు 400 పైచిలుకు సీసీ కెమెరాలను పరిశీలిస్తూ నిందితులను పోలీసులు పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి మొత్తం నగదు, నగలను స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ చూపిన పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

'రోల్‌బాల్'లో జాతీయ స్థాయికి ఎంపిక

చేవెళ్ల: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలో ఉన్న వివేకానంద ఇంటర్‌నేషనల్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని హుదా ఫాతిమా జూనియర్ మినీ రోల్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికైంది. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే యాదయ్యను స్కూల్ యాజమాన్యం, విద్యార్థిని తల్లిదండ్రులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆరో తరగతి చదువుతున్న హుదా ఫాతిమా ఇటీవల శంషాబాద్‌లో జరిగిన జూనియర్ మినీ రోల్‌బాల్ పోటీల్లో సత్తా చాటి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ నరేశ్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కర్రె శివప్రసాద్, మాజీ సర్పంచ్ జహంగీర్, విద్యార్థిని తల్లిదండ్రులు పాషా, స్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వీఎస్టీ ఎన్నికల్లో గెలిపిస్తే కార్మికుల సంక్షేమానికి కృషి

ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు టి.సంజీవరెడ్డి



ముషీరాబాద్: వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా తనను గెలిపిస్తే కంపెనీలోని 386 మంది కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ టి.సంజీవరెడ్డి హామీ ఇచ్చారు. నాలుగు ఇంక్రిమెంట్లు, ప్రతి నెల నాలుగు వేల షిఫ్టింగ్ బెనిఫిట్స్ వచ్చేలా చూస్తానని చెప్పారు. బుధవారం అడిక్‌మెట్‌లో సంజీవరెడ్డి గ్రూప్ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2027లో జరిగే లాంగ్ టర్మ్ అగ్రిమెంట్ (ఎల్‌టీఏ)లో ప్రతి కార్మికుడి డీఏను సరిసమానంగా ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. వీఎస్టీ అజామాబాద్‌లో ఉన్న వర్కింగ్ కండిషన్‌ను తూప్రాన్‌లో కూడా కొనసాగించేందుకు తూప్రాన్‌లోని వీఎస్‌టీ కంపెనీలో 24 గంటల ఎమర్జెన్సీ వ్యాన్ ప్రయాణ సౌకర్యాలను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. అపాయింట్‌మెంట్లలో అవినీతి జరగకుండా నిజాయితీగా రిక్రూట్‌మెంట్ జరిగేలా చూస్తామన్నారు. కార్మికులు తూప్రాన్‌కు వెళ్లి వచ్చేందుకు మంచి కండీషన్ గల బస్సు సౌకర్యం కల్పిస్తామని, కంపెనీలో మంచి క్యాంటీన్, వైద్య సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. ప్రస్తుతం ఉన్న యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి కంపెనీని తూప్రాన్‌కు తరలించి కార్మికులకు అన్యాయం చేశారని సంజీవరెడ్డి ఆరోపించారు. ఈ నెల 28న జరిగే ఎన్నికల్లో కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని త్రాసు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సంజీవరెడ్డి గ్రూప్ కార్మిక నాయకులు కె.రాజు, ఎల్.డి.పాల్, శ్రీనివాస్‌యాదవ్, నాగేష్, సమద్, జానకిరాం, కృష్ణారెడ్డి, డి.శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు ఆర్.డి.చంద్రశేఖర్, విజయ్‌కుమార్‌యాదవ్, ఎన్.అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు


వేడుకల్లో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ఆటపాట





బాబునాయుడు నగర్‌లో..



- అర్ధరాత్రి నుంచే చర్చిలకు క్యూ
- ప్రత్యేక ప్రార్థనలు..క్రీస్తు సందేశాలు ఇచ్చిన పాస్టర్లు

ఖైరతాబాద్ నియోజకవర్గవ్యాప్తంగా బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచే చర్చిలకు క్యూ కట్టారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్–9 లోని సెయింట్ ఆల్ఫోన్సస్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తెలుగు, ఇంగ్లిష్, మళయాళీ ప్రత్యేక సర్వీసులను నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్–12లోని షారోన్‌ఫుల్ గాస్పెల్ చర్చిలో పాస్టర్ బిషప్ జాన్ క్రీస్తు సందేశం అందించారు. అలాగే క్రీస్తు జననాన్ని వివరించే ప్రదర్శించిన నాటిక ఆకట్టుకున్నది. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మిలంద్, బోడ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని పటేల్‌నగర్ చర్చిలో జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్లడ వెంకటేశ్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేశారు. ఇక్కడ పాస్టర్ కృపారావు క్రీస్తు సందేశం ఇచ్చారు.

–ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ జోన్ల బృందం


షారోన్ చర్చిలో క్రీస్తు సందేశం ఇస్తున్న బిషప్ జాన్


బంజారాహిల్స్ రోడ్ నం.9 లోని సెయింట్ ఆల్ఫోన్సస్ చర్చిలో..


ఎమ్మెల్యే కాలనీ షారోన్ చర్చిలో ..




బంజారాహిల్స్‌లో ప్రార్థనల్లో నార్త్ ఈస్ట్ రాష్ట్రాల యువతులు


పటేల్‌నగర్ చర్చిలో కార్పొరేటర్ వెంకటేశ్


సంస్కార్ స్కూల్ చిన్నారులు..


స్వరాజ్‌నగర్‌లో..


పీపుల్స్ ప్లాజాలో శాంటాక్లాస్ గిఫ్ట్‌ల పంపిణీ..


లెమెన్స్ ఎవాంజెలికల్ ఫెలోషిప్ చర్చిలో..

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో మ్యాథ్స్ డే

ఫిలింనగర్: ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజం జయంతిని పురస్కరించుకుని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం మ్యాథ్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణిత శాస్త్రానికి సంబంధించిన స్కిట్స్, క్విజ్, ఫజిల్స్ వంటివి ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ కాంచనవల్లి మాట్లాడుతూ గణిత శాస్త్ర జ్ఞానాన్ని పెంపొందించేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

వర్ధంతికి రండి


సీఎంకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న విజయారెడ్డి

బంజారాహిల్స్: సీఎం రేవంత్‌రెడ్డిని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 28న ఖైరతాబాద్ చౌరస్తాలో నిర్వహించనున్న పీజేఆర్ 17వ వర్ధంతికి రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు.

బీసీల రిజర్వేషన్ల పెంపు హర్షణీయం

లిబర్టీ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. బుధవారం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో స్థానిక సంస్థల్లో బీసీలకు కేవలం 20 శాతం రిజర్వేషన్లు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర పంచాయతీరాజ్ సవరణ బిల్లు 2024 ఆమోదించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రభాకర్, మిగితా మంత్రివర్గ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహాపడి పూజ


గురుస్వామి చినబాబును సన్మానిస్తున్న బస్తీ నేతలు

శ్రీనగర్‌కాలనీ: ఎల్లారెడ్డిగూడలో గురుస్వామి చినబాబు ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్ప స్వామి మహా పడి పూజను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామిని అంబేద్కర్‌నగర్ బస్తీవాసులు సన్మానించారు. కార్యక్రమంలో నేతలు సోనూ, మారుతి, బస్తీ పెద్దలు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక


శివచరణ్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నేతలు

కాచిగూడ: యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన జక్కిడి శివచరణ్ రెడ్డిని యూత్ కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిస్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతినిధులు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. శివచరణ్ రెడ్డి నాయకత్వంలో యూత్ కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతుందని అనిస్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. హిమాయత్ నగర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అభిషేక్ రెడ్డి, కార్యదర్శి శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆర్ఆర్‌సీ గ్రౌండ్‌లో పోలీస్ క్రికెట్ టోర్నమెంట్

అడ్డగుట్ట: సికింద్రాబాద్‌లోని ఆర్ఆర్‌సీ గ్రౌండ్‌లో శుక్రవారం హైదరాబాద్ సిటీ పోలీస్(నార్త్‌జోన్) క్రికెట్ టోర్నమెంట్ జరగనున్నది. నార్త్‌జోన్ పరిధిలోని నాలుగు డివిజన్లలో ఉన్న 11 పోలీస్‌స్టేషన్ల నుంచి నాలుగు జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయి. నాలుగు డివిజన్లకు రెండు మ్యాచ్‌లు జరుగుతాయని, అందులో గెలిచిన రెండు టీమ్‌లు ఫైనల్ ఆడుతాయి. ఒకే రోజు మూడు మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు నార్త్‌జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

లిబర్టీ: ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వి.కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. 2021 నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లాలంటే ఆటంకాలు ఎదురవుతున్నాయన్నారు. ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని కళాశాలల యాజమాన్యాలు పీచి పెడుతున్నాయని ఫలితంగా విద్య పూర్తయిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మనుస్మృతి గ్రంథాన్ని దహనం చేసిన పీడీఎస్‌యూ నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీ ఎదుట బుధవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు మనుస్మృతి గ్రంథాన్ని దహనం చేశారు. దేశంలో కులాల పుట్టుకకు కారణం మనుస్మృతి అని పీడీఎస్‌యూ నాయకులు పేర్కొన్నారు. నాడు మనువాదులకు వ్యతిరేకంగా అంబేడ్కర్ పోరాడగా నేడు వారి వారసులే పాలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో అధికారంలో కొనసాగుతున్న బీజేపీ ప్రభుత్వం దేశాన్ని పాలించేందుకు రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని తీసుకురావాలని యత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ గ్రేటర్ అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం శ్యామ్, కె.శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు సంతోష్, ఓయూ నేతలు గౌతం, సాయి, మధు, మహేష్, పవన్, వినయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

బౌద్ధనగర్: అంబానగర్‌లోని పోచమ్మ మైసమ్మ ఆలయ 5వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన కార్పొరేటర్ కంది శైలజ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం, బస్తీనాయకులు కార్పొరేటర్‌ను ఘనంగా సత్కరించారు. బస్తీ ఇన్‌చార్జి భాగ్య, వెంకటస్వామి పాల్గొన్నారు.

టీజీసీటీఏ ఓయూ కార్యదర్శిగా రాకేష్ భవాని

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ గవర్నమెంట్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ (టీజీసీటీఏ) ఉస్మానియా యూనివర్సిటీ సెక్రటరీగా కవి, రచయిత, గాయకులు డాక్టర్ చింతల రాకేష్ భవాని వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. ఇటీవల డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రాజేంద్రకుమార్, డాక్టర్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డాక్టర్ చింతల రాకేష్‌భవాని ప్రస్తుతం ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఆయన ఇటీవల 2024 సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక పురస్కారాన్ని అందుకున్నారు. ప్రభుత్వ సీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకుడిగా పాత పెన్షన్ సాధనకు కృషిచేస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాకేష్ భవాని మాట్లాడుతూ... ఈ ఎన్నిక తన బాధ్యతను మరింత పెంచిందని, తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

వాజ్‌పేయి శత జయంతి వేడుకలు


నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని మహనీయుల విగ్రహాల వద్ద మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి వేడుకలను బీజేపీ శ్రేణులు బుధవారం ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి హాజరై మాట్లాడుతూ వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయ సాధనకు నాయకులు, యువత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బంగారు శృతి, పెద్దిరెడ్డి, కాడిగారి భోజరెడ్డి, గడ్డం వెంకట్‌స్వామి, కొత్త నీరజ, వల్లెపు శంకర్, దండుగుల శ్రీనివాస్, కస్తూరి మహిపాల్‌రెడ్డి, గందె అరుణ్‌కుమార్, ముద్దంగుల శ్రీనివాస్, భీమయ్య పాల్గొన్నారు.

కేన్సర్ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ

బంజారాహిల్స్: మాజీ ప్రధాని వాజ్‌పేయి శత జయంతి వేడుకల్లో భాగంగా బంజారాహిల్స్‌లోని కేన్సర్ ఆస్పత్రిలో బాధిత చిన్నారులు, రోగులకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బుధవారం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో ఎన్నో సంస్కరణలు చేపట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి స్థానిక నేతలు మేచినేని శ్రీనివాసరావు, బంగారం చంద్రశేఖర్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

నిజాయితీకి నిలువుదట్టం..

లిబర్టీ: నిబద్ధతకు, నిజాయితీకి నిలువుదట్టం వాజ్‌పేయి అని లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పీవీ రాజేశ్వరరావు అన్నారు. వాజ్‌పేయి జయంతి సభను పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. సమావేశంలో పీవీ శ్రీనివాసరావు, సంకీర్త తదితరులు పాల్గొన్నారు.

రహమత్‌నగర్‌లో ..

రహమత్‌నగర్ : రాష్ట్ర బీజేపీ నాయకుడు జెల్లపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రహమత్‌నగర్ కూడలిలో నిర్వహించిన జయంతి వేడుకలకు జూబ్లీహిల్స్ నాయకుడు లంకల దీపక్ రెడ్డి హాజరయ్యారు. నాయకులు కుంభాల గంగరాజు, అట్లూరి రామకృష్ణ, సత్యనారాయణ, ప్రేమ్, శివరాజ్ మల్లయ్య ,డివిజన్ అధ్యక్షుడు కనకరాజు, కిట్టు తదితరులు పాల్గొన్నారు.


కేన్సర్ బాధిత చిన్నారులకు పండ్లు పంపిణీ చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


వేడుకల్లో బీజేపీ నాయకులు

నేడు విగ్రహాల ప్రతిష్ఠ

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ శాస్త్రినగర్‌లోని శ్రీ శివ ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం నాగదేవతల, నందీశ్వర పునఃప్రతిష్ఠ, నూతన దీపస్తంభ ప్రతిష్ఠను నిర్వహించనున్నట్లు చింతపల్లి వంశీరెడ్డి, చింతపల్లి శోభారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేద పండితులతో ప్రత్యేక పూజలతో భక్తుల సమక్షంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఇండియన్ ప్రజా కాంగ్రెస్ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి పేర్కొన్నారు.

పీజీ కాలేజీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సాక్షి సిటీ బ్యూరో: కాలేజీ రోజులను గుర్తు చేసుకుంటూ మురిసిపోయారు. నాటి స్నేహమే అన్నింటికన్నా విలువైనది అంటూ నెమరేసుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని సికింద్రాబాద్ పీజీ కాలేజీలో చదువుకున్న పూర్వ విద్యార్థులు కర్మాన్‌ఘాట్‌లోని గ్రాండ్ హవేలీలో సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలు జరుపుకున్నారు. అంతా ఒక చోట చేరి, పాతికేళ్ల జీవనంలో వచ్చిన మార్పుచేర్పులను, స్నేహితులతో పంచుకున్నారు. అప్పట్లో ఉస్మానియా హాస్టల్ జీవనంలో స్నేహితులతో గడిచిన రోజులను గుర్తు చేసుకున్నారు. జీవన ప్రయాణంలో సమస్యలు ఎదురైనప్పుడు అండగా నిలిచిన స్నేహపు గొప్పతనాన్ని పంచుకున్నారు. తెలుగు, హిస్టరీ, మ్యాథ్స్, పొలిటికల్ సైన్స్.. విభాగాలకు చెందిన పూర్వ విద్యార్థులు తెలుగు రాష్ట్రాల్లో భిన్న రంగాల్లో తాము చేస్తున్న కృషిని అనుభవాలను వివరించారు. అనంతరం విందు వినోదాలతో..ఆట, పాటలతో ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన సతీశ్ శ్రీనివాస్‌రెడ్డి, చంద్రకుమార్‌ను అందరూ అభినందించారు.

11న ప్రకృతి ఒడిలో సంక్రాంతి సంబరాలు


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ రైతు నాగరత్నం నాయుడు తదితరులు

బంజారాహిల్స్: ప్రకృతిని కాపాడాలి, ప్రకృతి విలువ, మొక్కల విలువను నగరవాసులకు తెలియజేసేందుకు ఈసారి సంక్రాంతి వేడుకలను తన వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించనున్నట్లు ప్రముఖ రైతు నాగరత్నం నాయుడు తెలిపారు. జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అందుకు సంబంధించిన కరపత్రాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామోజీ ఫిలిం సిటీ సమీపంలోని దైరా గ్రామంలో జనవరి 11వ తేదీన సంబరాలు నిర్వహిస్తామన్నారు. పాల్గొనే వారికి కుండల తయారీ, ముగ్గుల పోటీలు, టగ్ ఆఫ్ వార్ వంటి వినోదాత్మక క్రీడలు కూడా ఉంటాయన్నారు. అదేవిధంగా బీడు భూమిలో తాను ఎన్నో ప్రయోగాలు చేసిన అద్భుతాలను సైతం నగరవాసులకు పరిచయం చేస్తానన్నారు. వ్యవసాయ రంగంలో తాను చేసిన ప్రయోగాలకు ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల నుంచి 437 అవార్డులు లభించినట్లు తెలిపారు. హాజరయ్యే వారు 7032691531 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాంబాబు పొన్నాన తదితరులు పాల్గొన్నారు.

వైద్యం పొంది..బిల్లు ఎగ్గొట్టి..

- న్యూసెన్స్ చేసిన మహిళపై కేసు

బంజారాహిల్స్: చికిత్స చేయించుకున్న అనంతరం బిల్లు చెల్లించాలని అడిగిన ఓ క్లినిక్‌లో మహిళ దౌర్జన్యం చేసి అద్దాలు ధ్వంసం చేసి బెదిరింపులకు పాల్పడిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–1లోని సీవీఆర్ న్యూస్ బిల్డింగ్ పక్కన వీవీసీ పార్క్ వ్యూ కాంప్లెక్స్‌లో గల డాక్టర్ జమునా పాయిస్ స్కిన్ ల్యాబ్‌కు ఈ నెల 23న పర్వీన్‌బేగం తన కూతురు తన్వీర్ తపస్సుం (21)ను పీల్ ట్రీట్‌మెంట్ కోసం తీసుకువచ్చింది. చికిత్సకు రూ 2.19 లక్షల ఖర్చు అవుతుందని ఆపరేషన్ హెడ్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎస్.హర్షవర్ధిని చెప్పింది. దీంతో పర్వీన్‌బేగం రూ.లక్ష చెల్లించి వెళ్లిపోయింది. సాయంత్రం 6 గంటలకు చికిత్స పూర్తయిన తర్వాత నిర్వాహకులు పర్వీన్‌బేగంకు ఫోన్ చేసి మిగిలిన రూ. 1.19 లక్షల బిల్లు చెల్లించాలని కోరారు. దీంతో దురుద్దేశపూర్వకంగా పర్వీన్‌బేగం క్లినిక్‌లో కంప్యూటర్లు, అద్దాలు ధ్వంసం చేసింది. అంతేగాకుండా అద్దం ముక్కను పట్టుకుని పొడిచేస్తానంటూ బెదిరించింది. డాక్టర్ హర్షవర్ధిని ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. త్వరలో తన కూతురు పెళ్లి ఉండడంతో పీల్ ట్రీట్‌మెంట్ చేయించినట్లు నిర్వాహకులు తెలిపారు.

పీల్ చికిత్స అంటే..

కెమికల్ పీల్ ట్రీట్‌మెంట్ అనేది నాన్–ఇన్వాసివ్ ప్రక్రియ. ఇది చర్మం యొక్క దెబ్బతిన్న బయట పొరలను ఎక్స్‌ఫోలియేట్ చేసేందుకు, తొలగించేందుకు రసాయన ద్రావణాన్ని ఉపయోగిస్తారు. ఈ ప్రక్రియ కొత్త చర్మ కణాల ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. ఫలితంగా మృదువైన, స్పష్టమైన, మరింత యవ్వనంగా కనిపిస్తారు.

ఉమ్రాకు బయలుదేరిన యాత్రికులు

శంషాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఏభై మంది యాత్రికులు బుధవారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఉమ్రా యాత్రకు బయలుదేరారు. అల్ మిజాన్ సంస్థ ఆధ్వర్యంలో బయలుదేరిన ఈ యాత్రికులను వారి కుటుంబసభ్యులు, బంధువులు పూలమాలలతో సత్కరించారు. యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని తిరిగి రావాలంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్రా యాత్రను సజావుగా పర్యవేక్షించేందుకు కృషి చేస్తున్నామని నిర్వాహకులు ఫయాజ్ అలీ తెలిపారు.





పరిశుభ్రమైన వాటర్ కోసం యువీ



లిక్విడ్ వేస్ట్‌ను బయోగ్యాస్‌గా మార్చే విధానం



కోళ్ల నుంచి వచ్చే వ్యర్థాల తొలగింపు ఇలా..

పోర్టబుల్ స్లాటర్‌హౌస్‌కు శ్రీకారం

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని చెంగిచర్లలో ఉన్న జాతీయ మాంస పరిశోధనా సంస్థ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సి.రామకృష్ణ పోర్టబుల్ స్లాటర్‌హౌస్ ఆవిష్కరణకు శ్రీకారం చుట్టారు. ఈ ఆవిష్కరణ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉందని పేర్కొన్నారు. మొబైల్ వ్యాన్‌లో బుధవారం డెమో రూపంలో దాని గురించి వివరించారు. 'చికెన్ సెంటర్ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, అనైతికంగా కోళ్లను కోస్తున్నారు. వాటికి బాధ, నొప్పి తెలవకుండా కోయాలి. మిగతా కోళ్లు ఆ దృశ్యాన్ని చూడొద్దు. కోళ్లు అపస్మారక స్థితిలోకి వెళ్లేందుకు కరెంట్ షాక్ ఇచ్చి తరువాత వాటిని కోయాలి'అని ఆయన పేర్కొన్నారు. మాంసాన్ని శుభ్రపర్చేందుకు పరిశుభ్రమైన నీరు వాడాలని, బ్యాక్టీరియా, వైరస్, ప్యారాసైట్స్ లేకుండా చూడాలని, మాంసాన్ని శుభ్రపర్చేందుకు వాటర్ స్ప్రేయర్స్‌ను వాడాలని సూచించారు. చికెన్ సెంటర్ నిర్వాహకులు రాష్ట్ర పొల్యూషన్ బోర్డు అనుమతులు తీసుకోవాలని, ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలు పాటించాలని, స్థానిక సంస్థల నుంచి అనుమతులు తీసుకోవాలని రామకృష్ణ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థలు చికెన్ సెంటర్ నిర్వాహకులకు, మాంస ప్రియులకు అవేర్‌నెస్ కల్పించాలని సూచించారు. పోర్టబుల్ స్లాటర్ హౌస్ పర్యావరణహితంగా ఉంటుందని పేర్కొన్నారు. చికెన్ సెంటర్ నిర్వాహకులకు తమ సెంటర్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తామని ఆయన చెప్పారు.



కోళ్లను కటింగ్ చేస్తున్న ఎలక్ట్రికల్ స్టన్నింగ్

హజ్ యాత్ర ఖర్చులు భారీగా పెంపు

గతేడాది రూ.3 లక్షలు.. వచ్చేఏడాదికి రూ.4.50 లక్షలు


సాక్షి, సిటీబ్యూరో: వచ్చే ఏడాది నుంచి హజ్ యాత్ర మరింత ప్రియం కానుంది. గతేడాదితో పోలిస్తే లక్షన్నర రూపాయల చొప్పున అదనపు భారం పడనుంది. గతేడాది రాష్ట్ర హజ్ కమిటీ రూ.3 లక్షల చొప్పున వసూలు చేయగా, 2025 యాత్ర కోసం రూ. 4.50 లక్షలకు పెంచింది. ప్రైవేట్ టూర్ ఆపరేటర్లు రూ. 8 లక్షలకు పెంచారు. ఖర్చులు విపరీతంగా పెరగడంతో యాత్రికులకు హజ్ యాత్ర పట్ల ఆసక్తి తగ్గింది. దీంతో 2025 హజ్ యాత్రకు రాష్ట్రవ్యాప్తంగా కేవలం 8,500 దరఖాస్తులే వచ్చాయి. రూ. 3.5 లక్షల ఖర్చు అవుతోందని కేంద్ర హజ్ కమిటీ నిర్ధారించగా, రెండు నెలల నుంచి రూ.1.10 లక్షలు అదనంగా వసూలు చేశారు. మళ్లీ రూ.10 వేలు కట్టాలని మెసెజ్‌లు పంపిస్తున్నారని, యాత్రకు వెళ్లే వరకు ఎంత డబ్బు కట్టాల్సి వస్తుందోనని యాత్రికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో విమాన టికెట్, సౌదీలో వసతులు, గైడ్, ఖుర్బానీ, అక్కడి ట్రాన్స్‌పోర్ట్ అంతా కలుపుకొని రూ.3 లక్షల ఖర్చు అయ్యేది. రాష్ట్ర హజ్ కమిటీ ద్వారా యాత్రకు వెళ్లితే ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందనేది ప్రచారం మాత్రమేనని, వాస్తవం అందుకు విరుద్ధంగా ఉందని యాత్రికులు అంటున్నారు. ఇప్పటికైనా ఖర్చులను తగ్గించి ప్రభుత్వమే వాటిని భరించాలని కోరుతున్నారు. ప్రైవేట్ ఆపరేటర్లపై హజ్ కమిటీ కానీ, రాష్ట్ర ప్రభుత్వంకానీ నిఘా పెట్టడంలేదు. అడ్డగోలుగా డబ్బులు వసూలు చేయకుండా నియంత్రించాలని కోరుతున్నారు.

జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



బంజారాహిల్స్: ది జర్నలిస్ట్స్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ నూతన కార్యవర్గం బుధవారం జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ కాలనీలోని సొసైటీ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేసింది. ఈ నెల 18వ తేదీన సొసైటీ కార్యవర్గ ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడిగా బ్రాహ్మండభేరి గోపరాజు, ఉపాధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, సెక్రటరీగా మిక్కిలినేని రవీంద్రబాబు, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ చల్లా భాగ్యలక్ష్మీ, ట్రెజరర్‌గా భీమగాని మహేశ్వర్, డైరెక్టర్లుగా డి.కమలాకరాచార్య, డి.వెంకటాచారి, ఎంఎ స్‌హెచ్ హష్మీ, స్వేచ్ఛా ఓటర్కర్‌లు ప్రమాణస్వీకారం చేశారు.

సృజనాత్మకతకు కళలు ఆధారం



నాట్య గురువును సన్మానిస్తున్న ఆనందాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: సృజనాత్మకతకు కళలు ఆధారమని ప్రముఖ సంపాదకుడు కె.ఆనందాచారి అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో శ్రీ మయూరి నృత్యాలయ సంస్థ ఆధ్వర్యంలో 'నాట్యమాల తోరణం–సంగీత నృత్యోత్సవం'పేరిట నృత్య ప్రదర్శనలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతం, కళలు మనల్ని ఉన్నతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దుతాయని పేర్కొన్నారు. మానవత్వంతో ఎదగాలంటే కళల్లో ప్రావీణ్యం ఉండాలని సూచించారు. అనంతరం పలువురు నాట్య గురువులను సత్కరించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ మహ్మద్ ఆజంఖాన్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు మెరుగు సునీత, నిర్వాహకులు ఆర్ఎస్ఎస్ రాంకుమార్, రాజనాల శ్రీదేవి, నందిత తదితరులు పాల్గొన్నారు.

అన్ని అత్యవసర సేవలకు 112

'100', '101', '108'లకు బదులుగా...

ఒకే గూటి కిందికి అన్ని రకాల సేవలు

త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం

దేశవ్యాప్తంగా పోలీసు, మెడికల్, ఫైర్.. ఇలా అత్యవసర సేవలన్నీ ఒకే గూటి నుంచి అందనున్నాయి. దీనికోసం కేంద్ర హోంమంత్రిత్వ శాఖ(ఎంహెచ్ఏ) నేషనల్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిస్టం (ఎన్ఈఆర్ఎస్) పేరుతో మైక్రో మిషన్‌లో భాగంగా చేపట్టింది. ఈ ప్రాజెక్టు కోసం '112'టోల్ ఫ్రీ నంబర్‌ను కేటాయించింది. ఇప్పటికే రాష్ట్రాల్లో అమలులో ఉన్న 100, 101, 108 తదితర ఎమర్జెన్సీ నెంబర్లను దీని పరిధిలోకి తీసుకురానుంది. అయితే సైబర్ క్రైంహెల్ప్‌లైన్ 1930ను ఇందులో చేర్చే విషయమై ఇంకా నిర్ణయం తీసుకోలేదు.

–సాక్షి, సిటీబ్యూరో

టీజీ సీసీసీ కేంద్రంగా సాగనున్న కార్యకలాపాలు

సైబర్ హెల్ప్‌లైన్ 1930 చేర్చడంపై ఇంకా రాని స్పష్టత

ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో నిర్వహణ...

ఈ కొత్త నంబర్‌ను ప్రవేశపెడుతున్న ఎంహెచ్ఏ ఇప్పటికే రాష్ట్రాలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. జాతీయ స్థాయిలో ఈ వ్యవస్థ ఏర్పాటు అవుతున్నప్పటికీ బాధితులకు ఇబ్బంది రాకుండా రాష్ట్రాల్లో అమలు కానుంది. రాష్ట్ర పోలీసు విభాగం సైతం కొత్త నంబర్‌పై ప్రచారం చేస్తోంది. దేశవ్యాప్తంగా 36 చోట్ల 24 గంటలూ నిర్విరామంగా పని చేసే కంట్రోల్ రూమ్ తరహాలో 112 కాల్ సెంటర్లను కేంద్రం ఏర్పాటు చేసింది. డయల్–112 కాల్ సెంటర్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీజీ సీసీసీ) నుంచి కార్యకలాపాలు సాగించనుంది. దీనిని త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించడానికి పోలీసు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

పది రకాలుగా సంప్రదించే చాన్స్...

విపత్కర పరిస్థితుల్లో ఉన్న మహిళలుసహా ఇబ్బందులు, సమస్యల్లో ఉన్న బాధితులు మొత్తం తొమ్మిది రకాలుగా ఈ '112'కాల్ సెంటర్‌లో సహాయం కోరేలా ఏర్పాటు చేస్తున్నారు. ల్యాండ్ లైన్, సెల్‌ఫోన్ ద్వారా కాల్స్, ఎస్సెమ్మెస్, ఈ–మెయిల్, చాట్ బోట్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్స్‌లో ఏర్పాటు చేసే ప్యానిక్ బటన్, వాయిస్ ఓవర్ ఇంటర్‌నెట్ ప్రొటోకాల్, ప్రత్యేకంగా అందించే మొబైల్ యాప్స్, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ) ద్వారా కంట్రోల్‌రూమ్‌కు సమాచారం ఇచ్చేలా రూపుదిద్దుతున్నారు. వీటికి అదనంగా మరో విధానంలోనూ '112'ను సంప్రదించే అవకాశం హైదరాబాద్‌వాసులకు ఉంటుంది. ఇప్పటికే నగరంలో అనేక చోట్ల ప్యానిక్ పోల్స్ ఏర్పాటు చేశారు. జంక్షన్లలో ఉండే వీటికి ఉన్న ఫోన్, వీడియో కెమెరా ద్వారా బాధితులు కంట్రోల్ రూమ్‌ను సంప్రదించి సహాయం పొందవచ్చు.

ఆటోమేటిక్‌గా బాధితుల ప్రాంతం గుర్తింపు

అత్యవసర సహాయం అవసరమైన బాధితులు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి సహాయం కోరుతారే తప్ప, అన్ని సందర్భాల్లో వారి చిరునామాతోసహా మరే ఇతర వివరాలు వివరించే స్థితిలో ఉండరు. ఈ నేపథ్యంలోనే కంట్రోల్‌రూమ్‌కు కాల్ రాగానే వెంటనే అది ఏ ప్రాంతం నుంచి వస్తోందనే విషయాన్ని సాంకేతికంగా గుర్తించేందుకు రాష్ట్ర పోలీసు శాఖ మరింత అత్యాధునికమైన పరిజ్ఞానం సమకూర్చనుంది. ఎన్ఈఆర్ఎస్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే జీపీఎస్ పరిజ్ఞానంతో కూడిన వీడియో వాల్స్ కంట్రోల్ రూమ్స్‌లో ఉంటాయి. బాధితులు ఏ ప్రాంతం నుంచి ఫిర్యాదు చేస్తున్నారనే దానిని తక్షణమే దీని ద్వారా గుర్తించే అవకాశం ఉంటుంది. సమాచారం అందగానే ఎంత తక్కువ సమయంలో పోలీసులు స్పందిస్తే బాధితులకు అంత ఎక్కువ ఊరట ఉంటుంది. ఈ రెస్పాన్స్ టైమ్ తగ్గించేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా సమకూరుస్తున్నారు.

ఎన్ఈఆర్ఎస్ వ్యవస్థ కేంద్రం, రాష్ట్రాల ఉమ్మడి భాగస్వామ్యంతో పనిచేయనుంది. మౌలిక వసతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని కేంద్రం అందిస్తుండగా, సిబ్బందిని ఏర్పాటు చేయడంతోపాటు పోలీసులకు అవసరమైన వాహనాలు తదితరాలను సమకూర్చడాన్ని రాష్ట్రం చూసుకుంటుంది. బాధితుల నుంచి ఫోన్ వచ్చినప్పుడు, వైపరీత్యాలు సంభవించినప్పుడు సత్వర స్పందన కోసం పోలీసు విభాగంతోపాటు అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ కార్పొరేషన్లకు ఏకకాలంలో సమాచారం అందేలా ఇంటిగ్రేటెడ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. సైబర్ నేరాల్లో బాధితులకు సహాయం చేయడానికి కేంద్రం ఇప్పటికే 1930 టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇది ఇండియన్ సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) అధీనంలో ఉన్నప్పటికీ, దీనికి సంబంధించిన కంట్రోల్ రూమ్స్ ప్రతి రాష్ట్రంలో ఉన్నాయి. సైబర్ నేరాల్లో ఆర్థికనష్టాలు చాలా ఎక్కువ. ఈ నేపథ్యంలోనే 1930ను సైతం 112లో కలపాలనే వాదన బలంగా వినిపిస్తోంది. అప్పుడే ఫలితాలు పూర్తిస్థాయిలో వస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



పోటీగా పెరుగుతున్న సైబర్ నేరాలు...

సదాలక్ష్మి సేవలు సదా స్మరణీయం



సదాలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జానారెడ్డి

జయంతి ఉత్సవాల్లో వక్తలు

కవాడిగూడ: తెలంగాణ తొలిదశ ఉద్యమకారిణి, మాజీమంత్రి టి.ఎస్.సదాలక్ష్మి సేవలు చిరస్మరణీయమని, ఆమె ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు అన్నారు. ఇందిరాపార్కు చౌరస్తాలో సదాలక్ష్మి విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. బుధవారం సదాలక్ష్మి జయంతి ఉత్సవాల కమిటీ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ వంశతిలక్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో సదాలక్ష్మి 96వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీమంత్రులు కె.జానారెడ్డి, పుష్పలీల, మాజీ ఐఆర్‌టీఎస్ అధికారి భరత్‌భూషణ్, బీఎస్పీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నల్లా సూర్యప్రకాష్, ప్రముఖ కవయిత్రి జూపాక సుభద్ర, బహుజన కవిగాయకుడు చుక్కా రామనర్సయ్య, కిరణ్‌మాదిగ హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వంశతిలక్ మాట్లాడుతూ సదాలక్ష్మి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఇటీవల ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా, తెలంగాణ తొలిదశ ఉద్యమకారిణిగా, ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఆమె చేసిన సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు మేడి రమణ, నంద్రూ నర్సింహారావు, తిరుపతి, కృపాకర్ మాదిగ, గంధం రాములు, గొల్లపల్లి దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు సన్మానం..

ప్రతిభా పాటవాలకు సన్మార్గం

గన్‌ఫౌండ్రీ: ప్రతిభావంతులను సన్మానించుకోవడం వల్ల ప్రతిభాపాటవాల వెతుకులాటకు బాట వేసినట్లు అవుతుందని పద్మభూషణ్ పురస్కార గ్రహీత డాక్టర్ కె.ఐ.వరప్రసాదరెడ్డి అన్నారు. బుధవారం రావు పంగనామముల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ శాస్త్రవేత్త విజయ్‌కుమార్ చాగంటి, ఆధ్యాత్మికవేత్త మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తిలకు రావు పంగనామముల జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికం, సాంకేతిక రంగాలు వంటివి విభిన్న కోణాలు కాదని, అవి ఒకదానికొకటి కొనసాగింపు మాత్రమే అని పేర్కొన్నారు. అనుమానం ఉన్న చోటుకు శాస్త్రవేత్త వస్తే, నమ్మకం ఉన్న చోటుకు ఆధ్యాత్మికవేత్త వస్తారని తెలిపారు. ఒకే వేదికపై ఆధ్యాత్మిక, సాంకేతిక రంగాలకు చెందిన ప్రముఖులను సన్మానించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, రచయిత డాక్టర్ అక్కిరాజు సుందరరామకృష్ణ, సీనియర్ జర్నలిస్టు మా శర్మ, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కాకి ప్రాణాలు కాపాడారు..



యాకుత్‌పురా: అప్పటిదాకా 'కావ్ కావ్'అంటూ కాకి గాలిలో చక్కర్లు కొట్టింది. సేద తీరేందుకు వచ్చి కరెంటు తీగపై వాలింది. కరెంటు తీగకు అల్లుకున్న మాంజాలో కానక చిక్కుకుంది. మెడకు మాంజా చుట్టుకోవడంతో ఎగరలేక విలవిలలాడింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి కాపాడటంతో ఎంచక్కా ఎగురుకుంటూ ఎటో వెళ్లిపోయింది. ఈ సంఘటన ఆదివారం సుల్తాన్ షాహీ వాల్మీకి నగర్‌లో చోటుచేసుకుంది. వాల్మీకి నగర్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ఉన్న విద్యుత్ తీగలకు ఉన్న చైనా మాంజాలో కాకి చిక్కుకుంది. తప్పించుకోవడానికి అటు ఇటు కదిలే క్రమంలో దాని మెడకు మరింతగా బిగుసుకుపోయింది. దీంతో ఎటూ కదల్లేకపోయిన కాకి అరవడం మొదలుపెట్టింది. గమనించిన స్థానికులు విద్యుత్ సిబ్బందికి ఫోన్ చేసి విషయం చెప్పారు. అయితే వారు పట్టించుకోకపోవడంతో మొఘల్‌పురా అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సకాలంలో స్పందించిన అగ్నిమాపక శాఖ అధికారులు వెంటనే ఫైరింజన్ సిబ్బందితో అక్కడి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మాంజాను తొలగించారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న కాకిని కాపాడారు. దీంతో అగ్నిమాపక సిబ్బందిని స్థానికులు అభినందించారు.

కనుక్కున్నారు.. కొనుక్కున్నారు..!

- పెద్దఎత్తున పుస్తకాలను ఖరీదు చేసిన సందర్శకులు
- క్రిస్మస్ రోజు భారీగా తరలివచ్చిన పుస్తకప్రియులు
- అలరించిన ఆవిష్కరణలు, సాంస్కృతిక ప్రదర్శనలు

కవాడిగూడ: ఆవిష్కరణలు.. ప్రసంగాలు.. వర్క్‌షాపులు.. సాంస్కృతిక ప్రదర్శనలు.. ఇలా ఎటు చూసినా కోలాహలమే. జనమే జనం. కిక్కిరిసిన సందర్శకులు.. తరలివచ్చిన పుస్తక ప్రియులు. ఆసక్తికరమైన పుస్తకాల గురించి కనుక్కున్నారు.. ఆకట్టుకున్న వాటిని కొనుక్కున్నారు. ఈ దృశ్యాలు ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న 37వ జాతీయ పుస్తక ప్రదర్శనలో కనిపించాయి. బుధవారం పుస్తక ప్రియులు, సందర్శకులు భారీసంఖ్యలో హాజరయ్యారు. క్రిస్మస్ సెలవుదినం కావడమే దీనికి కారణం. దీంతో బుక్‌ఫెయిర్ ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా తెలంగాణ బలోత్సవం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనిలా ఆర్ట్స్ ఆధ్వర్యంలో క్రాఫ్ట్స్ వర్క్‌షాపు నిర్వహించారు. అనంతరం డాక్టర్ అమరవాది నీరజ ఆధ్వర్యంలో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రగతి హైస్కూల్ విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభను కనబరిచారు.

ఆలోచింప చేసిన 'పుస్తక స్ఫూర్తి'

ఎన్‌టీఆర్ స్టేడియంలోని డాక్టర్ బోయి విజయభారతి వేదికపై 'నేను నచ్చిన, నన్ను ప్రభావితం చేసిన పుస్తకం.. పుస్తక స్ఫూర్తి'కార్యక్రమాన్ని కవయిత్రి శీలాలోలిత ఆధ్యక్షతన నిర్వహించారు. ప్రముఖ వాగ్గేయకారుడు గోరటి వెంకన్న మాట్లాడుతూ 'నేను 10వ తరగతి దాకా పెద్దగా పుస్తకాలు చదవలేదు. విరాట్ అనే నవల నన్ను భాగా ప్రభావితం చేసింది. ఈ నవల నా జీవితంలో అనేక సందర్భాల్లో ఉపయోగపడింది, గెలుపోటములలో నన్ను నేను తరచి చూసుకునేలా చేసింది'అని పేర్కొన్నారు. ప్రసాదమూర్తి, ఆడెపు లక్ష్మిపతి మాట్లాడుతూ 'నేను నచ్చిన పుస్తకాల్లో పెంకుటిల్లు ఒకటి' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రచయితలు సీఏ ప్రసాద్, సునంద, రూప్ కుమార్, బుక్‌ఫెయిర్ అధ్యక్ష కార్యదర్శులు కవియాకూబ్, ఆర్ వాసు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏనుగు నర్సింహారెడ్డి తదితరులు

పలు పుస్తకాల ఆవిష్కరణ

ఎన్‌టీఆర్ స్టేడియంలోని తోపుడు బండి సాదిక్ వేదికపై బుధవారం 'తెలంగాణ తొలితరం కథకులు', 'ఉచ్చల జలధి తరంగా', 'రంగుపూల మొఖాలు'తదితర పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏనుగు నర్సింహారెడ్డి, సీనియర్ జర్నలిస్టు ప్రసేన్, కవి, విమర్శకుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, బషీర్‌బాగ్ లా కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ గుమ్మడి అనురాధ తదితరులు పాల్గొన్నారు.



బుక్ ఫెయిర్‌లో సాంస్కృతిక ప్రదర్శనలు



ఎమ్మెల్సీ గోరటి వెంకన్నను సన్మానిస్తున్న నిర్వాహకులు

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, గురువారం, 26, డిసెంబర్, 2024

- విద్యార్థులకు సరికొత్త అనుభూతి
- ఏడాది పొడవునా ఆహ్వానం
- ఎన్నెన్నో వింతలు, మరెన్నో విశేషాలు




విజ్ఞానం.. విహారం

రాష్ట్రపతి నిలయం చూసొద్దాం రండి

దేశ ప్రథమ పౌరుడు/పౌరురాలి దక్షిణాది అధికారిక నివాసం.. నగరంలో బ్రిటిష్ పాలనకు కేంద్రంగా కొనసాగిన రెసిడెన్సీ భవనం.. వీఐపీలు మినహా సామాన్యులకు ఎలా ఉంటుందో తెలిసేది కాదు. ప్రతి సంవత్సరం కేవలం వారం రోజులు మాత్రమే సామాన్యులకు సందర్శనకు అవకాశం ఉండేది.. కానీ ప్రస్తుత రాష్ట్రపతి ఆదేశాలతో బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం సామాన్యులకు అందుబాటులోకి వచ్చింది. రాష్ట్రపతికి దక్కే రాజభోగాలు, సుగంధ పరిమళాలు వెదజల్లే పూలతోటలు, వందల ఏళ్ల నాటి మర్రి చెట్లు, ఎండ ఆనవాళ్లు కూడా కానరాని పండ్ల తోటలు, మయూరాల కిలకిలారావాలు.. అలనాటి వ్యవసాయానికి కేంద్ర బిందువులైన మోట, మెట్ల బావులు.. గత రాష్ట్రపతులు వాడిన గుర్రపు బగ్గీ, వింటేజ్ బెంజ్ కారు.. ఇలా చెప్పకుంటూ పోతే రాష్ట్రపతి నిలయం విశేషాలు ఎన్నెన్నో.. రాష్ట్రపతి విడిది చేసే ప్రత్యేక గదులు, మీటింగ్ హాల్స్, ప్రత్యేకంగా వంటచేసే కిచెన్, కిచెన్ నుంచి రాష్ట్రపతి ప్రధాన విడిది భవనానికి ఆహారాన్ని తీసుకెళ్లే సొరంగ మార్గం.. వాటితో పాటు ప్రతి శని, ఆదివారాల్లో సాయంత్రం వేళలో సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకోనున్నాయి. ముఖ్యంగా విద్యార్థులకు విజ్ఞానంతో పాటు విహార అనుభూతి కలగనుంది. రాష్ట్రపతి శీతాకాల విడిది కోసం సామాన్యుల సందర్శనకు తాత్కాలిక బ్రేక్ పడగా, మళ్లీ అనుమతిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి నిలయంపై ప్రత్యేక కథనం..

– కంటోన్మెంట్





మూడో అధికారిక నివాసం..

భారత రాష్ట్రపతి అధికారిక నివాసమైన ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌తో పాటు మరో రెండు అధికారిక నివాసాల్లో ఒకటి షిమ్లాలోని 'ది రిట్రీట్ బిల్డింగ్' కాగా సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని 'రాష్ట్రపతి నిలయం' మూడోది. ఈ భవనం నిజాం నజీర్ ఉద్–దౌలా హయాంలో 1860లో నిర్మితమైంది. బొల్లారంలోని 97 ఎకరాల సువిశాల స్థలంలో 2,500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్రధాన భవనం ఉంటుంది. కంటోన్మెంట్ పరిధిలోని చీఫ్ మిలటరీ ఆఫీసర్ నివాస స్థలంగా వినియోగించే ఈ భవనాన్ని రెసిడెన్సీ హౌజ్‌గా వ్యవహరించేవారు. 1948లో హైదరాబాద్ సంస్థానం విలీనం అనంతరం రాష్ట్రపతి దక్షిణాది తాత్కాలిక నివాసంగా మారింది.

ఏడాది పొడవునా అనుమతి

గతంలో రాష్ట్రపతి శీతాకాల విడిది అనంతరం రెండు లేదా మూడు వారాల పాటు మాత్రమే సాధారణ పౌరులకు రాష్ట్రపతి నిలయం సందర్శనకు అనుమతి ఉండేది. ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హయాంలో నిత్యం ప్రజల సందర్శనకు అవకాశం కల్పించారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, వారాంతాల్లో రాత్రి 7 గంటల వరకు సందర్శకులకు అనుమతి ఇస్తున్నారు. గతేడాది మార్చి నుంచి ఇప్పటి వరకు సుమారు 3 లక్షల మంది రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించారు. విద్యార్థుల సందర్శనకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నారు. ఈ నెల 29 నుంచి రాష్ట్రపతి నిలయంలో ఉద్యాన్ ఉత్సవ్ పేరిట పక్షం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.





20 గదులు, సొరంగ మార్గం..

రాష్ట్రపతి నిలయంలోని ప్రధాన భవనం ప్రెసిడెంట్స్ వింగ్, ఫ్యామిలీ వింగ్‌తో పాటు ఏడీసీ వింగ్ పేరిట మూడు విభాగాలుగా ఉంటుంది. ఇందులో డైనింగ్ హాలు, దర్బార్ హాలు, మార్నింగ్ రూమ్, సినిమాల్ సహా మొత్తం 11 గదులుంటాయి. ప్రధాన భవనానికి కొంత దూరంలో ఉండే కిచెన్ ద్వారా ఆహారాన్ని డైనింగ్ హాలుకు తీసుకొచ్చేందుకు ప్రత్యేక సొరంగ మార్గం ఉంది. రాష్ట్రపతి ప్రధాన నివాస భవనంతో పాటు మరో 150 మంది వరకు సిబ్బంది ఉండేందుకు ప్రత్యేక వసతి సముదాయం ఉంది. రకరకాల పూలమొక్కలతో పాటు పండ్ల తోటలు ఉన్నాయి. 116 రకాల సుగంధ, ఔషధ మొక్కలతో కూడిన ప్రత్యేక హెర్బల్ గార్డెన్ ఈ ఆవరణలో ఉంది. మూడు మంచినీటి బావులు కూడా ఉన్నాయి.



- మరుగున పడిన కళలకు హంగులు
- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో తోలుబొమ్మల ప్రదర్శన
- సంప్రదాయ కళాకారులకు ఉపాధి కల్పిస్తున్న మిమిరాకీ
- ఔత్సాహిక కళాకారుల కోసం వర్క్‌షాప్‌ల నిర్వహణ

మిమిరాకిల్!





సాక్షి,సిటీబ్యూరో: శంషాబాద్ ఎయిర్‌పోర్టులోకి ప్రవేశించగానే.. వేదికపై కొన్ని బ్లాకులను పేర్చారు. వాటిపై రంగురంగుల బొమ్మలను ప్రదర్శించారు. చూడగానే అరె భలే ఉందనేలా అద్భుతంగా అమర్చారు. ఇంతకీ బ్లాకులపై ఏముందా అని దగ్గరికి వెళ్లి చూస్తే అందమైన తోలు బొమ్మలను అలా బ్లాకుల రూపంలో పెట్టారు. ఇలా హైదరాబాద్‌లో మాత్రమే కాదు దేశంలోని అనేక విమానాశ్రయాల్లో ఇలా ఎన్నో కళా ఖండాలను చూడొచ్చు. మిమిరాకీ అనే సంస్థ మరుగున పడుతున్న సంప్రదాయ కళలకు ఆధునికత జోడించి మిరాకిల్స్ సృష్టిస్తోంది. మరుగునపడ్డ ఎన్నో కళలను వెలికి తీసి, అలాంటి కళాకారులను వెలుగులోకి తెచ్చి ఎంతో మందికి ఉపాధి కల్పించేందుకు ప్రయత్నిస్తోంది ఆ సంస్థ.

ఇంటింటికీ కళాఖండం..

సంప్రదాయ కళాకారులు తమ కళను ప్రపంచానికి పరిచయం చేసుకునేందుకు సరికొత్త వేదిక అందించేందుకు మిమిరాకీ అనే సంస్థను ముంబైకి చెందిన యోషాగుప్తా ప్రారంభించారు. అపురూపమైన కళారూపాలు ప్రతి ఒక్కరి ఇంట్లో ఉండేలా చేయడమే లక్ష్యంగా ఈ సంస్థ పనిచేస్తోంది. దీంతో వందలాది మంది కళాకారులకు జీవనోపాధి కల్పిస్తోంది. లైవ్ ఆర్ట్‌షాప్స్ నిర్వహిస్తూ ఔత్సాహిక కళాకారులకు మెళకువలు నేర్పించడమే కాకుండా నేర్చుకోవాలనే తపన ఉన్న వారికి కూడా ఈ కళను పరిచయం చేస్తోంది. ఆన్‌లైన్ క్లాసులు కూడా అందజేస్తోంది.

ఎన్నో కళలకు వేదిక

ఎంతో వైవిధ్యమైన కళలకు పుట్టినిల్లు మనదేశం. ఎన్నో కళలు, ఎందరో కళాకారులు గుర్తింపునకు నోచుకోకుండా కనుమరుగైన వారు ఉన్నారు. అయితే వారందరినీ మరోసారి ప్రపంచం దృష్టికి తీసుకొచ్చి వారి కళలను పరిచయం చేస్తోంది. తెలంగాణ చేర్యాల పెయింటింగ్స్, ఆంధ్రప్రదేశ్‌లోని కలంకారి పెయింటింగ్స్, గోండు పెయింటింగ్స్, బిహార్ మధుబని, కేరళ మ్యూరల్స్, వర్లీ, పిచ్వాయి, ఒడిశాలోని పట్టచిత్ర, గుజరాత్‌లోని లిప్పన్, రాజస్థాన్ ఫాద్, బిహార్ సాహ్రాయి, పశ్చిమబెంగాల్ కాళీ ఘాట్ ఇలా ఎన్నో రకాల కళాత్మక రూపాలకు, ఎంతోమంది కళాకారులకు వేదికగా నిలుస్తూ కల్చరల్ ఎంట్రప్రెన్యూర్‌షిప్‌ను కొత్త పుంతలు తొక్కిస్తోంది.

- ఓయో రూమ్స్ బుకింగ్స్‌లో సిటీకి అగ్రస్థానం
- మన తర్వాతే మిగిలిన మెట్రో నగరాలు
- విశ్రాంతి, వ్యాపారం కోసమూ నగరానికి..
- ట్రావెలోపీడియా 2024 నివేదికలో వెల్లడి

మళ్లీ మనమే..



సాక్షి, సిటీబ్యూరో: రాకపోకలతో కిక్కిరిసిపోతున్న మన హైదరాబాద్.. హోటల్ బుకింగ్స్‌లోనూ టాప్‌గా నిలుస్తోంది. మెట్రో నగరాలన్నింటి కన్నా మిన్నగా మన నగరం అత్యధిక బుకింగ్స్ సాధిస్తోంది. ఈ విషయాన్ని లీజ్, ఫ్రాంఛైజీ మోడల్స్‌లో గదులు అద్దెకు ఇచ్చే ప్రముఖ హాస్పిటాలిటీ సంస్థ ఓయో తాజాగా విడుదల చేసిన ట్రావెలోపీడియా 2024' వార్షిక నివేదిక వెల్లడిస్తోంది. నివేదిక వెల్లడించిన మరికొన్ని ఆసక్తికరమైన విశేషాలు..

వరుసగా రెండో ఏడాదీ మనమే..

గతేడాది కూడా మన నగరం అత్యధికంగా బుకింగ్స్ కలిగిన నగరంగా నిలిచింది. తర్వాత స్థానాల్లో వరుసగా బెంగళూరు, ఢిల్లీ, కోల్‌కతా వంటి నగరాలు బుకింగ్‌లలో అగ్రస్థానాలను పొందగా, విచిత్రంగా ముంబై బుకింగ్స్‌లో దిగజారింది. దీనికి కారణం ముంబైకి వెళ్లే పర్యాటకులు ఆ నగరానికి సమీప ప్రాంతాల్లోని విశ్రాంతికి, విహారానికి అనువుగా ఉండే ప్రదేశాలను ల్లో ఉండేందుకు ఇష్టపడటమేనని తెలుస్తోంది.

ఉత్తరప్రదేశ్ టాప్..

దేశంలోకెల్లా ఉత్తరప్రదేశ్ ప్రయాణానికి అత్యంత ప్రజాదరణ పొందిన రాష్ట్రంగా నిలిచింది. పూరి, వారణాసి, హరిద్వార్ తీర్థయాత్రల రంగానికి నాయకత్వం వహించడంతో, ఆధ్యాత్మిక పర్యాటకం భారత దేశ పర్యాటకానికి ప్రధాన చోదకశక్తిగా ఉందని నివేదిక పేర్కొంది. డియోఘర్, పళని, గోవర్ధన్ వంటి ప్రాంతాలకు వెళ్లే వారి సంఖ్యలో గణనీయమైన మార్పు కనిపించింది. ఇది గతంలో అంతగా తెలియని ఆధ్యాత్మిక ప్రదేశాలపై పెరుగుతున్న ఆసక్తిని తెలియజేస్తోంది.

విహారం.. వ్యాపారం..

విశ్రాంతి, విహారాలతో పాటు వ్యాపార కార్యకలాపాలకు సంబంధించిన ప్రయాణాల్లోనూ హైదరాబాద్ గణనీయమైన పెరుగుదల చూసింది. ప్రయాణికుల సంఖ్యాపరంగా చూస్తే మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక వరుసగా తొలి మూడు స్థానాలు దక్కించుకున్నాయి. బీహార్‌లోని పాట్నా, ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి, కర్ణాటకలోని హుబ్లీ వంటి చిన్న పట్టణాలు ఈ ఏడాది అద్భుతమైన వృద్ధితో బుకింగ్‌లు 48 శాతం పెంచుకున్నాయి. జైపూర్, గోవా, పాండిచ్చేరి, మైసూర్ అగ్ర పర్యాటక కేంద్రాలుగా ఉన్నాయి.



షహర్ కా షాన్ షేర్వానీ



యువతలో పెరుగుతున్న మోజు

- అన్ని శుభకార్యాలకు స్పెషల్ వేర్
- అన్ని వర్గాల ప్రజల నుంచి ఆదరణ
- నగరంలో ఆనాటి నుంచి షేర్వానీ ట్రెండ్




నవాబుల కాలం నుంచి ఇప్పటి దాకా షేర్వానీకి ఏమాత్రం క్రేజ్ తగ్గకపోగా రోజురోజుకూ పెరుగుతోంది. ఒకప్పుడు రాజ కుటుంబీకులు, సంపన్నవర్గాలకే షేర్వానీ పరిమితమయ్యేది. రానురాను పేద, ధనిక అందరూ షేర్వానీ అంటే ఆసక్తి కనబరుస్తున్నారు. పెళ్లిళ్లు, పేరంటాల్లో కుటుంబ సభ్యులంతా చిన్నాపెద్దా తేడా లేకుండా షేర్వానీ ధరించాల్సిందే.. బ్రాండెడ్ దుస్తులు మార్కెట్‌ను రాజ్యమేలుతున్నా.. రాజుల కాలం నాటి షేర్వానీలు పండగలు, శుభకార్యాలకు సరికొత్త శోభను తీసుకువస్తున్నాయి. ఇదే ఇప్పుడు నయా ట్రెండ్‌గా మారింది.

– సాక్షి, సిటీబ్యూరో



అభిరుచులకు అనుగుణంగా షేర్వానీ డిజైన్లలోనూ మార్పులొచ్చాయి. రాకుమారులు.. సినీహీరోలు.. రాజకీయ నాయకులు ఇలా సెలబ్రెటీలంతా భారతీయ సంస్కృతికి అద్దంపట్టేలా షేర్వానీని ధరించేందుకు మొగ్గు చూపుతున్నారు. కేవలం మన సంస్కృతే కాదు.. పాశ్చాత్య డిజైన్ల సమ్మేళనంగా సరికొత్త షేర్వానీలు మార్కెట్‌లో ఆదరణ పొందుతున్నాయి. హైదరాబాద్‌లో కేవలం నిజాం నవాబులు, ముస్లిం, మార్వాడీ సమాజంలోనే షేర్వానీ ఆహార్యం కనిపించేంది. ఇప్పుడు ఈ ఫ్యాషన్ అందరి ఒంటి మీదకు చేరింది. మొదట్లో కేవలం పెళ్లి కుమారుడే షేర్వానీతో ఊరేగేవాడు.. ఇప్పుడు వరుడే కాదు.. పెళ్లి బరాత్‌కు హాజరయ్యే ప్రతి ఒక్కరూ ఈ డ్రెస్ వేర్‌ను వాడటం పరిపాటిగా మారింది. విభిన్న రకాలతో షేర్వానీలతో బరాత్‌కే కొత్త అందం వస్తుందనే ప్రచారంతో వివాహంలో షేర్వానీ డ్రెస్ కోడ్‌గా మారింది.

షేర్వానీ అంటే మక్కువ



ఇండో వెస్టన్ డిజైన్స్‌తో వినియోగదారులకు నచ్చే విధంగా షేర్వానీలు తయారు చేస్తున్నాం. నేటి యువత మాములు డిజైన్ షేర్వానీలకు కాకుండా స్టైయిలిష్‌గా కనబడటానికి కొత్త డిజైన్స్‌ను ఫాలో అవుతున్నారు. మారుతున్న డిజైన్స్‌కు అనుగుణంగా మా వద్ద షేర్వానీలు తయారవుతాయి. ప్రస్తుతం అన్ని మతాలు, వర్గాల వారు వీటిని ధరిస్తున్నారు. వారి వారి సంప్రదాయల డిజైన్లలో తయారు చేస్తున్నాం. షేర్మానీలు ధరించి శుభకార్యాలకు వెళితే ఎంతో సంతోషాన్ని ఇస్తుంది. శుభకార్యాలు పెళ్లిళ్లు విందుల్లో షేర్వాణి ధరించి వెళ్లే వారివైపే అందరి చూపు ఉంటుంది. నేటి యువత వీటిని ధరించడానికి మక్కువ చూపుతున్నారు.

– ఇబ్రాహీమ్ బుఖారీ, జహాపనా డిజైనర్స్ వ్యవస్థాపకుడు

బనారస్ పట్టుతో తయారీ

షేర్వానీల తయారీలో బనారస్ పట్టుదే పైచేయి. ఈ పట్టుతోనే వీటిని ఉత్పత్తి చేసే అవకాశమున్నందున.. ఫ్యాషన్‌లో బనారస్ షేర్వానీలదే హవా. పురుషులు వస్త్రాలలో పట్టుకు అంతగా ప్రాధాన్యత ఇవ్వరు. కేవలం షేర్వానీలలో మాత్రం ఈ పట్టుకే పట్టం కడుతున్నారు. ఇలా వస్త్ర నాణ్యతకు అనుగుణంగా వీటి ధరల్లో హెచ్చు తగ్గులున్నాయి. రూ.2వేల నుంచి రూ.2 లక్షల వరకు షేర్వానీలు లభ్యమవుతున్నాయంటే వీటికి మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు. వీటికి ఉన్న ఆదరణ దష్ట్యా షేర్వానీ ప్రియులు కస్టమైజ్డ్ డిజైన్లు చేయించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా డిజైనర్లు సైతం పుట్టుకొచ్చారు. నగరంలో బుఖారీ ఫ్యామిలీ జహాపనా డిజైనర్స్ పేరుతో షేర్వానీ రంగంలో విప్లవం తీసుకొచ్చింది. యుత్‌కు నచ్చే స్టయిల్స్‌తో పాటు అన్ని కట్స్‌లో షేర్వానీలు తయారవుతున్నాయి.

క్లుప్తంగా...

9 నుంచి వైకుంఠ ద్వార దర్శనం ఉచిత టోకెన్లు

- జనవరి 10, 11, 12 తేదీలకు 1.20 లక్షల సర్వదర్శనం టోకెన్లు
- జనవరి 9న జారీ...

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జనవరి 10 నుంచి 19 వరకు వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించి తిరుపతి, తిరుమలలో సర్వదర్శనం టైంస్లాట్ టోకెన్లు జారీ చేయనున్నట్లు టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడించారు. జనవరి 10, 11, 12 తేదీలకు సంబంధించి జనవరి 9న ఉదయం 5 గంటల నుంచి 1.20 లక్షల టోకెన్లు ఇస్తామని, తదుపరి రోజులకు ఏరోజుకారోజు ముందురోజు టోకెన్లు జారీచేస్తామని ఈవో తెలిపారు. ఇందుకోసం తిరుపతి, తిరుమలలో కౌంటర్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతిలోని 8 కేంద్రాల్లో 87 కౌంటర్లు, తిరుమలలో 4 కౌంటర్లు కలుపుకుని మొత్తం 91 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు తమ ఆధార్ కార్డు చూపించి టోకెన్లు పొందాలని, టోకెన్లు పొందిన భక్తులకు ఈసారి వారి ఫొటో గుర్తింపుతో కూడిన స్లిప్‌లను జారీచేస్తామని తెలిపారు. టోకెన్లు లేని భక్తులకు ఈ 10 రోజుల్లో శ్రీవారి దర్శనం ఉండదని స్పష్టం చేశారు.

టీటీడీకి రూ.1.11 కోట్ల విరాళం అందజేత

తిరుమల: రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఈవో పి.ఎం.ఎస్.ప్రసాద్ బుధవారం టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు ఒక కోటి పదకొండు లక్షల పదకొండు వేల నూట పదకొండు రూపాయలను విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు విరాళం డీడీని టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరికి అందజేశారు.

పోటెత్తిన యాదగిరిగుట్ట



యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. క్రిస్మస్ సెలవు కావడంతో.. జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు భారీగా తరలి వచ్చారు. వర్షంలోనే బారులు తీరారు. ధర్మ దర్శనానికి 4 గంటలు, వీఐపీ దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. శ్రీస్వామి వారిని 45వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులను తీర్చుకున్నారు.



వైఎస్సార్ జిల్లా తాటిరెడ్డిపల్లిలో భారీ జనసందోహం మధ్య వైఎస్ జగన్



జగన్‌కు కేక్ తినిపిస్తున్న తల్లి వైఎస్ విజయమ్మ

నీరా'జనం'

అభిమాన నేతను చూసేందుకు తరలి వచ్చిన పల్లె ప్రజానీకం

తాతిరెడ్డిపల్లె రామాలయం విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న వైఎస్ జగన్

- 30 కిలోమీటర్ల ప్రయాణానికి ఏకంగా 6 గంటల సమయం
- కుటుంబ సభ్యులతో కలిసి పులివెందుల సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు
- పెద్దనాన్న, తల్లితో కలిసి క్రిస్మస్ కేట్ కట్ చేసిన మాజీ సీఎం

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ జిల్లా పులివెందుల–తాతిరెడ్డిపల్లె మార్గంలోని పల్లెల జనమంతా బుధవారం రోడ్డుపైకి వచ్చేశారు.. జై జగన్ అంటూ నినాదాలు చేశారు.. తమ అభిమాన నాయకుడు, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ రహదారిలో వెళ్తున్నారని తెలుసుకుని ఆయా గ్రామాల వద్ద రోడ్డుపై తిష్ట వేశారు.. దారి పొడవునా జననేతకు బ్రహ్మరథం పట్టారు. వారి అభిమానానికి ముగ్ధుడైన వైఎస్ జగన్ సైతం ఏ ఒక్కరినీ నిరాశ పరచకుండా అందరినీ పలకరిస్తూ, సెల్ఫీలు దిగుతూ, అభివాదం చేస్తూ ముందుకు సాగారు. పులివెందుల సీఎస్ఐ చర్చిలో ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొన్న అనంతరం లింగాల మండలం తాతిరెడ్డిపల్లెలో రామాలయం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనేందుకు 11 గంటలకు బయలుదేరారు. అడుగడుగునా అభిమాన జనం పోటెత్తడంతో 30 కిలోమీటర్ల మేర ప్రయాణించేందుకు ఏకంగా ఆరు గంటలు పట్టింది. ప్రతి గ్రామం వద్ద రోడ్డుపైకి వచ్చిన ప్రజలు వైఎస్ జగన్‌ను చూసేందుకు ఎగబడ్డారు. ఆయనతో మాట్లాడటానికి, కరచాలనం చేయడానికి పోటీ పడ్డారు. సాయంత్రం ఐదు గంటలకు ఆలయం వద్దకు వచ్చే సరికి ఆ ప్రాంతం అంతా జనంతో కిక్కిరిసింది. వైఎస్ జగన్‌కు వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు.

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న వైఎస్ జగన్

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బుధవారం క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. పులివెందుల సీఎస్ఐ చర్చిలో వైఎస్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థనలు చేశారు. పెద్దనాన్న వైఎస్ శివప్రకాష్‌రెడ్డి, తల్లి వైఎస్ విజయమ్మ, పెద్దమ్మ వైఎస్ భారతమ్మతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, వైఎస్ ఆనందరెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతీరెడ్డి, వైఎస్ ప్రమీలమ్మ, మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వైఎస్ జగన్ 2025 కేలండర్‌ను ఆవిష్కరించారు.

అనంతరం ఆయన కోదండరాముడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విగ్రహ మూర్తులకు పట్టు వస్త్రాలు సమర్పించారు. కాగా, ఈ ఆలయానికి వైఎస్ జగన్ ప్రభుత్వంలో రూ.34 లక్షలు మంజూరు చేశారు.

పాలనలోనూ కృత్రిమ మేధస్సు!

- 21 ప్రభుత్వ విభాగాల్లో ఏఐ వినియోగానికి ఉన్న అవకాశాలపై మదింపు
- ఐటీ శాఖ పరిధిలోని 'ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్'కు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర సర్కారు
- అంతర్జాతీయంగా పాలన రంగంలో ఏఐ వినియోగం తీరుపై అధ్యయనం
- ప్రభుత్వ విభాగాల అవసరాలకు సరిపోయే రీతిలో ఏఐ ఆధారిత అప్లికేషన్ల రూపకల్పన
- పాలనలో ఏఐ వినియోగంపై ఉద్యోగులకు అవగాహన, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ పాలన, ప్రజాసేవల్లో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్– ఏఐ)ను మేళవించి ప్రజలకు త్వరితగతిన, సమర్థవంగా సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. సమాచార సాంకేతిక (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) రంగంలో వేగంగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవడంలో ప్రభుత్వ శాఖలు వెనుకంజలో ఉన్నాయనే విమర్శల నుంచి బయటపడేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. వివిధ ప్రభుత్వ శాఖల్లో కృత్రిమ మేధ వినియోగానికి ఉన్న అవకాశాలపై కసరత్తు చేస్తోంది. ప్రయోగాత్మకంగా కొన్ని ప్రభుత్వ శాఖల్లో ఏఐ వినియోగంతో కూడిన అప్లికేషన్లు (యాప్‌లు) ప్రవేశపెట్టాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ బాధ్యతను ఐటీ శాఖకు అనుబంధంగా ఉన్న 'ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్'కు అప్పగించింది.

21 ప్రభుత్వ శాఖలతో వర్క్‌షాప్

సాంకేతికత వినియోగం ద్వారా పేదరిక నిర్మూలనకు అవసరమైన విధానాల రూపకల్పనలో పేరొందిన 'జేపీఏఎల్'(జమీల్ పావర్టీ యాక్షన్ లాబ్) రాష్ట్ర పాలనలో ఏఐ వినియోగం విషయంలో ప్రభుత్వంతో జట్టుకట్టింది. ఇటీవల 21 ప్రభుత్వ శాఖలకు చెందిన 'ఏఐ నోడల్ ఆఫీసర్ల'తో వర్క్‌షాప్ నిర్వహించింది. ఆయా ప్రభుత్వ విభాగాల పరిధిలోని సంక్లిష్ట అంశాలకు ఏఐ ద్వారా ఏ తరహాలో పరిష్కారాలు సాధ్యమనే కోణంలో లోతుగా మదింపు చేశారు. అంతర్జాతీయంగా పాలన, ప్రజాసేవలో ఏఐ ప్రభావం, వినియోగం, వివిధ దేశాలు, రాష్ట్రాలు ఏఐని వినియోగిస్తున్న తీరుపై ఈ వర్క్‌షాప్‌లో నోడల్ ఆఫీసర్లకు అవగాహన కల్పించారు.

ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా..

వివిధ ప్రభుత్వ శాఖల అవసరాలకు తగిన ఏఐ ఆధారిత యాప్‌లు, ఏ ప్రభుత్వ విభాగానికి ఏ తరహా యాప్‌లు అవసరమనే కోణంలో ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్ కసరత్తు చేస్తోంది. ఆయా ప్రభుత్వ విభాగాల్లోని ఉద్యోగులకు కూడా ఏఐ పాలనలో ఏఐ వినియోగంపై అవగాహన కల్పించి, నైపుణ్య శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ శాఖల్లో దశలవారీగా ఏఐ సాంకేతికత వినియోగాన్ని పెంచేలా ఒక రోడ్‌మ్యాప్ రూపొందించే అంశంపై జేపీఏఎల్, ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్ కలసి పనిచేస్తున్నాయి.

ఇప్పటికే పలు యాప్‌లు అందుబాటులోకి..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఇటీవల ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ విజయోత్సవాల్లో భాగంగా రైతులు, యువత, మహిళలు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 3 ఐటీ, ఏఐ ఆధారిత అప్లికేషన్లను విడుదల చేసింది. మరో అప్లికేషన్‌ను ప్రభుత్వమే వినియోగిస్తోంది.

- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, అగ్రికల్చర్ డేటా ఎక్స్ఛేంజీ సంయుక్తంగా ఒక అప్లికేషన్ రూపొందించాయి. వేగంగా డేటా మార్పిడి, వ్యవసాయ ఆవిష్కరణలను ఈ యాప్ వేగవంతం చేస్తుంది. రైతులు రూ.లక్షలోపు రుణాలను గతంలో మాదిరిగా వారాల తరబడి కాకుండా రెండు రోజుల వ్యవధిలోనే పొందడం సాధ్యమవుతుంది.
- తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో 'దిమిత్ర'పేరిట ఏఐ ఆధారిత యాప్‌ను రూపొందించింది. పిల్లల్లో మాదక ద్రవ్యాల వినియోగాన్ని ప్రాథమిక స్థాయిలోనే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పసిగట్టేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. మాదక ద్రవ్య రహిత వాతావరణంలో పిల్లలు పెరిగేలా ఈ యాప్ తోడ్పడుతుంది.
- గ్రామీణ మహిళల్లో డిజిటల్ అక్షరాస్యత పెంపు కోసం 'సన్మతి'యాప్ రూపొందించారు. ఏఐ వినియోగంపై సాధారణ పౌరుల్లో అవగాహన పెంచడంలోనూ ఈ యాప్ సాయపడుతుంది.
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, పథకం అమలు కోసం రూపొందించిన 'ఇందిరమ్మ యాప్'తో ప్రస్తుతం లబ్ధిదారుల పరిశీలన జరుగుతోంది. భవిష్యత్తులో ఈ యాప్ ఇందిరమ్మ ఇళ్ల పథకం అమల్లో కీలకంగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నాం

జేపీఏఎల్ సహకారంతో ప్రభుత్వ శాఖల్లో ఏఐ వినియోగంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో అనేక ప్రతిపాదనలు అందాయి. ఏయే విభాగాల్లో ఏయే అంశాల్లో ఏఐ వినియోగం సాధ్యమవుతుందో పరిశీలిస్తున్నాం. 21 ప్రభుత్వ శాఖల నుంచి ప్రతిపాదనలు అందినా తొలిదశలో ఐదు శాఖలను ఎంపిక చేసి ఏఐ ఆధారిత అప్లికేషన్లు తయారు చేయాలని భావిస్తున్నాం. త్వరలో సంబంధిత శాఖల ముఖ్య కార్యదర్శులతో ఈ అంశంపై ప్రత్యేక సమావేశం జరుగుతుంది.

– రమాదేవి లంకా, డైరెక్టర్, ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్



శ్రీవారిసేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

తిరుమల: సుప్రీంకోర్టు న్యాయమూర్తి హృషికేష్ రాయ్ బుధవారం రాత్రి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన్ని రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా.. అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

7న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల: తిరుమలలో జనవరి 10 నుంచి 19 వరకు పది రోజుల వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనాలను పురస్కరించుకుని జనవరి 7 మంగళవారం తిరుమల ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. సాధారణంగా సంవత్సరంలో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. జనవరి 7వ ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఈ ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా బ్రేక్ దర్శనాలు రద్దు చేయడంతో 6న సిఫార్సు లేఖలు స్వీకరించరు.

పందెం కోడి.. పండక్కి రెడీ..



సంక్రాంతికి ముస్తాబవుతున్న పుంజులు

ఒక్కో పుంజు రూ.10 వేల నుంచి రూ.3 లక్షలకు విక్రయాలు

- బరిలో ఎలాంటి గాయాల్లేకుండా గెలిచిన పుంజుకు యమా డిమాండ్
- పుంజుల అమ్మకాల ద్వారా సంక్రాంతి సీజన్‌లో రూ.25 కోట్ల వ్యాపారం
- పందెం కోడిని సిద్ధంచేయడానికి ఒక్కోదానికి రూ.30 వేల వ్యయం
- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోనే 450 పెంపకం కేంద్రాలు
- ఇక్కడ ఈ ఏడాది సంక్రాంతికి చేతులు మారిన మొత్తం రూ.500 కోట్లు
- బరులను సొంతం చేసుకోవడానికి కూటమి నేతల్లో పోటీ

సంక్రాంతి వచ్చిందంటే చాలు పల్లెల్లో సందడి అంతా ఇంతా కాదు. ముఖ్యంగా గోదావరి జిల్లాల్లో అయితే ఈ హడావుడి ఓ రేంజ్‌లో ఉంటుంది. ఎక్కడెక్కడి నుంచో చిన్నాపెద్దా, ఆడామగా తేడాలేకుండా పొలోమని వచ్చేస్తారు. కారణం.. అందరినీ ఆకర్షించే కోడిపందేలు. ఈ మూడ్రోజుల పండగ ప్రత్యేకత.. ప్రత్యేక ఆకర్షణ ఇదే. మరో నెలరోజుల్లో ఈ సందడి ప్రారంభం కానుంది. కాలు దువ్వడానికి కోళ్లు.. పందెం రాయుళ్లు రెడీ అయిపోతున్నారు.

కైకలూరు : సంక్రాంతి పందేల బరిలో 'తగ్గేదే లే' అన్నట్లుగా ఢీకొట్టడానికి కోడిపుంజులు సిద్ధమవుతున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో పెద్ద పండుగ సమరానికి కసరత్తు మొదలైంది. పండ్ల తోటలు, చేపల చెరువు గట్లు, ఫాం హౌస్‌లు ఇలా చిన్నాపెద్దా కలిపి దాదాపు 450 పుంజుల పెంపక కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో టీడీపీ నాయకులతో పాటు జనసేన నేతలు పందేల బరుల ఏర్పాటుకు పోటీపడుతున్నారు. బరుల స్థల సేకరణలో నిమగ్నమయ్యారు. గుండాట, పేకాట, మద్యం విక్రయాలు, వ్యాపార దుకాణాల కోసం ఆశావహులు కూటమి నేతల ప్రసన్నానికి ప్రయత్నిస్తున్నారు.

ఒక్కో పుంజుకు రూ.30 వేల ఖర్చు..

ఇక పందేనికి సిద్ధంచేసే ఒక్కో పుంజుకు రూ.30 వేల వరకు ఖర్చుచేస్తున్నారు. జీడిపప్పు, బాదం, రాగులు, సజ్జలు, నువ్వులు, బెల్లం, డ్రై ఫ్రూట్స్‌తో పాటు ఉడికించిన మటన్, గుడ్లు పెడుతున్నారు. ప్రతిరోజూ ప్రత్యేకంగా నీటిలో ఈత కొట్టిస్తూ, ప్రత్యేక పరికరాల ద్వారా నడిపిస్తారు. కొంతమంది థాయ్‌లాండ్, ఫిలిప్పీన్స్ నుంచి మేలు జాతి కోడిపుంజులను తెప్పించుకుంటున్నారు. ఇటీవల నెల్లూరు జిల్లా రైతులు ఆటోలలో వివిధ జాతుల పుంజులను తీసుకొచ్చి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రూ.10 వేల నుంచి రూ.30 వేలకు విక్రయిస్తున్నారు.

ఆలాగే, కోడి పందేలలో ఎదుటి పుంజులు దాడి చేసినప్పుడు వాటిని తప్పించుకుని ఎలాంటి గాయాలు కాకుండా ప్రత్యర్థి పుంజును చంపిన పుంజులను రూ.3లక్షలకు కొనుగోలు చేస్తారు. ఇలాంటి వాటిని ఈ ప్రాంతంలో పందేల నిర్వాహకులు గుర్తిస్తారు. ఇక సంక్రాంతి నెలరోజుల్లో పుంజుల అమ్మకాల ద్వారా రూ.25 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుంది. సుమారు ఏడువేలకు పైగా పుంజుల అమ్మకాలు ఇక్కడ జరుగుతాయని అంచనా.

పొరుగు రాష్ట్రాల నుంచి అతిథులు రాక

కోడిపందేల కోసం ఏడాది మొత్తం ఎదురుచూసే వారు.. ఈ సమయంలోనే సంవత్సరానికి సరిపడా ఆదాయాన్ని గడించే వారు గోదావరి జిల్లాల్లో అనేక మంది ఉంటారు. ఈ ఏడాది జనవరిలో పండుగ మూడ్రోజులు ఒక్క ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోనే రూ.500 కోట్లపైనే చేతులు మారాయి. ఇక వచ్చే నెలలో జరిగే కోడిపందేలు ఒక రేంజ్‌లో ఉంటాయని జూద విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇక ఈ కోడిపందేలను తిలకించడానికి హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాల నుంచి విచ్చేసే అతిథుల కోసం హోటళ్లు, లాడ్జీల బుకింగ్‌లు మొదలయ్యాయి. ప్రధాన సెంటర్లలో అయితే ఇప్పటికే పూర్తయిపోయాయి. అలాగే, బరుల చుట్టూ ఎల్‌ఈడీ స్క్రీన్లు, ఫ్లడ్‌లైట్లు, బౌన్సర్ల ఏర్పాటుతో పాటు ఎక్కువ పందేలు గెలిచిన వారికి బుల్లెట్లు, స్కూటీలను అందించాలనే యోచనలో నిర్వాహకులు ఉన్నారు.

బిల్లులు భగభగ!

గతంలో రూ.150 - 250 దాటని ఇంటికి ఏకంగా రూ.5 వేలు

అపరాధ రుసుముతో ముక్కు పిండి మరీ వసూలు

(బోణం గణేష్, 'సాక్షి' ప్రతినిధి)

రాష్ట్రంలో చలితోపాటు కరెంట్ బిల్లులు పొగలు కక్కుతున్నాయి! ప్రతి నెలా పెరిగిపోతున్న విద్యుత్తు చార్జీల బాదుడుకు వినియోగదారులు వణికిపోతున్నారు. నవంబర్‌తో పోలిస్తే డిసెంబర్‌లో బిల్లులు భారీగా పెరిగాయి. శీతకాలంలో వాడకం తగ్గినా బిల్లులు మాత్రం పైపైకి వెళుతూనే ఉన్నాయి. గతంలో నెలకు రూ.రెండు మూడొందలు దాటని వారికి సైతం రూ.వేలల్లో బిల్లులు రావడంతో తీవ్ర షాక్‌కు గురవుతున్నారు. రైతన్నలు, మహిళలు ఇలాంటి పరిస్థితిని ఎన్నడూ ఎదుర్కోలేదని విద్యుత్తు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం ఉండటం లేదు. విద్యుత్తు శాఖ సిబ్బంది అపరాధ రుసుముతో సహా బిల్లులు వసూలు చేస్తున్నారు. రూ.6,000 కోట్ల విద్యుత్తు చార్జీల బాదుడుకే బిల్లులు ఇంత భారీగా పెరిగితే ఇక జనవరి నుంచి అదనంగా మరో రూ.9 వేల కోట్లకుపైగా భారం పడనుండటంతో ఏ స్థాయిలో బిల్లులు జారీ అవుతాయోననే ఆందోళన ప్రజల్లో నెలకొంది. మొత్తంగా రూ.15,485.36 కోట్ల విద్యుత్ చార్జీల పిడుగును టీడీపీ కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై వేస్తోంది. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని, అవసరమైతే ఇంకా తగ్గిస్తామని నమ్మబలికిన సీఎం చంద్రబాబు కనీవినీ ఎరుగని రీతిలో హై ఓల్టేజీ షాకులిస్తున్నారు. సంపద సృష్టిస్తానంటూ ప్రజలపై పెనుభారం మోపుతున్నారు.

సబ్సిడీలు లేవ్.. చార్జీల బాదుడే

గతంలో టీడీపీ అధికారంలో ఉండగా దాదాపు రూ.20 వేల కోట్ల సర్దుబాటు చార్జీలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అంటగట్టి దిగిపోయింది. అయినా సరే ఆ భారాన్నంతా ప్రజలపై మోపకుండా గత ప్రభుత్వం డిస్కంలకు సకాలంలో రాయితీలు అందించింది. 2014–19 వరకు టీడీపీ సర్కారు రూ.13,255.76 కోట్లు మాత్రమే సబ్సిడీల కింద చెల్లించగా వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండగా రూ.47,800.92 కోట్లను అందించింది. చంద్రబాబు రైతులకు ఎగ్గొట్టిన రూ.8,845 కోట్ల ఉచిత విద్యుత్ బకాయిలను సైతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే చెల్లించింది. తాజాగా కూటమి ప్రభుత్వం సబ్సిడీలు భరించకుండా వినియోగదారులపైనే చార్జీల భారాన్ని మోపుతోంది.

రైతన్నలు, మహిళల్లో తీవ్ర ఆందోళన

- ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్న కరెంట్ బిల్లులు
- నవంబర్‌తో పోలిస్తే భారీగా పెరిగిన విద్యుత్తు చార్జీలు
- ఇప్పటికే రూ.6,072.86 కోట్ల వసూలు ప్రారంభం
- జనవరి నుంచి మరో రూ.9412.50 కోట్ల బాదుడు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఖండాలు దాటొచ్చి..

రామప్ప వేదికగా ఉమ్మడి కుటుంబం కలయిక



రామప్ప ఆలయం వద్ద ఉమ్మడి కుటుంబ సభ్యులు

వెంకటాపురం(ఎం): ఆస్తుల కోసం ఒకే తల్లీబిడ్డలు ఘర్షణ పడుతూ.. అనుబంధాలు తెంచుకుంటూ.. పలకరింపులే కరువైన ఈ రోజుల్లో.. ఏకంగా ఉమ్మడి కుటుంబానికి చెందిన 80 మంది ఒకేచోట కలుసుకున్నారు. వీరి అపురూప కలయికకు చారిత్రక రామప్ప దేవాలయం వేదికైంది. హనుమకొండ జిల్లా దుగ్గొండి మండలం నాచినపల్లి గ్రామానికి చెందిన సింగిరికొండ వెంకట్రాజం, వజ్రమ్మ దంపతుల కుమారులు, కూతుళ్లు, వారి పిల్లలు అమెరికా, రష్యా, పూణె, నెదర్లాండ్, లండన్‌తో పాటు భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లో నివసిస్తున్నారు. మొత్తం 80 మంది కుటుంబ సభ్యులు బుధవారం రామప్ప ఆలయ కేంద్రంగా కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం రామలింగేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి.. ఫొటోలు దిగి సందడి చేశారు.

ఆస్తులు తీసుకున్నారు.. అంత్యక్రియలకు మొహం చాటేశారు

- వృద్ధురాలికి అంత్యక్రియలు చేసిన స్థానికులు
- జగిత్యాల పట్టణంలో ఘటన



అంత్యక్రియలు నిర్వహిస్తున్న స్థానికులు

జగిత్యాలక్రైం: ఆమెకు కన్నబిడ్డలు లేరు. బంధువులే అన్నీ చూసుకుంటారని భావించిన ఆమె వారికి ఆస్తులు పంచింది. కానీ ఆమె ఆస్తులు తీసుకుని.. తీరా చనిపోతే కనీసం అంత్యక్రియలు నిర్వహించేందుకు కూడా వారు రాలేదు. ఆ వృద్ధురాలి మృతదేహాన్ని సుమారు ఆరు గంటల పాటు రోడ్డుపై అంబులెన్స్‌లోనే ఉంచాల్సి వచ్చింది. జగిత్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి ఈ అమానవీయ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని తీన్‌ఖని చౌరస్తా ప్రాంతానికి చెందిన సాదుల సత్తమ్మ భర్త 20 ఏళ్ల క్రితం మృతిచెందాడు. వీరికి పిల్లలు లేకపోవడంతో సత్తమ్మ తమ ఆస్తిని బంధువులకు అప్పగించింది. ఈ క్రమంలో ఆమె వృద్ధాప్య సమస్యలతో మంగళవారం ఆస్పత్రిలో చనిపోయింది. దీంతో కొందరు బంధువులు అంబులెన్స్‌లో శవాన్ని ఇంటికి తీసుకొచ్చారు. అయితే ఆస్తి తీసుకున్న బంధువులు మాత్రం ఈలోగా శవాన్ని ఇంట్లోకి తీసుకురాకుండా ఇంటికి తాళంవేసి వెళ్లిపోయారు. ఫలితంగా రాత్రి 11 గంటల వరకు మృతదేహాన్ని అంబులెన్స్‌లో రోడ్డుపైనే ఉంచాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్సై గీత జోక్యం చేసుకుని వృద్ధురాలి ఇంటి తాళాలు పగులగొట్టించి మృతదేహాన్ని అందులో ఉంచారు. అయితే బుధవారం కూడా ఆమె అంత్యక్రియలు నిర్వహించేందుకు బంధువులెవరూ రాకపోవడంతో స్థానికులే అంత్యక్రియలు నిర్వహించారు. సత్తమ్మ ఆస్తులు పంచుకున్న వారు మాత్రం అంత్యక్రియలకు రాకపోవడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

విమానంలోకి హ్యాండ్ లగేజ్ 7 కిలోలే

సాక్షి, హైదరాబాద్: విమాన ప్రయాణంలో హ్యాండ్ లగేజ్ 7 కిలోలు దాటకుండా జాగ్రత్తలు పాటించాలని ఎయిర్ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది. ఎయిర్‌పోర్టుకు బయలుదేరడానికి ముందే బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) ప్రకటించిన కొత్త హ్యాండ్ బ్యాగేజీ విధానం గురించి తెలుసుకోవడం మంచిదని సూచించింది. ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీ పాయింట్‌ల వద్ద రద్దీ పెరుగుతున్న కారణంగా పలు మార్పులు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు దేశీయ లేదా అంతర్జాతీయ ప్రయాణంలో ఒక హ్యాండ్ బ్యాగేజీని మాత్రమే విమానంలోకి తీసుకెళ్లగలరు. అదనపు బ్యాగేజీ చెక్‌ఇన్ కావాల్సిందే. ఎకానమీ లేదా ప్రీమియం ఎకానమీ తరగతిలో ప్రయాణించే ప్రయాణికులు తమ వెంట విమానంలోకి 7 కిలోల వరకు బరువున్న ఒక బ్యాగేజీని మాత్రమే తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఫస్ట్ లేదా బిజినెస్ క్లాస్ ప్రయాణికులు మాత్రం సుమారు 10 కిలోల వరకు బరువు ఉండే ఒకే ఒక హ్యాండ్ బ్యాగేజీని తీసుకెళ్లవచ్చు. బ్యాగేజీ ఎత్తు 55 సెంటీమీటర్లు, పొడవు 40 సెంటీమీటర్లు, వెడల్పు 20 సెంటీమీటర్లు మించరాదు. హ్యాండ్ బ్యాగేజీ చుట్టుకొలత 115 సెంటీమీటర్లు మించరాదు. ఒకవేళ ప్రయాణికుడి హ్యాండ్ బ్యాగేజీ బరువు, విస్తీర్ణం పరిమితిని మించి ఉన్న పక్షంలో అదనపు చార్జీలు భరించక తప్పదని ఎయిర్‌లైన్స్ అధికారులు తెలిపారు. 2024 మే 2కి ముందు టికెట్లను బుక్ చేసుకున్న ప్రయాణికులకు మాత్రం వెసులుబాటు ఉంటుంది. ఎకానమీ క్లాస్ ప్రయాణికులు 8 కిలోల వరకు, ప్రీమియం ఎకానమీ క్లాస్ ప్రయాణికులు 10 కిలోల వరకు, ఫస్ట్ లేక బిజినెస్ క్లాస్ ప్రయాణికులు 12 కిలోల వరకు బరువుండే హ్యాండ్ బ్యాగేజీని తీసుకెళ్లవచ్చని ఎయిర్ ఇండియా పేర్కొంది.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
గురువారం ॥ 26-12-2024

2024 ఉమెన్ పవర్

కాలాన్ని కట్టడి చేశారు

కాలం..
మరో నూతన అధ్యాయాన్ని
ఆవిష్కరించడానికి సిద్ధమవుతోంది.
జారిపోతున్న కాలపు క్షణాలను
అపురూపంగా ఒడిసిపట్టుకొని
ఉన్నతంగా ఎదిగినవారు కొందరు...
ఉదాత్తంగా జీవనాన్ని
మలుచుకున్నవారు ఇంకొందరు
ఆర్థిక స్థితి గతులు ఎలా ఉన్నా
వెనక్కి లాగే పరిస్థితులు ఏవైనా
కాలానికి ఎదురు నిలిచి
అవకాశాలను అందిపుచ్చుకుంటూ
అత్యున్నతంగా ఎదిగిన కొందరు
మహిళా మణుల కృషిని
ఈ ఏడాది 'సాక్షి ఫ్యామిలీ'
ఆవిష్కరించింది.
ఆ గాథలను
మరోమారు గుర్తుచేసుకుందాం.
ఎదనిండా స్ఫూర్తిని నింపుకుందాం.


డాక్టర్ శీలం కవితారెడ్డి

డాక్టరమ్మ క్రీడా శిక్షణ

నిజామాబాద్ పట్టణంలో బాలికల క్రీడానైపుణ్యాలను చూసి, వారి కోసం తన పేరుతోనే 2019లో ఫుట్‌బాల్ అకాడమీని ఏర్పాటు చేశారు డాక్టర్ శీలం కవితారెడ్డి. ఈ అకాడమీలో 41 మంది బాలికలకు కోచ్ పర్యవేక్షణలో శిక్షణ ఇస్తున్నారు. ఇంటర్, డిగ్రీ చదువుతున్న గ్రామీణ విద్యార్థులకు ఈ అకాడమీ లో ఉచిత వసతి, ఆహారం, దుస్తులు, వైద్యసేవలను అందిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో జరిగే టోర్నమెంట్లలో పాల్గొనే క్రీడాకారులకు అవసరమైన ఖర్చులన్నీ భరిస్తున్నారు. ఈ అకాడమీ నుంచి జాతీయ-అంతార్జాతీయ స్థాయికి ఎదిగిన క్రీడాకారులు ఉన్నారు.


డాక్టర్ రుక్మిణీరావు

అమ్మాయిలను కాపాడుకుందాం..

గ్రామీణ మహిళలను నిత్యం కలుస్తూ వారి సంక్షేమానికి కృషి చేస్తూ పరిష్కారాలను సూచిస్తూ మహిళా రైతుల అభివృద్ధికి చేయూతనిస్తున్నారు డాక్టర్ రుక్మిణీరావు. హైదరాబాద్ వాసి అయిన ఈ సామాజిక కార్యకర్త డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్‌గానూ, వందకు పైగా మహిళా రైతు సంఘాలతో కూడిన జాతీయ వేదిక 'మకాం' సహ వ్యవస్థాపకురాలిగానూ ఉన్నారు. నారీశక్తి పురస్కార గ్రహీత అయిన రుక్మిణీరావు ముప్పై ఏళ్లుగా 'గ్రామ్య రిసోర్స్ సెంటర్ ఫర్ ఉమెన్' ద్వారా తెలంగాణలోని ఆరు మండలాల్లో 800 మంది మహిళలు తమ జీవనోపాధిని మెరుగుపరుచుకోవడానికి, అలాగే ఆడపిల్లల పెంపకం పట్ల తమ వైఖరిని పునరాలోచించడానికి కృషి చేస్తున్నారు.


సాయి ప్రియాంక

అమ్మలాంటి అన్నదాత కోసం

సాయి ప్రియాంక చదువుకున్నది హైదరాబాద్‌లో. పోషకాహారం దాని ప్రభావిత అంశాల గురించి చర్చించడానికి 600 మందిప్రతినిధులతో కొలంబోలో జరిగే అంతర్జాతీయ సదస్సులో పాల్గొనే అవకాశాన్ని పొందింది. ఖమ్మంవాసి అయిన పగడాల సాయి ప్రియాంక తల్లిదండ్రులిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులే. కూతురికి వ్యవసాయ రంగంపై ఉన్న ఆసక్తిని గమనించి ప్రోత్సహించారు. తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా పరిధిలో ఉన్న గ్రామాలలో రైతులను కలిసి ఆమె సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను పరీక్షించింది. ఢిల్లీలోని ఐఏఆర్ఐ (ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్)లో పీహెచ్‌డి చేస్తోంది. ప్రస్తుతం జహీరాబాద్ 'కృషి విజ్ఞాన కేంద్రం'లో అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సైంటిస్ట్‌గా పనిచేస్తోంది. విభిన్న ఆలోచనలు గల సాయి ప్రియాంక కొత్త దారిలో ప్రయాణించడమే కాదు, తన తోటివారికి స్ఫూర్తిగా నిలుస్తోంది.


కె.పద్మజ

సవాళ్లే పట్టాలెక్కించేది

దక్షిణ మధ్య రైల్వేలో ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పీసీసీఎమ్)గా భారతీయ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ సీనియర్ అధికారిగా కె.పద్మజ ఈ ఏడాది ఆగస్టులో నియమితులయ్యారు. 1991 ఐఆర్‌సిఆర్‌లో మొట్టమొదటి మహిళా పీసీసీఎమ్. ఉద్యోగంలో మహిళగా ఎదుర్కొన్న వివక్షను వివరించారు. 'సమస్యలు వచ్చేదే మనల్ని ధైర్యంగా ఉంచడానికి. మనకు ఏం కావాలో స్పష్టత ఉంటే ఆ పని కూడా సులువు అవుతుంది' అని తెలిపారు.


కవితారెడ్డి

'మారతాను' అనుకుంటే మారథాన్ గెలిచినట్టే!

జీవనశైలిని మార్చుకోవాలన్న ఒకే ఒక ఆలోచనతో ఇండియాస్ ఫాసెస్ట్ మారథాన్ రన్నర్‌గా తనకై తాను ఓ గుర్తింపును సాధించారు కవితారెడ్డి. 50 ఏళ్ల వయసులో ఆరు ప్రపంచ మారథాన్‌లను పూర్తి చేసి, స్టార్ మెడల్స్‌ను సొంతం చేసుకున్నారు. హైదరాబాద్‌తో పాటు దేశంలోని అన్ని ప్రధాన నగరాలలో మారథాన్ రన్స్‌లో పాల్గొంటున్న కవితారెడ్డి పదేళ్ల క్రితం వరకు గృహిణిగా బాధ్యతల నిర్వహణలో ఉన్నారు. ఆరోగ్యకరమైన జీవనం కోసం జిమ్‌లో చేరి, అటు నుంచి మారథాన్ రన్నర్‌గా దేశ విదేశాల్లో మహిళల్లో క్రీడాస్ఫూర్తిని నింపుతున్నారు.

న్యూస్‌మేకర్
భావనా పాలివాల్

వివాహాల గూఢచారి

గతంలో పెళ్లిళ్ల పేరయ్య ఏం చెప్తే అది. లేదా తెలిసిన వారి ఎంక్వయిరీతో సరి. ఇప్పుడు మాత్రం ఎవరినీ ఎవరూ నమ్మడం లేదు. ఏకంగా గూఢచారుల నుంచి రిపోర్టు తెప్పించుకుంటున్నారు. ఈ కాలం పెళ్ళిళ్లలో అబ్బాయి, అమ్మాయిల కాండక్ట్‌ను కనిపెట్టి చెబుతున్న 'మ్యారేజ్ డిటెక్టివ్'లు పెరిగారు. ఢిల్లీకి చెందిన భావనా పాలివాల్ వీరిలో ముందు వరుసలో ఉన్నారు. ఈమె ఏం చేస్తుంది? పెళ్లిళ్ల పరిశోధన ఎందుకు అవసరమని చెబుతోంది?


భావనా పాలివాల్

పెళ్లి అనగానే ఖర్చులు రాసుకోవడం మొదలుపెడతారు ఇటు పక్షం వాళ్లు, అటు పక్షం వాళ్లు. కల్యాణ మంటపం, బట్టలు, నగలు, భోజనాలకు... ఇప్పుడు మరో ఖర్చు కూడా చేరుతోంది. అది డిటెక్టివ్ ఖర్చు. ప్రేమ పెళ్ళిళ్లయినా, పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లయినా 'సరిగ్గా ఆచూకీ తీసి' పెళ్లి చేయాలనే నిర్ణయం ఎక్కువ కుటుంబాలలో కనిపిస్తోంది. మెట్రో నగరాలలో ఈ ధోరణి ఎక్కువగా ఉంది. ముఖ్యంగా ఢిల్లీలో. అందుకే 48 ఏళ్ల భావనా పాలివాల్ నిత్యం బిజీగా ఉంటోంది. ఈమెకు ఢిల్లీలో 'తేజాస్ డిటెక్టివ్ ఏజెన్సీ' ఉంది. ఈమెకు రోజుకు 4 కేసులు వస్తాయి- డిటెక్టివ్ పని చేసి పెట్టమని! కావాల్సిన వివరాలను బట్టి 50 వేల నుంచి లక్షన్నర వరకూ ఫీసు తీసుకుంటుందామె.

నమ్మకం కోసం:

'నగరంలో వివిధ మెట్రిమోనియల్ ఏజెన్సీల ద్వారా సంబంధాలు కలుపుకుంటున్నారు. లేదంటే సోషల్ మీడియా పరిచయాలు పెళ్లిళ్ల వరకూ వెళుతున్నాయి. అయితే ఎవరు ఎలాంటి వారో తెలిసేది ఎలా అందుకే మమ్మల్ని సంప్రదిస్తున్నారు' అంటుంది భావనా పాలివాల్. ఢిల్లీలో ఈమెలాంటి వారు- మెట్రిమోనియల్ డిటెక్టివ్స్ లేదా వెడ్డింగ్ డిటెక్టివ్స్ ఐదారుగురు ఉన్నారు. 'జీతం ఎంత, వేరే వారితో లైంగిక సంబంధాలు ఉన్నాయా, అబద్ధాలు ఏమైనా చెబుతున్నారా' అనేది వీళ్లు కనిపెట్టి చెప్పాలి.



పెళ్లికి ముందు జాగ్రత్త

'పెళ్లికి ముందు సరిగ్గా కనుక్కుంటే పెళ్లి తర్వాత సరిగ్గా కనుక్కోలేదే అనే బాధ ఉండదు. ఈ మధ్య వచ్చిన అమెరికా సంబంధంలో వరుడు సంవత్సరానికి 70 వేల డాలర్లు సంపాదిస్తున్నానని చెప్పాడు. మా ఎంక్వయిరీలో పావు వంతు సంపాదన కూడా లేదని తేలింది. సంబంధం కేన్సిల్ చేశాం. మరో కేసులో కూతురు ప్రేమించిన కుర్రవాడి మీద నిఘా పెట్టి రిపోర్ట్ ఇవ్వమని కూతురి తల్లి ఫీజు చెల్లించింది. దానికి కారణం ఆమె పెళ్లి విఫలమైంది. కూతురిది కూడా అలా కాకూడదనే. ప్రేమ పెళ్లికి సమ్మతమే అయినా కుర్రాణ్ణి అన్ని విధాలుగా తెలుసుకునే 'ఎస్' అనాలని ఆ తల్లి ప్రయత్నం. మేం దానికి సహకరించాం' అందామె. మరికొందరైతే కుర్రాడు హోమో సెక్సువల్ అవునా కాదా తేల్చి చెప్పమని అడుగుతారట. 'అబ్బాయి హోమో సెక్సువల్ అయ్యి పెళ్లి వద్దు మొర్రో అంటున్నా సంఘం కోసం తల్లిదండ్రులు పెళ్లి చేస్తారు. అమ్మాయి జీవితం నాశనం అవుతుంది. అందుకే ఇలాంటి ఎంక్వయిరీలూ వస్తున్నాయి' అని తెలిపింది భావన. గతంలో జర్నలిస్టుగా పని చేసిన భావన ఆ వృత్తిలో సంతృప్తి దొరక్క ఇలా డిటెక్టివ్‌గా మారానని అంటోంది.

ఆధునిక పరికరాలు

ప్రయివేట్ డిటెక్టివ్ ఏజెన్సీలకు చట్టపరమైన అనుమతి ఉంది. కాబట్టి వారు పని చేయవచ్చు. అయితే అనైతిక పద్ధతుల్లో పరిశోధన చేయకూడదు. అదీగాక ప్రాణాపాయ ప్రమాదం కూడా ఉంటుంది. అందుకే డిటెక్టివ్‌లు ఆధునిక పరికరాలను ఉపయోగిస్తారు. కెమెరాలు, జీపీఎస్ ట్రాకర్లు, సూక్ష్మమైన మైక్‌లు... ఇవన్నీ నిజమేమిటో అబద్ధమేమిటో చెబుతాయి. 'వధువరుల వయసు, చదువు, ఆస్తిపాస్తులు, గతంలో విఫల ప్రేమలు, ఎంగేజ్‌మెంట్ వరకూ వచ్చి ఆగిపోయిన సంబంధాలు, రెండో పెళ్లి... ఈ వివరాల్లో వీలున్నంత వరకూ తెలియచేసి పెళ్లికి వెళ్లాలి. లేకపోతే వాటిలోని అబద్ధాలు పెళ్లయ్యాక మెడకు చుట్టుకుంటాయి' అంటుంది భావన.

పెళ్లికి సిద్ధమయ్యి...

అన్నింటికి మించి ఈ స్థితికి వధూవరుల ఆమోదయోగ్యమైన సంసిద్ధత లేకపోవడమే గొడవలకు ముఖ్యకారణం అంటారు మానసిక నిపుణులు. 'పెళ్లి వ్యవస్థను విశ్వసించి దానిలో అవసరమైన కమిట్‌మెంట్, సహనం, అడ్జస్ట్‌మెంట్, నిజాయితీ... వీటన్నింటి పట్ల పూర్తి అవగాహనతో పరిణితి వచ్చాకే పెళ్లికి ఎస్ అనాలి వధూవరులు. లేకుంటే పెళ్లయిన వెంటనే గొడవలు మొదలవుతాయి. డిటెక్టివ్‌లు వాస్తవాలు తెలియచేస్తారు. కాని పెళ్లి నిలబడేది ప్రేమ, నమ్మకాల వల్లే. వాటిని తమలో బేరీజు వేసుకుని పెళ్లికి సంసిద్ధం కావాలి' అని తెలియచేస్తున్నారు వారు. లేకపోతే భావన వంటి వారికి పని పెరుగుతూనే ఉంటుంది.


అఖిల

అన్నీ తానై... తానే నాన్నయి

వ్యవసాయం చేసే తండ్రి అనారోగ్యంతో చనిపోతే డిగ్రీ చదువుతున్న అతని చిన్న కూతురు అఖిల రైతుగా మారింది. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం నర్సాపురం గ్రామ వాసి అఖిల తమకు ఉన్న రెండెకరల భూమిని సాగు చేస్తూ అనారోగ్యంతో బాధపడుతున్న తల్లినీ, నాయనమ్మనూ సంరక్షిస్తోంది. పొలం పనులకు ట్రాక్టర్ నడుపుతూ, వ్యవసాయం చేసుకుంటూ, పోటీ పరీక్షలకు సిద్ధమవుతోంది. తండ్రిలేని లోటును తీర్చుతూ కుటుంబానికి అండగా నిలబడింది.

ఇంటిప్స్



- ఇంట్లో సన్నటి దోమలు చుట్టుముట్టినప్పుడు కర్పూరం లేదా పచ్చకర్పూరాన్ని పొడి చేసి ఇల్లంతా చల్లాలి.
- ధూప్ స్టిక్ వెలిగించి మంచం కింద ఉంచితే దోమలు పారిపోతాయి.
- కరివేపాకును ఒక గ్లాసులో పెట్టి డైనింగ్ టేబుల్ మీద ఉంచితే ఈగలు ఆ దరిదాపులకు కూడా రావు. ఇక్కడ ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. మార్కెట్‌లో దొరికే కరివేపాకు మీద అనేక దఫాలుగా నీటిని చల్లి ఉంటారు. దాంతో ఆకు తన సహజమైన ఔషధగుణాల వాసనను కోల్పోయి ఉంటుంది. ఈగలను నివారించడానికి వాసన కోల్పోని కరివేపాకును వాడాలి.
- వండి పెట్టిన పదార్థాలకు చీమలు పడుతుంటే ఆ పాత్ర మీద చాక్‌పీస్‌తో గీతలు గీయాలి. నున్నటి పాత్రల మీద చాక్‌పీస్ గీతలు పడడం కష్టం. కాబట్టి టేబుల్ మీద పాత్ర చుట్టూ వలయాకారంగా గీత గీయాలి.


అక్షయినీ రెడ్డి

నానమ్మ గురించి రాస్తా!

పన్నెండేళ్ల అమ్మాయి పదహారేళ్ల అమ్మాయి గురించి కథలుగా రాసి, దానిని బుక్‌గా అందరికి ముందుకు తీసుకువచ్చింది ఏడవ తరగతి చదువుతున్న అక్షయినీ రెడ్డి. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మనవరాలైన అక్షయినీ ''తాతయ్యలా 'లా' చేస్తాను, సమాజంలో ఉన్న గాథలను కథలుగా పరిచయం చేస్తాను, నానమ్మ గురించి రాస్తాను''.. అంటూ తన భవిష్యత్తు లక్ష్యాలను నిర్ణయించుకుంది. ఆటపాటలతో రోజులు గడిపేసే ఎంతో మంది పిల్లల మధ్య ఉంటూనే ప్రపంచంలో పేరొందిన రచయితల పుస్తకాలు చదువుతూ, క్రీడల్లో రాణిస్తూ తనకంటూ ఓ ప్రత్యేకమైన మార్గాన్ని రూపొందించుకుంటూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది. చిన్నపిల్లలైనా పెద్ద కలలు కనవచ్చు అంటూ తన పుస్తకాన్ని చూపుతూ భావితరానికి చెబుతోంది.


శ్రీవల్లి

నీ ఆటే బంగారం శ్రీవల్లి

కరీంనగర్ వాసి శ్రీవల్లికి క్రికెట్ అంటే ఇష్టం. ఐదవ తరగతి చదువుతున్న రోజుల్లోనే హైస్కూల్ అబ్బాయిలతో కలిసి క్రికెట్ ఆడటానికి వెళ్లింది. అందరూ ఆమెను చూసి వెటకారంగా నవ్వారు. వారి నవ్వులకు వెనకడుగు వేయకుండా విషయం పీఈటీ సర్‌కు చెప్పింది. శ్రీవల్లి ఇష్టం చూసిన పీఈటీ రహీం ఆమె ఉత్సాహానికి మద్దతుగా నిలిచారు. తల్లిదండ్రులూ తమ ఆమోదం తెలిపారు. హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ అకాడమీలో చేరి, నైపుణ్యాలను మెరుగుపరుచుకుంది. జాతీయ స్థాయి మహిళా క్రికెట్ జట్టులో తన సత్తా చాటుతోంది.

టీచర్ కొలువిచ్చిన సి'విల్' పవర్

వనపర్తి వాసి అయిన హుమేరా బేగం తండ్రి రోజువారీ కూలీగా హైదరాబాద్‌లో ఒక మదర్సాలో పని చేసేవాడు. అమ్మ ఉర్దూ టీచర్‌గా కొంత కాలం పని చేసింది. హుమేరా ఏడో తరగతిలో ఉన్నప్పుడు తండ్రి పక్షవాతం బారిన పడ్డాడు. తండ్రి అనారోగ్య ప్రభావం హుమేరా చదువుపై పడింది. పదవ తరగతిలో ఉండగా తండ్రి ఆరోగ్యం క్షీణించి మరణించాడు. హుమేరాకు సివిల్స్ సాధించాలన్నది కల. ఆర్థిక స్థితి లేక చదువును వదిలేయాల్సిన స్థితి. హుమేరాకు చదువుపై ఉండే ఆసక్తి, పట్టుదల 'సేవ్ ద గర్ల్ చైల్డ్' సంస్థ దృష్టికి చేరింది. ఆ సంస్థ ఆమె చదువుకు అండగా నిలబడింది. డీఎడ్‌పూర్తి చేసి ఎస్‌జీటీ ఉర్దూ టీచర్‌గా ఎంపిక అయ్యింది. దయనీయమైన పరిస్థితుల నుంచి టీచర్‌గా ఎదిగిన హుమేరా కృషి ఎంతో మందికి స్ఫూర్తినిస్తుంది.


హుమేరా బేగం

బస్తీ దొరసాని

చెత్తను సేకరించే అమ్మాయి బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ హోదాలో ఒక రోజు అధికారిణిగా పలు శాఖలను స్వయంగా సందర్శించి, విధులను తెలుసుకుంది. హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లోని పిల్లిగుడిసెల బస్తీ వాసి అరిపిన జయలక్ష్మి. బస్తీల పిల్లల బాగు కోసం కృషి చేస్తోంది. తల్లిదండ్రులతో పాటు చేత్త సేకరణ పనిచేస్తూ, కాలేజీ చదువులు చదువుతూ, బస్తీలోని పిల్లలకు చదువులు చెబుతుంటుంది. కోవిడ్ సమయంలో యునిసెఫ్ నుంచి వాలెంటీర్‌గా పనిచేసింది. ఢిల్లీలో ఛేంజ్ మేకర్ అవార్డ్ తీసుకుంది. గాంధీ కింగ్ స్కాలర్‌షిప్‌కి దేశం మొత్తంలో పది మంది సెలక్ట్ అయితే వారిలో జయలక్ష్మి ఒకరు. ఇందులో భాగంగా కిందటేడాది అమెరికా వెళ్లి వచ్చింది. ఇప్పుడు డిగ్రీ చేస్తూ యుపీఎస్సీ సాధించాలని కృషి చేస్తోంది.


జయలక్ష్మి

చైతన్య లహరి

బాసర ట్రిపుల్ ఐటీ ఆర్జీయూకేటీలో ఈసీఈ ఫైనలియర్ చదువుతోంది లహరి. కరాటేలో బ్లాక్‌బెల్ట్, కిక్ బాక్సింగ్‌లో ప్రావీణ్యం సాధించింది. 'ఖేలో ఇండియా'లో ఉషూ ప్లేయర్‌గా సత్తా చాటింది. అత్యవసరంగా రక్తం అవసరం ఉన్నవారికి అందించేందుకు సిద్ధిపేటలో 'లహరి బ్లడ్ ఫౌండేషన్' ఏర్పాటు చేసింది. నేర్చుకున్న ఆత్మరక్షణ విద్యలను విద్యార్థినులకు నేర్పిస్తోంది. తోటి విద్యార్థులకు అండగా నిలిచేందుకు 'హోప్ హౌజ్ ఫౌండేషన్' కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇటీవల బ్యాంకాక్‌లో నిర్వహించిన 'ఏషియా యూత్ ఇంటర్నేషనల్ మోడల్ యునైటెడ్ నేషన్స్' సదస్సుల్లో పాల్గొంది. తండ్రి లాగే సైన్యంలో చేరి దేశ సేవ చేయాలనేది లహరి లక్ష్యం.


లహరి

● ముగ్గు-ముచ్చట


బొడ్డు ఝాన్సీ,
చౌటుప్పల్
యాదాద్రి భువనగిరి జిల్లా


21 చుక్కలు
9 వరుసలు
9 వచ్చేవరకు


20 చుక్కలు,
4 వరుసలు
2 వచ్చేవరకు - సరిచుక్క


పి.లక్ష్మీదేవి,
కర్నూలు

ముగ్గులకు ఆహ్వానం



ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1,
బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com



ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్: అశ్విన్ అత్యధిక రేటింగ్‌ను సమం చేసిన బుమ్రా

భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో... భారత తరఫున అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన రవిచంద్రన్ అశ్విన్ సరసన చేరాడు. ఆస్ట్రేలియాతో 'బోర్డర్-గావస్కర్' ట్రోఫీలో అద్వితీయ ప్రదర్శన కనబరుస్తున్న బుమ్రా 904 రేటింగ్ పాయింట్లతో బౌలర్ల జాబితాలో అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. 2016లో అశ్విన్ అత్యధికంగా 904 పాయింట్లు సాధించాడు. తాజా జాబితాలో దక్షిణాఫ్రికా పేసర్ రబడ (856), హాజల్‌వుడ్ (ఆస్ట్రేలియా-852) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. భారత్ నుంచి అశ్విన్ (5వ ర్యాంక్), జడేజా (10వ ర్యాంక్) టాప్-10లో చోటు దక్కించుకున్నారు. బ్యాటింగ్ విభాగంలో ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్ (895) 'టాప్'లో కొనసాగుతుండగా... భారత్ నుంచి అత్యుత్తమంగా యశస్వి జైస్వాల్ (805) ఐదో ర్యాంక్‌లో ఉన్నాడు. భారత్‌తో సిరీస్‌లో దంచికొడుతున్న ఆస్ట్రేలియా స్టార్ ట్రవిస్ హెడ్ (825) ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానానికి చేరాడు.

గెలుపు పంచ్ ఎవరిదో?

ఆస్ట్రేలియా పర్యటనలో భారత జట్టు మరో కీలక పోరుకు సమాయత్తమైంది. 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లో భాగంగా మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)లో ప్రారంభం కానున్న నాలుగో టెస్టులో **కంగారూలను కట్టి పడేసేందుకు** టీమిండియా **అస్త్రశస్త్రాలు సిద్ధం** చేసుకుంది. ఈ ఏడాదిని **విజయంతో** ముగించడం... 'బోర్డర్-గావ**స్కర్ ట్రోఫీ**'ని చేజిక్కించుకోవడం... ప్రపం**చ టెస్టు** చాంపియన్‌షిప్ ఫైనల్ మార్గ**ం సుగమం** చేసుకోవడం అనే మూడు ప్రధాన **లక్ష్యాలతో** రోహిత్ బృందం మైదానంలో **అడుగు** పెట్టనుంది. గత రెండు పర్య**టనల్లో** మెల్‌బోర్న్‌లో జయకేతనం ఎగరవేసిన టీమిండియా ఈ మైదానంలో **'హ్యాట్రిక్'** విజయంపై కన్నేయగా... **భారత జోరుకు** అడ్డుకట్ట వేయాలని కంగా**రూలు** కృతనిశ్చయంతో ఉన్నారు. **మరింకెందుకు** ఆలస్యం రసవత్తర పోరును ఆస్వాదించేందుకు మీరూ సిద్ధమైపోండి!

నేటి నుంచి భారత్, ఆస్ట్రేలియా మధ్య 'బాక్సింగ్ డే' టెస్టు

- మెల్‌బోర్న్‌లో గత రెండు పర్యాయాలు టీమిండియాదే పైచేయి
- రోహిత్ బ్యాటింగ్ స్థానంపై కొనసాగుతున్న సందిగ్ధత
- ఉదయం 5 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

పిచ్, వాతావరణం

మెల్‌బోర్న్ పిచ్ పేస్‌కు అనుకూలం. వికెట్‌పై 6 మిల్లీమీటర్ల పచ్చిక ఉంటుందని క్యూరేటర్ వెల్లడించాడు. తొలి రోజు ఎండ అధికంగా ఉండనుంది. రెండో రోజు చిరు జల్లులు కురవొచ్చు. వర్షం వల్ల ఆటకు పెద్దగా ఆటంకం కలగకపోవచ్చు.

4 **భారత్ ఆస్ట్రేలియా** మధ్య మెల్‌బోర్న్‌లో ఇప్పటి **వరకు 14 మ్యాచ్**లు జరిగాయి. ఇందులో **భారత్ 4 టెస్టుల్లో గెలిచి**ంది. ఆస్ట్రేలియా 8 టెస్టుల్లో **విజయం సాధించింది.** మరో రెండు మ్యాచ్‌లు 'డ్రా'గా **ముగిశాయి.**

6 బుమ్రా మరో ఆరు వికెట్లు తీస్తే (44 టెస్టుల్లో) భారత్ తరఫున వేగంగా 200 వికెట్లు పడగొట్టిన రెండో బౌలర్ అవుతాడు. అశ్విన్ 37 టెస్టుల్లో ఈ మైలురాయి దాటాడు.

6 గత ఆరేళ్ల కాలంలో మెల్‌బోర్న్ మైదానంలో ఆరు సెంచరీలు మాత్రమే నమోదయ్యాయి.


రోహిత్
కోహ్లి

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

మెల్‌బోర్న్: గత రెండు 'బాక్సింగ్ డే' టెస్టుల్లోనూ ఆస్ట్రేలియాను చిత్తు చేసిన భారత జట్టు... ముచ్చటగా మూడోసారి కంగారూలను మట్టికరిపించేందుకు రెడీ అయింది. ప్రతిష్టాత్మక 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లో భాగంగా భారత్, ఆస్ట్రేలియా మధ్య గురువారం నుంచి నాలుగో టెస్టు ప్రారంభం కానుంది. ప్రఖ్యాత మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)లో జరగనున్న ఈ పోరుకు రికార్డు స్థాయిలో ప్రేక్షకులు తరలి రానుండగా... అశేష జనసందోహం ముందు ఆసీస్‌పై ఆధిపత్యం కనబర్చేందుకు రోహిత్ బృందం సిద్ధమైంది. ఈ సిరీస్‌లో ఇప్పటి వరకు మూడు మ్యాచ్‌లు జరగగా... ఇరు జట్లు 1-1తో సమంగా ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే... చివరి టెస్టు ఫలితంతో సంబంధం లేకుండా 'బోర్డర్-గావస్కర్' ట్రోఫీని చేజిక్కించుకుంటుంది. పెర్త్‌లో జరిగిన తొలి టెస్టులో ఘనవిజయం సాధించి సిరీస్‌లో బోణీ కొట్టిన భారత్... అడిలైడ్ వేదికగా జరిగిన రెండో టెస్టు (డే-నైట్)లో పరాజయం చవిచూసింది. బ్రిస్బేన్‌లో జరిగిన మూడో టెస్టుకు వర్షం అంతరాయం కలిగించగా... చివరకు మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. ప్రస్తుతానికి ఇరు జట్లు సమ ఉజ్జీగా ఉన్నాయి. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు అర్హత సాధించాలంటే... ఈ సిరీస్‌లో మిగిలిన రెండు టెస్టుల్లోనూ టీమిండియాకు విజయం తప్పనిసరి. ఈ నేపథ్యంలో భారత జట్టు మెల్‌బోర్న్‌లో శక్తియుక్తులన్నీ ధారపోయడానికి సిద్ధమైంది. అయితే కెప్టెన్ రోహిత్ శర్మ ఫామ్ టీమ్ మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది. స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోతున్న రోహిత్ ఏ స్థానంలో బరిలోకి దిగుతాడనేది ఆసక్తికరంగా మారింది. పేస్‌కు సహకరించే మెల్‌బోర్న్ పిచ్‌పై రోహిత్ ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడా... లేక మిడిలార్డర్‌లోనే కొనసాగుతాడా చూడాలి! మరోవైపు అరంగేట్ర సిరీస్‌లోనే తీవ్రంగా తడబడ్డ ఓపెనర్ మెక్‌స్వీనీని తప్పించిన ఆస్ట్రేలియా... టీనేజర్ స్యామ్ కొంటాస్‌ను ఓపెనర్‌గా ఎంపిక చేసింది. ఇక గాయం కారణంగా జట్టుకు దూరమైన హాజల్‌వుడ్ స్థానంలో బోలండ్ జట్టులోకి రానున్నాడు.

రోహిత్ రాణించేనా!

'జట్టు ప్రయోజనాల కోసం ఏ స్థానంలో బ్యాటింగ్ చేసేందుకైనా సిద్ధమే' అని రోహిత్ శర్మ ఇప్పటికే స్పష్టం చేసినా... 'హిట్‌మ్యాన్' మిడిలార్డర్‌లో బరిలోకి దిగడం వల్ల జట్టుకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు. వికెట్లు పడుతున్న దశలో క్రీజులోకి వచ్చిన రోహిత్ కనీసం ఎదురుదాడి చేసి ప్రత్యర్థి బౌలర్ల లయను దెబ్బతీసే ప్రయత్నం కూడా చేయకుండానే పెవిలియన్ బాట పట్టాడు. నాలుగో టెస్టులోనూ అతడు మిడిలార్డర్‌లోనే దిగే సూచనలున్నా... మంగళవారం ప్రాక్టీస్ సెషన్‌లో భారీ షాట్లు ప్రాక్టీస్ చేసిన రోహిత్ ఎలాంటి ప్రదర్శన కనబరుస్తాడనేది కీలకం. గత పదేళ్లుగా మెల్‌బోర్న్ స్టేడియంలో పరాజయం లేకుండా సాగుతున్న టీమిండియా... అదే జోరు కొనసాగించాలని చూస్తోంది. ఈ సిరీస్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగి భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన కేఎల్ రాహుల్‌పై భారీ అంచనాలు ఉండగా... యశస్వి జైస్వాల్, శుబ్‌మన్ గిల్ నిలకడ కొనసాగించాల్సిన అవసరముంది. కోహ్లికి మెల్‌బోర్న్‌లో మంచి రికార్డు ఉంది. తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీతో చెలరేగిన కోహ్లి... ఆ తర్వాత తన స్థాయికి తగ్గ ఇన్నింగ్స్ ఆడలేకపోయాడు. పదే పదే ఆఫ్‌స్టంప్ ఆవల పడ్డ బంతికి వికెట్ సమర్పించుకోవడం అభిమానులను కలవరపెడుతోంది. అయితే ప్రాక్టీస్‌లో దీనిపై దృష్టి పెట్టిన విరాట్... 'ఫోర్త్ స్టంప్' లోపాన్ని అధిగమించేందుకు గట్టిగానే ప్రయత్నించాడు. మిడిలార్డర్‌లో పంత్ మంచి టచ్‌లో ఉండగా... పేస్ ఆల్‌రౌండర్‌గా ఆంధ్ర కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి జట్టులో ఉండటం ఖాయమే. ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగాలని భావిస్తే వాషింగ్టన్ సుందర్ జట్టులోకి రావచ్చు. సహచరుల నుంచి పెద్దగా సహకారం లభించకపోయినా... ఒంటి చేత్తో బౌలింగ్ భారాన్ని మోస్తున్న ఏస్ పేసర్ బుమ్రా మరోసారి కీలకం కానున్నాడు. బుమ్రాతో కలిసి సిరాజ్, ఆకాశ్‌దీప్ పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), జైస్వాల్, రాహుల్, గిల్, కోహ్లి, పంత్, జడేజా, నితీశ్ రెడ్డి/సుందర్, ఆకాశ్ దీప్, బుమ్రా, సిరాజ్. **ఆస్ట్రేలియా:** కమిన్స్ (కెప్టెన్), ఖ్వాజా, సామ్ కొంటాస్, లబుషేన్, స్మిత్, హెడ్, మార్ష్, కేరీ, స్టార్క్, లయన్, బోలండ్.

హెడ్ ఆట కట్టిస్తేనే...


హెడ్

సొంతగడ్డపై ఆస్ట్రేలియా జట్టు కూడా కొన్ని సమస్యలతో సతమతమవుతోంది. వార్నర్ రిటైరయ్యాక సరైన ప్రత్యామ్నాయం లభించక ఇబ్బంది పడుతున్న ఆసీస్... ఈ సిరీస్ తొలి మూడు టెస్టులకు మెక్‌స్వీనీని ప్రయత్నించింది. అతడు విఫలమవ్వడంతో మరో యువ ఆటగాడు కొంటాస్ ను ఎంపిక చేసింది. లబుషేన్‌లో నిలకడ లోపించగా... గత మ్యాచ్‌లో సెంచరీతో స్టీవ్ స్మిత్ ఫామ్‌లోకి వచ్చాడు. వీళ్లంతా ఒకెత్తు అయితే... భారత్ పాలిట కొరకరాని కొయ్య మాత్రం ట్రవిస్ హెడ్ అనే చెప్పాలి. ఇటీవల టీమిండియాపై హెడ్ విజృంభిస్తున్న తీరు చూస్తుంటే మరోసారి అతడి నుంచి రోహిత్ జట్టుకు ప్రమాదం పొంచి ఉంది. బోలండ్‌కు సొంత మైదానమైన ఎంసీజీలో అతడికి ఘనమైన రికార్డు ఉంది. మరోవైపు స్టార్క్, కమిన్స్ బౌలింగ్‌లో ఏమరపాటుగా ఉంటే జరిగే నష్టం ఏంటో ఈ పాటికే టీమిండియాకు తెలిసొచ్చింది. ఈ నేపథ్యంలో ఎంసీజీ టెస్టులో మళ్లీ గెలవాలంటే టీమిండియా సమష్టిగా రాణించాల్సి ఉంటుంది.

సినిమా


● భార్యా పిల్లలతో విష్ణు మంచు


● నమ్రత ఘట్టమనేని

క్రిస్‌మస్త్

''మా కుటుంబంలో క్రిస్మస్ వేడుకలను మా అమ్మగారు మొదలుపెట్టారు. అది మాకూ అలవాటైంది. నాకు క్రిస్మస్ ట్రీని అలంకరించడం చాలా ఇష్టం. అది కూడా సన్నిహితులతో కలిసి. అయితే రెండేళ్లుగా ఒంటరిగా చేస్తున్నాను. క్రిస్మస్ ట్రీని డెకరేట్ చేయడం అనేది చాలా అర్థవంతంగా, ఆరోగ్యవంతంగా భావిస్తాను. కేక్ బేక్ చేయడం నాకు పెద్దగా తెలియనప్పటికీ ట్రై చేస్తుంటా'' అంటూ బ్లాక్ కలర్ థీమ్‌తో తయారు చేసిన క్రిస్మస్ ట్రీతో అదే రంగు దుస్తులు ధరించి, అందంగా ముస్తాబై, ఆ ఫొటోలను షేర్ చేశారు శ్రుతీహాసన్. ఇంకా నమ్రత ఘట్టమనేని, మంచు విష్ణు తన భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడితో పండగ సందర్భంగా క్లిక్‌మనిపించిన ఫొటోను షేర్ చేశారు. కృతీ శెట్టి ఎరుపు రంగు గౌను, టోపీతో అసలు సిసలైన పండగ వాతావరణంలోకి మారిపోయారు. జాన్వీ కపూర్ క్యూట్‌గా తయారై అందంగా అలంకరించిన క్రిస్మస్ ట్రీతో ఫొటో షేర్ చేశారు. ఇంకా ఈషా రెబ్బా, ప్రగ్యా జైస్వాల్, శివాత్మికా రాజశేఖర్ తదితరులు ఫొటోలు షేర్ చేశారు. ఇలా కొందరు సెలబ్రిటీలు క్రిస్‌మస్‌ని మస్త్‌గా చేసుకున్నారు.


● శ్రుతీహాసన్



● కృతీ శెట్టి


● జాన్వీ కపూర్


● ప్రగ్యా


● ఈషా రెబ్బా

కశ్మీర్‌లో యాక్షన్


● నాని

కశ్మీర్‌లో విలన్లను రఫ్ఫాడిస్తున్నారు నాని. ఆయన హీరోగా నటిస్తున్న చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధీ శెట్టి కథానాయిక. యునానిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి ప్రశాంతి త్రిపిర్నేని నిర్మిస్తున్నారు. ''క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రంలో అర్జున్ సర్కార్‌గా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు నాని. ప్రస్తుతం కశ్మీర్‌లో షూటింగ్ జరుగుతోంది. యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు టాకీ పార్ట్‌ని చిత్రీకరిస్తున్నాం. 2025 మే 1న సినిమాని విడుదల చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్, సంగీతం: మిక్కీ జె. మేయర్.

రెట్రో సూర్య



సూర్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'రెట్రో' అనే టైటిల్ ఖరారు చేశారు. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నారు. సూర్య, జ్యోతిక నిర్మిస్తున్నారు. ''సూర్య, సుబ్బరాజ్ కలయికలో వస్తున్న తొలి మూవీ ఇది. ఇంటెన్స్ యాక్షన్, రొమాన్స్, ఎమోషనల్ డెప్త్... వంటి అంశాలు మిళితమైన గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఈ చిత్రం రూపొందుతోంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: శ్రేయాస్ కృష్ణ, సంగీతం: సంతోష్ నారాయణన్.

అది దా సారు!

హీరోయిన్ మేఘా ఆకాశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'సః కుటుంబానాం'. ఉదయ్ శర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రామ్ కిరణ్ హీరోగా నటిస్తున్నారు. హెచ్. మహాదేవ గౌడ, హెచ్. నాగరత్న నిర్మిస్తున్నారు. మణిశర్మ సంగీతం అందిస్తున్న ఈ సినిమా నుంచి 'అది దా సారు...' పాట లిరికల్ వీడియోను నిర్మాత 'దిల్' రాజు విడుదల చేశారు. ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం ఇవ్వగా, భాను మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. ''కుటుంబ నేపథ్యంలో వస్తున్న మా 'సః కుటుంబానాం' టైటిల్‌తోనే అంచనాలు పెంచేసింది. 'అది దా సారు...' పాటలోని లిరిక్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: మధు దాసరి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రోహిత్ కుమార్ పద్మనాభ, లైన్ ప్రొడ్యూసర్: అంకిత్ కనయ్.


● మేఘా ఆకాశ్, రామ్ కిరణ్

అయ్యో రామ!


● సుహాస్, మాళవికా మనోజ్

సుహాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఓ భామ అయ్యో రామ'. రామ్ గోదాల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మాళవికా మనోజ్ హీరోయిన్. హరీష్ నల్ల నిర్మిస్తున్నారు. ఈ చిత్రం గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. ''లవ్, రొమాంటిక్ కామెడీ నేపథ్యంలో రూపొందుతోన్న చిత్రం ఇది. అందర్నీ నవ్వించే యువకుడి చుట్టూ తిరిగే కథ. హరీష్ నల్ల గొప్ప నిర్మాణ విలువలతో తెరకెక్కిస్తున్నారు'' అని యూనిట్ పేర్కొంది. అనిత హస్సానందాని, అలీ, ప్రభాస్ శ్రీను, బబ్లు పృథ్వీరాజ్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రధన్, కెమెరా: ఎస్. మణికందన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: ఆనంద్ గడగోని, ప్రదీప్ తల్లపురెడ్డి.

మార్కో యాక్షన్


● ఉన్ని ముకుందన్

ఉన్ని ముకుందన్ హీరోగా నటించిన చిత్రం 'మార్కో'. హనీఫ్ అదేని దర్శకత్వం వహించిన ఈ సినిమాలో యుక్తి తరేజా, కబీర్ దుహన్ సింగ్ ప్రధాన పాత్రధారులు. షరీఫ్ ముహమ్మద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 20న మలయాళంలో విడుదలైంది. ఈ చిత్రాన్ని ఎన్వీఆర్ సినిమా తెలుగులో జనవరి 1న రిలీజ్ చేస్తోంది. ''వయొలెంట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'మార్కో'. టైటిల్ రోల్‌లో ఉన్ని ముకుందన్ అద్భుతంగా నటించారు. ఈ సినిమా మలయాళంలో సంచలన విజయం సాధించింది. తెలుగు ప్రేక్షకులకు కూడా నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం, నేపథ్య సంగీతం: రవి బస్రూర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: జుమానా షరీఫ్, కెమెరా: చంద్రు సెల్వరాజ్.


చిన్న సినిమా బాగుంటేనే మనం బాగుంటాం

\- కిరణ్ తిరుమల శెట్టి

''ఇండస్ట్రీలో మనమంతా బతికేది చిన్న చిత్రాల వల్లే. అవి బాగుంటేనే మనం బాగుంటాం. మా 'డ్రింకర్ సాయి' నచ్చితే పది మందికి చెప్పండి.. నచ్చకుంటే వంద మందికి చెప్పండి'' అని డైరెక్టర్ కిరణ్ తిరుమల శెట్టి అన్నారు. ధర్మ, ఐశ్వర్యా శర్మ జంటగా నటించిన చిత్రం 'డ్రింకర్ సాయి'. బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరీధర్ నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) రిలీజవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో ఇస్మాయిల్ మాట్లాడుతూ– ''డ్రింకర్ సాయి'లో అన్ని భావోద్వేగాలున్నాయి'' అన్నారు. ''ప్రభాస్‌గారికి పెద్ద ఫ్యాన్‌ని. ఆయన్ని కలవగా.. 'డ్రింకర్ సాయి' సక్సెస్ కావాలని కోరడం సంతోషాన్నిచ్చింది'' అని ధర్మ తెలిపారు.


● కిరణ్, ఐశ్వర్య, ధర్మ

జనవరిలో కృష్ణ విజయం


● హెచ్. మధుసూదన్

సూపర్ స్టార్ కృష్ణ నటించిన చిత్రం 'ప్రేమ చరిత్ర-కృష్ణ విజయం'. హెచ్. మధుసూదన్ స్వీయ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో యశ్వంత్-సుహాసిని జంటగా నటించారు. ఈ చిత్రం జనవరి 3న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో హెచ్. మధుసూదన్ మాట్లాడుతూ–''కృష్ణగారితో సినిమా తీయడం నా అదృష్టం. అయితే ఆయన నటించిన ఆఖరి చిత్రం విడుదల కాని చిత్రాల జాబితాలో ఉండకూడదనే పట్టుదలతో వ్యయప్రయాసలకోర్చి ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నాం. ఈ చిత్రం కృష్ణగారి ఫ్యాన్స్‌తోపాటు అందర్నీ అలరించేలా ఉంటుంది'' అని చెప్పారు. కృష్ణ పర్సనల్ మేకప్‌మేన్ మాధవరావు, సహ నిర్మాత ఎం. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

యూత్‌ఫుల్ థ్రిల్లర్


● అనిల్, విహారికా

అనిల్ అర్కా, విహారికా చౌదరి జంటగా శ్రీ కృష్ణ దర్శకత్వం వహించిన చిత్రం 'వారధి'. పెయ్యాల భారతి, ఎం.డి. యూనస్ నిర్మించిన ఈ చిత్రం రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి అతిథిగా హాజరైన 'ఎర్రచీర' మూవీ డైరెక్టర్ సుమన్ మాట్లాడుతూ–''ఈ మూవీ ట్రైలర్ చూస్తే యూత్‌ను ఆకట్టుకునే రొమాంటిక్ థ్రిల్లర్‌లా ఉంది'' అన్నారు. ''ఇదో ఎమోషనల్ డ్రామా'' అని చెప్పారు శ్రీకృష్ణ.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (మంగళవారం ముగింపు)

సెన్సెక్స్ ▽	67	78,474
నిఫ్టీ ▽	26	23,728

విదేశీ సూచీలు (తొలి మూడు మంగళవారం ముగింపు)

● నాస్‌డాక్	20,031	△	266
● డోజోన్స్	43,297	△	391
● ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,137	△	34
● డాక్స్ (సోమవారం ముగింపు)	19,849		0
● షాంఘై	3,393	▽	1
● నికాయ్	39,130	△	94

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	84.70	85.72
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.40	108.21
€	యూరో	ఎస్‌బీఐ	87.30	89.89
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.27	54.92
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.04	54.21
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.36	65.04
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.82	23.38
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.31	24.09
¥	చైనా యువాన్	థామస్‌కుక్	12.62	10.80

అల్ట్రాటెక్ చేతికి ఇండియా సిమెంట్స్

అనుబంధ సంస్థగా ఆవిర్భావం ● ప్రమోటర్ శ్రీనివాసన్ రాజీనామా ● 55.49 శాతానికి అల్ట్రాటెక్ వాటా

న్యూఢిల్లీ: సిమెంట్ రంగ దిగ్గజం అల్ట్రాటెక్ తాజాగా ఇండియా సిమెంట్స్(ఐసీఎల్)లో ప్రమోటర్లకున్న 32.72 శాతం వాటాను సొంతం చేసుకుంది. దీంతో ఎన్.శ్రీనివాసన్‌సహా ఇతర ఇండియా సిమెంట్స్ ప్రమోటర్లు తమ పదవుల నుంచి తప్పుకున్నారు. ఐసీఎల్‌లో 10.13 కోట్ల షేర్ల(32.72 శాతం వాటా)ను ఆదిత్య బిర్లా గ్రూప్ దిగ్గజం అల్ట్రాటెక్ తాజాగా చేజిక్కించుకుంది. దీంతో ఐసీఎల్‌లో ఇప్పటికే 22.77 శాతం వాటా(7.05 కోట్ల షేర్లు) కలిగిన అల్ట్రాటెక్ దీంతో ప్రధాన ప్రమోటర్‌గా అవతరించింది. ఇండియా సిమెంట్స్‌లో వాటాను 55.49 శాతానికి(17.19 కోట్ల షేర్లు) పెంచుకుంది. వెరసి ఈ నెల 24 నుంచి అల్ట్రాటెక్‌కు అనుబంధ సంస్థగా ఐసీఎల్ ఆవిర్భవించింది. ఈ నేపథ్యంలో వైస్‌చైర్మన్, ఎండీ పదవులకు శ్రీనివాసన్ రాజీనామా చేసినట్లు ఐసీఎల్ వెల్లడించింది. అంతేకాకుండా ఆయన భార్య చిత్రా శ్రీనివాసన్, కుమార్తె రూపా గురునాథ్, వీఎం మోహన్ సైతం బోర్డు నుంచి తప్పుకున్నట్లు పేర్కొంది. ఈ బాటలో స్వతంత్ర డైరెక్టర్లు ఎస్.బాలసుబ్రమణ్యన్ ఆదిత్యన్, కృష్ణ శ్రీవాస్తవ, లక్ష్మీ అపర్ణ శ్రీకుమార్, సంధ్యా రాజన్ సైతం బుధవారం(25న) రాజీనామా చేసినట్లు తెలియజేసింది.

కొత్త డైరెక్టర్లు

కొత్తగా కేసీ జన్వర్, వివేక్ అగర్వాల్, ఈఆర్ రాజ్ నారాయణన్, అశోక్ రామచంద్రన్ డైరెక్టర్లుగా ఐసీఎల్ బోర్డు ఎంపిక చేసింది. స్వతంత్ర డైరెక్టర్లుగా అల్కా భరూచా, వికాస్ బాలియా, సుకన్య క్రిపాలు ఎంపికయ్యారు. ఐసీఎల్‌లో మెజారిటీ వాటా కొనుగోలు(రూ. 7,000 కోట్ల డీల్) ప్రతిపాదనకు కాంపిటీషన్ కమిషన్ గత వారం అల్ట్రాటెక్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతోపాటు ఓపెన్ ఆఫర్ ద్వారా ఐసీఎల్‌లో మరో 26% వాటాను సొంతం చేసుకునేందుకు సైతం అనుమతించింది.

ఏం జరిగిందంటే?

ఈ ఏడాది జూలై 28న ఐసీఎల్‌లో ప్రమోటర్ల నుంచి 32.72 శాతం వాటాను కొనుగోలు చేసేందుకు అల్ట్రాటెక్ సిమెంట్ ప్రతిపాదించింది. ఇందుకు రూ. 3,954 కోట్ల డీల్ కుదుర్చుకున్నట్లు అల్ట్రాటెక్ వెల్లడించింది. దీంతో నిబంధనల ప్రకారం ఐసీఎల్ వాటాదారుల నుంచి 26 శాతం వాటా కొనుగోలు(రూ. 3,142 కోట్ల విలువ)కు ఓపెన్ ఆఫర్ సైతం ప్రకటించింది. తద్వారా వేగవంత వృద్ధితో పాటు, తీవ్ర పోటీ నెలకొన్న దక్షిణాది సిమెంట్ మార్కెట్లో విస్తరించేందుకు ప్రణాళికలు అమలు చేసింది. మరోపక్క అంతకుముందే అంటే జూన్ కల్లా ఐసీఎల్‌లో 23 శాతం వాటాను అల్ట్రాటెక్ సొంతం చేసుకుంది. ఈ బాటలో సుమారు రూ. 1,900 కోట్లు వెచ్చించి రెండు బ్లాక్‌డీల్స్ ద్వారా ఐసీఎల్‌లో డీమార్ట్ రిటైల్ స్టోర్ల దమానీ గ్రూప్‌నకు గల వాటాను చేజిక్కించుకుంది.



కన్సాలిడేషన్ బాట..

దేశీయంగా సిమెంట్ పరిశ్రమ కన్సాలిడేషన్ బాటలో సాగుతున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. ప్రధానంగా కుమార మంగళం బిర్లాకు చెందిన ఆదిత్య బిర్లా గ్రూప్, గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ పోటీ పడుతున్నాయి. చిన్న సిమెంట్ కంపెనీలను కొనుగోలు చేస్తున్నాయి. ఆదిత్య బిర్లా గ్రూప్ 2026–27కల్లా వార్షికంగా 200 టన్నుల(ఎంటీపీఏ) సామర్థ్యంతో టాప్ ర్యాంకులో నిలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు అదానీ గ్రూప్ 2027–28కల్లా సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 140 ఎంటీపీఏకు పెంచుకునే ప్రణాళికల్లో ఉంది. అల్ట్రాటెక్ ప్రస్తుత సామర్థ్యం 156.66 ఎంటీపీఏగా ఉంది. ఇప్పటికే సంఘీ ఇండస్ట్రీస్, పెన్నా ఇండస్ట్రీస్‌ను సొంతం చేసుకున్న అదానీ సిమెంట్ ఇటీవలే సీకే బిర్లా గ్రూప్ కంపెనీ ఓరియంట్ సిమెంట్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఈ ఏడాది(2024–25) 100 ఎంటీపీఏను అందుకోనుంది. ఇదేవిధంగా అల్ట్రాటెక్ కేశోరామ్ ఇండస్ట్రీస్ సిమెంట్ బిజినెస్‌పై దృష్టి పెట్టింది. కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసేందుకు నియంత్రణ సంస్థల అనుమతుల కోసం ఎదురు చూస్తోంది.

డిజిటల్ ఇండియాకు బ్లాక్‌చెయిన్ దన్ను

- ఫైనాన్స్, హెల్త్‌కేర్ రంగాల్లో మా సొంత టెక్నాలజీతో ప్రయోజనాలు
- అల్గోరాండ్ ఇండియా కంట్రీ హెడ్ అనిల్ కాకాని



సాక్షి ఇంటర్వ్యూ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ సంస్థ అల్గోరాండ్ భారత్‌లో కార్యకలాపాలను మరింతగా విస్తరించడంపై దృష్టి పెడుతోంది. డిజిటల్ ఇండియా లక్ష్య సాకారానికి తమ సాంకేతికత ఊతమివ్వగలదని సంస్థ వైస్ ప్రెసిడెంట్, ఇండియా కంట్రీ హెడ్ అనిల్ కాకాని సాక్షి బిజినెస్ బ్యూరోకు తెలిపారు. ఫైనాన్స్, ఆరోగ్య సంరక్షణ తదితర రంగాల్లో బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో గణనీయంగా ప్రయోజనాలు చేకూరగలవని వివరించారు. మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే..

దేశీయంగా వివిధ రంగాల్లో పలు సవాళ్లను పరిష్కరించేందుకు అల్గోరాండ్ బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ వాడుతున్నారు. ఉదాహరణకు మహిళల సారథ్యంలోని ఎంఎస్ఎంఈలకు కొత్త ఆర్థిక వనరులను అందుబాటులోకి తెచ్చేందుకు ఒక పెద్ద సహకార బ్యాంకు ప్రత్యామ్నాయ క్రెడిట్ స్కోరుకార్డ్‌ను రూపొందిస్తోంది. అలాగే, సెల్ఫ్ ఎంప్లాయ్డ్ ఉమెన్స్ అసోసియేషన్ (సేవా) తమ సభ్యుల కోసం డిజిటల్ హెల్త్ స్కోర్‌కార్డును ప్రయోగాత్మకంగా పరీక్షిస్తోంది. ఇలాంటివి అందరికీ ఆర్థిక సేవలను, ఆరోగ్య సంరక్షణ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ఉపయోగపడేవే. ఇక సప్లై చెయిన్‌లో పారదర్శకత సాధించేందుకు, పర్యావరణహిత ప్రాజెక్టులకు ఫైనాన్స్ చేసేందుకు, ఇతరత్రా ప్రజలకు మేలు చేకూర్చే పలు అంశాల్లో ఈ టెక్నాలజీ ఉపయోగపడగలదు. బ్లాక్‌చెయిన్ ఆధారిత గుర్తింపు ధృవీకరణ సొల్యూషన్స్, ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ మొదలైన వాటిపై మేము ప్రధానంగా దృష్టి పెడుతున్నాం. రోడ్ టు ఇంపాక్ట్, స్టార్టప్ ల్యాబ్‌లాంటి కార్యక్రమాలు స్థానికంగా ప్రతిభావంతులను, ఎంట్రప్రెన్యూర్లను ప్రోత్సహించే విధంగా ఉంటున్నాయి. ఇవన్నీ డిజిటల్ ఇండియా లక్ష్య సాకారానికి తోడ్పడతాయి.

అల్గోరాండ్ టెక్నాలజీతో ప్రధానంగా ఫైనాన్స్, సప్లై చెయిన్, హెల్త్‌కేర్, సస్టైనబిలిటీ వంటి కీలక రంగాలు లబ్ధి పొందగలవు. ఫైనాన్స్ విషయానికొస్తే అల్గోరాండ్ బ్లాక్‌చెయిన్ టెక్నాలజీవల్ల లావాదేవీలను వేగవంతంగా, సురక్షితంగా నిర్వహించవచ్చు. పారదర్శకత వల్ల సినిమాల నిర్మాణానికి, సీమాంతర వాణిజ్యానికి అవసరమయ్యే నిర్వహణ మూలధనాన్ని సమకూర్చుకునేందుకు మరిన్ని వనరులు అందుబాటులోకి రాగలవు. సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్‌ను చూస్తే ఏఆర్‌వీవో, ఎల్‌డబ్ల్యూ3 లాంటి కంపెనీలు మా టెక్నాలజీని ఉపయోగిస్తున్నాయి. హెల్త్‌కేర్ విభాగంలో ప్రభుత్వ పథకాలను అట్టడుగు వర్గాలకు కూడా చేర్చడంలో సేవా వంటి సంస్థల కార్యకలాపాలకు ఇది తోడ్పడుతోంది. టెరానోలాంటి సస్టైనబిలిటీ ప్రాజెక్టుల్లో దీన్ని ఉపయోగిస్తున్నారు. టెక్నాలజీ దన్నుతో సమ్మిళిత వృద్ధి సాధించే దిశగా టీ–హబ్, మన్ దేశీ ఫౌండేషన్ తదితర సంస్థలతో కలిసి పని చేస్తున్నాం.

భారత్‌లో ప్రాజెక్టులు..

టీ–హబ్‌లో మా స్టార్టప్ ల్యాబ్ అనేది టెరానో, ఆస్ట్రిక్స్, ఫిల్మ్ ఫైనాన్స్, ఎల్‌డబ్ల్యూ3లాంటి బ్లాక్‌చెయిన్ అంకుర సంస్థలకు తోడ్పాటు అందిస్తోంది. 2024 స్టార్టప్ ల్యాబ్‌లో తొలి బ్యాచ్ కంపెనీల్లో ఇప్పటికే అయిందింటిలో ఇన్వెస్ట్ చేసింది. 2025లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. బ్లాక్‌చెయిన్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు నాస్కామ్ వంటి సంస్థలతో కూడా కలిసి పని చేస్తున్నాం.

ప్రణాళికలు..

స్టార్టప్ ల్యాబ్‌లలో మరిన్ని కొత్త బ్యాచ్‌లు ప్రారంభించడం, ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమ దిగ్గజాలతో వ్యూహాత్మక భాగస్వామ్యాలను కుదుర్చుకోవడం తదితర ప్రయత్నాల ద్వారా భారత్‌లో కార్యకలాపాలను మరింతగా విస్తరించేందుకు అల్గోరాండ్ కట్టుబడి ఉంది. రోడ్ టు ఇంపాక్ట్ వంటి కార్యక్రమాలను విస్తరించడం, భారతదేశపు విశిష్టమైన సవాళ్లను పరిష్కరించేందుకు మరిన్ని బ్లాక్‌చెయిన్ ఆధారిత ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్స్‌ను ఆవిష్కరించడంపైనా దృష్టి పెడుతున్నాం.

డెవలపర్లకు తోడ్పాటు..

రోడ్ టు ఇంపాక్ట్ లాంటి కార్యక్రమాలతో డెవలపర్లు, ఎంట్రప్రెన్యూర్లకు తోడ్పాటు అందించడంపై అల్గోరాండ్ ఇన్వెస్ట్ చేస్తోంది. 2024లో హైదరాబాద్‌లోని తొలి అల్గోరాండ్ స్టార్టప్ ల్యాబ్‌లో 21 అంకుర సంస్థలు పాల్గొన్నాయి. మరో ఇరవై అంకుర సంస్థలు 2025 నాటికి ప్రోడక్ట్, మార్కెట్, ఇన్వెస్ట్‌మెంట్ అంశాలకు సంబంధించి సన్నద్ధంగా ఉంటాయి. దేశవ్యాప్తంగా యూనివర్సిటీ క్యాంపస్‌లలో సుమారు 70 అల్గోరాండ్ బ్లాక్‌చెయిన్ క్లబ్‌లతో యువ డెవలపర్లకు అవసరమైన వనరులు, మెంటార్‌షిప్, పోటీపడే అవకాశాలను అందిస్తున్నాం.

కొత్తగా 10,000 కోఆపరేటివ్ సొసైటీలు



కార్యక్రమంలో ఒక సొసైటీ ప్రతినిధికి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ అందిస్తున్న మంత్రి అమిత్‌షా

- ప్రారంభించిన కేంద్ర మంత్రి అమిత్‌షా
- ఐదేళ్లలో 2 లక్షల సొసైటీల ఏర్పాటు లక్ష్యం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా బుధవారం ఒక్కరోజే 10,000 బహుళ ప్రయోజన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (కోఆపరేటివ్ సొసైటీలు/ఎం-పీఏసీఎస్) ఏర్పాటయ్యాయి. కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్ షా వీటిని ప్రారంభించారు. వచ్చే ఐదేళ్ల కాలంలో 2 లక్షల ఎం-పీఏసీఎస్‌లను ఏర్పాటు చేయాలన్నది కేంద్ర ప్రభుత్వం లక్ష్యమని పంచాయతీ స్థాయిలో కోఆపరేటివ్ సొసైటీలు సమర్ధవంతంగా పనిచేస్తే తప్పించి వీటి ద్వారా ఆశించిన సంపద సృష్టి సాధ్యపడదని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. సహకార రంగంలో డిజిటలైజేషన్ ప్రాధాన్యాన్ని మంత్రి గుర్తు చేశారు. ఇప్పటికే అన్ని పీఏసీఎస్‌లను కంప్యూటరీకరించి, వాటిని అనుసంధానించినట్టు చెప్పారు. కొత్తగా ఏర్పాటు చేసిన సొసైటీలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌లు, మైక్రో ఏటీఎంలు, రూపే కిసాన్ కార్డులను ఈ సందర్భంగా అందించారు.

ద్రవ్యలోటు కట్టడికి ప్రాధాన్యం: ఆర్థికశాఖ



న్యూఢిల్లీ: ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1వ తేదీన లోక్‌సభలో 2025–26 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఆర్థికశాఖ కీలక డాక్యుమెంటును ఆవిష్కరించింది. బడ్జెట్ లక్ష్యాలను ఈ డాక్యుమెంట్‌లో సూచించింది. 4.5 శాతం వద్ద ద్రవ్యలోటు కట్టడి, పేదల అవసరాలకు అనుగుణంగా సామాజిక భద్రతా చర్యలకు పెద్దపీట వేయడం.. ఇందులో కీలక అంశాలుగా ఉన్నాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
మూడేళ్లలో మూడింతల ఆదాయం: గోమెకానిక్ / ట్రంప్ హయాంలో ఎగుమతులు పెరిగే చాన్స్

ఐపీవోకు ఇండిక్యూబ్ స్పేసెస్



న్యూఢిల్లీ: వర్క్‌ప్లేస్ సొల్యూషన్స్ కంపెనీ ఇండిక్యూబ్ స్పేసెస్ పబ్లిక్ ఇష్యూ బాటలో సాగుతోంది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా రూ. 750 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో రూ. 100 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ హిస్టరీ
» టెట్/డీఎస్సీ ప్రత్యేకం–ఇంగ్లిష్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–డిజాస్టర్ మేనేజ్‌మెంట్
» బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం– రీజనింగ్

విద్య, ఉద్యోగ సమాచారం

జేఈఈ(అడ్వాన్స్‌డ్)-2025 పరీక్ష

దేశవ్యాప్తంగా ఉన్న 23 ఐఐటీల్లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి బీటెక్, బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశాలకు జేఈఈ (అడ్వాన్స్‌డ్) పరీక్ష నోటిఫికేషన్ వెలువడింది. ఈ పరీక్షను ఐఐటీ కాన్పూర్ నిర్వహిస్తుంది.

» **అర్హత:** జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాయడానికి అర్హులు. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి రెండుసార్లు మాత్రమే పరీక్షకు అనుమతి ఉంటుంది. అంటే ఇంటర్ పాసైన సంవత్సరంతో పాటు ఆ తర్వాత ఏడాది మాత్రమే ఈ పరీక్ష రాయడానికి అవకాశం ఉంటుంది. మే నెలలో జరిగే అడ్వాన్స్‌డ్ పరీక్షకు 2024 మార్చి, 2025 మార్చిలో జరిగే ఇంటర్ లేదా తత్సమానమైన పరీక్షల్లో పాసైన వారు మాత్రమే అర్హులు. అంతకంటే ముందు ఉత్తీర్ణులైనవారికి అవకాశం ఉండదు.

» **వయసు:** అభ్యర్థులు 01.10.2000 లేదా తర్వాత జన్మించి ఉండాలి. ఎస్సీ,ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు ఐదేళ్ల వయసు సడలింపు ఉంటుంది.

» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తారు. మొత్తం రెండు పేపర్లు ఉంటాయి. అవి.. పేపర్–1, పేపర్–2. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి. ఇంగ్లిష్, హిందీ భాషల్లో ప్రశ్నాపత్రం ఉంటుంది. ఒక్కో పేపర్‌కు పరీక్ష సమయం మూడు గంటలు.

ముఖ్యమైన తేదీలు

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది: 23.04.2025
» ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది: 02.05.2025
» ఫీజు చెల్లింపునకు చివరితేది: 05.05.2025.
» అడ్వాన్స్‌డ్ పరీక్ష తేది: 18.05.2025.
» వెబ్‌సైట్: https://jeeadv.ac.in

తెలంగాణ గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశాలు

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్‌డబ్ల్యూ ఆర్ఈఐఎస్, టీజీటీడబ్ల్యూఆర్ఈఐఎస్, ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్, టీజీఆర్ఈఐఎస్).. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదో తరగతి (ఇంగ్లిష్ మీడియం)లో ప్రవేశాలకు అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, బాలబాలికలు నుంచి దరఖాస్తులు కోరుతోంది. గురుకులాల్లో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుంది.

» **అర్హత:** విద్యార్థులు సంబంధిత జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో నాలుగో తరగతి 2024–25 విద్యా సంవత్సరంలో చదివి ఉండాలి. జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి సంబంధిత జిల్లాలోని పాఠశాలల్లో చదువుతూ ఉండాలి.

» **వయసు:** ఓసీ, బీసీ విద్యార్థులు 9 నుంచి 11 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 9 నుంచి 13 ఏళ్ల మధ్య ఉండాలి. విద్యార్థి తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతం రూ. 1,50,000, పట్టణ ప్రాంతం రూ.2,00,000 మించకూడదు.

» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్షలో ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.

» **పరీక్ష విధానం:** ప్రవేశ పరీక్ష మొత్తం 100 మార్కులకు ఆబ్జెక్టివ్ పద్ధతిలో ఓఎంఆర్ షీట్ విధానంలో నిర్వహిస్తారు. తెలుగు (20 మార్కులు), ఇంగ్లిష్ (25 మార్కులు), గణితం (25 మార్కులు), మెంటల్ ఎబిలిటీ (10 మార్కులు), పరిసరాల విజ్ఞానం (20 మార్కులు) సబ్జెక్టుల నుంచి నాలుగో తరగతి స్థాయిలో ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నాపత్రం తెలుగు/ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుంది.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 01.02.2025
» **ప్రవేశ పరీక్ష తేది:** 23.02.2025.
» **వెబ్‌సైట్:** https://tgcet.cgg.gov.in

ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్, తమిళనాడులో ఎలక్ట్రిషియన్ పోస్టులు

తమిళనాడులోని నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్(ఎన్ఎల్‌సీ) ఎలక్ట్రీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 07.
» **పోస్టుల వివరాలు:** ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్–04, ఎలక్ట్రీషియన్–03.
» **అర్హత:** పదో తరగతి, ఐటీఐ, సంబంధిత విభాగంలో ఫుల్‌టైం డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
వయసు: 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్ పోస్టుకు రూ.38,000, ఎలక్ట్రీషియన్‌కు రూ.30,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.12.2024
» **వెబ్‌సైట్:** https://www.nlc-india.in

నవతరం కెరీర్.. ప్రాంప్ట్ ఇంజనీరింగ్!

ఆధునిక టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతోంది. చాట్ జీపీటీ, ఏఐతో క్షణాల్లో కోరుకున్న సమాచారం ప్రత్యక్షమవుతోంది. ఇదే ఇప్పుడు యువతకు సరికొత్త కెరీర్ అవకాశాలకు మార్గం వేస్తోంది. ఆ అవకాశాల పేరే.. ప్రాంప్ట్ ఇంజనీరింగ్! ఇందులో నైపుణ్యాలుంటే నేటి ఏఐ యుగంలో.. ఎవర్‌గ్రీన్ కెరీర్స్ సొంతం చేసుకోవచ్చు!! ఇటీవల కాలంలో.. సంస్థల్లో ఏఐ విభాగాల్లో..ప్రాంప్ట్ ఇంజనీర్స్ నియామకాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో.. ప్రాంప్ట్ ఇంజనీరింగ్ అంటే ఏమిటి.. వీరికి ఎలాంటి ఉద్యోగాలు లభిస్తాయి.. ఇందులో రాణించేందుకు ఎలాంటి నైపుణ్యాలు కావాలి.. వాటిని అందుకోవడానికి మార్గాలు తదితర అంశాలపై విశ్లేషణ..

» ఏఐ విప్లవంతో ప్రాంప్ట్ ఇంజనీర్లకు డిమాండ్
» కోడింగ్, ప్రోగ్రామింగ్‌పై పట్టుతో ఉద్యోగావకాశాలు
» యువతకు సరికొత్త కెరీర్ మార్గంగా ప్రాంప్ట్ ఇంజనీరింగ్

ప్రాంప్ట్ ఇంజనీరింగ్ అంటే

ప్రాంప్ట్ ఇంజనీరింగ్.. ఇటీవల కాలంలో సాఫ్ట్‌వేర్ రంగంలో తరచూ వినిపిస్తున్న మాట! దీంతో అసలు ప్రాంప్ట్ ఇంజనీరింగ్ అంటే ఏమిటి? అనే ప్రశ్న ఎదురవుతుంది. ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ సంస్థలు ఏఐ ఆధారిత సేవలు అందిస్తున్నాయి. అదే సమయంలో వ్యక్తులు సైతం తమకు అవసరమైన సమాచారం కోసం చాట్ జీపీటీ, గూగుల్ సెర్చ్ తదితర టూల్స్‌ను వినియోగిస్తున్నారు.

పాఠకులు అడిగే ప్రశ్నలు, సందేహాలకు చాట్ జీపీటీ, ఏఐ టూల్స్ క్షణాల్లో సమాధానాలు ఇస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో మనం అడిగే ప్రశ్నలు లేదా సమాచారం ఇన్‌పుట్ సరిగా లేకపోతే కచ్చితత్వంతో కూడిన సమాధానం లభించదు. దీంతో సంబంధిత వ్యక్తులు గందరగోళానికి గురయ్యే పరిస్థితులు ఏర్పడతాయి. దీనికి పరిష్కారంగా తెరపైకి వచ్చిన సాంకేతికతే.. ప్రాంప్ట్ ఇంజనీరింగ్.

కచ్చితమైన సమాచారం

వ్యక్తులు లేదా వినియోగదారులు ఏఐ టూల్స్ వినియోగించి అడిగే ప్రశ్నలకు కచ్చితమైన సమాచారాన్ని ఇచ్చే విధంగా సదరు టూల్స్‌ను తీర్చిదిద్దడమే.. ప్రాంప్ట్ ఇంజనీరింగ్ ప్రత్యేకత. ఒక విభాగానికి సంబంధించి వినియోగదారులు ఎలాంటి ప్రశ్నలు అడగొచ్చు? ఏ భాషలో ప్రశ్నలు అడిగితే ఎలా స్పందించాలి? ఎలాంటి ప్రశ్నకు ఎలాంటి సమాధానం ఇవ్వాలి? తదితర అంశాలను ముందుగానే గుర్తించి.. దానికి అనుగుణంగా ఏఐ టూల్స్‌ను సమర్థవంతంగా తీర్చిదిద్దడమే ప్రాంప్ట్ ఇంజనీరింగ్. అంటే.. ప్రాంప్ట్ ఇంజనీరింగ్ ద్వారా కచ్చితత్వంతో కూడిన సమాధానాలను వినియోగదారులకు అందిస్తారు. ఉదాహరణకు ఒక సంస్థ చాట్‌బోట్ ద్వారా కస్టమర్ సపోర్ట్ సేవలు అందిస్తే.. ఆ సేవలు, ఉత్పత్తులకు సంబంధించి సరైన సమాచారాన్ని ఇచ్చే విధంగా ప్రాంప్ట్ ఇంజనీరింగ్ నైపుణ్యం ఉపయోగపడుతుంది. అందుకే ఇప్పుడు సంస్థలు ప్రాంప్ట్ ఇంజనీరింగ్‌కు, అందులో నైపుణ్యాలున్న వారికి ప్రాధాన్యం ఇస్తున్నాయి.

ఏఐ టూల్స్ డిజైనింగ్

ప్రాంప్ట్ ఇంజనీరింగ్‌లో మరో ముఖ్యమైన అంశం.. ప్రాంప్ట్స్‌కు సంబంధించి ఏఐ టూల్స్ డిజైనింగ్, స్ట్రక్చరింగ్, ప్రోగ్రామింగ్, కోడింగ్‌లను రూపొందించడం. ఇందులో నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, నేచురల్ లాంగ్వేజ్ అండర్ స్టాండింగ్ వంటివి వినియోగిస్తారు. ఆయా భాషలకు సంబంధించిన అంశాలను లోతుగా విశ్లేషిస్తారు. వీటన్నింటి ద్వారా ఏఐ మోడల్స్ ఆధారంగా వినియోగదారులు అడిగే ప్రశ్నలకు కచ్చితత్వంతో కూడిన సమాచారం, సమాధానం ఇచ్చేలా సదరు ఏఐ టూల్స్‌ను రూపొందిస్తారు.

కీలక నైపుణ్యాలు

ప్రాంప్ట్ ఇంజనీరింగ్‌లో కెరీర్ కోరుకునే వారికి రెండు నైపుణ్యాలు కీలకంగా మారుతున్నాయి. అవి..ప్రోగ్రామింగ్, డేటా అనాలిసిస్. ఎందుకంటే.. ఆయా ప్రాంప్ట్‌లకు సంబంధించి ఏఐ టూల్స్ సమర్థంగా పని చేయాలంటే.. అందుకు తగిన సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామింగ్‌ను రూపొందించాల్సి ఉంటుంది. అదే విధంగా.. సదరు సంస్థలకు సంబంధించిన సేవలు, ఉత్పత్తులు, వినియోగదారుల డేటాను విశ్లేషించాల్సి ఉంటుంది. ఈ విశ్లేషణ ఆధారంగా ఆయా ఉత్పత్తులకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని రూపొందించడానికి వీలవుతుంది. అందుకే డేటా అనాలిసిస్ నైపుణ్యాలు ప్రాంప్ట్ ఇంజనీర్‌గా కెరీర్ కోరుకునే వారికి ఎంతో కీలకంగా మారుతున్నాయి. ప్రోగ్రామింగ్, డేటా అనాలిసిస్ స్కిల్స్‌తో పాటు ఆయా భాషలపై పరిజ్ఞానం, ప్రాబ్లమ్ సాల్వింగ్, టీమ్ వర్కింగ్ స్కిల్స్ ఉంటే ప్రాంప్ట్ ఇంజనీర్‌గా మరింత సమర్థవంతంగా రాణించే అవకాశం ఉంటుంది.

సీఎస్ఈ విద్యార్థులకు అనుకూలం

ప్రాంప్ట్ ఇంజనీరింగ్‌లో కెరీర్ కోరుకునే వారికి అకడమిక్‌గా టెక్నికల్ నేపథ్యం ఉంటే మరింత సులువుగా విధులు నిర్వర్తించే అవకాశం ఉంటుంది. కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్‌లలో బీటెక్ ఉత్తీర్ణులు ఈ జాబ్ ప్రొఫైల్‌కు సరితూగుతారని నిపుణులు పేర్కొంటున్నారు. ఎందుకంటే వీరికి అకడమిక్‌గా ప్రోగ్రామింగ్, కోడింగ్‌పై అవగాహన ఉంటుంది. దీంతో ప్రాంప్ట్స్ రూపకల్పనలో ముందంజలో నిలిచే ఆస్కారం ఉంటుంది.



సర్టిఫికేషన్స్

ప్రాంప్ట్ ఇంజనీర్‌గా కెరీర్ కోరుకునే వారు నిర్దేశిత సర్టిఫికేషన్స్ పూర్తి చేయడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. నెట్‌వర్క్ సెక్యూరిటీ ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, సర్టిఫైడ్ సెలీనియం ప్రొఫెషనల్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, యాక్సెసిబిలిటీ టెస్టింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, పైథాన్, డేటా సైన్స్ వంటి విభాగాల్లో సర్టిఫికేషన్స్ పూర్తి చేసుకుంటే.. ప్రాంప్ట్ ఇంజనీరింగ్‌లో మరింత సమర్థవంతంగా రాణించేందుకు వీలవుతుంది. ప్రస్తుతం ఈ కోర్సులను ఉడెమీ, కోర్సెరా వంటి సంస్థలు అందిస్తున్నాయి. అదే విధంగా పలు ఐటీ సంస్థలు తమ సిబ్బందికి అంతర్గత శిక్షణ ద్వారా ప్రాంప్ట్ ఇంజనీరింగ్ స్కిల్స్‌పై అవగాహన కల్పిస్తున్నాయి.

విస్తృత అవకాశాలు

ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ ఏఐ టెక్నాలజీ, చాట్‌బోట్, ఇతర వర్చువల్ అసిస్టెంట్ టూల్స్ వినియోగం పెరుగుతోంది. దీంతో ప్రాంప్ట్ ఇంజనీర్స్‌కు కెరీర్ అవకాశాలు విస్తృతంగా లభిస్తున్నాయి. ఏఐ కాంట్రాక్ట్ రివ్యూ ఫర్మ్స్, ఫిన్‌టెక్, ఎడ్ టెక్, సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఎక్కువగా ఉద్యోగాలు అందుకునే వీలుంది.

ఆకర్షణీయ వేతనాలు

ప్రాంప్ట్ ఇంజనీర్లకు సంస్థలు ఆకర్షణీయ వేతనాలను అందిస్తున్నాయి. ఎంట్రీ లెవల్‌లో ఏడాదికి రూ.6 లక్షల వరకు; రెండు నుంచి అయిదేళ్ల అనుభవంతో మిడిల్ లెవల్‌లో కనిష్టంగా రూ.6 లక్షలు–గరిష్ఠంగా రూ.12 లక్షల వార్షిక వేతనం పొందే అవకాశం ఉంది. అయిదేళ్లకు పైగా అనుభవంతో సీనియర్ లెవల్‌లో గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు వార్షిక వేతనం సొంతం చేసుకోవచ్చు. అంతర్జాతీయ స్థాయిలో అమెరికాలో సగటున 2.3 లక్షల డాలర్ల వార్షిక వేతనంతో ప్రాంప్ట్ ఇంజనీర్లను సంస్థలు నియమించుకుంటున్నాయి.

పెరుగుతున్న డిమాండ్

ప్రాంప్ట్ ఇంజనీర్లకు అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ పెరుగుతోంది. లింక్డ్ఇన్ సర్వే ప్రకారం –ఈ ఏడాది చివరికి చాట్‌బోట్, చాట్ జీపీటీ, ఇతర మెసేజింగ్ ప్లాట్‌ఫామ్స్‌ను వినియోగించే వారి సంఖ్య 2.5 బిలియన్లకు చేరుకోనుంది. ఆయా సంస్థలు ప్రాంప్ట్ ఇంజనీర్లను భారీ స్థాయిలో నియమించుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. ఏఐ విభాగంలో ప్రాంప్ట్ ఇంజనీర్ల భాగస్వామ్యం పెరుగుతోందని, గత రెండేళ్లలో ప్రాంప్ట్ ఇంజనీర్ల నియామకం 51 శాతం పెరిగిందని ఓ ప్రముఖ సర్వే పేర్కొంది.

టాప్ కెరీర్స్ జాబితాలో

ప్రాంప్ట్ ఇంజనీరింగ్ టాప్–5 కెరీర్స్ జాబితాలో నిలుస్తోంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం విడుదల చేసిన ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ ప్రకారం–గత ఏడాది సరికొత్త ఉద్యోగావకాశాల్లో నెంబర్ 1 జాబ్‌గా ప్రాంప్ట్ ఇంజనీరింగ్ విభాగాన్ని పేర్కొంది. 2025 నాటికి ఏఐ నియామకాల్లో ప్రాంప్ట్ ఇంజనీరింగ్ విభాగంలో 30 శాతం మేరకు ఉద్యోగాలు ఉంటాయని వెల్లడించింది.

ప్రాంప్ట్ ఇంజనీరింగ్.. సర్టిఫికేషన్స్

నెట్‌వర్క్ సెక్యూరిటీ ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్ డెవలపర్; సర్టిఫైడ్ సెలీనియం ప్రొఫెషనల్; సాఫ్ట్‌వేర్ టెస్టింగ్; యాక్సెసిబిలిటీ టెస్టింగ్; ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్;పైథాన్,డేటా సైన్స్.

అవసరమైన నైపుణ్యాలు

డేటా అనాలిసిస్, ప్రోగ్రామింగ్ స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలు, నేచురల్ లాంగ్వేజ్ స్కిల్స్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, నేచురల్ లాంగ్వేజ్ అండర్ స్టాండింగ్ స్కిల్స్, రీసెర్చింగ్ స్కిల్స్.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న త్రివిక్రమ్ శ్రీనివాస్, మామిడి హరికృష్ణ తదితరులు



'మన సినిమా-ఫస్ట్ రీల్' ఓ పరిశోధనా గ్రంథం

- సినీ రంగంపై రెంటాల జయదేవ్ రాసిన పుస్తకానికి.. దర్శకుడు త్రివిక్రమ్ ప్రశంస

కవాడిగూడ: ప్రముఖ సినీ రచయిత రెంటాల జయదేవ రచించిన 'మన సినిమా- ఫస్ట్ రీల్'పుస్తకం చలనచిత్ర పరిశ్రమపై పరిశోధనాత్మక గ్రంథమని సినీ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ అన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న 37వ జాతీయ పుస్తక ప్రదర్శనలో బుధవారం ఈ పుస్తక పరిచయ గోష్ఠిని డాక్టర్ బోయి విజయ భారతి వేదికపై నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, ఐఆర్ఎస్ అధికారి కృష్ణ కౌండిన్య, తెలుగు భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. రెంటాల జయదేవ్‌కు సినిమాలంటే అమితాసక్తి ఉండటం వల్లనే ఈ పుస్తకం రాయగలిగారని ప్రశంసించారు. ఆయన మరిన్ని పుస్తకాలు రాయాలని ఆకాంక్షించారు. తెలుగు సినిమా చరిత్రను తెలుసుకోవాలంటే ఈ పుస్తకం చదవాలని ఐఆర్ఎస్ అధికారి కృష్ణ కౌండిన్య సూచించారు. ఈ కార్యక్రమంలో బుక్ ఫెయిర్ అధ్యక్షుడు యాకూబ్, కార్యదర్శి ఆర్ వాసు, కొమ్మినేని వెంకటేశ్వర్‌రావు, కె. దశరథ్, కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చల్లాపూర్‌లో చిరుత కలకలం

దౌల్తాబాద్: వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం చల్లాపూర్‌లో బుధవారం తెల్లవారుజామున లేగదూడపై చిరుత దాడిచేసింది. గ్రామానికి చెందిన కొలుముల సాయప్ప రోజులాగే పొలం వద్ద కొట్టంలో పశువులను కట్టేసి ఇంటికి వచ్చాడు. ఉదయాన్నే వెళ్లి చూసేసరికి.. కొంత దూరంలో దూడ మృత శరీరం కనిపించింది. పొట్ట భాగం మొత్తం తినేయగా, తల, కాళ్లు మాత్రమే మిగిలాయి. చిరుత లాక్కెళ్లి తిని ఉంటుందని భావించి, ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడకు చేరుకున్న అటవీ శాఖ అధికారులు చిరుత ఆనవాళ్లు నిర్ధారించారు. రైతులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



భాగ్య నగర కీర్తి 'కెరటం'.. ఇంకాయిస్

హిందూ మహాసముద్రంతో అనుబంధం ఉన్న 28 దేశాలకు సునామీ హెచ్చరికలు మన భాగ్యనగరం నుంచే వెళ్తుంటాయి. సముద్రాల్లో ఏర్పడే భూప్రకంపనల నుంచి సునామీ రాక, సముద్రపు అలల ఎత్తు, వేగం, వాటి తీవ్రత ఏమేర ఉంటుందో క్షణాల్లో భారత్‌తోపాటు ఆయా దేశాలకు చేరవేసే విజ్ఞాన వాహిని భాగ్యనగర సొంతం. నగర కీర్తి కెరటంగా 'ఇంకాయిస్' (భారత జాతీయ మహాసముద్ర సమాచార సేవా కేంద్రం) పరిఢవిల్లుతోంది.

హైదరాబాద్‌లోని 'ఇంకాయిస్' కార్యాలయం



హిందూ మహాసముద్రంలో సునామీలను పసిగట్టే శాస్త్ర విజ్ఞానం హైదరాబాద్ సొంతం

- క్షణాల్లో మహాసముద్ర విపత్తులను పసిగడుతున్న 'ఇంకాయిస్'
- 28 దేశాలకు సునామీ హెచ్చరికలు మన రాష్ట్రం నుంచే..

హిందూ మహా సముద్ర సునామీకి నేటితో 20 ఏళ్లు

- నేడు 'ఇంకాయిస్'లో సునామీ మృతులకు నివాళి

సనత్‌నగర్ (హైదరాబాద్): ప్రపంచంలో మూడు దేశాల్లో సునామీ హెచ్చరిక కేంద్రాలు ఉంటే అందులో హైదరాబాద్‌లోని ఇంకాయిస్ ఒకటి. మిగతా రెండు ఇండోనేసియా, ఆ్రస్టేలియాలో ఉన్నాయి. 2004 హిందూ మహాసముద్ర సునామీ 20వ వార్షికోత్సవాన్ని గురువారం ప్రగతినగర్‌లోని ఓషన్ వ్యాలీలో గల ఇంకాయిస్‌లో జరపనున్నారు. దీనికి కేంద్ర భూవిజ్ఞాన శాస్త్ర మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. నాటి సునామీలో ప్రాణాలు విడిచిన వారికి నివాళులు అర్పించనున్నారు. ఈ సందర్భంగా ఇంకాయిస్ అందిస్తున్న సేవలపై ప్రత్యేక కథనం.

తొలుత మత్స్యకారుల సేవల కోసం..

1999లో మత్స్యకారులకు సేవలు అందించేందుకు పొటెన్షియల్ ఫిషింగ్ జోన్ (పీఎఫ్‌జెడ్)గా ఇంకాయిస్ ఆవిర్భవించింది. సముద్రంలో చేపలు ఎక్కువగా లభ్యమయ్యే ప్రాంతాలను గుర్తించి సమాచారాన్ని వారికి చేరవేసే కేంద్రంగానే ఉండేది. ఆ తరువాత కొద్దికాలానికి సముద్రంలో వాయు దిశ, అలల వేగం, వాటి ఎత్తు, ఉష్ణోగ్రత వివరాలను అందిస్తూ ఓషియన్ స్టేట్ ఫోర్‌కాస్ట్ సేవలకు అంకురార్పణ చేసింది. 2004కు ముందు వరకు సునామీ అంటే భారత్‌కు పరిచయం లేని పదం. 2004లో వచ్చిన సునామీతో 2,40,000 మందికి పైగా చనిపోయిన విషయం తెలిసిందే. 14 దేశాలపై సునామీ ప్రభావం పడింది. ఆ సమయంలోనే సునామీ అంటే ఏంటో అందరికీ తెలిసింది. అప్పటివరకు సునామీ వస్తుందన్న ముందస్తు సమాచారం ఇచ్చే కేంద్రం ప్రపంచదేశాల్లో ఎక్కడా లేదు. దీంతో భారత ప్రభుత్వం కూడా తేరుకుని సునామీ హెచ్చరిక కేంద్రం ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. ఆ మేరకు అప్పటికే ఇంకాయిస్ ద్వారా మహాసముద్ర సమాచార సేవలు అందుతుండటంతో దీనికి అనుబంధంగానే సునామీ హెచ్చరిక కేంద్రం నెలకొల్పింది. 2005లో ప్రక్రియ ప్రారంభించి 2007లో పూర్తిస్థాయిలో హిందూ మహాసముద్ర సునామీ ముందస్తు హెచ్చరిక కేంద్రంగా అవతరించింది.



సునామీలు ఎలా ఏర్పడతాయంటే..?

సముద్రంలో భూకంపాలు, అగ్ని పర్వతాలు బద్దలవ్వడం, కొండచరియలు విరిగిపడటం వంటి కారణాలతో సునామీలు ఉత్పన్నమవుతాయి. అయితే ఎక్కువ శాతం భూకంపాల ద్వారానే సునామీలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. భూకంప తీవ్రత 6.5 కంటే ఎక్కువ ఉంటే సునామీ వచ్చే ప్రమాదం ఉంది. సునామీ సమయంలో సముద్రం మధ్య భాగంలో వాయువేగం గంటకు 800 కి.మీ., కెరటాల ఎత్తు ఒక మీటరు కంటే తక్కువగా ఉంటాయి. అదే తీరప్రాంతాన్ని తాకే సమయంలో వాయువేగం గంటకు 30 కి.మీ.కు పడిపోయి అలల ఎత్తు మాత్రం 30 మీటర్లకు పెరిగిపోతుంది. అందుకే సునామీ వచ్చే ప్రాంతంలో ఎత్తైన ప్రదేశంలో ఉండాలని నిపుణులు హెచ్చరిస్తారు. తీరాన్ని తాకుతున్న కొద్దీ అలల ఎత్తు పెరుగుతుంది. సునామీ రాకను సామాన్య ప్రజలు కూడా గుర్తించవచ్చు. ఆ సమయంలో సముద్రం వెనుకకు వెళ్లిపోతుంది. అలల శబ్ద తరంగాల్లో మార్పు గమనించవచ్చు.

ఇంకాయిస్ ఎలా గుర్తిస్తుందంటే..

సునామీకి ముందు మొదట సముద్రంలో భూమి కంపిస్తుంది. అలా భూప్రకంపనలు జరిగిన 5–6 నిమిషాలకు ఇంకాయిస్‌కు సమాచారం అందుతుంది. సముద్ర భూభాగంలో అమర్చిన సిస్మో మీటర్ల ఆధారంగా శాటిలైట్ ద్వారా భూప్రకంపనలు జరిగిన సమాచారం ఇంకాయిస్‌కు చేరుతుంది. ఆ తరువాత భూకంపం ప్రభావంతో సునామీ వచ్చే అవకాశం ఉందా? లేదా? అనే దానిపై దృష్టిసారిస్తారు. సముద్ర జలాలకు కొద్ది కిలోమీటర్ల దూరంలో ఏర్పాటుచేసిన 'సునామీ బోయ్ నెట్‌వర్క్' పరికరాల ఆధారంగా కెరటాల ఎత్తు, వాయు దిశను పరిశీలించి సునామీని గుర్తిస్తారు. సాధారణ రోజుల్లో బోయ్ నెట్‌వర్క్ పరికరాలు శాటిలైట్ ద్వారా 15 నిమిషాలకో మారు అలలు, సముద్ర స్థితిగతులకు సంబంధించిన సమాచారం ఇంకాయిస్‌కు చేరవేస్తుంది. అదే సునామీ వస్తుందంటే నిమిషానికోమారు సందేశం పంపుతుంది. దాని ఆధారంగా సునామీని పసిగడతారు. ఒక్కో బోయ్ నెట్‌వర్క్ పరికరం రూ.6 కోట్ల వరకు ఉంటుంది.

నిమిషాల్లో సమాచారం...

ఇంకాయిస్ సేకరించిన సమాచారాన్ని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉండే విపత్తు నిర్వహణ కేంద్రాలకు, భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖకు వెబ్‌సైట్, మెయిల్, ఎస్ఎంఎస్‌ల ద్వారా కేవలం పది నిమిషాల లోపే చేరవేస్తుంది. మూడుస్థాయిల్లో ఇంకాయిస్ సమాచారం అందిస్తోంది. వార్నింగ్, అలర్ట్, వాచ్ స్థాయిల్లో సందేశం పంపుతుంది. వార్నింగ్ అని సందేశం పంపారంటే తీవ్రత అధికంగా ఉన్నట్లు అర్థం. సాధారణంగా భూ ప్రకంపనలు జరిగిన తరువాత సునామీ తీరాన్ని చేరుకోవడానికి రెండు గంటలు పడుతుంది. ఆ లోపు సునామీ ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించే అవకాశం ఉంటుంది. ఒక్క అండమాన్ దగ్గర సునామీ ఏర్పడితే మాత్రం 20 నిమిషాల వ్యవధిలోనే తీరాన్ని దాటే అవకాశం ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. యునెస్కో ఆదేశాల మేరకు 2011 నుంచి సునామీకి సంబంధించిన సమాచారాన్ని హిందూ మహాసముద్రానికి అనుబంధంగా ఉన్న 28 దేశాలకు ఇంకాయిస్ చేరవేస్తుంది. ఆయా దేశాల ప్రభుత్వాలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుంది.

శిలాజ ఇంధనాల వాడకాన్ని నియంత్రించి కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ కార్లను ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. అయినా వాటి వినియోగం ఆశించినంతగా పెరగడం లేదు. అసలే వాటి ధరలు అధికం, అయినా కొనేద్దామనుకున్నా.. ఒకేసారి ఎక్కువ దూరం వెళ్లలేం, పైగా గంటలకు గంటలు చార్జింగ్ పెట్టాల్సిన పరిస్థితి. కానీ త్వరలోనే పరిస్థితి మారిపోతుందని.. అసలు చార్జింగ్ అవసరం లేకుండానే వేల కిలోమీటర్లు తిరగొచ్చని మెర్సిడెస్-బెంజ్ కంపెనీ ప్రకటించింది. ఇందుకోసం వినూత్నమైన 'సోలార్ పెయింట్'ను అభివృద్ధి చేసినట్టు తెలిపింది.

ఈ-కార్లతో.. ఫ్రీగా తిరిగేయొచ్చు



దానంతట అదే చార్జింగ్ అవుతూ...

సోలార్ ప్యానల్స్ తరహాలో సూర్య రశ్మిని గ్రహించి విద్యుత్‌గా మార్చే ఈ 'ఫొటో వోల్టాయిక్ పెయింట్'ను నానో పార్టికల్స్‌తో రూపొందించినట్టు మెర్సిడెస్-బెంజ్ కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. వాహనంపై వెలుగు పడినంత సేపూ చార్జింగ్ అవుతూనే ఉంటుందని... ఇలా ఏడాదిలో సుమారు 12 వేల కిలోమీటర్ల దూరం తిరిగేందుకు సరిపడా చార్జింగ్ లభిస్తుందని తెలిపారు. వాహనంపై మొదట సోలార్ కోటింగ్ వేసి, దానిపైన ప్రత్యేకమైన రంగుల కోటింగ్ వేస్తారని... దీనివల్ల ఇప్పుడున్న వాహనాల్లానే కనిపిస్తాయని వివరించారు.



మన దేశంలో అయితే మరింత లాభం

ఎక్కువగా ఎండ పడే ప్రాంతాల్లో ఈ సోలార్ పెయింట్‌తో రూపొందించిన కార్లు వేగంగా, ఎక్కువగా చార్జింగ్ అవుతాయని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అంటే భారత్ సహా దక్షిణాసియా దేశాలు, ఆఫ్రికా, అరేబియన్ దేశాల్లో ఈ 'సోలార్ పెయింట్'కార్లతో మరింత ప్రయోజనం ఉండనుంది. ఈ టెక్నాలజీని కార్లు మాత్రమే కాదు బస్సుల వంటి ఇతర వాహనాల్లోనూ వాడవచ్చు. అయితే ఈ టెక్నాలజీకి అయ్యే ఖర్చు తక్కువేనని మెర్సిడెస్-బెంజ్ ప్రతినిధులు పేర్కొన్నా... అది ఎంతనేది గానీ, దీనిని ఎప్పటికి మార్కెట్లోకి తీసుకువస్తారన్నదీ వెల్లడించలేదు.

పెయింట్‌తో ఎలా చార్జింగ్ అవుతుంది?

వాహనాల బాడీపై ఈ సోలార్ పెయింట్ కోటింగ్ వేస్తారు. అందులోనే అతి సన్నని ఎలక్ట్రోడ్‌లు కూడా ఉంటాయి. అవన్నీ ఒకదానికొకటి కలసి కారులోని బ్యాటరీ వ్యవస్థకు అనుసంధానం అవుతాయి. సోలార్ పెయింట్ సూర్యరశ్మిని గ్రహించి ఈ ఎలక్ట్రోడ్‌ల ద్వారా విద్యుత్‌గా మార్చి బ్యాటరీకి పంపుతుంది. దీనితో కారుపై వెలుతురు పడినంత సేపూ (అంటే ఉదయం నుంచి సాయంత్రం వరకు) బ్యాటరీ చార్జింగ్ అవుతూనే ఉంటుంది. ఇక ప్రత్యేకంగా చార్జింగ్ పెట్టాల్సిన అవసరం ఉండదు. ఎక్కువ దూరం ప్రయాణించి, బ్యాటరీ ఖాళీ అయిపోయి, వెంటనే మళ్లీ ప్రయాణం చేయాల్సి వస్తేనే చార్జింగ్ పెట్టాల్సి వస్తుంది. నిత్యం తక్కువ దూరాలకు వెళ్లేవారు అసలు చార్జింగ్ పెట్టాల్సిన అవసరమే ఉండదని మెర్సిడెస్-బెంజ్ కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు.

..: సాక్షి సెంట్రల్‌డెస్క్ :..



డీజిల్ బస్సుకు ఎలక్ట్రిక్ రూపు

ఎలక్ట్రిక్ బస్సులుగా పాత డీజిల్ బస్సులు

- మార్చేందుకు ఆర్టీసీ మళ్లీ ప్రయత్నాలు
- రెండేళ్ల నాటి ప్రణాళికకు తిరిగి ప్రాణం
- రెట్రో ఫిట్‌మెంట్ పాలసీ కోసం కేంద్రానికి లేఖ
- తక్కువ ఖర్చుతో ఎలక్ట్రిక్ బస్సులు లభిస్తాయని సూచన

కొత్త ఎలక్ట్రిక్ బస్సు ఖరీదు	పాత డీజిల్ బస్సును ఎలక్ట్రిక్ బస్సుగా మార్చేందుకు అయ్యే వ్యయం	డీజిల్ బస్సు ఖర్చు కి.మీ.కు
రూ.1.50కోట్లు	రూ.60 లక్షలు	రూ.20

ఎలక్ట్రిక్ బస్సుకు అయ్యే వ్యయం రూ.6

సాక్షి, హైదరాబాద్: ఖర్చులు తగ్గించుకొనేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఆర్టీసీ) అన్ని మార్గాలను వెదుకుతోంది. ఇంధన భారం తడిసి మోపెడవుతుండటంతో ఇప్పటికే ఎలక్ట్రిక్ బస్సుల వైపు మొగ్గుచూపింది. ఆ బస్సులు ఖరీదైనవి కావటంతో అద్దెకు తీసుకొని నడుపుతోంది. అదే సమయంలో సంస్థకు గుదిబండగా మారుతున్న పాత డీజిల్ బస్సులనూ ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చే ప్రయత్నాలను ముమ్మరం చేసింది. రెట్రో ఫిట్‌మెంట్ టెక్నాలజీ ద్వారా పాత డీజిల్ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చటానికి రెండేళ్ల క్రితమే రాష్ట్ర ప్రభుత్వ సాయం కోరింది. కానీ, ప్రభుత్వం స్పందించకపోవటంతో తాజాగా కేంద్రం తలుపు తట్టింది. రెట్రో ఫిట్‌మెంట్‌కు ఆర్థిక సాయం చేయాలని లేఖ రాసింది.

ఆ ప్రయోగం సక్సెస్..

డీజిల్ వ్యయాన్ని భరించలేక ఎలక్ట్రిక్ బస్సుల వైపు మొగ్గు చూపాలని మూడేళ్ల క్రితం ఆర్టీసీ ప్రయత్నాలు ప్రారంభించింది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం ఫేమ్ పథకం కింద 40 ఏసీ ఎలక్ట్రిక్ బస్సులు సరఫరా చేసింది. వాటిని ఇప్పుడు హైదరాబాద్ నుంచి ఎయిర్‌పోర్టుకు నడుపుతోంది. ఆ సమయంలో ఒక్కో బస్సు ధర రూ.2 కోట్ల వరకు ఉండటంతో సొంతంగా ఎలక్ట్రిక్ బస్సులు కొనటం సాధ్యం కాదని చేతులెత్తేసింది. రెట్రో ఫిట్‌మెంట్ ద్వారా రూ.60 నుంచి రూ..65 లక్షలతోనే డీజిల్ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చవచ్చని గుర్తించి, అందుకోసం టెండర్లు పిలిచింది. ఎలక్ట్రిక్ రైల్ లోకోమోటివ్‌లు తయారు చేస్తున్న ఓ ప్రైవేటు సంస్థ రెట్రో ఫిట్‌మెంట్‌కు ఆసక్తి చూపింది. శాంపిల్‌గా ముషీరాబాద్ డిపోకు చెందిన ఒక బస్సును ఆ సంస్థ రెట్రో ఫిట్‌మెంట్ చేసి ఇచ్చింది. ప్రస్తుతం అది ఉప్పల్ డిపో పరిధిలో తిరుగుతోంది. ఈ ప్రాజెక్టు భారాన్ని మొత్తం మోయలేనని భావించిన ఆర్టీసీ.. రేండేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వ సాయం కోరింది. ప్రభుత్వం కూడా సాయం చేయలేనని చేతులెత్తేయటంతో ప్రాజెక్టు అంతటితో ఆగిపోయింది.

కేంద్రం వైపు ఆర్టీసీ చూపు

నగరంలో డీజిల్ బస్సులను తొలగించి వాటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులే తిప్పాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా పీఎం ఈ-డ్రైవ్ పథకానికి శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా 9 ప్రధాన నగరాలకు 11 వేల ఎలక్ట్రిక్ బస్సులను సరఫరా చేయాలని నిర్ణయించింది. వాటిలో తనకు 2,500 బస్సులు కావాలని ఆర్టీసీ దరఖాస్తు చేసుకుంది. పనిలో పనిగా రెట్రో ఫిట్‌మెంట్ ద్వారా పాత డీజిల్ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చేందుకు కూడా ఓ విధానం ప్రకటించాలని లేఖ రాసింది. రెట్రో ఫిట్‌మెంట్ పరిజ్ఞానాన్ని ప్రోత్సహిస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని లేఖలో పేర్కొంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రయోగాత్మకంగా తిరుగుతున్న బస్సును ఉదహరించింది. ఈ లేఖపై కేంద్రం ఇంకా స్పందించలేదు. కేంద్రం గనుక రాయితీ పద్ధతిలో రెట్రో ఫిట్‌మెంట్‌కు పాలసీ అందుబాటులోకి తెస్తే, ఆర్టీసీ వద్ద ఉన్న పాత డీజిల్ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చి నిర్వహించేందుకు చాలా సంస్థలు ముందుకొచ్చే అవకాశం ఉంది.



శృతి, నిఖిల్ మృతదేహాలు

మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

- మరో యువకుడు కూడా..
- బీబీపేట స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ శృతి
- అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువులో ఇద్దరి మృతదేహాలు లభ్యం
- చెరువు వద్ద భిక్కనూరు ఎస్ఐ సాయికుమార్ కారు గుర్తింపు
- ఆయన కూడా ఆత్మహత్య చేసుకొన్నారనే అనుమానాలు
- చెరువులో అర్ధరాత్రి వరకు గాలించిన పోలీసులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: కామారెడ్డి జిల్లా బీబీ పేట పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ శృతి అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువులో దూకి బుధవారం ఆత్మహత్య చేసుకొన్నారు. ఆమెతోపాటు బీబీపేట మండలానికే చెందిన నిఖిల్ అనే యువకుడు కూడా అదే చెరువులో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. బుధవారం అర్ధరాత్రి వీరి మృతదేహాలను పోలీసులు వెలికితీశారు. నిజానికి భిక్కనూరు పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్సై సాయికుమార్ మొబైల్ స్విచాఫ్ రావటంతో.. ఆయన కుటుంబసభ్యులు బుధవారం ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆయన సెల్‌ఫోన్ టవర్ నెట్‌వర్క్ ఆధారంగా వెదకగా 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు సమీపంలో ఎస్సై కారును గుర్తించారు. చెరువు వద్ద ఇద్దరు పురుషుల చెప్పులు, మూడు సెల్‌ఫోన్లను కనుగొన్నారు. అందులో రెండు ఫోన్లు నిఖిల్‌వి కాగా.. మరొకటి కానిస్టేబుల్ శృతిదిగా గుర్తించారు. జిల్లా ఎస్పీ సింధు శర్మ అక్కడికి చేరుకొని గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది సాయంతో చెరువులో వెదికించారు. అర్ధరాత్రి రెండు శవాలు లభించగా, సాయికుమార్ జాడ లభించలేదు. ఆయన కూడా చెరువులో దూకి చనిపోయారా? లేదా? అన్నదానిపైనా క్లారిటీ రాలేదు. వీరి ఆత్మహత్యలకు కారణాలు కూడా తెలియలేదు. సాయికుమార్ సొంత ఊరు మెదక్ జిల్లా కాగా.. శృతిది గాంధారి మండల కేంద్రం. ఈ ఘటనపై రకరకాల ప్రచారం జరుగుతోంది. పోలీసులు మాత్రం ఎలాంటి వివరాలు వెల్లడించడం లేదు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

రాష్ట్రంలో పెరిగిన పులులు



గతంలో అంతగా కదలికలు లేని ప్రాంతాల్లోనూ సంచారం ● 33 జిల్లాలకుగాను 13కుపైగా జిల్లాల్లో నమోదైన కదలికలు

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో అత్యధికంగా 33 పులులు ఉన్నట్లు నిర్ధారణ ● కవ్వాల్ టైగర్ రిజర్వ్ వెలుపల ఐదారు తిరుగుతున్నట్లు గుర్తింపు

తెలంగాణలో పెద్ద పులుల గాండ్రింపులు పెరుగుతున్నాయి. రాష్ట్రంలోని రెండు పులుల అభయారణ్యాలైన అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్), కవ్వాల్ టైగర్ రిజర్వ్ (కేటీఆర్)లలోనే కాకుండా కొత్త ప్రదేశాల్లోనూ పులులు కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల 30, 40 ఏళ్ల తర్వాత వాటి కదలికలు రికార్డవుతున్నాయి. టైగర్ రిజర్వ్‌లలో పులుల సంఖ్య పెరుగుదలకు అనుకూల పరిస్థితులు ఉండటంతోపాటు పొరుగునే ఉన్న మహారాష్ట్రలోని తిప్పేశ్వర్, తడోబా, ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి అభయారణ్యాల్లోంచి రాష్ట్రంలోకి పులుల వలసలు క్రమంగా పెరుగుతున్నాయి. ఎందుకంటే.. తెలంగాణలో మెరుగైన అటవీ విస్తరణ, వేటకు తగిన సంఖ్యలో జంతువులు, నీటివనరులు, గడ్డి భూములు ఉన్నాయి. దీంతో పులులు ఇక్కడకు తరలి వస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాలకుగాను 13కుపైగా జిల్లాల్లో పులుల కదలికలను అధికారులు ఇటీవల గుర్తించారు.

-సాక్షి, హైదరాబాద్



ఒక పులి స్వేచ్ఛగా తిరుగుతూ తన జీవనాన్ని సాగించేందుకు 50 చ.కి.మీ. అడవి అవసరమవుతుంది. దీన్నిబట్టి తెలంగాణలోని అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లతో కలుపుకుంటే దాదాపు 5 వేల చ.కి.మీ. అటవీ ప్రాంతం అందుబాటులో ఉంది. ఇది సుమారు 100 పులులు జీవించేందుకు, స్థిరనివాసం ఏర్పరచుకోవడానికి అవకాశం ఉందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో ప్రస్తుతం రాష్ట్రంలోనే అత్యధికంగా 33 పులులు ఉన్నట్లు తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇక కవ్వాల్‌లో కోర్ ఏరియాలో కొంత కాలంగా ఒక్క పులి కూడా స్థిరనివాసం ఏర్పరచుకోలేదు. అయితే మహారాష్ట్ర-తెలంగాణ (ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా) టైగర్ కారిడార్, సరిహద్దు ప్రాంతాల్లో ఐదారు పెద్ద పులులు సంచరిస్తున్నట్లు తాజా ఉదంతాలు స్పష్టం చేస్తున్నాయి. ఇటీవల కాలంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే మనుషులపై పులుల దాడులు, ఒకరి మృతి, మరొకరు తీవ్రంగా గాయపడటం, పలుచోట్ల పశువుల సంహారం వంటివి చోటుచేసుకుంటున్న విషయం తెలిసిందే. దాదాపు 10-15 ఏళ్ల కిందట 'టైగర్ టెరిటరీ'గా ఉన్న అడవులు కొన్నిచోట్ల ఆక్రమణలతో పొలాలు, పత్తి చేన్లుగా మారిపోయాయి. మళ్లీ పులులు అక్కడకు చేరుకొనేటప్పటికి పత్తిచేన్లు మూడున్నర, నాలుగు అడుగుల మేర ఏపుగా పెరగడం, కిందకు వంగి పత్తి ఏరే కూలీలను వెనక నుంచి చూసి పులులు ఎరగా పొరబడి దాడులకు పాల్పడుతున్నాయని ఓ అటవీ ఉన్నతాధికారి 'సాక్షి'కి తెలిపారు. మహారాష్ట్రలో సంతానానికి జన్మనిచ్చాక పెద్ద పులులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్న క్రమంలో సరైన ఆవాసం దొరకకపోవడంతోపాటు ఆహారాన్వేషణలో దాడులు జరుగుతున్నాయని చెప్పారు. పులులు ఒకే మార్గంలో కాకుండా 3, 4 దిశల నుంచి వస్తుండటం వల్ల వాటి కదలికలను అంచనా వేయడం కష్టంగా మారుతోందన్నారు.

100 పులుల ఆవాసానికి అనుకూలం...



కొత్త ప్రాంతాల్లో ఆనవాళ్లు...

కొన్నేళ్లుగా పెద్ద పులులు కనిపించని భూపాలపల్లి, ఏటూరునాగారం, కిన్నెరసాని, పాకాల, మంచిర్యాల, ఇచ్చోడ, బోథ్, పెద్దపల్లి వంటి చోట్ల ఇటీవల కాలంలో పులుల కదలికలు నమోదయ్యాయి. రాష్ట్ర పర్యావరణానికి సంబంధించి దీన్ని ముఖ్యమైన పరిణామంగా పర్యావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దేశవ్యాప్తంగా మొత్తం 54 పులుల అభయారణ్యాలు ఉండగా వాటిలో 2 వేల చ.కి.మీ. పైబడి అటవీ వైశాల్యమున్న కొన్నింటిలో ఏపీలోని నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ (ఎన్ఎస్‌టీఆర్) 3,728 చ.కి.మీ.లలో., తెలంగాణలోని అమ్రాబాద్ 2,611 చ.కి.మీ.లలో, కవ్వాల్ టైగర్ రిజర్వ్ 2,016 చ.కి.మీ.ల విస్తీర్ణంలో విస్తరించి ఉన్నాయి.

పర్యావరణ వ్యవస్థ, జీవవైవిధ్యం పులితోనే ముడిపడి ఉంది

పులికి హాని జరగకుండా సంరక్షించుకుంటే దాని ద్వారా ఇతర జంతువులకూ రక్షణ లభిస్తుంది. టైగర్‌ను ఫ్లాగ్‌షిప్ ఫర్ ఎకోసిస్టమ్‌గా, అంబ్రెల్లా స్పీషిస్‌గా పరిగణిస్తాం. గొడుగు ఎలా అయితే తన నీడలో లేదా కింద ఉన్న వాటిని తడవకుండా రక్షిస్తుందో పులి కూడా అంతే. పర్యావరణ వ్యవస్థ, జీవవైవిధ్యం కూడా పులితోనే ముడిపడి ఉంది. అడవులు, ముఖ్యంగా పులుల అభయారణ్యాల నుంచే వర్షపునీరు కిందకు ప్రవహించి నదుల్లోకి చేరుతోంది. వాననీటితోపాటు బురద, ఇసుక వంటివి నదుల్లోకి సిల్ట్ రూపంలో చేరకుండా అడవులు అడ్డుకుంటాయి. పండ్లు, ఫలాలతోపాటు అడవుల్లోని ఔషధ మొక్కల ద్వారా మనకు మందులు లభిస్తున్నాయి.

– ఫరీదా తంపాల్, డబ్ల్యూడబ్ల్యూఎఫ్-నేచర్ స్టేట్ డైరెక్టర్ (హైదరాబాద్ సెంటర్)

పులులను పరిరక్షించుకోవాల్సిన అవసరముంది

తెలుగు రాష్ట్రాల్లోని 3 టైగర్ రిజర్వ్‌లు నదుల ఒడ్డునే ఉండటంతోపాటు ఈ అడవుల్లోంచే అత్యధిక వాటా నీరు నదుల్లోకి చేరుతోంది. అందువల్ల తెలంగాణ, ఏపీ భవిష్యత్ పర్యావరణపరంగా సురక్షితంగా ఉండాలంటే ఈ అభయారణ్యాల్లోని పులులను పరిరక్షించుకోవాల్సిన అవసరముంది. పులుల ఆవాసాల ద్వారా పర్యావరణపరంగా అందుబాటులోకి వచ్చే సేవలను (ఎకోలాజికల్ సర్వీసెస్ ద్వారా) డబ్బు విలువ పరంగా లెక్కిస్తే ఒక్కో పులి రూ. 250 కోట్ల విలువ చేస్తుంది. కోవిడ్ సంక్షోభం మనందరికీ ప్రకృతి, పర్యావరణం, వన్యప్రాణులను గౌరవించాలని, కాపాడుకోవాలని నొక్కి చెబుతోంది.

– ఇమ్రాన్ సిద్దిఖీ, హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ డైరెక్టర్





కేసీఆర్‌ను కలిసిన క్రిస్టియన్ జేఏసీ నేతలు

సాక్షి, హైదరాబాద్: క్రిస్మస్ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్, క్రిస్టియన్ జేఏసీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిషప్ నెహేమియా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో క్రిస్టియన్ జేఏసీ నాయకులు సోలోమన్ రాజు, క్యాథలిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ లియో లూయిస్ తదితరులు ఉన్నారు.



క్రిస్మస్ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి బొకే అందజేస్తున్న నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి. చిత్రంలో మంత్రి దామోదర రాజనర్సింహ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి , ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమార్



బుధవారం ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి నాంపల్లిలోని బీజేపీ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్ తదితరులు



మహా 'ఘన'పతిం..

26 అడుగుల ఎత్తయిన పురాతన ఏకశిల విగ్రహం

- ఆలయం లేక పూజలకు నోచని గణపతి
- పశ్చిమ చాళుక్యుల కాలం నాటి భారీ గణనాథుడు
- నాగర్‌కర్నూల్ జిల్లాలోని తిమ్మాజిపేట మండలం ఆవంచలో కొలువు
- ఆవంచకు పూర్వం ఆవుల మంచాపురం అనే పేరు

సాక్షి, నాగర్‌కర్నూల్: దేశంలోనే ఎత్తయిన ఏకశిలా వినాయకుని విగ్రహం నాగర్‌కర్నూల్ జిల్లాలోని తిమ్మాజిపేట మండలం ఆవంచ గ్రామంలో ఉంది. దుందుభీ వాగు తీరంలో వెలసిన ఈ వినాయకుడికి ఎంతో ఘనమైన చరిత్ర ఉంది. కర్ణాటకలోని శ్రావణ బెళగోళలోని గోమటేశ్వరుడు, చాముండి కొండపై నందీశ్వరుడితోపాటు.. ఆవంచలోని గణపతి సైతం అతిపెద్ద ఏకశిలా విగ్రహాలుగా ప్రసిద్ధి. హైదరాబాద్ నుంచి వంద కిలోమీటర్ల దూరంలో.. జడ్చర్ల పట్టణానికి చేరువలో ఆవంచ గ్రామంలో ఈ మహా గణనాథుని విగ్రహం ఉంది. ఏటా వినాయక చవితి సందర్భంగా వందలాది మంది భక్తులు ఇక్కడికి వచ్చి మహా గణపతిని దర్శించుకుంటారు. స్థానికులు ఐశ్వర్య గణపతిగా పిలిచే గణనాథునికి ఇప్పటికీ ఆలయం లేకపోవడంతో నిత్య పూజలకు నోచుకోవడం లేదు.

పశ్చిమ చాళుక్యుల కాలంలో..

పశ్చిమ చాళుక్యుల కాలంలో ప్రముఖులైన జగదేకమల్లుడు, భువనైకమల్లుడు, త్రైలోక్యమల్లుడు ఆవుల మంచాపురాన్ని రాజధానిగా చేసుకుని పాలించారు. నాటి ఆవుల మంచాపురాన్నే కాలక్రమంలో ఆవంచగా పిలుస్తున్నారు. తెలుగు నేలను పాలించిన ఇక్ష్వాకులు.. గణపతి భక్తులు కావడంతో ఇక్కడ 26 అడుగుల ఎత్తయిన ఏకశిలా గణపతిని నెలకొల్పినట్లు చరిత్ర పరిశోధకులు చెబుతున్నారు. పశ్చిమ చాళుక్యుల కాలంలో వెలుగొందిన ఆవంచ గ్రామంలో లభించిన విగ్రహాలు, శిల్పాలను మహబూబ్‌నగర్ జిల్లాలోని పిల్లలమర్రి మ్యూజియంలో భద్రపరిచారు. పశ్చిమ చాళుక్యుల కాలంలోనే గ్రామ శివారులోని భైరవాలయంలోని ప్రతిమలు, మరో స్తంభంపై శివపంచాయతనం చెక్కినట్లు స్పష్టమవుతోంది.

ఆదరణ లేక..

ఆవంచలోని భారీ ఏకశిలా గణనాథునికి ఆలయాన్ని నిర్మించేందుకు ఒక చారిటబుల్ ట్రస్టు ఏడేళ్ల కిందట ముందుకొచ్చింది. ఆలయం కోసం ఆరు ఎకరాల స్థలాన్ని సైతం కొనుగోలు చేసింది. అయితే ఆలయ నిర్మాణ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. ఏళ్ల తరబడి ఆలయ నిర్మాణానికి నోచుకోకపోవడంతో వినాయకునికి నిలువ నీడ లేకుండా పోయింది. ప్రభుత్వం స్పందించి ఆలయ నిర్మాణం చేపట్టి.. పర్యాటకంగానూ అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టి సారించాలి



పురాతన కాలం నాటి వినాయకుని ఏకశిలా విగ్రహానికి ఆలయ నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించాలి. ఏళ్లపాటు గణనాథుడు నిరాదరణకు గురవుతున్నాడు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆవంచ వినాయకుని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి.

– కిరణ్, ఆవంచ, తిమ్మాజిపేట మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా

'భౌ'బోయ్..

మందలు మందలుగా రోడ్లపై తిరుగుతున్న కుక్కల్ని చూసి హడలిపోయారు. వచ్చిపోయే వారిని వెంబడిస్తున్న శునకాలతో భయాందోళనకు గురయ్యారు. పెద్దపల్లి రాజీవ్ రహదారిపై బుధవారం ఉదయం కుక్కలతో పాదచారులు, వాహనదారులు ఎదుర్కొన్న తిప్పలకు దృశ్యరూపమిది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి.







క్లుప్తంగా...

అమ్మవారి సేవలో మహారాష్ట్ర గవర్నర్



చంద్రగిరి: మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ బుధవారం రాత్రి తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ఆయన ముందుగా ఆలయ ధ్వజస్తంభానికి మొక్కుకుని, అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా
బస్సులో ప్రయాణికులు సురక్షితం

నరసరావుపేట రూరల్: పల్నాడు జిల్లా పెట్లూరివారిపాలెం వద్ద బుధవారం ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి బోల్తా కొట్టింది. బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరు నుంచి పిడుగురాళ్ల వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు మార్గంమధ్యలో ప్రయాణికులను దింపేందుకు నరసరావుపేట వస్తుంది. పెట్లూరివారిపాలెం వద్దకు చేరుకున్న సమయంలో బ్రేకులు ఫెయిల్ కావడంతో బస్సు అదుపుతప్పింది. రోడ్డు పక్కనున్న మార్జిన్‌లోకి వెళ్లి బోల్తా కొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. స్థానికులు అక్కడకు చేరుకొని బస్సులో ఉన్న ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశారు. రూరల్ సీఐ పి.రామకృష్ణ, ఎస్ఐ కిశోర్‌లు ఘటనా స్థలానికి చేరుకొని ప్రయాణికులకు వేరే బస్సులో తరలించారు.

విద్యా మండలిలో నారాయణ ప్రిన్సిపాల్ నియామకం దారుణం

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటుచేసిన ఇంటర్మీడియట్ విద్యా మండలిలో నారాయణ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌ను నామినేటెడ్ సభ్యునిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం దారుణమని ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ(ఏఐఎస్ఈసీ) జిల్లా ఇన్‌చార్జ్ ఎ.హరీష్ ఓ ప్రకటనలో తప్పుబట్టారు. ఇంటర్ విద్యను ప్రైవేటుపరం చేశాక వెలుగులోకి వచ్చిన నారాయణ విద్యాసంస్థ అకృత్యాలకు అవధులు లేకుండా పోయాయని విచారం వ్యక్తం చేశారు. గ్రంథాలయాలు, ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు ఏవీ లేకుండా నిబంధనలు తుంగలో తొక్కుతూ విద్యను వ్యాపారం చేశారని మండిపడ్డారు. అలాంటి విద్యాసంస్థ ప్రిన్సిపాల్‌ను మండలిలో నామినేటెడ్ సభ్యునిగా నియమించడం దుర్మార్గమన్నారు. వెంటనే ప్రభుత్వ స్పందించి ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

బంతీ..చామంతీ.. ముద్దాడుకున్నాయిలే..!



పూలంటే ఇష్టం లేని వారు ఉండరు. అలాంటిది బంతి, చామంతి పూలంటే మరీ ఇష్టం. అవే పూలు వివిధ రంగుల్లో ఉండి కనువిందు చేస్తే ఇక వారి ఆనందానికి హద్దే ఉండదు. ఇలాంటి ఫొటోలను చూసే కాబోలో ఓ సినీ రచయిత బంతీ.. చామంతీ ముద్దాడుకున్నాయిలే అంటూ చరణం కట్టినట్లున్నారు. బేతంచెర్ల నుంచి కర్నూలుకు వెళ్లే ప్రధాన రహదారిలో దాదాపు రెండు కిలోమీటర్ల వరకు పూల తోటలు ప్రయాణికులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. సీతారామాపురం, శంకలాపురం, బైనపల్లె, యంబాయి, మండ్ల వానిపల్లె, రుద్రవరం, ముద్దవరం, వీరాయపల్లె గ్రామాల రైతులు బోరుబావుల కింద బంతి, చేమంతి పూలు సాగు చేశారు. సుమారు 300 ఎకరాల్లో సాగు చేసిన చేమంతి, బంతి పూల తోటలు కోత దశకు వచ్చాయి. కర్నూలు ప్రధాన రహదారి వెంట రాకపోకలు సాగించే ప్రయాణికులకు కొత్త ప్రాంతానికి వచ్చామా అనే అనుభూతిని కలిగిస్తున్నాయి.

– బేతంచెర్ల

భూగర్భజలం పుష్కలం

గత ఐదేళ్ల తరహాలోనే ఈ ఏడాదీ పెరిగిన భూగర్భ జలమట్టం

- నీటి సంవత్సరం ప్రారంభానికి ముందు సగటున 11.79 మీటర్లలో జలాలు
- ప్రస్తుతం రాష్ట్రంలో సగటున 7.6 మీటర్లలో లభ్యత
- భూగర్భ జలాలు పెరిగిన జిల్లాల్లో ప్రథమ స్థానంలో శ్రీసత్యసాయి జిల్లా
- చివరి స్థానంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా
- భూగర్భ జలాల లభ్యతలో ప్రథమ స్థానంలో బాపట్ల.. చివరి స్థానంలో తూర్పుగోదావరి
- రబీలో బోరు, బావుల కింద సాగునీటికి, వేసవిలో తాగు నీటికి తప్పిన ఇబ్బందులు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గత ఐదేళ్ల తరహాలోనే ఈ ఏడాదీ భూగర్భ జలాల లభ్యత పెరిగింది. ప్రస్తుత నీటి సంవత్సరంలో భూగర్భ జలమట్టం 4.19 మీటర్లు పెరిగింది. భూగర్భ జలమట్టం పెరిగిన జిల్లాల్లో శ్రీసత్యసాయి జిల్లా (12.69 మీటర్లు) మొదటి స్థానంలో ఉండగా, రెండో స్థానంలో ప్రకాశం జిల్లా (8.52 మీటర్లు), మూడో స్థానంలో పల్నాడు జిల్లా (7.97 మీటర్లు) ఉన్నాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా(1.16 మీటర్లు), శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా (1.31 మీటర్లు), పార్వతీపురం మన్యం జిల్లా(1.52 మీటర్లు)లో అత్యల్పంగా పెరిగాయి. 26 జిల్లాల్లో భూగర్భ జలాలు పుష్కలంగా పెరగడంతో బోరు బావుల కింద రబీలో పంట సాగుకు, వేసవిలో తాగు నీటికి ఇబ్బందులు ఉండవని అధికారవర్గాలు చెబుతున్నాయి.

సగటున 7.6 మీటర్లలో భూగర్భ జలాల లభ్యత

నీటి సంవత్సరం జూన్ 1తో ప్రారంభమై.. మే 31తో ముగుస్తుంది. గత నీటి సంవత్సరం ముగిసేటప్పటికి అంటే 2024 మే 31కి రాష్ట్రంలో భూగర్భ జలాలు 11.79 మీటర్లలో లభ్యమయ్యేవి. గత ఐదేళ్ల తరహాలోనే ఈ ఏడాదీ నైరుతి, ఈశాన్య రుతుపవనాల ప్రభావం వల్ల సమృద్ధిగా వర్షాలు కురిశాయి. రాష్ట్రంలో ఈ ఏడాది ఇప్పటికి 858 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా ఇప్పటిదాకా 950.57 మిల్లీమీటర్లు కురిసింది. అంటే సాధారణ వర్షపాతం కంటే 10.79 శాతం ఎక్కువ. దాంతో భూగర్భ జలాలు పెరిగాయి. ప్రస్తుతం భూగర్భ జలమట్టం సగటున 7.6 మీటర్లకు చేరుకుంది. అంటే.. ప్రస్తుత నీటి సంవత్సరంలో ఇప్పటికే 4.19 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగాయి.

బాపట్ల జిల్లా గరిష్టం.. తూర్పు గోదావరిలో కనిష్టం

భూగర్భ జలాల లభ్యతలో బాపట్ల జిల్లా (2.63 మీటర్లతో) ప్రథమ స్థానంలో ఉంది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా (2.64 మీటర్లు) రెండో స్థానంలో, గుంటూరు జిల్లా (3.39 మీటర్లు) మూడో స్థానంలో నిలిచాయి. భూగర్భ జలాల లభ్యత కనిష్టంగా ఉన్న జిల్లాల్లో తూర్పుగోదావరి జిల్లా (21.66 మీటర్లతో) ప్రథమ స్థానంలో నిలవగా.. ఏలూరు జిల్లా(17.59 మీటర్లు) రెండో స్థానంలో, అన్నమయ్య జిల్లా(13.67 మీటర్లు) మూడో స్థానంలో నిలిచింది.

రాష్ట్రంలో భూగర్భజలాల లభ్యత ఇలా (మీటర్లలో..)

జిల్లా	భూగర్భ జలమట్టం	వర్షాకాలం (2024 మే 31 నాటికి)	2024 నవంబర్ 30 నాటికి పెరుగుదల
1. శ్రీకాకుళం	**10.02**	**6.95**	**3.07**
2. విజయనగరం	6.64	4.24	2.40
3. పార్వతీపురంమన్యం	8.13	6.61	1.52
4. అల్లూరిసీతారామరాజు	9.06	6.26	2.80
5. విశాఖపట్నం	10.82	5.63	5.19
6. అనకాపల్లి	8.0	4.16	3.84
7. కాకినాడ	9.8	5.69	4.11
8. అంబేడ్కర్ కోనసీమ	3.8	2.64	1.16
9. తూర్పు గోదావరి	24.77	21.66	3.11
10. పశ్చిమ గోదావరి	9.0	7.37	1.63
11. ఏలూరు	23.67	17.59	6.08
12. కృష్ణా	10.21	7.95	2.26
13. ఎన్టీఆర్	8.42	3.83	4.59
14. గుంటూరు	6.72	3.39	3.33
15. బాపట్ల	4.46	2.63	1.83
16. పల్నాడు	14.88	6.91	7.97
17. ప్రకాశం	21.59	13.07	8.52
18. నెల్లూరు	7.07	5.76	1.31
19. కర్నూలు	10.35	6.78	3.57
20. నంద్యాల	10.83	5.21	5.62
21. అనంతపురం	15.22	8.27	6.95
22. సత్యసాయి	20.44	7.75	12.69
23. వైఎస్సార్ కడప	13.83	7.98	5.85
24. అన్నమయ్య	18.13	13.62	4.51
25. చిత్తూరు	13.83	11.18	2.65
26. తిరుపతి	6.78	4.38	2.40
రాష్ట్ర సగటు	**11.79**	**7.60**	**4.19**

జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లో కాఫీ ధరలకు స్థానికంగా నిర్ణయించిన ధరలకు పొంతన ఉండటం లేదు. పార్చ్‌మెంట్, చెర్రీ కిలోకు రూ.వందకు పైగా వ్యత్యాసం ఉన్నందున భారీగా నష్టపోతున్నామని గిరి రైతులు వాపోతున్నారు. ప్రభుత్వ రంగ సంస్థ జీసీసీ నిర్ణయించిన ధరలు తమను దోపిడీ చేసేలా ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారిక దోపిడీ





పార్చ్‌మెంట్ కాఫీ గింజలు

జాతీయ మార్కెట్‌కు స్థానిక ధరలకు ఎంతో వ్యత్యాసం

- అక్కడ కిలో పార్చ్‌మెంట్ రూ.450, చెర్రీ రూ.250
- జీసీసీ ధర పార్చ్‌మెంట్ కిలో రూ.320, చెర్రీ రూ.170 మాక్స్ పండ్ల ధర కిలో రూ.44
- ప్రభుత్వరంగ, మరికొన్ని సంస్థల ధరలు తక్కువగా ఉన్నాయని రైతుల ఆవేదన
- భారీగా నష్టపోతున్నామని మండిపాటు

సాక్షి,పాడేరు: కాఫీకి జాతీయ, అంతర్జాతీయస్థాయి మార్కెట్లో మంచి ధరలు ఉండటంతో ఈ ఏడాది అదేస్థాయిలో గిట్టుబాటు ధర కల్పించాలని అల్లూరి జిల్లా అధికార యంత్రాంగానికి గిరి రైతులు విన్నవించుకుంటున్నారు. బెంగళూరు మార్కెట్లో పార్చ్‌మెంట్ కాఫీ కిలో రూ.430 నుంచి రూ.450, అరబికా చెర్రికి కూడా కిలో రూ.250 ధర ఉంది. చాలా దేశాల్లో కాఫీ దిగుబడులు తగ్గడంతో ఈ ఏడాది డిమాండ్ నెలకొంది. పార్చ్‌మెంట్ కాఫీ గింజల ధర మున్ముందు మరింత పెరిగు పరిస్థితులు కనిపిస్తున్నాయి. మన్యంలో 1.50 వేల ఎకరాల్లో కాఫీ తోటలు ఉండగా సుమారు 17 వేల టన్నుల వరకు దిగుబడి వస్తోంది. కాఫీ రైతుల నుంచి కొనుగోళ్లకు ఐటీడీఏ, జీసీసీ కార్యాచరణ రూపొందించాయి. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కూడా రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు ముందుకువచ్చాయి. అయినప్పటికీ జాతీయస్థాయి మార్కెట్లో ధరలకు అనుగుణంగా తమకు చెల్లించడం లేదని గిరి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డిమాండ్ ఉన్నా..గిట్టుబాటు ధరలేక..

బెంగళూరు జాతీయ మార్కెట్‌లో కాఫీ గింజలకు రికార్డు ధరలు ఉన్నప్పటికీ గిరిజన రైతులకు మాత్రం గిట్టుబాటు ధర లేకపోతోంది.కాఫీ సీజన్‌కు ముందు జీసీసీ పార్చ్‌మెంట్ కాఫీ గింజలను కిలో రూ.285,అరబికా చెర్రి రూ.150 ధరకు కొనుగోలు చేస్తామని ప్రకటించింది. అయితే బెంగళూరు మార్కెట్‌లో పార్చ్‌మెంట్ కాఫీ ధరలు కిలోకు రూ.400 దాటడంతో జీసీసీ అపెక్స్ కమిటీ కూడా ఏజెన్సీలో కొనుగోలు ధరలను కాస్త పెంచింది. పార్చ్‌మెంట్ కిలో రూ.320, అరబికా చెర్రిని కిలో రూ.170, రొబస్టా చెర్రి కిలో రూ.100 ధరకు కొనుగోలు చేస్తామని జీసీసీ ప్రకటించింది. బెంగళూరు మార్కెట్లో ధరలకు జీసీసీ ప్రకటించిన ధరలకు పొంతన లేకపోవడంతో కాఫీ రైతులు మండి పడుతున్నారు. పార్చ్‌మెంట్ కాఫీ గింజలు రూ.450, అరబికా చెర్రి కిలో రూ.250 ధర ఉన్నందున అందుకు తగ్గట్టుగా తమకు చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కనీసం పార్చ్‌మెంట్ కిలో రూ.420, చెర్రి కిలో రూ.200 ధరకు కొనుగోలు చేసేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కాఫీ పండ్ల ధర అంతే..

పండ్ల దశలో కాఫీ పంటను అమ్ముకునే కాఫీ రైతులకు కూడా గిట్టుబాటు ధర కరువైంది. కిలో కాఫీ పండ్లను కిలో రూ.44ధరతో చింతపల్లి మాక్స్ సొసైటీ ద్వారా ఐటీడీఏ కొనుగోలు చేయిస్తోంది. బెంగళూరు మార్కెట్‌లో పెరిగిన ధరలు ప్రకారం చూసుకుంటే కిలో పండ్లకు కనీసం రూ.60ధర అయిన చెల్లించాల్సి ఉంది. అయితే ఐటీడీఏ మాత్రం ధరలు పెంచకపోవడంతో కాఫీ పండ్లను తక్కువ ధరకే అమ్ముకుంటూ కాఫీ రైతులు ఉసూరుమంటున్నారు. కొన్ని ప్రైవేట్ సంస్థలు మాత్రం కాఫీ పండ్లకు కిలో రూ.60 చెల్లిస్తున్నాయి. గిట్టుబాటు ధరలు కల్పించాల్సిన ప్రభుత్వ యంత్రాంగంలోని జీసీసీ, ఐటీడీఏలు తక్కువ ధరలతో కాఫీ ఉత్పత్తులను కొనుగోలు చేయడం అన్యాయమని కాఫీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాఫీ పండ్ల ధర పెంచాలి



కాఫీ పండ్లకు కూడా గిట్టుబాటు ధర కరువైంది. కిలో రూ.44తో చింతపల్లి మాక్స్ సంస్థ కొనుగోలు చేస్తుంది. ఈ తక్కువ ధరతో అమ్ముకుంటే నష్టమే మిగులుతుంది.కిలో రూ.70ధరతో కాఫీ పండ్లను ఐటీడీఏ కొనుగోలు చేయాలి. ఈ ఏడాది జాతీయ, అంతర్జాతీయస్థాయి మార్కెట్లో ధరలు బాగున్నాయి. అందుకు తగ్గట్టుగా ధరల చెల్లించేలా పాడేరు ఐటీడీఏ, గిరిజన సహకార సంస్థ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– డిప్పల సురేష్‌బాబు, కాఫీ రైతు, గుర్రగరువు, పాడేరు మండలం

అధికారులతో కమిటీ వేస్తాం



ఏజెన్సీలోని కాఫీపంట సాగు చేస్తున్న రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి న్యాయం చేస్తున్నాం. బెంగళూరు కాఫీ మార్కెట్‌లో నాణ్యత ప్రకారం రోజువారి కాఫీ ఉత్పత్తుల ధరలపై సమీక్షించేందుకు అధికారులతో కమిటీ వేస్తాం. కాఫీ రైతులు నష్టపోకుండా అపెక్స్ కమిటీ ఆమోదంతో జీసీసీ ఇప్పటికే ధరలను పెంచి కొనుగోలుకు ఏర్పాట్లు చేసింది. చింతపల్లి మాక్స్ సంస్థకు కాఫీ పండ్లను అమ్ముకుంటున్న కాఫీ రైతులకు న్యాయం చేస్తాం. కాఫీ గింజల ఉత్పత్తి అనంతరం బహిరంగ మార్కెట్‌లో వేలం వేసి అమ్మకాల ద్వారా వచ్చే లాభాలను ఆయా కాఫీ రైతులకు బోనస్ రూపంలో చెల్లిస్తాం.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్, పాడేరు



శ్రీవారి దర్శనానికి 16 గంటలు


తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 14 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 67,209 మంది స్వామివారిని దర్శించుకోగా 22,708 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ. 4.15 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది.

కాణిపాకంలో భక్తుల రద్దీ



కాణిపాకం: చిత్తూరు జిల్లా కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు కిక్కిరిసిపోయారు. దీంతో ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర దర్శన క్యూలు కిటకిటలాడాయి. దర్శనానికి 4 గంటల సమయం పట్టింది. భక్తులకు ఇబ్బంది లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టారు.

గొబ్బిదేవతకు పుర ఉత్సవం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని గొబ్బిదేవతకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో గొబ్బిదేవత ఉత్సవ మూర్తికి ప్రత్యేక అబిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.




ఏయూ ఖో ఖో జట్ల ఎంపిక

విశాఖ విద్య: ఇంటర్ యూనివర్శిటీ పోటీల్లో ఏయూ తరుపున ఆడే ఖోఖో పురుషుల, మహిళల జట్లను బుధవారం ఎంపిక చేశారు. వీరిని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు అభినందించారు. ఇంటర్ యూనివర్శిటీ క్రీడల్లో ప్రతిభ సాధించి ఏయూకు మంచి పేరుతీసుకురావాలని ఆకాంక్షించారు. ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్.విజయమోహన్ మాట్లాడుతూ ఇంటర్ యూనివర్శిటీ పురుషులు ఖోఖో పోటీలు తిరువూరు తమిళనాడు యూనివర్శిటీలో ఈనెల 27 నుంచి 31 వరకు జరుగుతాయన్నారు.

సౌత్ జోన్ యూత్ ఫెస్ట్‌కు తరలిన ఏయూ బృందం



విశాఖ విద్య: 38వ ఏఐయూ ఇంటర్ యూనివర్సిటీ సౌత్ జోన్ యూత్ ఫెస్టివల్‌కు ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి విద్యార్థుల బృందం బుధవారం తరలివెళ్లింది. ఏయూ ఆర్ట్స్, ఫార్మసీ, ఇంజినీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలకు చెందిన 46 మంది విద్యార్థులతో కూడిన బృందం ఈ ఫెస్టివల్‌లో పాల్గొంటుంది. తమిళనాడులోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఇది జరగనుంది. మ్యూజిక్, డ్యాన్స్ లిటరరీ, థియేటర్, ఫైన్ ఆర్ట్స్ విభాగాల్లో 27 అంశాల్లో జరిగే పోటీల్లో ఏయూ విద్యార్థులు తమ ప్రతిభ చూపనున్నారు. బుధవారం ఉదయం ఏయూ పరిపాలన భవనం వద్ద ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు జెండా ఊపి విద్యార్థుల బృందాన్ని పంపించారు.



కృష్ణానది సాగరుణ్ణి చేరే అత్యంత సుందర ప్రదేశంలో దేవతలు నిర్మించిన శ్రీ రుక్మిణీ, సత్యభామా సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవాలయం ఉంది. అనేక పౌరాణిక విశేషాలకు ఆలవాలమైన ఈ ప్రదేశం అందరినీ ఆకట్టుకుంటుంది. ఆలయ దర్శనం చేసుకున్న పెద్దలు ఎంత సంతోషపడతారో, అక్కడే ఉన్న సముద్రం ఒడ్డున కెరటాలతో పోటీపడుతూ ఆ నీళ్లతో ఆడుతూ పిల్లలూ అంతే సరదా పడతారు.

● హంసలదీవి

దేవతలు నిర్మించిన వేణుగోపాలస్వామి ఆలయం

పూర్వం పాపాత్ములందరూ వెళ్ళి గంగానదిలో స్నానం చేసి తమ తమ పాపాలను పోగొట్టుకునే వాళ్ళు. గంగా నది, పాపం, వీళ్ళందరి పాపాలతో అపవిత్రమై, నల్లని రూపాన్ని సంతరించుకుంది. ఆ పాపాలనుంచి విముక్తికై ఆమె మహావిష్ణువుని ప్రార్థించింది. అప్పుడాయన, పాపాత్ముల పాపాల మూలంగా నువ్వు నల్లగా మారి పోయావు, అందుకని నువ్వు నల్లని కాకి రూపంలో వివిధ తీర్థాలలో స్నానం చేస్తూ వుండు. ఏ తీర్థంలో స్నానం చేసినప్పుడు నీ మాలిన్యం వదలి హంసలా స్వచ్ఛంగా మారుతావో, అది దివ్య పుణ్య క్షేత్రం అని చెప్పాడు. గంగ కాకి రూపంలో వివిధ తీర్థాలలో స్నానం చేస్తూ, కృష్ణవేణి సాగర సంగమ ప్రదేశంలో కూడా చేసింది. వెంటనే ఆవిడకి కాకి రూపం నశించి హంస రూపం వచ్చింది. అందుకని ఈ ప్రాంతాన్ని హంసలదీవి అన్నారని ఒక కథ.

పులిగడ్డ దగ్గర కృష్ణానది చీలి దక్షిణ కాశియని పేరు పొందిన కోళ్ళపల్లి (నాగేశ్వర స్వామి) మీదుగా హంసలదీవికి వచ్చిన వైనం గురించి ఒక కథ వుంది. ఇది బ్రహ్మాండ పురాణంలో వున్నది.

పూర్వం దేవతలు సముద్ర తీరంలో ఒక విష్ణ్వాలయం నిర్మించి అక్కడ వారు పూజాదికాలు నిర్వర్తించాలనుకున్నారు. మరి దేవతలు వచ్చి పూజలు చెయ్యాలంటే వారికి ఏ ఆటంకం లేని ప్రదేశం కావాలి కదా. పూర్వం ఈ ప్రాంతమంతా దట్టమైన అడవులతో నిర్మానుష్యంగా వుండేది. అందుకని దేవతలు ఇక్కడ వేణు గోపాల స్వామి ఆలయం నిర్మించాలనుకున్నారు. అందుకోసం వాళ్ళు ఒక్క రాత్రిలోనే ఆలయాన్ని నిర్మించారుట. కోడి కూసే సమయానికి రాజగోపురం సగమే పూర్తయింది. దాంతో వారు గోపురాన్ని అసంపూర్తిగా వదిలేసి వెళ్ళిపోయారు. తర్వాత చోళ, మౌర్య రాజుల కాలంలో ఆలయ పునరుద్ధరణ జరిగినా, అసంపూర్తిగా వున్న గాలి గోపురాన్ని అలాగే వదిలేశారు. ఇటీవల విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం వారు ఈ ఆలయాన్ని దత్తత తీసుకుని నూతన గాలి గోపురాన్ని నిర్మించారు. పురాతన గాలి గోపుర శిథిలాలు కొన్ని ఇప్పటికీ ఆలయ పరిసర ప్రాంతాల్లో కనిపిస్తాయి.

స్వామి ఆవిర్భావం గురించి.... పురాతన కాలంలో ఈ ప్రాంతంలో ఆవులు ఎక్కువగా ఉండేవి. అందులో కొన్ని ఆవులు ఇంటి దగ్గర పాలు సరిగ్గా ఇవ్వక పోవటంతో వాటిని జాగ్రత్తగా కాపలా కాశారు. అవి వెళ్ళి ఒక పుట్ట దగ్గర పాలు వర్షించటం చూసి గోపాలురు కోపంతో అక్కడున్న చెత్తా చెదారం పోగుచేసి ఆ పుట్టమీద వేసి తగులబెట్టారు. పుట్టంతా కాలిపోయి అందులో స్వామి శరీరం తునాతునకలయింది. స్వామిని చూసిన గోవుల కాపరి వెంటనే మంట ఆపివేశాడు. అందరూ వచ్చి పుట్ట తవ్వి చూడగా ముఖం తప్ప మిగతా శరీరమంతా ఛిన్నా భిన్నమయిన స్వామి దర్శనమిచ్చారు.. అదిచూసి వారంతా సతమతమవుతున్న సమయంలో స్వామి ఒకరికి కలలో కనిపించి పశ్చిమ గోదావరి జిల్లాలో కాకరపర్తి అనే గ్రామంలో భూస్వామి ఇంటి ఈశాన్య మూలగల కాకర చెట్టుకింద వున్న నన్ను తీసుకువచ్చి ఇక్కడ ప్రతిష్ఠించమని ఆనతినిచ్చారు. ఆ విగ్రహమే ఇది. నల్లశానపు రాతిలో చెక్కిన విగ్రహంలాగా కాక నీలమేఘ ఛాయతో విలసిల్లుతోంది.

దేవాలయంపై పెద్ద రాతి దూలాలు అమర్చబడివున్నాయి. ఈ ప్రాంతంలో కొండ గుట్టలు కానీ, పర్వతాలుగానీ లేవు. ఆ రాతి దూలాలను ఇప్పుడు తీసుకు రావాలన్నా చాలా వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని. మరి ఎటువంటి సౌకర్యాలూ లేని ఆ కాలంలో వాటిని ఎక్కడనుంచి తెచ్చారో తలచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. ఆలయ కుడ్యాలపై గరుత్మంతుడు, లక్ష్మీ నారాయణులు, నరసింహుడు, ఆంజనేయ స్వామి మొదలగు విగ్రహాలున్నాయి.









ఉత్సవాలు...

ప్రతి సంవత్సరం మాఘ శుద్ధ నవమి నుండి మాఘ బహుళ పాడ్యమి వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.

సరదాలు...

కృష్ణా నది సముద్రంలో కలిసే అందమైన ప్రదేశంలో సత్యభామ, రుక్మిణీ సమేత శ్రీ వేణు గోపాల స్వామి ఆలయం ఉంది. దీన్ని దేవతలు నిర్మించారని చరిత్ర చెబుతోంది. అంతే కాదు మహర్షులు, దేవతలకు మధ్య అనేక విషయాలు జరిగిన ప్రదేశం కూడా ఇది. దీన్ని చూడటానికి పిల్లలు, పెద్దలు కూడా ఎంతో ఆసక్తి చూపుతారు. ఎందుకంటే ఇక్కడి దైవాన్ని దేవతలు ప్రతిష్ఠించారు అని ,సముద్ర తీరంలో చల్లని ఆహ్లాదకరమైన వాతావరణం లో సేద తీరడానికి అందరూ వయసుతో సంబంధం లేకుండా ఇష్టపడతారు.


– స్వాతీ భాస్కర్

ఎలా వెళ్లాలి?

విజయవాడకు 110 కి.మీ., అవనిగడ్డకు 25 కి.మీ. దూరంలో ఉంది హంసలదీవి. విజయవాడ నుంచి పామర్రు, కూచిపూడి, చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ, కోడూరు మీదుగా ఇక్కడికి చేరుకోవచ్చు. అలాగే మచిలీ పట్నం నుంచి కూడా. అయితే ఈ ప్రాంతానికి బస్సు సౌకర్యం కొంచెం తక్కువ. అవనిగడ్డనుంచి హంసలదీవి దాకా బస్సులున్నాయి. దారి బాగుంటుంది. సొంత వాహనాల్లో వెళ్తే కృష్ణానదీ, సాగర సంగమాల దాకా కూడా వెళ్ళి రావచ్చు. అయితే మనకి కావలసిన ఆహారం, మంచినీరు వగైరాలన్నీ తీసుకు వెళ్ళాలి. ఎందుకంటే అక్కడ ఇంకా అన్ని సౌకర్యాలూ లేవు. వెలుతురు ఉన్న సమయంలో వెళ్తే ప్రకృతి అందాలను ఆస్వాదించవచ్చు.

● ఆధ్యాత్మికం

మౌనం ఒక వరం...



మౌనంగా ఉండటం చాలా మందికి తెలీదు. ఏదో ఒకటి వాగుతూనే ఉంటారు. కొందరు పూజలు చేస్తూ మాట్లాడుతూ ఉంటారు. మరి కొంతమంది మత గ్రంథాలు చదువుతూ ఒక పక్క మాట్లాడుతూ మరోప్రక్క అనవసర విషయాలలో జోక్యం చేసుకుంటారు. ఏదో ఉదయమే చదివితే చాలు అనే ధ్యాసలో ఉంటారు. మరి కొంతమంది ఎటువంటి పూజలు కాని మత గ్రంథాలు చదవటం కాని చేయరు. అనునిత్యం పైకి అనకుండా మనసులోనే తమ దైవాన్ని స్మరించుకుంటారు. వారు ఎక్కువ మాట్లాడకుండా మౌనంగా ఉంటారు. చిరునవ్వుతోనే సమాధానం ఇస్తూ ఉంటారు. ఇటువంటి వారు చాలా అరుదుగా కనిపిస్తారు. ముఖ్యంగా ఎవరు ఏమైనా అంటే దానికి సమాధానం ఇవ్వకుండా ఉంటే మేలు. లేకపోతే మాటకు మాట పెరిగి వాగ్వివాదం పెరిగి చూసేవారికి అసహనం కలుగుతుంది. సమాధానం ఇవ్వకుండా ఉంటే మౌనంగా ఉండొచ్చు కదా అని చాలా మంది అనుకుంటారు. వృద్ధాప్యం ఉన్న వాళ్ళు ఎక్కువగా మౌనంగా ఉండటం నేర్చుకోవాలి. కొందరికి అన్ని కావాలి. ఎవరు, ఏమిటీ అని ఆరా తీస్తారు. అది వారి పెద్దరికానికి తగదు. పూజలు చేస్తేనే పుణ్యం అనే భ్రమలోనుంచి వారు బయటకు రావాలి. చేత కానప్పుడు మదిలోనే భగవంతుని స్మరించవచ్చు. అంతేకాని వితండవాదం చేయకూడదు. మన మాట పిల్లలు విననప్పుడు మనం మారు మాటాడకూడదు. వారు ఏదయినా అడిగితేనే మనం సలహా ఇవ్వాలి. అయినా ఈ రోజులలో పెద్దల మాట ఎవరూ పట్టించుకోరు. మనం సాధ్యమైనంత వరకు మనసులోనే మౌనంగా మన ఇష్టదైవాన్ని తలచుకుంటే అదే పదివేలు. మౌనమే మనం అలవర్చుకోవాలి. మౌనాన్ని మించిన విద్య లేదు. మౌనం అన్నిటికి పరిష్కారం.

– కనుమ ఎల్లారెడ్డి,
విశ్రాంత పౌర శాస్త్ర అధ్యాపకులు

● హదీసు ప్రబోధిని

జీవితానికి పంచ సూత్రాలు



దైవ సందేశ హరులు (సఅసం) ఇలా ప్రవచించారని హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించారు:

నేను చెప్పే ఈ వాక్కులను గ్రహించి వాటికి అనుగుణంగా నడిచేవాడు మీలో ఎవరైనా ఉన్నారా? లేక వాటికి అనుగుణంగా నడిచేవాణ్ణి మీలో ఎవరైనా చూపించగలరా? అని అడగ్గా, దైవ ప్రవక్తా నేను సిద్ధంగా ఉన్నాను అని అన్నాను. అప్పుడు ఆయన నా చేతిని పట్టుకొని ఈ సూత్ర సూత్రాలను ఇలా లెక్కించారు:

వివరణ: జీవితం గడిపేందుకు ముఖ్యమైన సంపూర్ణమైన ఐదు సూత్రాలను చూపించి వాటిని అమలు చేయాలని ఆదేశించారు దైవ ప్రవక్త మహమ్మద్ సల్లం.

మొదటి సూత్రం: హరాం కు (నిషేధించబడిన దానికి) దూరంగా ఉండండి. మీరు గొప్ప భక్తి పరులవుతారు.

అంటే బహు దైవారాధన, తల్లి దండ్రుల ఆదేశాల ధిక్కరణ, హింస, దౌర్జన్యం, హత్యాకాండ, రక్తపాతం, మద్యపానం, జూదం, వ్యభిచారం, అనాథల ధనాన్ని కొల్లగొట్టడం, ప్రత్యక్షమైన, పరోక్షమైన అశ్లీలం, వడ్డీ వ్యాపారం, ప్రజలను పీడించడం, కొలతల్లో మోసం చేయడం వగైరాలన్నీ నిషిద్ధమైనవి అంటే 'హరాం' చేయబడినవి. వీటన్నిటికీ దూరంగా ఉండడం గొప్ప ఆరాధన. ఎవరైతే ఈ దుష్కృత్యాల దరిదాపుల్లోకి కూడా పోరో వారు ఎల్లడూ దైవారాధనలోనే మునిగి ఉండే భక్తి పరుల కంటే గొప్ప భక్తి పరులు. మనిషి మనసుకు ఆహ్లాదాన్ని కలిగించే ఈ నిషిద్ధాలకు దూరంగా ఉండాలంటే అతడు తన మనోవాంఛలతో పోరాడి వాటిని అణచగలగాలి.

రెండో సూత్రం: అల్లాహ్ మనిషిని సృష్టించాడు. అతడిని పోషిస్తున్నాడు కూడా. ఆయన తన వివేచనా, విజ్ఞానం దృష్ట్యా ఎవరికీ

ఎంత ఇవ్వాలో అదంతా రాసి ఉంచాడు. అది మనిషికి తప్పకుండా లభిస్తుంది. ఏ ఒక్కరూ దాన్ని ఆపడం గాని, పెంచడం గాని చేయలేరు. ఈ విషయాన్ని నమ్మి తప్తిపడే వారి మనస్సులో ఓ విధమైన మనశ్శాంతి, సంతృప్తి ఉద్భవిస్తాయి. తన శక్తి సామర్థ్యాలకు అనుగుణంగా భుక్తి కోసం ప్రయత్నం చేస్తాడు ఆ వ్యక్తి. అయితే పేరాశ, అసూయ, ద్వేషాల అగ్ని జ్వాలల్లో మాత్రం మండడు. ఇతని జీవితం ఎంతో సాఫీగా ప్రశాంతంగా గడుస్తుంది.

మూడో సూత్రం: నీ పొరుగు వారి పట్ల సద్బుద్ధితో మెలుగు నీవు మోమిన్ (విశ్వసివి) అవుతావు. ఎవరి దుష్కార్యాల నుండి అతని పొరుగువాడు సురక్షితంగా ఉండడో అతడు మోమిన్ (విశ్వసి) కాడు అని మరొక ప్రవచనంలో ఉంది. అంటే మీరే గనుక మోమిన్ నిజమైన విశ్వాసి కాదల్చుకుంటే ఈ పొరుగు వారి పట్ల మంచి బుద్ధితో మెలగండి.

నాలుగో సూత్రం: ఒకరి ధనమాన ప్రాణాలపై మీ నోటి ద్వారా గాని, మీ చేతులతో గాని దాడి చేయకండి. మీ ధనమాన ప్రాణాలపై ఎవరూ దాడి చేయకూడదు అని మీరు కోరుకున్నట్లే ఇతరుల పట్ల కూడా మీరు అదే వైఖరిని అవలంబించండి.

ఐదవ సూత్రం: దైవస్మరణతో హృదయం నిరంతరం సజీవంగా ఉంటుంది. అధికంగా నవ్వడం వల్ల మీరు మైమరపు కు గురి అవుతారు. ఈ పరిస్థితినే మరణంగా పేర్కొనడం జరిగింది.

– మొహమ్మద్ అబ్దుల్ రషీద్

● పరిహారం

తరచు పీడకలలు వస్తున్నాయా?



ఒక్కోసారి వరుసగా పీడకలలు వచ్చి ఇబ్బందిపెడుతుంటాయి. ఏ అర్ధ రాత్రి వేళలోనో గాఢనిద్రలో వచ్చే పీడకలలకు ఉలిక్కిపడి హఠాత్తుగా మేలుకుంటారు. ఇక ఆ తర్వాత నిద్రపట్టడమే గగనమవుతుంది. ఏదో ఒక సారి వచ్చే పీడకలలతో పెద్ద ఇబ్బందేమీ ఉండదు గాని, వరుసగా రోజుల తరబడి లేదా చాలా తరచు వచ్చే పీడకలలు భయాందోళనలకు గురిచేస్తాయి. పీడకలలు ఇబ్బంది పెట్టకుండా ఉండాలంటే...

- మీకు అనుకూల నక్షత్రం చూసుకుని, ఏదైనా మంగళవారం రోజున మొదలుపెట్టి హనుమాన్ చాలీసా లేదా ఆంజనేయ దండకం పఠించండి. ప్రతి రోజూ నిత్యపూజలో భాగంగా ఈ పఠనం సాగించండి. ● మహామృత్యుంజయ యంత్రాన్ని తాయెత్తులో భద్రపరచి, దానిని ఏదైనా శనివారం రోజున నల్లదారంతో మెడలో ధరించండి. ● ఉదయం, సాయంత్రం ఇంట్లో గుగ్గిలంతో ధూపం వేయండి. ప్రతిరోజూ నిత్యపూజలో భాగంగా దేవీ ఖడ్గమాలా స్తోత్రాన్ని పఠించండి.
- పీడకలలకు పెద్దలే ఉలిక్కిపడతారు. పిల్లలకు ఇలాంటి అనుభవం ఎదురైతే మరింతగా భయాందోళనలు చెందుతారు. అలాంటప్పుడు పిల్లల తల వద్ద చిన్న పటిక ముక్కను ఉంచి వారిని నిద్రపుచ్చండి. వారు నిద్రలోకి జారుకుంటుండగా ఆంజనేయ దండకాన్ని పఠించండి.
- పిల్లలు పీడకలలో ఇబ్బంది పడుతుంటే, ఏదైనా మంగళవారం రోజున ఆంజనేయుడి ఆలయంలో అర్చన జరిపించండి. సంజీవని పర్వతం మోస్తున్నట్లుగా ఉండే ఆంజనేయుని వెండి లాకెట్‌ను పిల్లల మెడలో వేయండి.

– సాంఖ్యాయన

● సువార్త

గాఢాంధకారంలో వెలుగు రేఖలు



చుట్టూ గాఢాంధకారం... గ్రామం గాఢనిద్రలో ఉంది కదాని ప్రకృతి కూడా అప్పుడే నిద్రకు ఉపక్రమించింది. పైరగాలి మాత్రం కొద్దిగా మేలుకొని మెల్లని, చల్లని గాలులను వీయిస్తోంది. ఆ గాలికి మైమరచి కొండలు ప్రశాంతంగా నిద్రపోతున్నాయి. ఆ కొండల పక్కనే ఓ చిన్న బొరియ. దాని నిండా పలు రకాల పశువులు.

ఇంతలో దూరంగా ఇద్దరు వ్యక్తులు. చూడటానికి భార్యాభర్తల్లా ఉన్నారు. అసలే అర్ధరాత్రి. చలి గజగజ వణికిస్తోంది. చలికి ఆ స్త్రీ రెండు చేతులు చెవులపై అదిమి పెట్టింది. భార్య చలికి తట్టుకోలేకపోవడాన్ని గమనించి అతడు తన పై వస్త్రాన్ని తీసి ఆమెకు కప్పాడు. సరిగ్గా అప్పుడే చంద్రుడు నిద్రలేచాడు. నల్లని మబ్బుల కనురెప్పలను తెరచి వెన్నెలను విరబూయించడం ప్రారంభించాడు.

'ఏంటి వీళ్ళు... ఇటే వస్తున్నారు. ఇప్పటికే ఇరుకుగా ఉంది. వీరెక్కడ సరిపోతారు' అందో గాడిద.

'సరేలే ఉన్న దాంట్లో ఇరుక్కుంటారేమో నీకెందుకు నొప్పి' అంది పక్కనే ఉన్న మరో గాడిద. 'సరిగ్గా చూడండెహే.. పాపం ఆవిడ ప్రసవానికి సిద్ధంగా ఉంది. నోర్మూసుకుని దారి ఇవ్వండి లేకపోతే తెలుసుగా, కొమ్ములకు ఈ మధ్యే పదును పెట్టా' అని హెచ్చరించింది పక్కనే ఉన్న ఓ పొట్టేలు.

'నిజమే.. అందరూ లేవండి.. మనం ఆ మూలకు వెళదాం అంది' ఓ గొర్రె. ఇంతలో వారు లోనికి రానేవచ్చారు. పశువులన్నీ మరో మూలకు చేరి వారికి కొంచెం చోటిచ్చాయి. అనుకున్నదే అయింది. ఆ స్త్రీ వచ్చిన కొద్దిసేపటికే బంగారులాంటి కొడుకు పుట్టాడు. బుజ్జి మేక ఆ బాలుడి దగ్గర చేరి చెంగు చెంగున గెంతుతోంది. అది చూసి మిగిలిన బుజ్జి మేకలు, గొర్రె పిల్లలు మే.. మే అని శబ్దాలు చేస్తూ పిల్లాడి చుట్టూ చేరి ఆడుకుంటున్నాయి. 'ఎవరి సహాయం లేకపోయినా సుఖ ప్రసవం జరిగింది.. సంతోషం' అంది పొట్టేలు పక్కనే ఉన్న గాడిదతో...

'నిజమే బాలుడు చూడ ముచ్చటగా ఉన్నాడు, నా మీద ఎక్కి కూర్చుంటే నగరమంతా తిప్పుతాను' అంది గాడిద.

ఇంతలో బిడ్డ దగ్గరకు ఓ ఆవు, పెయ్య దూడ కలిసి వచ్చాయి. ఆ పెయ్య దూడ తన తల్లితో.. 'అమ్మా.. బాబు చూడు నాలాగే ఎర్రగా ఉన్నాడు. ఒక్క మచ్చ కూడా లేదు'. అంది. నిజమేనన్నట్లు ఆ ఆవు తలూపింది.

ఇంతలో ఆ పాకలో గొప్ప వెలుగు పుట్టింది. ఆ వెలుగులో రెక్కలు కట్టుకున్న అందమైన జీవులు ప్రత్యక్షం అయ్యాయి. బిడ్డ పుట్టుకతో, జంతునాట్యాలతో పరవశులైన ఆ రెక్కల జీవులు బిడ్డను పొగిడి తిరిగి వెళ్లిపోయారు...

ఆ జాబిల్లి వెలుగులో పశువులన్నీ ఓ మానవీయ ఘటనను చూశాయి. తమ వద్దకు వస్తున్న ఆ జంట చూడ ముచ్చటగా ఉంది. ఆమె నిండు గర్భిణి. ఏ క్షణమైనా ప్రసవం జరిగేలా ఉంది. వీరికి దారి చూపడానికే చంద్రుడు నిద్ర లేచాడా అన్నట్లు ఉందా పరిస్థితి. పశుల పాకలోని జంతువులు ఒక్కొక్కటిగా నిద్ర లేచాయి.

అప్పటివరకూ ఎగిరిన పశుపిల్లలు అన్నీ అలసిపోయి బిడ్డ చుట్టూ పడుకున్నాయి. పెద్ద జంతువులన్నీ కాసేపు ముచ్చట్లు కొనసాగించి అలాగే నిద్రపోయాయి. వేదనను అనుభవించిన ఆ స్త్రీ సంతోషంతో, ఆత్మీయ ఆనందంతో నిద్రలోకి జారుకుంది. అప్పటివరకు గర్భవతియైన తన భార్యను కాపాడిన భర్త కూడా పడుకున్నాడు. ఆ బిడ్డ మాత్రం... సంతోషంతో తనవైపే చూస్తున్న జాబిల్లిని, ఆనంద బాష్పాలను మంచురూపంలో కురిపిస్తున్న నల్లని మబ్బులను... తన పుట్టుకను గాంచి మిగుల ఆనందపడిన పశు పిల్లలను, వాటి తల్లులను చూస్తున్నాడు.

ఏదో ఒకరోజు నీ మీద నగరానికి వస్తానని గాడిదకు మనసులోనే మాటిచ్చాడు. అచ్చం నాలాగే ఉన్నాడన్న గొర్రెపిల్లకు, ఎర్రగా ముద్దుగా ఒక్కమచ్చ కూడా లేదన్న పెయ్య దూడకు మీరన్నవన్నీ నిజమే అని తన మనసులో అనుకుంటూ చిరునవ్వుల వర్షం కురిపించాడు. లోకాన్ని మేల్కొల్పాల్సిన అవసరం ఉందని అనుకుంటూ, తనకు జన్మనిచ్చిన తల్లివైపు... ఆదరించిన తండ్రివైపు కృతజ్ఞతతో చూశాడు.

– సృజన్ సెగెవ్

ధర్మ సందేహాలు

కృష్ణుడిని మురారి అని ఎందుకు పిలుస్తారు?

కశ్యపుడికి మురుడు అనే కుమారుడు ఉన్నాడు. అతను ఎలాగైనా దేవతలని ఓడించాలని చాలా సంవత్సరాలు బ్రహ్మను గురించి తపస్సు చేశాడు. బ్రహ్మ మురుడికి ఏ యుద్ధభూమిలోనైనా మురుడు తాకితే ఆ వ్యక్తి అమరుడయినా సరే, వెంటనే మరణిస్తాడనే వరమిచ్చాడు. ఆ వరబలంతో మురుడు అజేయుడు అయ్యాడు. అతను ఇంద్రునిపై దాడి చేశాడు. తత్ఫలితంగా, మురుడితో యుద్ధం చేయలేక ఇంద్రుడు స్వర్గాన్ని విడిచిపెట్టవలసి వచ్చింది. తర్వాత మురుడు విష్ణువు వద్దకు చేరుకున్నాడు. ఏం కావాలని అడిగిన విష్ణువుని నీతో యుద్ధం చేయాలని ఉందని కోరుకున్నాడు. విష్ణువు మురాసురుడితో భీకర యుద్ధం చేసి అతణ్ణి సంహరించాడు. మురాసురుడనే రాక్షసుని సంహరించాడు కాబట్టి విష్ణుమూర్తికి మురారి అని పేరొచ్చింది. అప్పటినుంచి విష్ణువుని మురారి అని పిలుస్తారు.

బిజినెస్ రీల్

భారత్‌లో ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు ఏడీబీ అండ

రూ.4,250 కోట్ల రుణసాయంపై ఒప్పందం

న్యూఢిల్లీ: భారత్‌లో మౌలిక రంగ ప్రాజెక్టులకు 500 మిలియన్ డాలర్ల (రూ.4,250 కోట్లు) రుణ సాయం అందించేందుకు ఆసియా అభివృద్ధి బ్యాంక్ ముందుకొచ్చింది. ఈ మేరకు ఏడీబీ, కేంద్ర ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది. భారత ప్రభుత్వ హామీతో ఈ మొత్తాన్ని ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కంపెనీ (ఐఐఎఫ్‌సీఎల్)కి ఏడీబీ అందించనున్నట్టు ఆర్థిక శాఖ ప్రకటించింది. అనుసంధానత, ఇంధన పరివర్తనం, పట్టణ ప్రాజెక్టులు, విద్య, హెల్త్‌కేర్ రంగ ప్రాజెక్టులకు ఈ నిధులు వెచ్చించనున్నట్టు తెలిపింది. సున్నా కర్బన ఉద్గారాల లక్ష్యానికి చేరుకునేందుకు దేశానికి పెద్ద ఎత్తున పెట్టుబడుల అవసరాన్ని గుర్తు చేసింది. ఐఐఎఫ్‌సీఎల్‌తో కలసి ఏడీబీ చాలా కాలంగా పనిచేస్తుండడం గమనార్హం.

మూడేళ్లలో మూడింతల ఆదాయం: గోమెకానిక్

న్యూఢిల్లీ: కార్ సర్వీసెస్, రిపేర్ ప్లాట్‌ఫామ్ గోమెకానిక్ మూడేళ్లలో నికర ఆదాయం మూడింతలకుపైగా అధికమై రూ.700 కోట్లకు చేరుకుంటుందని అంచనావేస్తోంది. ఆ తర్వాత పబ్లిక్ లిస్టింగ్‌కు వెళ్తామని కంపెనీ కో-ఫౌండర్, సీఈవో హిమాన్షు అరోరా తెలిపారు. ప్రస్తుతం 3 శాతం మార్కెట్ వాటా కలిగి ఉన్నామని, మూడేళ్లలో దీనిని 10 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. ద్విచక్ర, ఎలక్ట్రిక్ వెహికిల్స్ సర్వీసెస్ విభాగంలోకి ప్రవేశిస్తామన్నారు. 'కంపెనీ ప్రస్తుతం 125 నగరాల్లో 800 గరాజ్‌ల ద్వారా సేవలను అందిస్తోంది. 2027 నాటికి 500 నగరాల్లో 2,500 గరాజ్‌లను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నాం' అని వివరించారు. గతంలో ఆర్థిక లావాదేవీల్లో అవకతవకలు బయటపడడంతో కంపెనీని ఇన్వెస్టర్లు అమ్మకానికి పెట్టారు. లైఫ్‌లాంగ్ గ్రూప్ అనుబంధ కంపెనీ సర్విజ్జీ 2023 మార్చిలో గోమెకానిక్‌ను కొనుగోలు చేసింది.

8 లక్షల మంది కస్టమర్లు..

గోమెకానిక్ 2023–24లో రూ.210 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జూన్‌లో రూ.85 కోట్లు నమోదు చేసింది. 'విడిభాగాలు, ఉపకరణాల అమ్మకాలు కూడా వేగంగా పెరుగుతున్నాయి. వీటి విక్రయాలు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.432 కోట్లు నమోదయ్యే అవకాశం ఉంది. నికర రాబడి దాదాపు రూ.200 కోట్లకు చేరుకుంటాం' అని అరోరా చెప్పారు. యాక్టివ్ కస్టమర్లు నెలకు 8 లక్షలు ఉన్నారని గోమెకానిక్ కో-ఫౌండర్, సీవోవో ముస్కాన్ కక్కర్ వివరించారు. నిర్వహణ లాభం నమోదు చేస్తున్నామని, 2027 నాటికి నికరలాభం అందుకుంటామని ఆమె వెల్లడించారు. కంపెనీ రోల్స్‌పై 550 మంది, ఫ్రాంచైజీ నెట్‌వర్క్‌లో 4,000 మంది పనిచేస్తున్నారని వివరించారు.

వర్టెక్స్ గ్లోబల్ సర్వీసెస్‌లో 4,000 కొలువులు..

న్యూఢిల్లీ: అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఐటీ సపోర్ట్, సర్వీసుల సంస్థ వర్టెక్స్ గ్లోబల్ సర్వీసెస్ తాజాగా భారత్‌లో గణనీయంగా నియామకాలు చేపట్టనుంది. కస్టమర్లకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు వచ్చే 3–5 ఏళ్లలో ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో 4,000 మంది పైగా లాంగ్వేజ్ నిపుణులను నియమించుకోనున్నట్లు సంస్థ వెల్లడించింది. చిన్న నగరాల్లో ఉద్యోగాల లభ్యతకు సంబంధించిన సవాళ్లను యువత అధిగమించడంలో తోడ్పాటు అందించే దిశగా రిక్రూట్‌మెంట్ తలపెట్టినట్లుగా కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈవో గగన్ ఆరోరా తెలిపారు. ఇంగ్లీష్, ఫ్రెంచ్, కొరియన్ తదితర అంతర్జాతీయ భాషలతో పాటు కన్నడ, బెంగాలీ, గుజరాతీ తదితర ప్రాంతీయ భాషల్లోనూ సర్వీసులను అందిస్తున్నట్లు వివరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

26-12-2024

విశాఖ	600–00
చిత్తూరు	603–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	600–00
విజయవాడ	600–00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	585–00
వరంగల్	587–00
రిటైల్ ధర	6.45

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	70.10	$ 69.24
బ్రెంట్	73.22	$ 72.32

అమెరికాకు ఎగుమతులు పెరిగే చాన్స్

చైనాపై అధిక సుంకాల హెచ్చరికల నేపథ్యం ● కేంద్రం మద్దతు కోరిన ఎఫ్ఐఈఓ



న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ చైనా వస్తువులపై అధిక సుంకాలు విధిస్తామని హెచ్చరిస్తున్న నేపథ్యంలో అందివచ్చే అవకాశాలను భారత్ సద్వినియోగం చేసుకునే వీలుందని అత్యున్నత స్థాయి ఎగుమతిదారుల సంస్థ- ఎఫ్ఐఈఓ పేర్కొంది. ఈ దిశలో అమెరికాకు భారత్ ఎగుమతులను పెంచడానికి వ్యూహాన్ని రూపొందించినట్లు కూడా ఎఫ్ఐఈఓ తెలిపింది. ఈ ప్రణాళికలో భాగంగా దేశ ఎగుమతిదారులు అమెరికా అంతటా జరిగే వాణిజ్య, వ్యాపార ప్రదర్శనలలో పాల్గొనడానికి ఆర్థిక సహాయం అందించాలని ఎఫ్ఐఈఓ (ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్) వైస్ ప్రెసిడెంట్ ఇస్రార్ అహ్మద్ ఇక్కడ విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. తాను అధికారం చేపట్టింది వెంటనే మెక్సికో, కెనడా, చైనాలపై కొత్త టారిఫ్‌లు విధిస్తానని ట్రంప్ బెదిరించిన నేపథ్యంలో ఇస్రార్ అహ్మద్ ఇచ్చిన ఇంటర్వ్యూలో కొన్ని ముఖ్యమైనవి...

- అమెరికా మార్కెట్‌కు భారత్ ఎగుమతుల్లో వృద్ధిని పెంచడానికి రూపొందించిన వ్యూహంలో మేము ఐదు కీలక రంగాలను గుర్తించాము. దుస్తులు, ఎలక్ట్రానిక్స్, బొమ్మలు, పాదరక్షలు, ఆర్గానిక్ కెమికల్స్ రంగాలు ఇందులో ఉన్నాయి. ఈ రంగాలకు సంబంధించి అమెరికా వాణిజ్య సంఘాలతో చేతులు కలపాలని ఎఫ్ఐఈఓ భావిస్తోంది.
- బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చితి కారణంగా చాలా దుస్తులు కంపెనీలు భారత్‌కు స్థావరాలను మార్చుకుంటున్నాయి.
- అమెరికా మార్కెట్‌లో భారత్ ఎగుమతులు విస్తరించాల్సిన అవసరం, అవకాశాలు ఉన్నాయి. అమెరికాలో భారత్ ఉత్పత్తులను విస్తృత స్థాయిలో మార్కెటింగ్ చేయడానికి ఎగుమతిదారులకు తగిన ఆర్థిక మద్దతు అవసరం. అందివస్తున్న అవకాశాలను వినియోగించుకోవడంలో ఇది కీలకం.
- దేశంలో పెద్ద ఫ్యాక్టరీలు వస్తున్నందున సామర్థ్యాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికాలో భారత్ ఉనికి మరింత పెంచుకోవాలి. అవకాశాలను చేజిక్కించుకోవడానికి మార్కెట్ యాక్సెస్ ఇనిషియేటివ్స్ (ఎంఏఐ) పథకం కింద మరిన్ని నిధులు అడుగుతున్నాము. అమెరికాకు ఎగుమతులు లక్ష్యంగా ఈ పథకంపై దృష్టి పెట్టా లి. కనీసం మూడు సంవత్సరాలు దీనిని అమలు చేయాలి.
- ప్రస్తుతం భారత్ ఎగుమతిదారులు 'ద్రవ్య లభ్యత' (లిక్విడిటీ) సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఫైనాన్స్ అవసరాలు తీవ్ర సవాళుగా ఉన్నాయి.
- వస్తువులు, సేవలను కొనుగోలు చేసిన 45 రోజుల్లోగా ఎంఎస్ఎంఈ (లఘు, సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలు)లకు చెల్లింపులు జరపాలన్న నిబంధనను సడలించాలి. రుణ వ్యయాలను తగ్గించుకోవడానికి సంబంధించిన - ఇంట్రస్ట్ ఈక్విలైజేషన్ స్కీమ్ (ఐఈఎస్)ను ఐదు సంవత్సరాల పొడిగించాలి.
- దేశం నుంచి ఎగుమతయ్యే ఉత్పత్తులకు సంబంధించి కేంద్రం అమలుచేస్తున్న ఆర్ఓడీటీఈపీ (ఎగుమతి ఉత్పత్తులపై సుంకాలు, పన్నుల రిఫండ్) పథకం ప్రయోజనాలు అందిస్తున్నప్పటికీ, ఆయా ఉత్పత్తుల దిగుమతిదేశాలు విధిస్తున్న కౌంటర్‌వ్యాలింగ్ సుంకాలు (రాయితీలు పొందిన ఉత్పత్తులపై సుంకాలు- యాంటీ సబ్సిడీ సుంకాలు) ఎగుమతిదారులకు ఇబ్బందులను సృష్టిస్తున్నాయి. ఈ సమస్యపై ఈఐఎఫ్ఓ వాణిజ్య మంత్రిత్వశాఖతో చర్చిస్తోంది.

భారత్-అమెరికా వాణిజ్య బంధం ఇలా..

మార్చితో ముగిసిన గత 2023–24లో భారతదేశానికి అమెరికా అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. గత ఆర్థిక సంవత్సరంలో భారతదేశ ఎగుమతులు 77.51 బిలియన్ డాలర్లుగా ఉండగా, దిగుమతులు 42.2 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్–అక్టోబర్ కాలంలో అమెరికాకు దేశ ఎగుమతులు 6.31 శాతం పెరిగి 47.24 బిలియన్ డాలర్లకు చేరుకోగా, దిగుమతులు 2.46 శాతం పెరిగి 26 బిలియన్ డాలర్లకు ఎగశాయి. కొత్త అమెరికా ప్రభుత్వం 'అమెరికా ఫస్ట్' అజెండాను అనుసరించాలని నిర్ణయించుకుంటే ఆటోమొబైల్స్, టెక్స్‌టైల్స్, ఫార్మాస్యూటికల్స్ వంటి వస్తువులపై భారతీయ ఎగుమతిదారులు అధిక కస్టమ్స్ సుంకాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని వాణిజ్య నిపుణులు పేర్కొన్నారు.

పెట్రోకెమికల్‌పై దిగుమతి సుంకాన్ని పెంచాలి

కేంద్రానికి ఫిక్కీ విజ్ఞప్తి



న్యూఢిల్లీ: భారతదేశంలో పెట్రోకెమికల్ ఉత్పత్తులను డంప్ చేయడానికి చైనా వంటి దేశాలు ఇక్కడి తక్కువ దిగుమతి సుంకాన్ని అవకాశంగా తీసుకునే ప్రమాదముందని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ– ఫిక్కీ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో దేశీయ పరిశ్రమను అలాగే ఈ రంగంలో ఉద్యోగాలను రక్షించడానికి కస్టమ్స్ డ్యూటీని పెంచాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రసాయనాలు, ఎరువుల మంత్రిత్వశాఖకు ఫిక్కీ ఒక లేఖ రాసింది. ఆటోమొబైల్స్, ప్యాకేజింగ్, వ్యవసాయం, ఎలక్ట్రానిక్స్, వైద్య పరికరాలు, నిర్మాణ రంగాల్లో ఎక్కువగా ఉపయోగించే పాలీప్రొఫైలిన్, పాలిథిలిన్‌లపై కస్టమ్స్ లేదా దిగుమతి సుంకాన్ని ప్రస్తుత 7.5 శాతం నుండి 12.5 శాతానికి పెంచాలని ఈ లేఖలో కోరింది. పెట్రో కెమికల్స్‌కు భారత్ కొరత ఉంది. ఇప్పటివరకు ప్రకటించిన సామర్థ్య జోడింపులను పరిగణనలోకి తీసుకుంటే పాలీప్రొఫైలిన్, పాలిథిలిన్ అంచనా లోటు సంవత్సరానికి 12 మిలియన్ టన్నులు. ప్రస్తుత ధరల స్థాయిల ప్రకారం 2030 నాటికి 12 బిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశం ఉంది. చైనా పెట్రోకెమికల్స్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకుంటూ, దేశానికి ప్రముఖ ఎగుమతిదారుగా అవతరిస్తోంది. మధ్యప్రాచ్యం, అమెరికాలు ప్రస్తుతం భారీ ఎగుమతులతో మెరుగైన లాభాల మార్జిన్‌లను పొందుతున్నాయి. ప్రస్తుతం భారత్ 101 బిలియన్ డాలర్ల కెమికల్స్, పెట్రోకెమికల్స్‌ను దిగుమతి చేసుకుంటోంది. సుంకాల పెంపుద్వారా ఈ దిగుమతుల బిల్లును, కరెంట్ అకౌంట్ లోటును గణనీయంగా తగ్గించుకునే అవకాశం భారత్‌కు ఉందని ఫిక్కీ తన లేఖలో పేర్కొంది. అలాగే ఈ విభాగాల్లో స్వయం స్వావలంభనకూ తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. కెమికల్స్ అలాగే పెట్రోకెమికల్స్ భారతదేశంలోకి దిగుమతులలో రెండవ అతిపెద్ద భాగస్వామ్యాన్ని కలిగిఉన్నాయి. పాలిథిలిన్, పాలీప్రొఫైలిన్ దిగుమతిపై తక్కువ రేటు సుంకం వల్ల దేశీయ మార్కెట్‌లోకి డంప్ చేయడానికి అవకాశం ఏర్పడుతోంది. మన దేశీయ పరిశ్రమకు దీనివల్ల తీవ్ర ప్రతికూలతలు ఎదురవుతున్నాయి.

2.36 కోట్ల బాటిళ్ల నానో యూరియా అవసరం



న్యూఢిల్లీ: దేశంలో 2024–25 రబీ సీజన్‌లో 2.36 కోట్ల బాటిళ్ల నానో యూరియా అవసరం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ డిమాండ్‌లో 43.38 లక్షల బాటిళ్లతో ఉత్తరప్రదేశ్ ముందంజలో ఉంటుందని ప్రభుత్వం వివరించింది. మహారాష్ట్ర 34.7 లక్షల యూనిట్లు, పంజాబ్ 20.82 లక్షల యూనిట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ సీజన్‌లో హర్యానా, కర్ణాటకలకు ఒక్కొక్కటి 17.35 లక్షల బాటిళ్లు అవసరమని అంచనా వేయగా, రాజస్థాన్‌లో 15.01 లక్షలు, మధ్యప్రదేశ్‌లో 12.54 లక్షల యూనిట్లు అవసరం. గుజరాత్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మేఘాలయ, చండీగఢ్, దయ్యూ-డామన్, దాదర్-నగర్ హవేలీ, అండమాన్-నికోబార్ నుండి ఎటువంటి డిమాండ్ రాలేదని ప్రభుత్వం వివరించింది. దేశంలో ప్రస్తుతం 27.22 కోట్ల బాటిళ్ల వార్షిక సామర్థ్యంతో ఆరు నానో యూరియా ప్లాంట్లు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఒక్కో బాటిల్ సామర్థ్యం 500 మిల్లీలీటర్లు. 2024లో మూడు ప్లాంట్లు ప్రారంభం అయ్యాయి. 5 కోట్ల బాటిళ్ల సామర్థ్యంతో మేఘమణి క్రాప్ న్యూట్రిషన్ ప్లాంట్ వీటిలో ఒకటి. 0.12 కోట్ల యూనిట్లతో జువారీ ఫామ్ హబ్, 0.60 కోట్ల బాటిళ్ల సామర్థ్యంతో కోరమాండల్ ఇంటర్నేషనల్ సౌకర్యాలు ఉన్నాయి. సహకార ఎరువుల సంస్థ ఇఫ్కో ఖాతాలో మిగిలిన మూడు కేంద్రాలు ఉన్నాయి. దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు అదనంగా నానో యూరియా ప్లాంట్ల ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

భారత్‌కు ఎంఎఫ్ఎన్ హోదా రద్దు ప్రభావం..

ఈఎఫ్‌టీఏ వాణిజ్య ఒప్పందంపై ఉండదు

- స్విట్జర్లాండ్ రాయబార కార్యాలయం స్పష్టీకరణ
- 100 బిలియన్ డాలర్ల పెట్టుబడికి భరోసా



న్యూఢిల్లీ: ద్వంద్వ పన్నుల నివారణా ఒప్పందానికి (డీటీఏఏ) సంబంధించి అత్యంత అనుకూలమైన దేశం (ఎంఎఫ్ఎన్) నిబంధనను సస్పెండ్ చేయాలనే స్విస్ నిర్ణయం, భారత్– నాలుగు దేశాల ఈఎఫ్‌టీఏ (యూరోపియన్ స్వేచ్ఛా వాణిజ్య సంఘం) బ్లాక్ మధ్య మార్చిలో జరిగిన వాణిజ్య ఒప్పందం ఆమోదం, అమలుపై ఏ మాత్రం ప్రభావం చూపబోదని సిట్జర్లాండ్ స్పష్టం చేసింది. వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (టీఈపీఏ)గా అధికారికంగా పేర్కొంటున్న ఈఎఫ్‌టీఏలో సభ్యదేశాలుగా ఐస్‌లాండ్, లీచ్‌టెన్‌స్టెయిన్, నార్వే, స్విట్జర్లాండ్ ఉన్నాయి. ఈ ఒప్పందం ఇంకా అమల్లోకి రావాల్సి ఉంది. ఎంఎఫ్ఎన్ సస్పెన్షన్ ప్రభావం స్విట్జర్లాండ్ నుండి భారత్‌కు వచ్చే పెట్టుబడులపై కూడా ఎటువంటి ప్రతికూల ప్రభావం చూపబోదని కూడా భారతదేశంలో స్విట్జర్లాండ్ రాయబార కార్యాలయం స్పష్టం చేసింది.

సందేహాలకు ఇక తెర


స్విట్జర్లాండ్ తాజా ప్రకటనతో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడి ఒప్పందంపై నెలకొన్న నీలినీడలు తొలగిపోయినట్లయ్యింది. భారత్ నాలుగు–దేశాల యూరోపియన్ కూటమి మార్చిలో ఒక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేశాయి. దీని ప్రకారం న్యూఢిల్లీ 15 సంవత్సరాలలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడిని ఈ నాలుగు దేశాల నుంచి పొందుతుంది. అదే సమయంలో స్విస్ గడియారాలు, చాక్లెట్లు, కట్, పాలిష్డ్ వజ్రాలు వంటి అనేక ఉత్పత్తులను తక్కువ లేదా జీరో సుంకాలతో భారత్ అనుమతిస్తుంది. ఒప్పందంలో భాగంగా మొదటి పదేళ్లలో 50 బిలియన్ డాలర్లు, ఆ తదుపరి ఐదేళ్లలో 50 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా భారత్ పొందుతుంది. భారత్‌లో 10 లక్షల ఉద్యోగాల కల్పనకూ ఈ ఒప్పందం దారితీస్తుందన్న భరోసాను నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. ఈ తరహా కీలక ఒప్పందాన్ని భారత్ ఏ కూటమితో చేసుకోకపోవడం గమనార్హం.

భారత్‌పై భారీ వాణిజ్యలోటు భారం

2023–24లో స్విట్జర్లాండ్ నుండి భారత్ దిగుమతుల విలువ 21.24 బిలియన్ డాలర్లు. ఎగుమతుల విలువ కేవలం 1.52 బిలియన్ డాలర్లు. దీనితో ఎగుమతులు–దిగుమతుల మధ్య వాణిజ్య విలువ ఏకంగా 19.72 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. 2000 ఏప్రిల్–2024 సెప్టెంబర్ మధ్య స్విట్జర్లాండ్ నుంచి భారత్‌కు 10.72 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయి.

ఒడిశాలో ఐవోసీఎల్ నాఫ్తా ప్రాజెక్ట్

రూ.61,000 కోట్ల పెట్టుబడులు



భువనేశ్వర్: ప్రభుత్వరంగ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీఎల్) రూ.61,000 కోట్ల పెట్టుబడులతో ఒడిశాలోని పరదీప్‌లో నాఫ్తా క్రాకర్ ప్రాజెక్టును ఏర్పాటు చేయనుంది. ఇందుకు సంబంధించి ఐవోసీఎల్, ఒడిశా ప్రభుత్వం మధ్య జనవరిలో జరిగే 'ఉత్కర్ష్ ఒడిశా–మేక్ ఇన్ ఒడిశా 2025' సదస్సు సందర్భంగా అవగాహన ఒప్పందం కుదరనుంది. ఈ మేరకు ఒడిశా ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. భద్రక్‌లో రూ.4,352 కోట్లతో ఏర్పాటు చేయనున్న యార్న్ ప్రాజెక్ట్‌కు సైతం ఇదే వేదికగా శంకుస్థాపన చేయనున్నట్టు పేర్కొంది. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఐవోసీఎల్ చైర్మన్ ఏఎస్ సాహ్నీ మధ్య భువనేశ్వర్‌లో జరిగిన భేటీలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిపింది. ''పరదీప్‌లో నాఫ్తా ప్రాజెక్టుకు ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టు కోసం ఐవోసీఎల్ రూ.61,000 కోట్లు ఇన్వెస్ట్ చేస్తుంది. ఈ రంగంలో దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్ట్ అవుతుంది. ఈ ప్రాజెక్టులో రాష్ట్ర ప్రభుత్వానికీ వాటా ఉంటుంది. పన్నులకు అదనంగా, డివిడెండ్ రూపంలో ఆదాయం లభిస్తుంది''అని ఒడిశా ప్రభుత్వం ప్రకటించింది. భద్రక్‌లో రూ.4,352 కోట్లతో ఏర్పాటు చేయనున్న యార్న్ ప్రాజెక్టుతో, పెద్ద ఎత్తున వస్త్రాల తయారీ కంపెనీలు ఇక్కడకు వస్తాయని తెలిపింది. ఈ రెండు ప్రాజెక్టులతో యువకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని ప్రకటించింది.

హైదరాబాద్‌లో ఆఫీస్ లీజింగ్ కళకళ

- ఈ ఏడాది 56 శాతం వృద్ధి
- ఆరు నగరాల్లో 14 శాతం అధికం
- ఢిల్లీ, చెన్నైలో ప్రతికూలతలు
- కొలియర్స్ ఇండియా నివేదిక



న్యూఢిల్లీ: హైదరాబాద్ మార్కెట్లో కార్యాలయ స్థలాలకు బలమైన డిమాండ్ కొనసాగుతోంది. ప్రస్తుత ఏడాది మొత్తం మీద గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్ లీజింగ్ 56 శాతం పెరిగి 12.5 మిలియన్ చదరపు అడుగులు (ఎస్ఎఫ్‌టీ)గా ఉన్నట్టు కొలియర్స్ ఇండియా నివేదిక వెల్లడించింది. క్రితం ఏడాది లీజు పరిమాణం 8 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉన్నట్టు పేర్కొంది. ఇక దేశవ్యాప్తంగా ఆరు ప్రధాన నగరాల్లో ఆఫీస్ స్పేస్ లీజింగ్ ఈ ఏడాది 14 శాతం పెరిగి 66.4 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉన్నట్టు కొలియర్స్ నివేదిక తెలిపింది. క్రితం ఏడాది ఇవే పట్టణాల్లో స్థూల కార్యాలయ స్థలాల లీజింగ్ 58.2 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉంది.

పట్టణాల వారీగా..

- ✓ బెంగళూరులో ఆఫీస్ స్పేస్ లీజింగ్ 21.7 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి చేరింది. క్రితం ఏడాది 15.6 మిలియన్ ఎస్ఎఫ్‌టీ లీజుతో పోల్చితే 39 శాతం పెరిగింది.
- ✓ ముంబైలోనూ 43 శాతం వృద్ధితో 10 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా నమోదైంది.
- ✓ పుణెలో ఆఫీస్ స్పేస్ లీజింగ్ క్రితం ఏడాదితో పోల్చి చూస్తే 4 శాతం పెరిగి 5.7 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి చేరింది.
- ✓ చెన్నైలో స్థూల లీజింగ్ 35 శాతం క్షీణతతో 6.8 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి పరిమితమైంది. 2023లో ఇదే పట్టణంలో లీజింగ్ 10.5 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉంది.
- ✓ ఢిల్లీ ఎన్‌సీఆర్‌లోనూ 16 శాతం తక్కువగా 9.7 మిలియన్ ఎస్ఎఫ్‌టీ లీజు నమోదైంది.

2025లోనూ గరిష్ట స్థాయిలోనే..

టెక్నాలజీ, ఇంజనీరింగ్, తయారీ కంపెనీలతో పాటు ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీల నుంచి ఆఫీస్ స్థలాలకు ఈ ఏడాది డిమాండ్ ఎక్కువగా ఉన్నట్టు కొలియర్స్ ఇండియా నివేదిక తెలిపింది. 2025లోనూ ఆఫీస్ స్పేస్ లీజింగ్ గరిష్ఠ స్థాయిలోనే కొనసాగొచ్చని కొలియర్స్ ఇండియా ఆఫీస్ సర్వీసెస్ విభాగం ఎండీ అర్పిత్ మెహరోత్రా అంచనా వేశారు. వచ్చే కొన్నేళ్ల పాటు లీజింగ్ 60 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి మించి కొనసాగడం సాధారణ అంశంగా మారుతుందన్నారు. గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల (జీసీసీలు) నుంచి స్థిరమైన డిమాండ్ కొనసాగడం పెద్ద పరిమాణంలో ఆఫీస్ స్థలాల లీజింగ్‌కు మద్దతుగా నిలుస్తున్నట్టు బెంగళూరు కేంద్రంగా పనిచేసే సుమధుర గ్రూప్ సీఎండీ మధుసూదన్ పేర్కొన్నారు.

లాజిస్టిక్స్, ఇండస్ట్రియల్ వసతులకూ డిమాండ్

దేశవ్యాప్తంగా టాప్–8 నగరాల్లో లాజిస్టిక్స్, ఇండస్ట్రియల్ (ఎల్అండ్ఐ) వసతుల లీజింగ్ ప్రస్తుత ఏడాది మొత్తం మీద 50–53 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉండొచ్చని కుష్‌మన్ అండ్ వేక్ ఫీల్డ్ సంస్థ తెలిపింది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, పుణె, అహ్మదాబాద్, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్) పరిధిలో గతేడాది లాజిస్టిక్స్ అండ్ ఇండస్ట్రియల్ వసతుల లీజింగ్ 53.57 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉన్నట్టు పేర్కొంది. ఈ ఏడాది అక్టోబర్ వరకు లీజింగ్ ఈ నగరాల్లో 41 మిలియన్ ఎస్ఎఫ్‌టీని అధిగమించినట్టు తెలిపింది. ''ప్రభుత్వం 2020లో ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) ప్రకటించిన నాటి నుంచి ఇండస్ట్రియల్ స్థలాల లీజింగ్‌లో మెరుగైన వృద్ధి నమోదవుతోంది. దీనికితోడు రిటైల్, ఈ-కామర్స్ సైతం బలంగా అవతరించడం డిమాండ్‌కు మద్దతుగా నిలిచింది'' అని ఈ నివేదిక వెల్లడించింది. బలమైన పారిశ్రామిక కార్యకలాపాలకు తోడు వినియోగ దోరణి విస్తృతం కావడంతో 2025లో లీజింగ్ బలంగా కొనసాగొచ్చని అంచనా వేసింది. చైనా ప్లస్ వన్ విధానంతో భారత్ సైతం ప్రయోజనం పొందుతుండడం ఈ రంగాల్లో డిమాండ్‌కు కలిసొస్తున్నట్టు వివరించింది.

వచ్చే రెండేళ్లు భారత్ వృద్ధి 6.5 శాతం

2024–25, 2025–26పైఈవై అంచనా

న్యూఢిల్లీ: భారత్ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత (2024–25) వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2025–26) 6.5 శాతం వృద్ధి చెందే అవకాశం ఉందని సేవల దిగ్గజ సంస్థ- ఎర్నెస్ట్ అండ్ యంగ్ (ఈవై) నివేదిక పేర్కొంది. ప్రైవేట్ వినియోగ వ్యయం, అలాగే మూలధన వ్యయాలు అంచనాలకన్నా తగ్గడం వృద్ధికి బ్రేకులు వేస్తున్న అంశంగా ఈవై వివరించింది. ఈ కారణంగానే సెప్టెంబర్ త్రైమాసికంలో వృద్ధి రేటు ఏడు త్రైమాసికాల కనిష్ఠ స్థాయిలో 5.4 శాతంగా నమోదయ్యిందని విశ్లేషించింది. ప్రపంచ పరిస్థితులు అనిశ్చితంగా ఉండటం, ప్రపంచ వాణిజ్య పరిస్థితుల వంటి అంశాల నేపథ్యంలో దేశీయ డిమాండ్, సేవల ఎగుమతులపై భారత్ ఎక్కువగా ఆధారపడవలసి ఉంటుందని ఈవై పేర్కొంది. రోడ్లు, స్మార్ట్ సిటీలు, రైల్వేలు, విద్యుత్, పునరుత్పాదక ఇంధనంసహా ప్రాధాన్యతా రంగాల పురోగతికి 2030 వరకు వర్తించే తాజా నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైప్‌లైన్ (ఎన్ఐపీ) ఆవిష్కరణ అవసరమని పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొత్తం అప్పులు స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 60 శాతానికి మించకూడదని పేర్కొన్న ఈవై, ఈ 60 శాతం భారం కేంద్రం, రాష్ట్రాలపై సమానంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించింది.




ఇరిగేశి అర్జున్

ముగింపు మెరవాలి!

నేటి నుంచి ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్

- అర్జున్, ప్రజ్ఞానంద, హంపి, హారికలపై దృష్టి
- మళ్లీ ఫేవరెట్‌గా కార్ల్‌సన్

న్యూయార్క్: ఈ ఏడాది భారత చెస్ క్రీడాకారులు విశ్వవేదికపై అదరగొట్టారు. ప్రతిష్టాత్మక ఒలింపియాడ్‌లో భారత పురుషుల, మహిళల జట్లు స్వర్ణ పతకాలతో మెరిపించగా... క్లాసికల్ ఫార్మాట్‌లో దొమ్మరాజు గుకేశ్ కొత్త ప్రపంచ చాంపియన్‌గా అవతరించాడు. క్యాడెట్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ చిన్నారి దివిత్ రెడ్డి పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఇక పలు అంతర్జాతీయ టోర్నమెంట్లలో పలువురు భారత గ్రాండ్‌మాస్టర్లు టాప్-3లో నిలిచి తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది చివరి అంతర్జాతీయ టోర్నమెంట్ అయిన ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చాంపియన్‌షిప్ పోటీలకు నేడు తెర లేవనుంది. న్యూయార్క్‌లో ఆరు రోజులపాటు ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్ జరగనుంది. భారత్ నుంచి ఓపెన్ విభాగంలో 9 మంది గ్రాండ్‌మాస్టర్లు, మహిళల విభాగంలో 8 మంది క్రీడాకారిణులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చాంపియన్‌షిప్ పోటీల్లో భారత్‌కు మంచి రికార్డే ఉంది. ఫలితంగా ఈ ఏడాది ఆఖరి టోర్నీలోనూ భారత క్రీడాకారులు పతకాలు సాధించి సూపర్ ఫినిషింగ్ ఇవ్వాలని ఆశిద్దాం. 2017లో విశ్వనాథన్ ఆనంద్ ర్యాపిడ్ ఫార్మాట్‌లో ప్రపంచ చాంపియన్ అయ్యాక మరో భారత ప్లేయర్ ఈ విభాగంలో టాప్-3లో నిలువలేదు. ఇక ఓపెన్ విభాగంలో ర్యాపిడ్, బ్లిట్జ్ ఫార్మాట్‌లలో నార్వే దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్ డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగనున్నాడు. మహిళల ర్యాపిడ్ విభాగంలో అనస్తాసియా బొడ్నారుక్ (రష్యా), బ్లిట్జ్ విభాగంలో వాలెంటీనా గునీనా (రష్యా) తమ ప్రపంచ టైటిల్స్‌ను కాపాడుకుంటారో లేదో వేచి చూడాలి.

భారత్ నుంచి ఎవరెవరంటే....

ఓపెన్ విభాగం (ర్యాపిడ్, బ్లిట్జ్): ఇరిగేశి అర్జున్, ప్రజ్ఞానంద, రౌనక్ సాధ్వాని, సందీపన్ చందా, అరవింద్ చిదంబరం, హర్ష భరతకోటి, ప్రణవ్, దీప్తాయన్ ఘోష్, కార్తీక్ వెంకటరామన్.
మహిళల విభాగం (ర్యాపిడ్, బ్లిట్జ్): కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, దివ్య, వైశాలి, వంతిక అగర్వాల్, సాహితి వర్షిణి, పద్మిని రౌత్, నూతక్కి ప్రియాంక.

ఫార్మాట్ ఎలా అంటే...

ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ ఓపెన్ విభాగంలో మొత్తం 13 రౌండ్లను స్విస్ ఫార్మాట్‌లో... మహిళల విభాగంలో 11 రౌండ్లను స్విస్ ఫార్మాట్‌లో నిర్వహిస్తారు. నిర్ణీత రౌండ్ల తర్వాత రెండు విభాగాల్లో అత్యధిక పాయింట్లు సాధించిన ప్లేయర్లు విజేతగా నిలుస్తారు. ప్రపంచ బ్లిట్జ్ చాంపియన్‌షిప్‌ను రెండు దశల్లో నిర్వహిస్తారు. ముందుగా ఓపెన్ విభాగంలో 13 రౌండ్లను స్విస్ ఫార్మాట్‌లో... మహిళల విభాగంలో 11 రౌండ్లను స్విస్ ఫార్మాట్‌లో ఏర్పాటు చేశారు. నిర్ణీత రౌండ్ల తర్వాత టాప్-8లో నిలిచిన వారు రెండో దశ (నాకౌట్)కు అర్హత పొందుతారు. నాకౌట్ దశలో అజేయంగా నిలిచిన ప్లేయర్లు విజేతలుగా అవతరిస్తారు.

టైమ్ కంట్రోల్ ఎంతంటే...

ర్యాపిడ్ ఫార్మాట్‌లో ఒక్కో గేమ్ 15 నిమిషాలు జరుగుతుంది. తొలి ఎత్తు నుంచి ప్రతి ఎత్తుకు 10 సెకన్లు జత కలుస్తాయి. బ్లిట్జ్ ఫార్మాట్‌లో ఒక్కో గేమ్ 3 నిమిషాలు జరుగుతుంది. తొలి ఎత్తు నుంచి ప్రతి ఎత్తుకు 2 సెకన్లు జత కలుస్తాయి. నిర్ణీత రౌండ్ల తర్వాత ప్లేయర్లు సమంగా పాయింట్లు సాధిస్తే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించి విజేతలను నిర్ణయిస్తారు.

ప్రైజ్‌మనీ ఎంతంటే...

ర్యాపిడ్ ఫార్మాట్ ఓపెన్ విభాగంలో టాప్-40లో నిలిచిన ప్లేయర్లందరికీ ప్రైజ్‌మనీ ఇస్తారు. విజేతకు 90 వేల డాలర్లు (రూ. 76 లక్షలు), రెండో స్థానంలో నిలిచిన ప్లేయర్‌కు 70 వేల డాలర్లు (రూ. 59 లక్షలు), మూడో స్థానంలో నిలిచిన ప్లేయర్‌కు 56 వేల డాలర్లు (రూ. 47 లక్షలు) అందజేస్తారు. బ్లిట్జ్ ఫారామ్ట్ ఓపెన్ విభాగంలోనూ టాప్-40లో నిలిచిన ఆటగాళ్లకు ప్రైజ్‌మనీ లభిస్తుంది. చాంపియన్‌గా 90 వేల డాలర్లు (రూ. 76 లక్షలు), రెండో స్థానంలో నిలిచిన వారికి 70 వేల డాలర్లు (రూ. 59 లక్షలు), మూడో స్థానం పొందిన ఆటగాడికి 42 వేల డాలర్లు (రూ. 35 లక్షలు) అందజేస్తారు.

ర్యాపిడ్ ఫార్మాట్ మహిళల విభాగంలో టాప్-20లో నిలిచిన వారందరికీ ప్రైజ్‌మనీ దక్కుతుంది. విజేతకు 60 వేల డాలర్లు (రూ. 51 లక్షలు), రెండో స్థానంలో నిలిచిన క్రీడాకారిణికి 40 వేల డాలర్లు (రూ. 34 లక్షలు), మూడో స్థానంలో నిలిచిన ప్లేయర్‌కు 28 వేల డాలర్లు (రూ. 23 లక్షలు) లభిస్తాయి. బ్లిట్జ్ ఫార్మాట్ మహిళల విభాగంలోనూ టాప్-20లో నిలిచిన ప్లేయర్ల ఖాతాలో ప్రైజ్‌మనీ చేరుతుంది. చాంపియన్‌కు 60 వేల డాలర్లు (రూ. 51 లక్షలు), రెండో స్థానంలో నిలిచిన ప్లేయర్‌కు 40 వేల డాలర్లు (రూ. 34 లక్షలు), మూడో స్థానం పొందిన ప్లేయర్‌కు 20 వేల డాలర్లు (రూ. 17 లక్షలు) లభిస్తాయి.

4 ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి కోనేరు హంపి సాధించిన పతకాలు. ర్యాపిడ్ ఫార్మాట్‌లో 2012లో కాంస్యం నెగ్గిన హంపి, 2019లో స్వర్ణ పతకాన్ని, 2023లో రజత పతకాన్ని సాధించింది. బ్లిట్జ్ ఫార్మాట్‌లో హంపి 2022లో రజతం సొంతం చేసుకుంది.


కార్ల్‌సన్


హారిక
హంపి

క్వార్టర్ ఫైనల్లో శ్రావ్య శివాని జోడీ


శ్రావ్య శివాని

అహ్మదాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ15 మహిళల టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి చిలకలపూడి శ్రావ్య శివాని డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. బుధవారం జరిగిన డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో శ్రావ్య శివాని–మధురిమ సావంత్ (భారత్) ద్వయం 6–0, 1–6, 10–5తో 'సూపర్ టైబ్రేక్'లో భారత్‌కే చెందిన స్నేహల్ మానె–సోనల్ పాటిల్ జంటపై విజయం సాధించింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో హైదరాబాద్‌కే చెందిన వేమూరి అభయ–వేమూరి అపూర్వ ద్వయం 4–6, 5–7తో వైష్ణవి–పూజా ఇంగాలె (భారత్) జోడీ చేతిలో ఓడిపోయింది. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో హుమేరా బహార్మస్–దివా భాటియా ద్వయం 6–7 (2/7), 3–6తో లక్ష్మీ ప్రభ–మాయా రాజేశ్వరి జంట చేతిలో... చందన పోటుగారి–ప్రియాంక జంట 0–6, 0–6తో కశిష్ భాటియా–అంజలి రాఠి ద్వయం చేతిలో ఓడిపోయాయి. సింగిల్స్‌లోనూ హైదరాబాద్ ప్లేయర్ హుమేరా పోరాటం ముగిసింది. రెండో రౌండ్‌లో హుమేరా 1–6, 1–6తో జీజెల్ సెక్వెరా (బ్రిటన్) చేతిలో ఓడిపోయింది.


హుమేరా

సెమీస్ బెర్త్ ఎవరిదో!



- నేడు రెండు ఎలిమినేటర్ మ్యాచ్‌లు
- యూపీ యోధాస్‌తో జైపూర్ పింక్ పాంథర్స్ 'ఢీ'
- పట్నా పైరేట్స్‌తో యు ముంబా పోరు
- రాత్రి 8 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్–2లో ప్రత్యక్ష ప్రసారం

పుణే: గత రెండు నెలలుగా క్రీడాభిమానులను ఉర్రూతలూగించిన ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్ చివరి అంకానికి చేరింది. లీగ్ దశ పోటీలు ముగియగా... ఇక నాకౌట్ సమరాలకు వేళయింది. పాయింట్ల పట్టిక తొలి రెండు స్థానాల్లో నిలిచిన హరియాణా స్టీలర్స్, దబంగ్ ఢిల్లీ జట్లు నేరుగా సెమీఫైనల్స్‌కు అర్హత సాధించగా... ఆ తర్వాత 3 నుంచి 6వ స్థానం వరకు నిలిచిన జట్ల మధ్య గురువారం ఎలిమినేటర్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇందులో విజయం సాధించిన జట్లు సెమీఫైనల్‌కు చేరనున్నాయి. రాత్రి 8 గంటలకు ప్రారంభం కానున్న తొలి ఎలిమినేటర్‌లో యూపీ యోధాస్‌తో జైపూర్ పింక్ పాంథర్స్ తలపడనుండగా... రాత్రి 9 గంటల నుంచి జరగనున్న రెండో ఎలిమినేటర్‌లో పట్నా పైరేట్స్‌తో యు ముంబా పోటీపడుతుంది. పీకేఎల్‌లో యూపీ యోధాస్ ఇప్పటి వరకు టైటిల్ గెలవలేకపోగా... జైపూర్ పింక్ పాంథర్స్ రెండుసార్లు విజేతగా నిలిచింది. పట్నా పైరేట్స్ మూడుసార్లు చాంపియన్‌గా నిలవగా... యు ముంబా కూడా ఒకసారి విన్నర్స్ ట్రోఫీని ముద్దాడింది. తాజా సీజన్‌లో యూపీ యోధాస్ 13 విజయాలు సాధించి 79 పాయింట్లతో పట్టికలో మూడో స్థానంలో నిలవగా... పింక్ పాంథర్స్ 12 విజయాలతో 70 పాయింట్లు సాధించి ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. కెప్టెన్ సురేందర్ గిల్‌తో పాటు శివమ్ చౌధరీ యోధాస్‌కు కీలకం కానుండగా... పింక్ పాంథర్స్ జట్టు సారథి అర్జున్ దేశ్వాల్‌పై ఎక్కువగా ఆధారపడుతోంది. మరి ఈ కీలక పోరులో ఎవరిది పైచేయి అవుతుందో చూడాలి. లీగ్ చివరి మ్యాచ్ విజయంతో యు ముంబా ముందడుగు వేయగా... పట్నా పైరేట్స్ సమష్టి ప్రదర్శనతో సత్తా చాటి నాకౌట్‌లో అడుగు పెట్టింది. యు ముంబా జట్టు తరఫున కెప్టెన్ సునీల్ కుమార్, అజిత్ చౌహాన్, మన్‌జీత్ రాణిస్తుండగా... పైరేట్స్ తరఫున దేవాంక్, దీపక్ నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఎలిమినేటర్‌లో విజయం సాధించిన జట్లు శుక్రవారం జరగనున్న సెమీఫైనల్స్‌లో తలపడనున్నాయి.

అశుతోష్‌కు రజత పతకం



సాక్షి, హైదరాబాద్: జాతీయ స్కూల్ గేమ్స్ అండర్-17 షూటింగ్ పోటీల్లో హైదరాబాద్‌కు చెందిన నందనూరి అశుతోష్ కుమార్ రజత పతకం సాధించాడు. ఇండోర్‌లో జరిగిన ఈ పోటీల్లో అశుతోష్ 10 మీటర్ల పీప్ సైట్ ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో రెండో స్థానంలో నిలిచాడు. ఈ టోర్నీలో మొత్తం 32 జట్లు పోటీపడ్డాయి. 'ట్రిపుల్ ఒలింపియన్' హాకీ క్రీడాకారుడు ముకేశ్ కుమార్ తనయుడైన అశుతోష్ కేంద్రీయ విద్యాలయ సంఘటన్ తరఫున ఈ పోటీల్లో పాల్గొన్నాడు.

మార్టినా దేవికి రెండు పతకాలు

దోహా: ఆసియా జూనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో భారత ప్లేయర్ మార్టినా దేవి రెండు పతకాలు సొంతం చేసుకుంది. ప్లస్ 87 కేజీల విభాగంలో పోటీపడ్డ 18 ఏళ్ల ఈ మణిపూర్ లిఫ్టర్ మొత్తం 225 కేజీలు



(స్నాచ్‌లో 96+క్లీన్ అండ్ జెర్క్‌లో 129) బరువెత్తింది. క్లీన్ అండ్ జెర్క్‌లో రజతం సాధించినా మార్టినా స్నాచ్‌లో కాంస్య పతకాన్ని దక్కించుకుంది.

దేశవాళీ టోర్నీలు పెంచాలి

టెన్నిస్ క్రీడకు మరింత ఆదరణ లభించాలంటే... దేశవాళీ టోర్నీలు విరివిగా నిర్వహించాలని భారత టెన్నిస్ దిగ్గజం రోహన్ బోపన్న అభిప్రాయపడ్డాడు. టెన్నిస్ సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల డబుల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగనున్న 44 ఏళ్ల బోపన్న... భారత్‌లో టెన్నిస్ భవిష్యత్తు, యువ ఆటగాళ్ల ముందున్న సవాళ్లు, తన సహచరుడు మాథ్యూ ఎబ్డెన్‌తో విడిపోయి కొత్త భాగస్వామితో కలిసి ఆడనుండటం తదితర అంశాలపై స్పష్టత ఇచ్చాడు. బోపన్న పంచుకున్న వివరాలు అతడి మాటల్లోనే...

అప్పుడే భారత్‌లో టెన్నిస్‌కు మరింత ఆదరణ ● డబుల్స్ దిగ్గజం బోపన్న మనోగతం



→ మన దేశంలో టెన్నిస్ భవిష్యత్తు కోసం మొదట అఖిల భారత టెన్నిస్ సంఘాన్ని క్రమబద్ధీకరించాలి. దాని ఆధ్వర్యంలో జూనియర్, సీనియర్ అనే తేడా లేకుండా టోర్నమెంట్లు నిర్వహించాలి. దేశవాళీ సర్క్యూట్‌ను బలంగా నిర్మించాలి. 'ఫ్యూచర్స్', 'చాలెంజర్స్' వంటి టోర్నీలు అవసరమే అయినా... వాటితో పాటు దేశవాళీ టోర్నీలు కూడా చాలా ముఖ్యం.

→ జూనియర్ స్థాయిలో రాణించిన ఎందరో ప్లేయర్లు 18 ఏళ్ల తర్వాత ఏ టోర్నీల్లో పాల్గొనాలో తెలియక ఆటకు స్వస్తి చెబుతున్నారు. తదుపరి స్థాయిలో పోటీపడేందుకు ప్రతి ఒక్కరికీ ఆర్థిక పరమైన వెసులుబాటు ఉండదు. పెద్ద టోర్నీల కోసం ప్రయాణాలు చేయడం అంటే ఖర్చుతో కూడుకున్న పని. దీంతో ప్రతిభావంతులు ఆటకు దూరం అవుతున్నారు. దేశవాళీ టోర్నీల్లో పెద్దగా నగదు ప్రోత్సాహకాలు ఉండకపోవడం ఇందుకు కారణం. అందుకే దీన్ని మరింత బలోపేతం చేసి ఒక వ్యవస్థగా మార్చాలి.

→ గత రెండేళ్లుగా అందరూ నా రిటైర్మెంట్ గురించి అడుగుతున్నారు. అయితే అదే సమయంలో రెండేళ్లుగా నేను అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) సీజన్ ముగింపు టోర్నీలకు అర్హత సాధించాను. అంటే, సీజన్ ఆసాంతం బాగా ఆడాననే కదా అర్థం. మరి అలాంటప్పుడు వీడ్కోలు ఆలోచనలు ఎందుకు వస్తాయి.


→ ప్రస్తుతం ఫిట్‌గా ఉన్నా.. శారీరకంగా మానసికంగా సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధం. ఇలాంటప్పుడు రిటైర్మెంట్ ఆలోచన కూడా దరిచేరనివ్వను.

→ కెరీర్ చరమాంకంలో ఉన్నాననే విషయాన్ని పట్టించుకోను. గత 12 నెలల కాలంలో మెరుగైన ప్రదర్శన కనబర్చాను. శారీరకంగా ఎలాంటి ఇబ్బందులు లేవు.

→ సహచరుడు మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) నిర్ణయం ఆశ్చర్యానికి గురి చేసింది. చాన్నాళ్లుగా మేం కలిసి ఆడుతున్నాం. ఎందుకు విడిపోవాలనుకున్నాడో ఎబ్డెన్‌కే తెలియాలి. అతడి కారణాలు అతడికి ఉంటాయి. గత ఏడాది యూఎస్ ఓపెన్ సమయంలో అతను వేరే ఆటగాడితో కలిసి ఆడనున్నట్లు మొదట చెప్పాడు. ఆ తర్వాత తిరిగి నాతో కలిసి కోర్టులో అడుగుపెట్టాడు. ఇప్పుడు ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నాడో అర్థం కావడం లేదు.

→ ఎబ్డెన్ తన నిర్ణయం ఆలస్యంగా వెల్లడించడంతో నికోలస్ బారియెంటాస్ (కొలంబియా)తో కలిసి ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆడాలని నిర్ణయించుకున్నా. డిఫెండింగ్ చాంపియన్ కావడంతో సీడింగ్ లభించనుంది. గతంలో నికోలస్‌తో ప్రత్యర్థిగా తలపడ్డాను. అతడి బేస్‌లైన్ గేమ్ బలంగా ఉంటుంది.

→ బారియెంటాస్‌తో కలిసి ప్రస్తుతానికి రెండు టోర్నీలు ఆడాలని నిర్ణయించుకున్నా. అడిలైడ్ ఓపెన్‌తో పాటు, ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో కలిసి ఆడుతాం. ఈ రెండు టోర్నీల తర్వాత ర్యాంకింగ్స్ ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. పాయింట్లు కాపాడుకోకపోతే మాస్టర్స్ టోర్నీ 'డ్రా'లలో అవకాశం లభించదు. అందుకే ఆస్ట్రేలియన్ ఓపెన్ తర్వాతే దీనిపై స్పష్టత వస్తుంది.


బవుమా

పాకిస్తాన్ X దక్షిణాఫ్రికా

- నేటి నుంచి తొలి టెస్టు
- మధ్యాహ్నం గం. 1:30 నుంచి జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

సెంచూరియన్: దక్షిణాఫ్రికా గడ్డపై తొలిసారి వన్డే సిరీస్ క్లీన్‌స్వీప్ చేసి చరిత్ర సృష్టించిన పాకిస్తాన్ జట్టు నేటి నుంచి టెస్టు సిరీస్ ఆడనుంది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా పాకిస్తాన్, దక్షిణాఫ్రికా మధ్య గురువారం నుంచి తొలి టెస్టు ప్రారంభం కానుంది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో 63.33 పాయింట్లతో ప్రస్తుతం అగ్రస్థానంలో ఉన్న దక్షిణాఫ్రికా... ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా ఫైనల్‌కు అర్హత సాధించాలంటే ఈ సిరీస్‌ను 2–0తో గెలవాల్సిన అవసరముంది. ఇదే తమ లక్ష్యమని సఫారీ జట్టు సారథి తెంబా బవుమా ఇప్పటికే ప్రకటించగా... వన్డే సిరీస్‌లో కనబర్చిన జోరును కొనసాగిస్తూ సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ సత్తా చాటాలని పాకిస్తాన్ జట్టు ఆశిస్తోంది. పేసర్లకు సహకరించనున్న సెంచూరియన్ పిచ్‌పై దక్షిణాఫ్రికా నలుగురు పేసర్లతో బరిలోకి దిగనుంది. గత ఆరేళ్లలో సెంచూరియన్‌లో జరిగిన మ్యాచ్‌ల్లో పేసర్లు 227 వికెట్లు పడగొట్టగా... స్పిన్నర్లు కేవలం 16 వికెట్లు మాత్రమే తీశారు. సఫారీ గడ్డపై పాకిస్తాన్ టెస్టు రికార్డు ఏమంత గొప్పగా లేదు. 1995 నుంచి అక్కడ పర్యటిస్తున్న పాక్ జట్టు 15 టెస్టులాడి 12 మ్యాచ్‌ల్లో ఓడింది. పాకిస్తాన్ టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యల్ప స్కోరు (49) కూడా దక్షిణాఫ్రికా గడ్డపైనే నమోదైంది. వన్డే సిరీస్‌లో సత్తా చాటిన ప్రధాన పేసర్ షాహీన్ షా అఫ్రిది లేకపోవడం పాక్ జట్టుకు ప్రధాన లోటు కాగా... చివరగా ఇంగ్లండ్‌తో ఆడిన టెస్టు మ్యాచ్‌లో చోటు దక్కించుకోలేకపోయిన నసీమ్ షా, బాబర్ ఆజమ్ తిరిగి జట్టులోకి వచ్చారు. పేస్ బౌలర్ మొహమ్మద్ అబ్బాస్ మూడేళ్ల తర్వాత పాక్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. మరి టెస్టుల్లో నిలకడైన ప్రదర్శన కనబర్చలేకపోతున్న పాకిస్తాన్ జట్టు షాన్ మసూద్ సారథ్యంలో సఫారీ గడ్డపై పేస్ సవాల్‌ను ఎలా ఎదుర్కొంటుందనేది ఆసక్తికరం.


మసూద్



క్రిస్మస్‌ను జరుపుకోవడానికి అధిక సంఖ్యలో సందర్శకులు మనాలికి రావడంతో ఏర్పడిన ట్రాఫిక్ జామ్



హిమాచల్‌ప్రదేశ్‌లోని మండీలో భారీగా మంచు కురుస్తున్న దృశ్యం

హిమాచల్‌లో భారీ మంచు

నలుగురు మృతి, 223 రహదారులు మూసివేత
- మనాలీకి పర్యాటకుల తాకిడి
- అప్రమత్తంగా ఉండాలని హిమాచల్ ప్రభుత్వం హెచ్చరిక

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లో గత 24 గంటల్లో భారీగా మంచు కురియడంతో నలుగురు మృతి చెందారు. మూడు జాతీయరహదారులు, మరో 220 దారులను మూసివేశారు. సిమ్లా, కులు, మండి, చంబా, సిర్మౌర్ జిల్లాలతో పాటు కిన్నౌర్, లాహౌల్, స్పితి జిల్లాల్లో భారీగా మంచు కురిసింది. పలు వాహనాలు అదుపుతప్పి బోల్తా పడటంతో నలుగురు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. దీంతో సిమ్లాలో 145, కులులో 25, మండీ జిల్లాల్లో 20 రహదారులను మూసివేశారు. 356 ట్రాన్స్ ఫార్మర్ ఫెయిల్యూర్ కావడంతో చాలా ప్రాంతాల్లో విద్యుత్ లేదు. క్రిస్మస్, న్యూ ఇయర్ కోసం సిమ్లా, మనాలీలకు పర్యాటకులు పోటెత్తారు. స్థానిక నివేదికల ప్రకారం, అట్టారి నుంచి లేహ్, కులు జిల్లాలోని సంజ్ నుంచి ఔత్, కిన్నౌర్ జిల్లాలోని ఖాబ్ సంగం, లాహౌల్, స్పితి జిల్లాలోని గ్రామ్ ఫూ వరకు జాతీయ రహదారులు ట్రాఫిక్ కారణంగా మూసివేశారు. రోడ్లను క్లియర్ చేయడానికి హిమాచల్ ప్రభుత్వం రెండు స్నో బ్లోయర్లతో సహా 268 యంత్రాలను ఏర్పాటు చేసింది. జిల్లా యంత్రాంగం సూచనలను పాటించాలని, స్థానికులు చెప్పేది వినాలని, మంచులో డ్రైవింగ్ చేయవద్దని పర్యాటకులు సూచించింది.

తెల్లని వండర్‌ల్యాండ్‌గా హిమాచల్..

హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లా, మనాలీ వంటి పర్యాటక కేంద్రాలు తెల్లని వండర్‌ల్యాండ్‌గా మారాయి. అలాగే జమ్మూకాశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాల్లో తాజాగా మంచుకురిసింది. ఉష్ణోగ్రతలు గడ్డకట్టే స్థాయి కంటే అనేక డిగ్రీలు పడిపోయాయి. ఇది క్రిస్మస్ సెలవుల కోసం ప్రదేశాలను సందర్శించే పర్యాటకులకు ఉత్సాహాన్ని కలిగిస్తోంది. మరోవైపు వాహనాల రాకపోకలకు కష్టమవుతోంది. సోమవారం అర్ధరాత్రి మనాలీ, డల్హౌసీ శివారు ప్రాంతాల్లో తేలికపాటి హిమపాతం నమోదైంది. ఖద్రాలాలో అత్యధికంగా 24 సెంటీమీటర్లు, సంగ్లాలో 16.5 , షిల్లారోలో 15.3, చోపాల్, జుబ్బల్‌లో 15 సెంటీమీటర్ల చొప్పున, కల్పాలో 14, నిచార్‌లో 10, సిమ్లాలో 7, పూహ్‌లో 6, జోత్‌లో 5 సెంటీమీటర్ల చొప్పున మంచు కురిసింది. ప్రతికూల వాతావరణం, హిల్ స్టేషన్‌కు వెళ్లే మార్గంలో రహదారిపై ప్రాణాంతక పరిస్థితులు ఉన్నా పర్యాటకులు పోటెత్తారు. సిమ్లాలోని హోటల్ గదుల ఆక్యుపెన్సీ 70 శాతం నమోదైంది. గత ఏడాది డిసెంబర్ కంటే ఇది 30 శాతం ఎక్కువ. మంచు దుప్పటితో అందంగా కప్పబడిన సిమ్లా, మనాలీ చిత్రాలతో సోషల్ మీడియా నిండిపోయింది. శుక్రవారం సాయంత్రం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో, ముఖ్యంగా సిమ్లాలో భారీ వర్షాలు, మంచు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

రేపిస్టులకు, హంతకులకు మరణశిక్షే: ట్రంప్

వాషింగ్టన్: మరణశిక్షను కఠినంగా అమలు చేస్తానని అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ మంగళవారం ప్రకటించారు. మరణశిక్ష పడిన ఫెడరల్ ఖైదీ శిక్షలను తగ్గించిన జో బైడెన్‌పై ట్రంప్ విరుచుకుపడ్డారు. ఉరిశిక్ష పడిన 40 మందిలో 37 మందికి పెరోల్ లేకుండా యావజ్జీవ కారాగార శిక్షను మారుస్తూ సోమవారం బైడెన్ తీసుకున్న నిర్ణయం అర్థరహితమని, బాధిత కుటుంబాలను అవమానించడమేనని ట్రంప్ విమర్శించారు. హింసాత్మక రేపిస్టులు, హంతకులు, రాక్షసుల నుంచి అమెరికన్ కుటుంబాలను, పిల్లలను రక్షించేందుకు మరణశిక్షను పకడ్బందీగా అమలు చేయాలని న్యాయశాఖను ఆదేశిస్తానని ట్రంప్ ప్రకటించారు. 'మన దేశంలో అత్యంత దారుణమైన హంతకుల్లో 37 మందికి జో బైడెన్ మరణశిక్షను తగ్గించారు. ఇది నమ్మశక్యం కాని నిజం. దీనివల్ల బాధితుల బంధుమిత్రులు మరింత కుంగిపోతారు' అని ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్ఫామ్ ట్రూత్ సోషల్లో పోస్ట్ చేశారు.



మరణశిక్షపై బైడెన్ తాత్కాలిక నిషేధం

ఫెడరల్ మరణశిక్షపై బైడెన్ తాత్కాలిక నిషేధం విధించారు. ఉరిశిక్ష కోసం ఎదురు చూస్తున్న 40 మంది ఫెడరల్ ఖైదీల్లో 37 మందికి పెరోల్ అవకాశం లేకుండా జీవిత ఖైదుగా మారుస్తున్నట్లు అధ్యక్షుడు బైడెన్ సోమవారం ప్రకటించారు. 2013 బోస్టన్ మారథాన్ బాంబర్లలో ఒకరు, 2018లో 11 మంది యూదు ఆరాధకులను హత్య చేసిన దుండగుడు, 2015లో తొమ్మిది మంది నల్లజాతి చర్చిలలో కాల్పులు జరిపిన శ్వేత జాతి ఆధిపత్యవాదిని ఆయన తన ఉత్తర్వుల నుంచి మినహాయించారు. ఈ ఖైదీల్లో తోటి ఖైదీలను హత్య చేసిన తొమ్మిది మంది, బ్యాంకు దోపిడీల సమయంలో చేసిన హత్యలకు నలుగురు, జైలు గార్డును చంపిన కేసులో ఒకరు ఉన్నారు. బైడెన్ నిర్ణయంపై కొన్ని బాధిత కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. అయితే ఫెడరల్ ఖైదీలకు మరణశిక్షను విధించడంలో కాబోయే అధ్యక్షుడు ట్రంప్‌కు మరింత కష్టతరం చేయాలని కోరుతూ న్యాయవాద గ్రూపుల నుంచి వచ్చిన ఒత్తిడితో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉగ్రవాదం, విద్వేష ప్రేరేపిత సామూహిక హత్యలు కాకుండా ఇతర కేసుల్లో ఫెడరల్ మరణశిక్షలపై విధించిన నిషేధానికి అనుగుణంగా వారి శిక్షలను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చడం సమంజసమని బైడెన్ అన్నారు. ఏసీఎల్‌యూ, యూఎస్ కాన్ఫరెన్స్ ఆఫ్ కాథలిక్ బిషప్స్ ఈ నిర్ణయాన్ని అభినందించాయి.

అధ్యక్షుడి ప్రమేయం ఎంత?

క్రిమినల్ కేసుల్లో ప్రతివాదుల కోసం ఫెడరల్ ప్రాసిక్యూటర్లు కోరే శిక్షలను నిర్దేశించడంలో లేదా సిఫారసు చేయడంలో అధ్యక్షుల ప్రమేయం ఉండదు. అయినప్పటికీ ట్రంప్ చాలా కాలంగా న్యాయ శాఖ కార్యకలాపాలపై మరింత ప్రత్యక్ష నియంత్రణను కోరుతున్నారు. తాను అధికారంలోకి రాగానే మరణశిక్షను అమలు చేయాలని విభాగాన్ని ఆదేశిస్తానని అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయన ప్రకటించారు. పోలీసు అధికారులను చంపినవారికి, మాదక ద్రవ్యాలు, మానవ అక్రమ రవాణాకు పాల్పడినవారికి, యూఎస్ పౌరులను చంపిన వలసదారులకు ఫెడరల్ మరణశిక్షను విస్తరించాలని ఎన్నికల ప్రచారంలో పదే పదే చెప్పారు. మరణశిక్షను ఒక ముఖ్యమైన సాధనంగా తాను భావిస్తున్నానని, దానిని ఉపయోగించాలనుకుంటున్నానని ట్రంప్ చాలా స్థిరంగా చెప్పారు. అయితే ప్రస్తుతం ఉన్న చట్టాల ప్రకారం ఆచరణలో ఇది జరుగుతుందా? అనేది కష్టమైన విషయం. హత్యకు పాల్పడిన వ్యక్తులకు మరణశిక్షను ఒకప్పుడు చాలా మంది అమెరికన్లు సమర్థించారు. కానీ కొన్ని దశాబ్దాలుగా ఈ మద్దతు తగ్గుతోంది. అక్టోబర్‌లో జరిగిన ఓ సర్వేలు.. సగం మంది అమెరికన్లు మరణశిక్షను వ్యతిరేకించారు. 2007లో నిర్వహించిన ఓ సర్వేలో మాత్రం 10 మంది అమెరికన్లలో 7 మంది మరణశిక్షను సమర్థించారు.

ఆరోగ్య రంగంలో 'ఏఐ' విప్లవాత్మక పాత్ర

- ముందస్తు రోగ నిర్ధారణ, మెరుగైన చికిత్సలో ఏఐ పాత్ర పెరుగుతోంది
- ఇప్పటికే ఢిల్లీ ఎయిమ్స్‌లో ఏఐ వినియోగం
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఢిల్లీ ఎయిమ్స్ డైరెక్టర్ ఎం.శ్రీనివాస్



సాక్షి, న్యూఢిల్లీ: వైద్య ఆరోగ్య రంగంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విప్లవాత్మక పాత్ర పోషిస్తోందని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)- ఢిల్లీ డైరెక్టర్ ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. పెరుగుతున్న దేశ జనాభా దృష్ట్యా ముందస్తు రోగ నిర్ధారణ, వేగవంతమైన చికిత్సల్లో ఏఐ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. మహమ్మారి వ్యాధుల నిర్ధారణ, తీవ్రత అంచనా, వ్యాధి విశ్లేషణలకు ఏఐ పరిపూర్ణ సహకారం అందిస్తోందన్నారు. ఎయిమ్స్-ఢిల్లీలోని చాలా విభాగాలు ఇప్పటికే రోగనిర్ధారణ, రోగి-కేంద్రీకృత సేవల్లో ఏఐని వినియోగిస్తున్నాయని తెలిపారు. ఆరోగ్య సంరక్షణలో ఏఐ వినియోగంలో ఎయిమ్స్ ఢిల్లీని అత్యుత్తమ కేంద్రంగా ప్రభుత్వం గుర్తించిందని, ప్రాథమిక స్థాయిలోనే ఆరోగ్య సంరక్షణను అందించే లక్ష్యంతో గత మూడేళ్లుగా డెర్మటాలజీ, ఆప్తాల్మాలజీ, రేడియాలజీ వంటి విభాగాల్లో పరిష్కారాలను అభివృద్ధి చేయడం, పరీక్షించడం, అమలు చేయడంలో ఆరోగ్య మంత్రిత్వ శాఖతో కలిసి ఎయిమ్స్ అవిశ్రాంతంగా పని చేస్తోందన్నారు. ఏఐ ఆధారిత సీసీటీవీ కెమెరాలతో అధీకృత సిబ్బంది డేటాబేస్‌తో ముఖాలను పోల్చడానికి, ముఖాలను గుర్తించడానికి ఉపయోగిస్తున్నామని, అంతేగాక వీటితో అనధికార ఎంట్రీలను నిరోధించడం ద్వారా భద్రతను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకొని ఎయిమ్స్‌లో నిర్వహించిన సుపరిపాలనా దినోత్సవం సందర్భంగా ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఎయిమ్స్ పరిధిలో పాలనా పరంగా తీసుకొచ్చిన సంస్కరణలు, రోగులకు అందుబాటులోకి తెచ్చిన సౌకర్యాలను ఆయన వివరించారు. ఇటీవలే కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ద్వారా ఆరోగ్య సంరక్షణలో ఏఐ వినియోగం కోసం ఎయిమ్స్ ఢిల్లీని ప్రధాన సంస్థగా నియమించారని, దీని ద్వారా దేశవ్యాప్తంగా 20 సంస్థల కన్సార్టియంకు ఎయిమ్స్ ఢిల్లీ నాయకత్వం వహిస్తోందని తెలిపారు. మిగతా వివరాలు ఆయన మాటల్లోనే..

4 వేలకు చేరువలో బెడ్‌లు..: ప్రస్తుతం ఎయిమ్స్‌కి ప్రతి రోజూ సగటున 15వేలకు పైగా రోగులు ఓపీడీ సేవలకై వస్తున్నారు. కోవిడ్ తర్వాత ఓపీడీ కేసుల సంఖ్య 20-30 శాతం పెరిగింది. వీరికి కనీసంగా 15వేల మంది సిబ్బంది సేవలందిస్తున్నారు. ఇక రోగులకై కోవిడ్ వరకు 2,600 వరకు బెడ్‌లు అందుబాటులో ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 3,600లకు పెంచాం. ఇందులో మాతా, శిశు బ్లాక్‌లోనే ఏకంగా 425 బెడ్‌లను పెంచగా, సర్జికల్ బ్లాక్‌లో 200ల బెడ్లు అదనంగా ఏర్పాటు చేశారు. రోగులకు మందుల అందుబాటులో ఉంచేందుకు ఇటీవలి కాలంలో 4 అమృత్ ఫార్మసీలను అందుబాటులోకి తెచ్చాం. ఇక ఆయుష్మాన్ భారత్ కార్డుల ద్వారా 30 వేల మంది రోగులకు చికిత్స అందించాం. దేశం నలుమూలల నుంచి వివిధ వ్యాధులతో వచ్చి వారిని ఒక్కరినీ తిరిగి పంపడం లేదని, ప్రతి ఒక్కరికీ వైద్యం అందిస్తున్నాం. వివిధ రాష్ట్రాల్లోని ఎయిమ్స్ ఆస్పత్రుల్లోని రోగులకు సైతం రిఫరెన్స్‌ల ఆధారంగా టెలీకన్సల్టేషన్ విధానంలో ఆరోగ్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.

రోగుల సహాయకులకు 1,516 బెడ్‌లు..

ఇక రోగులకు సహాయకులుగా వచ్చే వారికి ఎలాంటి ఇక్కట్లు లేకుండా 5 విశ్రాంతి సదన్‌లను ఏర్పాటు చేయగా, అందులో 1516 బెడ్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటే ఓపీడీ సహా ప్రతి కేంద్రం వద్ద వెయిటింగ్ ఏరియాలను ఏర్పాటు చేశాము. ఆస్పత్రి పరిధిలో పర్యావరణహిత ప్రయాణాన్ని ప్రోత్సహించేందుకు ఎలక్ట్రిక్ షటిల్‌బస్ సర్వీసులు నడుపుతున్నాం. రోగుల నుంచి ఎలాంటి ఫిర్యాదులైనా స్వీకరించి వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు సంతుష్ట్ పోర్టల్‌ను ఏర్పాటు చేశాం, దీనిద్వారా రోగులకు మరింత మెరుగైన సేవలను అందించే వీలు కలుగుతోంది. ఆస్పత్రిలో రోగుల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని సీఎస్ఆర్ నిధులను సమకూర్చుకున్నాం. ఇప్పటికే 15కి పైగా వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు రూ.150 కోట్లకు పైగా నిధులను సమకూర్చాయి. ఇందులో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఏకంగా రూ.108 కోట్లు అందించింది.

డిజిటల్ పాలన..

ఎయిమ్స్‌లో పారదర్శకతను పెంచేందుకు వీలుగా పూర్తిగా డిజిటల్ పాలనను అందుబాటులోకి తెచ్చాం. పేపర్‌లెస్‌గా మార్చాలని నిర్ణయించి, ఇప్పటికే ఈ-హాస్పిటల్ ప్రోగ్రామ్‌ను అమలు చేస్తున్నాం. 100 శాతం ఈ-ఆఫీస్ ప్రక్రియతో నడుస్తున్న దేశంలోని మొదటి ఆస్పత్రి ఎయిమ్స్ ఒక్కటే. ఎయిమ్స్‌లో ప్రస్తుతం ఫిజికల్ ఫైల్స్ వినియోగం లేదు. 6 నెలల్లో 17,000 ఈ-ఫైళ్లు, 1.11 లక్షల రసీదులు జారీ చేశాం. డిజిటల్ ప్రొక్యూర్‌మెంట్ రీఫార్మ్స్‌లో భాగంగా స్టోర్‌లలో ఆటోమేషన్, డిజిటల్ ప్రొక్యూర్‌మెంట్ లైబ్రరీ ఉన్నాయి. ఈ కొనుగోలు విధానంతో సగటు కొనుగోలు ధర 10 శాతం నుంచి 200 శాతం తగ్గింది. దీంతో వార్షిక పొదుపు రూ. 100 కోట్లుగా ఉంది. ఇక నియామకాల్లోనూ పూర్తిగా ఆన్‌లైన విధానమే కొనసాగుతోంది. నోటిఫికేషన్ మొదలు పరీక్ష, నియామకపత్రాల జారీ, అపాయింట్‌మెంట్ ఆర్డర్‌ల వరకు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో పూర్తి పారదర్శకతను తెచ్చాం.



పుణ్యక్షేత్రాల ప్రయాగరాజ్

- 1,400 ఏళ్లకిందటే చైనా ప్రజలకు ఇష్టమైన గమ్యస్థానం
- 'తీర్థరాజ్'గా బిరుదు పొందిన ప్రయాగరాజ్

ప్రయాగరాజ్: మహా కుంభమేళాకు ఆతిథ్యమివ్వనున్న ప్రయాగరాజ్ .. పుణ్యక్షేత్రాల నగరంగాకీర్తికెక్కింది. దాదాపు 1,400 సంవత్సరాలుగా చైనా ప్రజలకు ఇష్టమైన గమ్యస్థానంగా ఉంది. భారత సాంస్కృతిక వారసత్వం పట్ల చైనాకు ఆకర్షణ నాటినుంచే బలంగా ఉందని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఏడవ శతాబ్దపు చైనీస్ యాత్రికుడు యాత్రికుడు జువాన్జాంగ్ తన రచనలలో పేర్కొన్న విషయాలను ప్రభుత్వం ప్రస్తావించింది.

హర్షవర్ధనరాజు పరిపాలనలో...

చరిత్రలోకి వెళ్తే.. హ్యూయెన్ త్సాంగ్ అని కూడా పిలుచుకునే జువాన్జాంగ్ 16 ఏళ్ల పాటు భారత దేశంలోని వివిధ ప్రాంతాలపై అధ్యయనం చేశారు. అందులో భాగంగా ప్రయాగరాజ్‌నూ సందర్శించారు. క్రీ.శ. 644లో హర్షవర్ధన రాజు పరిపాలనలో ఉన్న రాజ్యాన్ని ఆయన ప్రశంసించారు. ధాన్యం సమృద్ధిగా ఉందని చాటిచెప్పారు. అలాగే అనుకూలమైన వాతావరణం, ఆరోగ్యం, సమృద్ధిగా పండ్లు ఇచ్చే చెట్లు ఉన్న ప్రాంతంగా ప్రయాగ్‌రాజ్‌ను ఆయన అభివర్ణించారు. ప్రయాగరాజ్, దాని పరిసరాల్లోని ప్రజలు ఎంతో వినయంగా, మంచి ప్రవర్తన కలిగి ఉన్నారని, అంకితభావంతో నేర్చుకుంటున్నారని తన రచనల్లో వర్ణించారు. అందుకే ప్రయాగరాజ్‌కు 'తీర్థరాజ్' (అన్ని పుణ్యక్షేత్రాల రాజు) బిరుదును వచ్చిందని వాస్తవాన్ని పురావస్తు సర్వేలు, అధ్యయనాలు మరింత బలపరుస్తున్నాయి.

ఆసక్తికర వర్ణనలు..

ప్రయాగరాజ్ సాంస్కృతిక ప్రాముఖ్యత గురించి జువాన్జాంగ్ 'సి-యు-కి'పుస్తకంలో రాశారని పురావస్తుశాఖ పేర్కొంది. జువాన్జాంగ్ రచనలు పురాతన కాలంలో ప్రయాగరాజ్ గురించి ఆసక్తికరంగా వర్ణించాయి. 'ప్రయాగ్‌రాజ్‌లో పెద్ద ఎత్తు న మతపరమైన ఉత్సవాలు జరిగాయని, 5లక్షల మందికి పైగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాల్లో ఎందరో మహారాజులు, పాలకులు పాల్గొన్నారు. ఈ గొప్ప రాజ్యం యొక్క భూభాగం సుమారు 1,000 మైళ్ళ వరకు విస్తరించి ఉంది. ప్రయాగ రాజ్ రెండు పవిత్ర నదులైన గంగా, యమునా మధ్య ఉంది.' అని జువాన్జాంగ్ పేర్కొన్నారు. నగరంలోని ప్రస్తుతం కోట లోపల పాతాళపురి ఆలయం గురించి కూడా రాశారు. ఇక్కడ ఒకే నాణే న్ని సమర్పించడం, వెయ్యి నాణేలను దానం చేయడంతో సమానమని ప్రజలు నమ్ముతున్నారని లిఖించారు. ప్రయాగరాజ్‌లో స్నానం చేస్తే సకల పాపాలు తొలగిపోతాయని విశ్వసించే విష యాన్ని కూడా ఆయన పేర్కొన్నారు. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు ప్రయాగరాజ్‌లో మహా కుంభమేళా-2025 జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ విషయాలను పంచుకుంది.

వాట్సాప్, గూగుల్ ప్లేపై నిషేధం ఎత్తేసిన ఇరాన్

టెహ్రాన్: వాట్సాప్, గూగుల్ ప్లే స్టోర్‌పై నిషేధాన్ని ఇరాన్ ఎత్తేసింది. ఇది దేశంలో ఇంటర్నెట్ ఆంక్షలలో గణనీయమైన మార్పును సూచిస్తుందని ఇస్లామిక్ రిపబ్లిక్ న్యూస్ ఏజెన్సీ (ఐఆర్ఎన్ఏ) నివేదించింది. మంగళవారం జరిగిన మూడు ప్రభుత్వ శాఖల అధిపతులు, మంత్రులు, సుప్రీం కౌన్సిల్ సభ్యులతో సమావేశమై ఇంటర్నెట్ గవర్నెన్స్, ఆంక్షలకు సంబంధించిన విధానాలను సమీక్షించింది. సంబంధిత అధికారులతో చర్చల తరువాత.. ప్రస్తుతం ఉన్న ఇంటర్నెట్ ఆంక్షలలో మార్పులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అనంతరం ఈ విషయాన్ని ఇరాన్ సమాచార, సాంకేతిక శాఖ మంత్రి సత్తార్ హాషేమి ఎక్స్ వేదికగా ప్రకటించారు. 'ఈ రోజు, మేము ఐక్యత, సహకారంతో ఇంటర్నెట్ ఆంక్షలను ఎత్తివేసే దిశగా మొదటి అడుగు వేశాం. అధ్యక్షుడికి, మీడియాకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు. ఈ సంఘీభావం గతంలో కంటే ఎక్కువగా అవసరం' అని ఆయన పేర్కొన్నారు. ఇంటర్నెట్‌పై ఆంక్షలను ఎత్తివేయడం అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తన అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ప్రధాన వాగ్దానాలలో ఒకటి. ఈ ఆంక్షల సడలింపు ఇరాన్‌లో ఇంటర్నెట్ స్వేచ్ఛకు గణనీయమైన ముందడుగు. ఎన్నికల ప్రచార హామీలో భాగంగా ఇటీవల ఇరాన్ ప్రభుత్వం 'హిజాబ్' చట్టాన్ని కూడా వెనక్కి తీసుకున్న విషయం తెలిసిందే.

నక్సల్ కట్టడిలో సీఆర్‌పీఎఫ్ కృషి భేష్

కేంద్ర హోంమంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ: నక్సలిజాన్ని కట్టడి చేయడంలో సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) అమోఘమైన కృషి చేస్తోందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కొనియాడారు. అలాగే ఈశాన్య రాష్ట్రాల్లో, జమ్మూకశ్మీర్‌లో శాంతిభద్రతలను కాపాడటంలో సీఆర్‌పీఎఫ్ పాత్ర అమోఘమన్నారు. దేశ అంతర్గత భద్రత, శాంతిని కాపాడటంతో ముఖ్య భూమిక పోషిస్తోందన్నారు. అమిత్ షా బుధవారం నాడిక్కడ సీఆర్‌పీఎఫ్ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించారు. సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ అనీష్ దయాళ్ సింగ్‌తో సహా ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. సీఆర్‌పీఎఫ్ కార్యకలాపాలను సమీక్షించారు. ఈశాన్య రాష్ట్రాల్లో, జమ్మూకశ్మీర్‌లో శాంతిభద్రతలను నెలకొల్పడంలో ప్రశంసనీయమైన పాత్ర పోషిస్తోందని కొనియాడారు. విధినిర్వహణలో అమరులైన జవాన్ల కుటుంబాల కోసం చేపడుతున్న సంక్షేమ పథకాలను అమిత్ షాకు సీఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారులు వివరించారు. కారుణ్య నియామకాలను కూడా అమలు చేస్తున్నట్లు తెలిపారు. సిబ్బందికి ఇచ్చే ఆహారంలో తృణధాన్యాలు ఉండేటట్లు చూడాలని అమిత్ సా సూచించారు. ఆయుర్వేద లాభాలను పొందాలని ఆయన సిబ్బందిని కోరారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ తదితర ఉన్నతాధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

హిమాచల్‌లో దొరికిన కర్ణాటక మిస్సింగ్ మహిళ

మండి: 25 ఏళ్ల క్రితం కుటుంబంతో సంబంధాలు కోల్పోయిన కర్ణాటకకు చెందిన 50 ఏళ్ల మహిళ (సాకమ్మ) ఎట్టకేలకు కుటుంబాన్ని కలిసింది. కర్ణాటకలోని బళ్లారి జిల్లా దాననాయకనకెరె గ్రామానికి చెందిన సాకమ్మ 25 ఏళ్ల క్రితం తన పిల్లలతో కలిసి హోసపేటలో జరిగిన బంధువుల పెళ్లికి వెళ్లింది. అనుకోకుండా ఆమె చండీగఢ్ రైలు ఎక్కింది. మహిళ తప్పిపోయిందని కేసు పెట్టిన కుటుంబ సభ్యులు అనేక చోట్ల వెదికారు. ఎక్కడా దొరక్కపోవంతో చివరకు చనిపోయి ఉంటుందని అంతిమ సంస్కారాలు కూడా నిర్వహించారు. మరోవైపు సాకమ్మ ఉత్తర భారత రాష్ట్రాల్లో అనేక క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నారు. చివరకు మండి(హిమాచల్ ప్రదేశ్)లోని వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందారు. వృద్ధాశ్రమాన్ని సందర్శించిన ఓ యువ ఐపీఎస్ అధికారి ఆ యువతి కన్నడలో మాట్లాడుతుండటాన్ని గమనించి పరిచయం ఏర్పరుచుకున్నారు. అలా సాకమ్మ.. తన కథనంతా ఆ అధికారికి చెప్పుకొన్నారు. వెంటనే ఐపీఎస్ అధికారి కర్ణాటక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖను సంప్రదించారు. స్థానిక అధికారులు ఆ కుటుంబంతో సంప్రదింపులు జరిపి కుటుంబం చెంతకు చేరుస్తున్నారు.

బీజేపీ ఎమ్మెల్యేపై కోడిగుడ్ల దాడి

యశవంతపుర: బెంగళూరులో ఆర్‌ఆర్ నగర బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నపై అపరిచితులు కోడిగుడ్లతో దాడి చేశారు. బుధవారం స్థానిక లక్ష్మీనగరలో వాజ్‌పేయి జయంతి వేడుకలో పాల్గొని ఆయన నడిచి వస్తుండగా, గుర్తు తెలియని వ్యక్తులు కోడిగుడ్లు విసిరారు. ఒక గుడ్డు నేరుగా ఆయన తలపై పడింది. ఈ ఘటనపై ఆయన స్పందిస్తూ, తనపై దాడి చేస్తారనే విషయం ముందుగానే తెలుసు. అందుకే పోలీసులు కారు దిగి రావద్దని నాకు చెప్పారు. దాడి గురించి రాష్ట్రపతి, ప్రధానికి లేఖ రాస్తా. నాపై పోటీ చేసిన ఓడిపోయిన కుసుమ, ఆమె తండ్రి హనుమంతరాయప్ప ఈ దాడికి కారణం అని ఆరోపించారు. ఈ ఘటనలో పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారని హోంమంత్రి జి పరమేశ్వర్ తెలిపారు. కాగా, ఎమ్మెల్యే మునిరత్న ఇటీవల ఫోన్లో కాంట్రాక్టర్లను బెదిరించడం, కులం పేరుతో దూషించడం కేసులో అరెస్టయి బెయిలు మీద విడుదలయ్యారు. గుడ్ల దాడి వ్యవహారంపై అధికార కాంగ్రెస్, బీజేపీ నాయకులు పరస్పరం విమర్శలు చేసుకున్నారు.

బస్సులో లోయలో పడి నలుగురి మృతి

నైనిటాల్: ఉత్తరాఖండ్‌లోని భీమ్‌తల్త్ సల్ది ప్రాంతంలో బుధవారం బస్సు లోయలో పడి నలుగురు మృతి చెందారు. మరో 23 మంది గాయపడ్డారు. పితోర్‌గఢ్ నుంచి వస్తున్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులో డ్రైవర్, కండక్టర్‌తో సహా మొత్తం 27 మంది ఉన్నారని కుమోన్ కమిషనర్ దీపక్ రావత్ వెల్లడించారు. మృతుల్లో ఒక మహిళ, చిన్నారి ఉన్నట్లు తెలిపారు. క్షతగాత్రులను హల్ద్వానీలోని సుశీలా తివారీ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. బస్సు 1,500 ఫీట్ల లోతున్న లోయలో పడిపోయిందని బొవాలీ సర్కిల్ ఆఫీసర్ సుమీత్ పాండే చెప్పారు. క్షతగాత్రుల్లో ఎక్కువమందికి జనరల్ వార్డుల్లోనే చికిత్స అందిస్తున్నారని, అయితే కొందరిని ఐసీయూకు తరలించాల్సి రావొచ్చని వివరించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. బస్సు 1,500 ఫీట్ల లోతు లోయలో పడిపోయినందువల్ల క్షతగాత్రులను పైకి తేవడం కష్టతరమైంది. తాళ్ల సహాయంతో వీరిని పైకి లాగినట్లు సుమీత్ పాండే తెలిపారు.

చొరబాటుదారుడి కాల్చివేత

జైపూర్: భారత్- పాకిస్తాన్ సరిహద్దుల్లో ఒక పాక్ చొరబాటుదారుడిని సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) కాల్చి చంపింది. రాజస్తాన్‌లోని శ్రీగంగానగర్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. మంగళవారం రాత్రి అనుమానితుడు భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించగా.. బీఎస్ఎఫ్ సిబ్బంది అతన్ని హెచ్చరించారు. అయినా అతను వినిపించుకోకుండా భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించగా.. బీఎస్ఎఫ్ జరిపిన కాల్పుల్లో మృతి చెందాడు. కేసరిసింగ్‌పూర్ గ్రామ సమీపంలో ఈ ఘటన జరిగింది. హతుడి వద్ద నుంచి పాకిస్తాన్ కరెన్సీ నోట్లు, సిగరెట్ ప్యాకెట్, కొన్ని ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అతను ఎవరనేది తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

అన్నా యూనివర్సిటీలో విద్యార్థినిపై లైంగిక దాడి

సాక్షి, చెన్నై: చెన్నైలోని ప్రముఖ విద్యాసంస్థ అన్నా వర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థినిపై లైంగిక దాడి జరిగింది. ఇద్దరు ఆగంతకులు ఈ చర్యకు పాల్పడ్డారు. ఈ సమాచారంతో విద్యార్థులలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. నిందితులను పట్టుకోవాలని నినదిస్తూ ఆందోళనకు దిగారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అన్నావర్సిటీలో ఇంజినీరింగ్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని, మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థితో కలిసి మంగళవారం రాత్రి తాము తరచూ కలిసే ప్రదేశంలో కూర్చొని ఉండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అటు వైపుగా వచ్చారు. తొలుత విద్యార్థిపై దాడి చేశారు. అతడిని తన్ని తరిమేసి, ఆ విద్యార్థినిని పొదలలోకి ఎత్తుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారు. తోటి విద్యార్థులకు సమాచారం అందించి అక్కడికి ఆ విద్యార్థిని స్నేహితుడు వచ్చేలోపు నిందితులు అక్కడి నుంచి ఉడాయించారు. అర్ధరాత్రి వేళ సమాచారం అందుకున్న కోట్టూరుపురం పోలీసులు రంగంలోకి దిగారు. దీంతో బుధవారం యూనివర్సిటీ విద్యార్థులు కళాశాల ఎదుట ధర్నాకు దిగారు. నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది.

పంచారామాల్లో శివాలయాలు నిర్మించినవారు?

చాళుక్య రాజులు శివ భక్తులు. వీరు పంచారామాల్లో శివాలయాలు నిర్మించారు. చాళుక్య రాజులు వేయించిన శాసనాల్లో తెలుగు భాషా పదాలు, పద్యాలు ఉన్నాయి. తెలుగు భాషలో ఆదికవి అయిన నన్నయ్య రాజరాజ నరేంద్రుని ఆస్థాన కవి. ఈయన మహాభారతాన్ని తెలుగులోకి అనువదించారు. మల్లన 'గణితసార సంగ్రహం' గ్రంథాన్ని తెలుగు పద్యాల్లో రచించారు.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

దక్షిణ భారతదేశ చరిత్ర (క్రీ.పూ. 250 - క్రీ.శ. 250)

శాతవాహనులు

శాతవాహన వంశస్థాపకుడు శ్రీముఖుడు. నానాఘాట్, హాతిగుంఫా శాసనాల్లో శ్రీ శాతకర్ణి గురించి వర్ణించారు. శాతవాహన రాజుల్లో ప్రసిద్ధుడు గౌతమీ పుత్రశాతకర్ణి. ఇతడి గురించి నాసిక్ శాసనంలో ఉంది. హాలుడు ప్రాకృతంలో 'గాథా సప్తశతి' గ్రంథం రచించాడు. ఒకటో పులోమావి చివరి కణ్వ పాలకుడైన సుశర్మను సంహరించాడు. యజ్ఞశ్రీ శాతకర్ణి రుద్రదాముని కుమార్తెను వివాహం చేసుకున్నాడు. యజ్ఞశ్రీ శాతకర్ణి శాతవాహన చివరి రాజుల్లో గొప్పవాడు. శాతవాహనుల్లో చివరి పాలకుడు మూడో పులోమావి.

కంచి పల్లవులు (క్రీ.శ. 300-888)

పల్లవ వంశ స్థాపకుడు 'వీరకూర్చవర్మ'. ఇతడి కుమారుడు శివస్కందవర్మ. మహాపల్లవ వంశానికి మూల పురుషుడు సింహ విష్ణువు. ఇతడు చోళ, పాండ్య, సింహళ రాజులను ఓడించి, 'అవనీసింహ' అనే బిరుదు పొందాడు. ఇతడి కుమారుడైన మహేంద్రవర్మను చాళుక్యరాజు రెండో పులకేశి 'పుల్లలూర్ యుద్ధం'లో ఓడించాడు. మహేంద్రవర్మ 'మత్తవిలాస ప్రహసనం' అనే వ్యంగ్య నాటకాన్ని రచించాడు. ఇతడు గొప్ప శిల్పకళాపోషకుడు. మామండనూర్, దళవదూర్ గృహాలయాలు, చిత్తన్నవాసల్‌లోని కుడ్య చిత్రాలు ఇతడి కళాపోషణకు నిదర్శనాలు. మహేంద్రవర్మ కుమారుడు నరసింహవర్మ పల్లవ రాజులందరిలో అగ్రగణ్యుడు. ఇతడు రెండో పులకేశిని చంపి తండ్రి ఓటమికి ప్రతీకారం తీర్చుకున్నాడు.

మొదటి నరసింహవర్మ (క్రీ.శ. 630 - 668): ఇతడు శివ భక్తుడు. ఇతడు కైలాసనాథ, తీర (షోర్ టెంపుల్) దేవాలయాలను నిర్మించి కళా ప్రపంచంలో చిరస్మరణీయ స్థానం సంపాదించాడు. ఇతడు 641లో పులకేశిని ఓడించాడు. చోళ, పాండ్య పాలకులు ఇతడికి సామంతులుగా ఉన్నారు. ఇతడు సాధించిన విజయాల వల్ల 'వాతాపికొండ', 'మహామల్ల' బిరుదులతో కీర్తి పొందాడు. సంస్కృత కిరాతార్జునీయ కావ్యాన్ని రచించిన భారవి ఇతడి ఆస్థానకవి. ఇతడి కాలంలో హుయాన్ త్సాంగ్ కంచిని దర్శించాడు.

నందివర్మ: 'పల్లవ మల్ల' బిరుదాంకితుడు. ఇతడు వైకుంఠ పెరుమాళ్ దేవాలయాన్ని నిర్మించాడు. పల్లవుల దేవాలయ శిల్పకళలో ఆలయాలు, మండపాలు, రథాలు అనే మూడు రకాల నిర్మాణాలు ఉన్నాయి. వరాహ, త్రిమూర్తి, మహిషాసురమర్ధని, పంచపాండవుల మండపం (రథాలు) నందివర్మ శిల్ప కళాపోషణకు తార్కాణాలు. పల్లవుల పాలనా వ్యవస్థ మౌర్యులు, ఆంధ్ర శాతవాహనుల పరిపాలనా వ్యవస్థను పోలి ఉంది.

ద్రావిడ దేవాలయాలు



భారతీయ వాస్తుశైలిలో ద్రావిడశైలి ప్రసిద్ధమైంది. ద్రావిడ శైలి దేవాలయాల్లో ప్రముఖమైనవి బృహదీశ్వరాలయం, శ్రీ రంగనాథ స్వామి ఆలయం, మీనాక్షి దేవాలయం.

బృహదీశ్వరాలయం

దీన్ని చోళ చక్రవర్తి తంజావూరులో నిర్మించాడు. ఇది ద్రావిడ శైలికి ప్రతీక. ఈ దేవాలయం గోపురంపై ఉన్న ఏకైక కలశం బరువు 90 టన్నులు.

శ్రీరంగనాథ స్వామి ఆలయం

ద్రావిడ దేవాలయాల్లో ఇది అతి పెద్దది. ఇది కావేరి ఒడ్డున ఉన్న శ్రీరంగంలో ఉంది.ఇక్కడ స్వామి విగ్రహం శయనాకార రూపంలో ఉంటుంది. ఈ రూపంలో ఉన్న మరో విగ్రహం నెల్లూరులోని శ్రీ రంగనాయకుల దేవాలయంలో మాత్రమే ఉంది.

మీనాక్షి దేవాలయం

నాయకరాజు కాలంలో మదురైలో నిర్మించారు. ఈ ఆలయంలో పలు ప్రాకారాలు, గోపురాలు ఉన్నాయి.

పశ్చిమ చాళుక్యులు (క్రీ.శ. 500-757)

పశ్చిమ చాళుక్యుల రాజధాని 'వాతాపి' లేదా 'బాదామి'. వీరిని వాతాపి లేదా బాదామి చాళుక్యులు అని కూడా అంటారు. చాళుక్య వంశ మూలపురుషుడు జయసింహ వల్లభుడు. సత్యాశ్రయ పులకేశి 'వాతాపి' (బీజాపూర్ జిల్లా, కర్ణాటక) నగరాన్ని నిర్మించి దాన్ని రాజధానిగా చేసుకున్నాడు. రెండో పులకేశి దక్షిణాపథ సార్వభౌముడిగా కీర్తి పొందాడు. ఇతడు 'ఐహోల్' వద్ద రాయించిన శాసనం అతడి విజయాల గురించి వర్ణిస్తుంది. ఇతడు ఎలిఫెంటా, పట్టాడక్కల్ దేవాలయాన్ని నిర్మించాడు. రెండో హర్షుడిని ఓడించాడు.

తూర్పు చాళుక్యులు (క్రీ.శ. 630-970)

ఆంధ్ర సంస్కృతి, తెలుగు భాషకు తూర్పు చాళుక్యులు ఎనలేని సేవ చేశారు. ఈ వంశంలో రాజరాజ నరేంద్రుడు ఆంధ్ర భాషా సాహిత్య పరిపోషకుడిగా పేరుపొందాడు.ఈ వంశ స్థాపకుడైన కుబ్జ విష్ణువర్ధనుడికి 'విషమసిద్ధి' అనే బిరుదు ఉంది.

కళ్యాణి చాళుక్యులు (క్రీ.శ. 973-1189)

తైలపుడు రాష్ట్రకూట రాజును ఓడించి చాళుక్య రాజ్యాన్ని పునఃస్థాపించాడు. ఇతడు 'కళ్యాణి'ని రాజధానిగా చేసుకొని పాలించాడు. కళ్యాణి చాళుక్యుల కాలంలో కన్నడ, సంస్కృత భాషలు అభివృద్ధి చెందాయి. బసవేశ్వరుడు వీరశైవ (ఆరాధ్య) మతాన్ని స్థాపించాడు.

మాన్యఖేట రాష్ట్రకూటులు (క్రీ.శ. 757-973)

జైనమతానికి,కన్నడ భాషకు మాన్యఖేట రాష్ట్రకూటులు ఎనలేని సేవ చేశారు.ఈ వంశానికి మూల పురుషుడు దంతి దుర్గుడు (752-56). ఇతడికి 'ఖడ్గావలోక','వైరమేఘ' అనే బిరుదులు ఉన్నాయి.

ధ్రువుడు(780-92): ఇతడి కాలంలో రాష్ట్రకూట సామ్రాజ్యం అఖిల భారత ప్రతిష్ఠను పొందింది. గంగా కావేరీ నదుల మధ్య వీరికి ఎదురే లేకుండా పోయింది. ధ్రువుడికి నిరుపమ, కలివల్లభ, శ్రీ వల్లభ, ధారావర్ష అనే బిరుదులున్నాయి.

మూడో గోవిందుడు (792-814): ఇతడి కాలంలో రాష్ట్రకూట ప్రతిష్ఠ మహోన్నత స్థితికి చేరింది. ఇతడు జగత్తుంగ, ప్రభూత వర్ష అనే బిరుదులు ధరించాడు. ఇతడి కాలంలో ఉత్తరాపథంపై రాష్ట్రకూటుల అధికారం చెక్కు చెదరలేదు.

అమోఘవర్షుడు: 'మాన్యఖేట' అనే దుర్గాన్ని నిర్మించి రాజధానిగా చేశాడు. సోదరి శీల మహాదేవిని రెండో విజయాధిత్యుడి కుమారుడైన కలి విష్ణువర్ధనుడికి ఇచ్చి వివాహం జరిపించాడు. ఈవిధంగా వేంగి చాళుక్యుల మైత్రిని సాధించాడు. గంగ, అంబిరాజులను సామంతులుగా చేసుకున్నాడు. ఇతడు కన్నడ భాషలో గొప్ప పండితుడు.

రెండో కృష్ణ: ఇతడు చోళరాజు పరాంతకుడి చేతిలో 'వల్లా యుద్ధం'లో ఓడిపోయాడు. ఇతడిని 'అకాలవర్షుడు'గా పేర్కొంటారు.

రాష్ట్రకూటుల్లో మూడో కృష్ణ చివరి గొప్ప రాజు. పరాంతకుడు 'తక్కోల యుద్ధం'లో ఓటమి పాలయ్యాడు. అమోఘవర్షుడు 'కవిరాజ మార్గం' అనే అలంకార గ్రంథాన్ని రచించాడు. ఎలిఫెంటా, ఎల్లోరాల్లో రాష్ట్రకూటుల శిల్పకళను చూడొచ్చు. రాష్ట్రకూట రాజు ఒకటో కృష్ణుడు ఎల్లోరా (మహారాష్ట్ర)లో కైలాస దేవాలయాన్ని నిర్మించాడు. ఇది ఏకశిలా నిర్మితం. దీన్ని నిర్మించడానికి 150 ఏళ్లు పట్టింది. పశ్చిమ కనుమల్లో ఒక కొండరాయిని ఎన్నుకొని దాన్ని కొండల నుంచి వేరు చేసి దేవాలయంగా మలిచారు. ప్రపంచంలో ఈ తరహా దేవాలయం ఎక్కడా లేదు.

తంజావూరు చోళులు

ఈ చోళ వంశస్థాపకుడు విజయాలయుడు. ఇతడు ఉరైయూర్‌లో క్రీ.శ. 850 ప్రాంతంలో పల్లవ సామంతుడుగా ఉంటూ పాండ్య సామంతుడైన ముత్తరయార్‌ను ఓడించి తంజావూర్‌ను స్వాధీనం చేసుకున్నాడు. ఇతడి కాలం నుంచి చోళుల విజృంభణ ప్రారంభమైంది.

రాజరాజు (క్రీ.శ. 985-1014): చోళ రాజ్య ప్రతిష్ఠను పునరుద్ధరించి నూతనాధ్యాయాన్ని ప్రారంభించాడు. చోళుల ఇష్టదైవమైన శివుడికి బృహదీశ్వరాలయం (రాజరాజేశ్వరి దేవాలయం) నిర్మించాడు. ఇదే చోళకళకు ప్రసిద్ధి. భూమిశిస్తు విధానాన్ని సక్రమంగా అమలుపరచడానికి వ్యవసాయ భూములను 'సర్వే' చేయించాడు. ఇతడికి రాజరాజ (ది గ్రేట్) అనే బిరుదు ఉంది.

రాజేంద్ర చోళుడు(క్రీ.శ.1014-1044): ఇతడు రాజరాజు కుమారుడు. శ్రీవిజయ సామ్రాజ్యంపై దండెత్తి శైలేంద్ర రాజును ఓడించాడు.క్రీ.శ.1012లో అతడి రాజధాని నగరం 'కందరం'ను ముట్టడించాడు. బంగాళాఖాతం,హిందూ మహాసముద్రాలపై ఆధిపత్యం సాధించాడు. ఇతడు 'కదరగొండన్', 'త్రి సముద్రాదీశ్వర' అనే బిరుదులు పొందాడు. బెంగాల్‌పై విజయం సాధించాడు. తల్లి కోరికపై 'గంగైకొండ చోళపురం' అనే నగరాన్ని నిర్మించాడు. దీన్ని తన రాజధానిగా చేసుకొని పాలించాడు.

ఒకటో రాజాధిరాజు (క్రీ.శ.1044-52): ఇతడు రాజేంద్రుడి కుమారుడు. కళ్యాణి చాళుక్య రాజైన సోమేశ్వరుడిని 'కొప్పం' యుద్ధంలో ఓడించాడు. కానీ అదే యుద్ధంలో ప్రాణాలు కోల్పోయాడు. మధుర, సింహళంలో చెలరేగిన తిరుగుబాట్లను అణచివేశాడు.

రెండో రాజేంద్రుడు (క్రీ.శ. 1052-64): ఇతడు రాజాధిరాజు సోదరుడు. చాళుక్యరాజును 'కూడల్ సంగమ యుద్ధంలో' ఓడించి కొల్హాపూర్ వద్ద విజయ స్తంభాన్ని వేయించాడు.

వీర రాజేంద్రుడు (క్రీ.శ. 1064-70): వేంగి, కళింగ, చక్రకూట పాలకులపై దాడులు చేశాడు. చాళుక్య రాజులను, విక్రమాదిత్యుడిని ఓడించాడు. ఇతడు తన కుమార్తెలను విక్రమాదిత్యుడు, కళింగ గంగ యువరాజైన రాజరాజుకు ఇచ్చి వివాహం చేశాడు.

మొదటి కులోత్తుంగ చోళుడు (క్రీ.శ.1070-1120): వీర రాజేంద్రుడి తర్వాత వారసులు లేకపోవడం వల్ల రాజరాజ నరేంద్రుడు, అమ్మంగదేవికి జన్మించిన రాజేంద్రుడు అధికారంలోకి వచ్చాడు. ఇతడు కులోత్తుంగ చోళుడు అనే పేరుతో సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఇతడిది చాళుక్య చోళ వంశం.


చోళుల కాలం తమిళ సాహిత్యానికి స్వర్ణయుగం. కంబకవి తమిళంలో రామాయణాన్ని రచించాడు. జయకొండార్ 'పెరియపురాణం' గ్రంథాన్ని రాశాడు.

జనరల్ నాలెడ్జ్ ఫర్ గ్రూప్స్

చారిత్రక కట్టడాలు - నిర్మాతలు	
సూర్య దేవాలయం (కోణార్క్, ఒడిశా)	- నరసింహదేవ వర్మ
వైకుంఠపెరుమాళ్ దేవాలయం(కంచి,తమిళనాడు)	- మూడో నందివర్మ
బరాబర్‌గుహలు (గయ జిల్లాలో, బిహార్)	- అశోకుడు
ఏకశిల రథాలు (మహాబలిపురం, తమిళనాడు)	- మొదటి నరసింహ వర్మ
కైలాసనాథ దేవాలయం (కంచి)	- రెండో నరసింహ వర్మ
మౌంట్‌అబు జైన దేవాలయం (రాజస్థాన్)	- తేజ్‌పాల, వస్తుపాల

Life is in language...

When you stop thinking new thoughts, new ideas, new imaginations, new feelings, new aptitudes and new intellectual creations, there is no need of a language. From the moment you get up from your bed, till the moment you go to your bed, the same set of stock vocabulary is enough. When you don't need any other vocabulary than your known, faded, stereotyped, boring, tiresome and tasteless vocabulary, it means that you have stopped thinking which makes you isolated. Find out what makes a word tick and how you can make it stick.



VOCABULARY

When somebody asked 'what is a language?', the other man replied 'words, words, words and words'. This is actually from William Shake-speare's immortal work 'Hamlet'.

It goes like this..

Polonius: What do you read, my Lord?
Hamlet: Words, words, words.
Polonius: What is the matter, my Lord?
Hamlet: Between whom? (In the original text, it is 'Between who?')
Polonius: I mean the matter that you read, my Lord.

In the above dialogue, one can see how important one's use of vocabulary is. Keeping a side the significance of the dialogue a while, there is a grammar mistake in it. 'Between' is a preposition. There is a rule that there must be an objective case pronoun after a preposition. Now this rule is violated. But we often say that they are exceptions. It may be true. Somebody wanted to know and asked "Did Shakespeare write in English?" Then the other man retorted "Shakespeare didn't write in English rather whatever he wrote is English".

Yes it is true. Hundred percent true.
Emily Dickinson rightly opines;

"A word is dead
When it is said,
Some say. I say it just
Begins to live
That day"

Yes. Language is lively. Life is in language. Life without language is just unimaginable, a mere cipher. In vocabulary building, the problem is not so much finding new words or even finding out what they mean. The problem is to remember them, to fix them permanently in your mind. The simple way is to 'see the word, utter it thrice, use it once and it is yours'. Your being introduced to a number of words is of no use as you will forget them as quickly as you forget the names of people you are casually introduced to at a crowded party. Unless you meet them again or unless you spend some time with them, you can't say "I know them or they know me". Try to meet some of the more difficult words, see them in their contexts, look at them from other angles and spend some time with them. Your meeting them should not be a casual one. Some association should be established between you and the words. Try to bring into sharp and permanent focus those words that are now on the blurred fringe of your mind. Imagine a context and you will fall in the need of words.

Let's taste a spoon of words from the ocean of language...

Celibacy: Unmarried state, usually a religious vow of chastity.
Censorious: Being inclined to find faults.
Clinophobia: Morbid fear of lying in bed.
Confiscate: Seize (private property) by authority.
Connoisseur: One who appreciates, understands and enjoys arts.
Conscription: Compulsory enrollment, especially for the armed forces; draft.
Convalescence: Gradual return to health and strength after illness.
Claustrophobia: An abnormal fear of being in narrow or enclosed spaces.
Cynic: A person who believes all people are motivated by selfishness or one whose outlook is scor-nfully and often habitually negat-ive. (Cynic is a member of a sect of ancient Greek philosophers who believed virtue to be the only good and self-control to be the only means of achieving virtue).
Cynophobia: Morbid fear of dogs.
Cynosure: Centre of attention. An object that serves as a focal point of attention and admiration. Som-ebody or something that is the centre of admiration, attention or attraction.
Discophile: One who studies and collects phonographs.
Dissenter: Person who is hard to be pleased. (Often Dissenter One who refuses to accept the doctrines or usages of an established or a national church, especially a Protestant who dissents from the Church of England)
Dipsomania: Morbid craving or desire for alcohol.
Ditheism: Belief in independent principles of good and evil.
Diurnal: Relating to or occurring in a 24-hour period; daily or occurring or active during the daytime rather than at night: as in diurnal animals.

SYNONYMS AND ANTONYMS

S: = Synonyms **A:** = Antonym

- **Capricious**

S: Unpredictable, impulsive, fickle, changeable, inconstant, whimsical
A: Constant, firm, steadfast, unswerving

- **Cheek**

S: Impertinent boldness: (As in 'he shows the cheek to insult his hosts'). To speak impudently to or impudence, effrontery, gall, temerity, audacity, insolence, sauce, sass (=Impertinent, disrespectful speech; back talk)
A: Politeness, courtesy, humility, gentleness, respect.
(Cheek also means 'either side of the face below the eye. Eg. They are dancing cheek to cheek)

- **Dainty**

S: Pretty, neat, delicate, refined, tas-ty, delicious, fastidious, elegant, toothsome, exquisite, cute, palatable.
A: Inelegant, coarse, vulgar, rough, crude, rude, nasty, dirty.

- **Detrimental**

S: Harmful, injurious, hurtful, pernicious, damaging, noxious
A: Good, beneficial, valuable, useful, profitable, harmless, inoffensive, unobnoxious

- **Diligent**

S: Industrious, laborious, hard-working, attentive, assiduous, observant, mindful, vigilant, watchful, wakeful, careful
A: Careless, heedless, inattentive, indifferent, unobservant, unmindful

- **Docile**

S: Pliant, tractable, amenable, teachable, yielding, compliant, tame, submissive, gentle, unresisting, dutiful, passive, acquiescent, unassertive, manageable, governable, obsequious.
A: Obstinate, stubborn, intractable, self-willed, dogged, defiant, insolent, resistant, resisting, obdurate, disobedient, willful, uncompromising, unyielding, refractory, recalcitrant

- **Droll**

S: Amusing, laughable, funny, com-ic, sarcastic, whimsical, comical, odd, queer, farcical, ludicrous, ri-diculous, absurd, diverting, romp
A: Sad, lamentable, lugubrious, tragic, painful, dolorous, hurtful, distressing, grievous, woeful, rueful, mournful, deplorable, touching

- **Ephemeral**

S: Short lived, transitory, transient, fleeting, momentary, fugitive, evanescent, fugacious, temporary
A: Eternal, perpetual, perennial, permanent, intransient, lifelong, everlasting, long-lived, prolonged, protracted

- **Enormous**

S: Immense, gigantic, colossal, huge, vast, gargantuan, monstrous, prodigious, stupendous, plentiful, plenteous, copious
A: Trivial, insignificant, ordinary, average, small, little, tiny, diminutive.

MODEL QUESTIONS

Directions (Q. No. 1 - 5): ***Out of the four choices, select the one which can be substituted for the given words or sentences.***

1. Relating to the science of sounds
   a) Acoustics b) Ultrasonic
   c) Phonetic d) Sonics
2. A word formed from the initial letter or letters of each of the successive parts or major parts of a compound term:
   a) Abbreviation b) Palindrome
   c) Acronym d) Contraction
3. A substance which alleviates pain:
   a) Narcotic b) Anodyne
   c) Chloroform d) Intoxicant
4. A person who can speak several languages:
   a) Linguist b) Lexicographer
   c) Polyglot d) Multilingual
5. Deserving blame of an offence or crime:
   a) Criminal b) Culpable
   c) Punishable d) Culprit

Directions (Q. No. 6 - 14): ***From the given options, choose the one that is nearest in meaning to the underlined word:***

6. Gandhi is an ardent abolitionist.
   a) Amnesty activist
   b) One opposed to violence
   c) War activist
   d) One opposed to slavery
7. Only barren lands must be utili-zed for building the capital of AP
   a) Unproductive b) Vacant
   c) Fertile d) Assigned lands
8. With its good bandwidth, the company made good profits in its dish sales.
   a) Measurement of handwritten data
   b) Measurement of transferable data
   c) Measurement of burned data
   d) Measurement of shredded data
9. I felt it a little brackish.
   a) Polluted b) Boring
   c) Slightly salty d) Hot
10. Finally the hero gets catharsis.
    a) Applaud
    b) Gets relief from tension
    c) Romantic reply d) Victory
11. The party's policies are deleterious to the state.
    a) Beneficial b) Harmful
    c) Retrospective d) Degrading
12. The invading force had no artillery and was completely annihilated.
    a) Defeated b) Destroyed
    c) Demolished d) Dismembered
13. The party can no longer win the admiration with its evanescent glory.
    a) Vanishing b) Susceptive
    c) Melting d) Evaporating
14. She looked at her friend's bristly chin.
    a) Soft and shining
    b) Rough c) Pricking
    d) Cadent

KEY

1) a 2) c 3) b 4) c 5) b
6) d 7) a 8) b 9) c 10) b
11) b 12) b 13) a 14) b

విపత్తు నిర్వహణలో అంతర్భాగమైనవి?

భారతదేశం- విపత్తుల నిర్వహణ

విపత్తు లేదా అత్యవసర పరిస్థితులపై నియంత్రణ ఉండటానికి, ప్రజలను విపత్తు ప్రభావం నుంచి తప్పించడానికి, వాటి వల్ల కలిగే నష్టాలను తగ్గించడానికి, విపత్తుల బారిన పడ్డ ప్రజలు కోలుకోవడానికి దోహదం చేసేలా రూపొందించిన వివిధ రకాల కార్యక్రమాల సమాహారమే 'విపత్తు నిర్వహణ'.

భారతదేశ విస్తీర్ణం 329 మిలియన్ హెక్టార్లు. దేశ భూభాగంలో ఉన్న 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలు ఏదో ఒక రూపంలో, ఏదో ఒక రకమైన విపత్తును ఎదుర్కొంటున్నాయి. ఇప్పటి వరకు సంభవించిన భూకంపాలు, రెండు లేదా మూడేళ్లకు ఒకసారి దేశంలో ఏర్పడుతోన్న దుర్భిక్ష పరిస్థితులే ఇందుకు నిదర్శనం. 1967లో సంభవించిన కొయనా భూకంపం, 1993 నాటి లాతూర్ భూకంపం, 1994లో సూరత్‌లో ప్రబలిన ప్లేగు వ్యాధి, 1999లో ఒడిశా తీరాన్ని ముంచెత్తిన సూపర్ సైక్లోన్, 2014లో విశాఖ నగరాన్ని అతలాకుతలం చేసిన హుదూద్ తుపాను మొదలైన వాటిని విపత్తులకు ఉదాహరణలుగా పేర్కొనవచ్చు. వైపరీత్యాల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం అధికంగా వాటిల్లుతోంది. లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులవుతున్నారు. దేశంలోని సాంస్కృతిక, సహజ సంపద దెబ్బతింటోంది.

2004లో సునామీ వచ్చే వరకు భారత ప్రభుత్వం విపత్తులు వాటిల్లక ముందు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెట్టలేదు. విపత్తుల నిర్వహణ కోసం, వాటి వల్ల కలిగే నష్టాన్ని కనిష్ఠ స్థాయికి తగ్గించడానికి అమలు చేసిన కార్యక్రమాలు.. విపత్తు సంభవించిన తర్వాత తీసుకునే పునరావాస, పునర్నిర్మాణ చర్యల రూపంలో ఉన్నాయి. అందువల్ల విపత్తులు సంభవిస్తే భారీ నష్టం వాటిల్లేది. భారత ప్రభుత్వం విపత్తు నిర్వహణలోని లోపాలను సవరించి 2005 మే 20న జాతీయ విపత్తు నిర్వహణ చట్టాన్ని రూపొందించింది. అమెరికా, జపాన్ లాంటి అభివృద్ధి చెందిన దేశాలు అమలు చేస్తున్న కార్యక్రమాలు, ప్రణాళికలను దృష్టిలో ఉంచుకొని ఈ చట్టాన్ని రూపొందించారు. ఈ చట్టం ప్రకారం విపత్తుల సమగ్ర నిర్వహణ కోసం 2005 మే 30న జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికారిక సంస్థ (NDMA)ను ఏర్పాటు చేశారు. 2005 డిసెంబరు 23 నుంచి జాతీయ విపత్తు నిర్వహణ చట్టం పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చింది. ఇందులోని సెక్షన్ 3(1) ప్రకారం 2006, సెప్టెంబరు 27న ప్రధానమంత్రి అధ్యక్షుడిగా తొమ్మిది మంది సభ్యులతో నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చింది.

జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికారిక సంస్థ (NMDA)లోని ముఖ్యాంశాలు

- వివిధ స్థాయుల్లో ఉన్న సంస్థలు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో విపత్తు నిర్వహణ యాజమాన్యం చేపట్టాలి.
- ప్రభావిత ప్రాంత ప్రజల జీవనోపాధి దృష్టిలో ఉంచుకొని విపత్తు యాజమాన్యం ఉండాలి.
- విపత్తు నిర్వహణ కోసం అమలు చేసే కార్యక్రమాలు ప్రభావిత ప్రాంతాల్లో సుస్థిరాభివృద్ధిని సాధించే విధంగా ఉండాలి.
- విపత్తు నిర్వహణకు సంబంధించి చేపట్టే సాంకేతిక పరిజ్ఞానం మారుమూల ప్రాంతాల్లో ఉన్న చివరి నిరాశ్రయుడికి సైతం అందుబాటులో ఉండాలి.
- సమగ్ర విపత్తు నిర్వహణకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, శాస్త్రవేత్తలు, ఎన్‌జీవోల మధ్య సమన్వయం పెంపొందించే విధంగా కార్యక్రమాలు ఉండాలి.
- అన్నింటికంటే ముఖ్యంగా ప్రభావిత ప్రాంత ప్రజలకు విపత్తుల నుంచి తమను తాము రక్షించుకునేలా సరైన శిక్షణా కార్యక్రమాలను నిర్వహించి వారిని చైతన్యవంతుల్ని చేయాలి.
- సంస్థాగతమైన, న్యాయపరమైన, చట్టపరమైన, సాంకేతికపరమైన అంశాలన్నింటి మధ్య సమన్వయం సాధిస్తూ, అభివృద్ధి ప్రక్రియలన్నింటిలో విపత్తు యాజమాన్యాన్ని భాగస్వామ్యం చేయాలని ఎన్‌డీఎంఏ సూచిస్తోంది.

పైన పేర్కొన్న లక్ష్యాల సాధనకు విపత్తు యాజమాన్యంలో ఉండాల్సిన దశలను ఎన్‌డీఎంఏ సూచించింది. అవి..



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

డిజాస్టర్ మేనేజ్‌మెంట్

ఎ) నివారణ బి) సంసిద్ధత
సి) ఉపశమనం డి) పునరావాసం
ఇ) పునర్నిర్మాణం ఎఫ్) ప్రతిస్పందన

ఎ. నివారణ: విపత్తు సంభవించడానికి ముందే చేపట్టే చర్యలు. ఉదాహరణకు వర్షాకాలానికి ముందే వరద ప్రభావిత ప్రాంతాల్లో వరదలు సంభవించకుండా జలాశయాల్లో పూడికలు తొలగించడం, నదులకు ఇరువైపులా కరకట్టల నిర్మాణం లాంటి చర్యలతో కూడిన కార్యక్రమమే నివారణ.

బి. సంసిద్ధత: వైపరీత్యాల ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి వైపరీత్య ఘటనకు ముందే చేపట్టే కార్యకలాపాలను సంసిద్ధత అని పిలుస్తారు. ఉదాహరణకు వైపరీత్య ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో పాల్గొనే ప్రభుత్వ సిబ్బంది వైపరీత్యం సంభవించడానికి ముందే సరిపడా రేషన్, ఔషధాలు, వాహనాలను సిద్ధం చేసుకోవాలి. సమాచార, ప్రసార మాధ్యమాల ద్వారా విపత్తుల సమాచారం తెలపాలి.

సి. ఉపశమనం: విపత్తు ప్రభావం పరిధి, దానివల్ల వాటిల్లే ప్రమాదాలు, నష్టాలను తగ్గించే ఏ చర్యనైనా ఉపశమనం అనవచ్చు. విపత్తుకు ముందు, విపత్తు సమయంలో, విపత్తు తర్వాత కూడా ఉపశమన చర్యలను చేపట్టవచ్చు. ఉపశమన చర్యలో భాగంగా అనేక నిర్మాణాత్మక, నిర్మాణేతర చర్యలను చేపడతారు. అవి:

నిర్మాణాత్మక చర్యలు: విపత్తు ప్రభావిత ప్రాంతాల్లో విపత్తులను తట్టుకునే భవనాల నిర్మాణాన్ని చేపట్టడం, నదీ ఆనకట్టల ఎత్తును పెంచడం, వైపరీత్య ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లను, కమ్యూనికేషన్ వ్యవస్థను పునరుద్ధరించడం, వైపరీత్యం వల్ల నష్టపోయిన ప్రజలకు పునరావాస, పునఃనిర్మాణ కార్యక్రమాలు చేపట్టడం మొదలైనవి.

నిర్మాణేతర చర్యలు: వైపరీత్య ప్రభావం వల్ల దగ్గరి వ్యక్తులను కోల్పోయిన వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం, ఆర్థిక సహాయం అందేలా చూడటం. ఉద్యోగావకాశాలు కల్పించడం, వారిని సురక్షితంగా ఇంటికి పంపడం లాంటి చర్యలు తీసుకోవాలి.

డి. ప్రతిస్పందన: వైపరీత్యం సందర్భంలో, వైపరీత్యం సంభవించిన వెంటనే దాని ప్రభావాలను తగ్గించడానికి చేపట్టే తక్షణ చర్యలు. ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు, స్వచ్ఛంద సంస్థల సహాయం, సమన్వయంతో చేపట్టే చర్యలు ఇందులో భాగంగా ఉంటాయి. ఉదాహరణకు బాధితుల ఫోన్ నంబర్లు తీసుకోవడం, మెడికల్ క్యాంపుల ఏర్పాటు, ఎప్పటికప్పుడు హెచ్చరికల జారీ, సరిపడా షెల్టర్లు, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయడం మొదలైనవి.

ఇ. పునరావాసం, పునర్నిర్మాణం: ప్రతిస్పందన, సహాయక చర్యలు చేపట్టిన వెంటనే విపత్తు ప్రభావిత ప్రాంతంలోని పరిస్థితులు, అక్కడి ప్రజా జీవనం సాధారణ స్థితికి చేరుకునేందుకు చేపట్టే చర్యలు. ఉదాహరణకు రహదారుల మరమ్మతులు, శాశ్వత గృహాల నిర్మాణం, జీవనోపాధి కల్పించడం మొదలైనవి.

- పైన పేర్కొన్న వాటిలో చివరి మూడు చర్యలు విపత్తు నిర్వహణ కోసం 2004 వరకు ప్రభుత్వం అమలు చేస్తోన్న కార్యక్రమాల్లో అంతర్భాగంగా ఉండేవి. అయితే ఇవి విపత్తు అనంతరం తీసుకొనే చర్యలు. విపత్తు వాటిల్లడానికి ముందే జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం వల్ల జరగాల్సిన నష్టం జరిగిపోయేది. ఈ లోపాన్ని సవరిస్తూ విపత్తు అనంతర చర్యలతోపాటు విపత్తులు సంభవించడానికి ముందు తీసుకునే చర్యలు(సంసిద్ధత, నివారణ) కూడా విపత్తు నిర్వహణ కార్యక్రమాల్లో అంతర్భాగంగా చేర్చాలని ఎన్ఎండీఏ సూచించింది.

విపత్తు నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం చేపట్టిన చర్యలు

- 1937లో సంభవించిన బిహార్-నేపాల్ భూకంపం తర్వాత బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో విపత్తు నిర్వహణపై సెంట్రల్ రిలీఫ్ కమిషనర్ ఆధ్వర్యంలో ఒక వ్యవస్థీకృత నిర్మాణం ప్రారంభమైంది.
- స్వాతంత్ర్యం వచ్చాక కూడా విపత్తు నిర్వహణను సెంట్రల్ రిలీఫ్ కమిషనర్ ఆధ్వర్యంలోనే నిర్వహించేవారు.
- ఐక్యరాజ్యసమితి సాధారణ సభ 1990వ దశాబ్దాన్ని అంతర్జాతీయ విపత్తు తగ్గింపు దశాబ్దంగా ప్రకటించింది. దీనికి అనుగుణంగా మన దేశంలో ఒక శాశ్వత, సంస్థాగత విపత్తు నిర్వహణ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇది వ్యవసాయ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది.
- 1999 అక్టోబరు 29న వ్యవసాయ మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి కె.సి.పంత్ అధ్యక్షతన ఒక అత్యున్నత కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ సూచనల ప్రకారం 2002 ఫిబ్రవరి 2న విపత్తు నిర్వహణ విభాగాన్ని గృహమంత్రిత్వశాఖలోని సంయుక్త కార్యదర్శి పరిధిలోకి తెచ్చారు. దుర్భిక్షం మినహా మిగతా అన్ని రకాల విపత్తుల నిర్వహణను గృహమంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో చేపడతారు. దుర్భిక్ష నిర్వహణ మాత్రం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోనే కొనసాగుతోంది.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. అన్ని ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించి (దుర్భిక్షం మినహా) విపత్తు నిర్వహణ కార్యకలాపాలను సమన్వయం చేయడానికి కేంద్రంలో ఉన్న సంస్థ ఏది? (Town Planning Exam)
ఎ) హోం మంత్రిత్వశాఖ
బి) సాంఘిక న్యాయ, సాధికారత శాఖ
సి) వ్యవసాయ మంత్రిత్వశాఖ
డి) శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ
2. కింది వాటిలో విపత్తు నిర్వహణలో అంతర్భాగమైనవి ఏవి? (Town planning Exam)
ఎ) పునరావాసం బి) పునర్నిర్మాణం
సి) నివారణ డి) పైవన్నీ
3. 2005 విపత్తు నిర్వహణ చట్టం ప్రకారం ఏర్పాటు చేసిన జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికారిక సంస్థ అధ్యక్షుడు ఎవరు? (Town planning Exam)
ఎ) ప్రధానమంత్రి
బి) హోం శాఖ మంత్రి
సి) ఆర్థికమంత్రి
డి) గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి
4. విపత్తు నిర్వహణ కార్యకలాపాలు జరిపే సమయం? (Town planning Exam)
ఎ) విపత్తు రావడానికి ముందు
బి) విపత్తు సమయంలో
సి) విపత్తు తర్వాత
డి) పై అన్ని సమయాల్లో

సమాధానాలు

1) ఎ 2) డి 3) ఎ 4) డి

మాదిరి ప్రశ్నలు

1. ఐక్య రాజ్య సమితి విడుదల చేసిన విపత్తుల నివేదిక-2014 రిపోర్ట్ ప్రకారం ప్రపంచంలో అత్యధిక విపత్తు ప్రభావిత ముప్పు ఉన్న నగరం ఏది?
ఎ) చికాగో బి) టోక్యో
సి) కోల్‌కతా డి) మనీలా
2. విపత్తు నివేదిక-2014 ప్రకారం అత్యధిక విపత్తు ప్రభావిత నగరాల్లో ప్రపంచంలో ఏడో స్థానంలో ఉన్న భారత నగరం?
ఎ) ముంబై బి) చెన్నై
సి) కోల్‌కతా డి) కొచ్చిన్
3. ఐక్య రాజ్య సమితి సాధారణ సభ ఏ దశాబ్దాన్ని ప్రపంచ విపత్తు తగ్గింపు దశాబ్దంగా ప్రకటించింది?
ఎ) 1980 బి) 1990
సి) 2000 డి) 2010
4. విపత్తు నిర్వహణ విభాగాన్ని ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
ఎ) 2002 జనవరి 2
బి) 2002 ఫిబ్రవరి 2
సి) 2003 ఫిబ్రవరి 3
డి) 2002 జనవరి 3

సమాధానాలు

1) బి 2) సి 3) బి 4) బి

What is the code for "earn"

Model Questions

Directions (Q. No. 1-7): Study the following information to answer the given questions.

Eight people, viz A, B, C, D, E, F, G and H are sitting in a straight line facing North. Each of them has passed a recruitment exam and must join the office in different months, viz January, February, March, April, May, June, July and August but not necessarily in the same order.

G sits third to the right of the person who joins in May. The person who joins in August sits second to the right of G. A and E are immediate neighbours of each other. Neither A nor E has joining dates in either May or August. Neither A nor E is an immediate neighbour of G.

H sits third to the right of the person whose joining date is in January. Neither A nor E has joining dates in January. H's joining date is not in August.

Only two people sit between E and the person whose joining date is in July. The person whose joining date is in February sits on the immediate left of D.

Only one person sits between E and B. C joins before July. E joins after April. G joins after A.

1. In which of the following months does H join the office?
1) April 2) June 3) July
4) February 5) March
2. Who among the following sits exactly between E and B?
1) The person whose joining date is in May
2) The person whose joining date is in January
3) D 4) A
5) The person whose joining date is in August
3. "H" is related to "July" in a certain way based on the above arrangement. "B" is related to "June" following the same pattern. "___" is related to "May" following the same pattern.
1) F 2) G 3) A 4) D 5) C
4. Which of the following is true regarding D?
1) Only two people sit to the left of D
2) D is sitting second to the right of the person whose joining date is in July
3) E and B are immediate neighbours of D
4) D's joining date is in May
5) None is true
5. Who among the following has joining date in June?
1) F 2) E 3) G 4) D 5) C
6. How many people sit between C and the person whose joining date is in April?
1) None 2) One 3) Two
4) Three 5) Four
7. Who among the following are sitting at extreme ends of the line?
1) A and the person whose joining date is in August
2) The person whose joining date is in May and E
3) C and G
4) The persons whose joining dates are in March and June
5) None of these

Directions (Q. No. 8-12): Study the following information to answer the given questions.

Eight people are sitting in two parallel rows containing four people each in such a way that there is an equal distance between adjacent persons. In row 1, A, B, C and D are sitting (but not necessarily in the same order) and all of them are facing North. In row 2, P, Q, R and S are sitting (but not necessarily in the same order) and all of them are facing South. Therefore, in the given seating arrangement, each member sitting in a row faces another member of the other row. S sits second to left of Q. A faces the immediate neighbour of S. Only one person sits between A and C. P does not face A. B is not an immediate neighbour of A.

8. Which of the following is true regarding D?
1) D sits at one of the extreme ends of the line
2) A sits on the immediate left of D
3) Q faces D
4) C is an immediate neighbour of D
5) No immediate neighbour of D faces R
9. Who among the following faces C?
1) P 2) Q 3) R 4) S
5) Cannot be determined
10. Who among the following sits on the immediate right of the person who faces C?
1) P 2) Q 3) R 4) S
5) Cannot be determined
11. Four of the following five are alike in a certain way based on the given seating arrangement and thus form a group. Which is the one that does not belong to that group?
1) A 2) Q 3) R 4) B 5) S
12. Who among the following faces R?
1) A 2) B 3) C 4) D
5) Cannot be determined



BANK EXAMS

REASONING

Directions (Q. No. 13-18): Study the following information to answer the given questions:

In a certain code,
"time and money" is written as "ma jo ki",
"manage time well" is written as "pa ru jo",
"earn more money" is written as "zi ha ma" and
"earn well enough" is written as "si ru ha".

13. What is the code for "earn"?
1) si 2) ru 3) ha 4) ma
5) Cannot be determined
14. Which of the following represents "more time"?
1) pa jo 2) zi ki 3) ma ki
4) si jo 5) jo zi
15. What is the code for "manage"?
1) ru 2) pa 3) jo
4) ha 5) Either "jo" or "ru"
16. Which of the following may represent "money matters"?
1) ki to 2) ma pa 3) fi ma
4) ha ma 5) ma jo
17. What does "ru" stand for?
1) well 2) manage
3) time 4) enough
5) Either "time" or "enough"
18. Which of the following may represent "good enough"?
1) ru si 2) da ha 3) si pa
4) si da 5) ki ru

Directions (Q. No. 19-23): Study the following information carefully and answer the given questions.

A word and number arrangement machine, when given an input line of words and numbers, rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement.

Input: gone over 35 69 test 72 park 27
Step I: 27 gone over 35 69 test 72 park
Step II: 27 test gone over 35 69 72 park
Step III: 27 test 35 gone over 69 72 park
Step IV: 27 test 35 park gone over 69 72
Step V: 27 test 35 park 69 gone over 72
Step VI: 27 test 35 park 69 over gone 72
Step VII: 27 test 35 park 69 over 72 gone

Step VII is the last step of the rearrangement.

As per the rules followed in the above steps, find out in each of the following questions the appropriate step for the given input.

19. **Input:** 86 open shut door 31 49 always 45
How many steps will be required to complete the rearrangement?
1) Five 2) Six 3) Seven
4) Four 5) None of these
20. **Step III of an input:** 25 yes 37 enemy joy defeat 52 46
Which of the following is definitely the input?
1) enemy 25 joy defeat yes 52 37 46
2) 37 enemy 25 joy yes defeat 52 46
3) enemy joy defeat 25 52 yes 46 37
4) Cannot be determined
5) None of these
21. **Step II of an Input:** 18 win 71 34 now if victory 61.
How many more steps will be required to complete the rearrangement?
1) Three 2) Four 3) Five
4) Six 5) More than six
22. **Input:** where 47 59 12 are they going 39
Which of the following steps will be the last but one?
1) VII 2) IV 3) V
4) VIII 5) None of these

Explanations

(1-7):

March	June	May	Jan	July	April	Feb	Aug
A	E	C	B	F	G	H	D

1. 4 2. 1 3. 1 4. 5 5. 2
6. 3 7. 1

(8-12):

Q	P	S	R	Row 2
B	C	D	A	Row 1

8. 4 9. 1 10. 2 11. 5 12. 1

(13-18):

time and money → ma jo ki... (i)
manage time well → pa ru jo...(ii)
earn more money→ zi ha ma..(iii)
earn well enough → si ru ha ...(iv)
From (i) and (ii), time → jo
From (i) and (iii), money → ma
From (i), and → ki
From (ii) and (iv) well → ru
From (ii), manage → pa
From (iii) and (iv), earn → ha
From (iii), more → zi
From (iv), enough → si

13. 3 14. 5 15. 2

16. Since "matters" is a new word. So, new code is introduced for "matters" ie, "fi". Code for "money" is "ma". **Ans: 3**
17. 1
18. Code for "enough" is "si" and since "good" is a new word, so a new code for "good", ie "da" is introduced. **Ans: 4**

(19-23):

The machine rearranges numbers in ascending order and word in reverse alphabetical order alternately.

19. **Input:** 86 open shut door 31 49 always 45
Step I: 31 86 open shut door 49 always 45
Step II: 31 shut 86 open door 49 always 45
Step III: 31 shut 45 86 open door 49 always
Step IV: 31 shut 45 open 86 door 49 always
Step V: 31 shut 45 open 49 86 door always
Step VI: 31 shut 45 open 49 door 86 always **Ans: 2**
20. Can't proceed backward. **Ans: 4**
21. **Step II:** 18 win 71 34 now if victory 61
Step III: 18 win 34 71 now if victory 61
Step IV: 18 win 34 victory 71 now if 61
Step V: 18 win 34 victory 61 71 now if
Step VI: 18 win 34 victory 61 now 71 if
Four more steps are needed to complete the rearrangement. **Ans: 2**
22. **Input:** where 47 59 12 are they going 39
Step I: 12 where 47 59 are they going 39
Step II: 12 where 39 47 59 are they going
Step III: 12 where 39 they 47 59 are going
Step IV: 12 where 39 they 47 going 59 are **Ans: 5**
23. **Step II:** 33 store 81 75 full of goods 52
Step III: 33 store 52 81 75 full of goods
Step IV: 33 store 52 of 81 75 full goods
Step V: 33 store 52 of 75 81 full goods
Step VI: 33 store 52 of 75 goods 81 full **Ans: 3**